www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు : 14
సంపుటి (Volume) : 21
సంచిక (Issue) : 279
శనివారం | 6-1-2024
శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: దశమి రా. 12.43 తదుపరి ఏకాదశి; నక్షత్రం: స్వాతి రా. 9.24 తదుపరి విశాఖ; వర్జ్యం: తె.3.10-4.49; దుర్ముహూర్తం: ఉ.6.51-8.19; అమృతఘడియలు: మ.12.01-1.43; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 5.51
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రాజకీయాల్లేకుండా..!

టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల నియామకం, ప్రక్షాళన

గత ప్రభుత్వం పునరావాస కేంద్రంగా మార్చింది

రాజకీయ నియామకాలతోనే లీకులు, రద్దులు

కేసీఆర్ అసమర్థతతోనే ఉద్యోగాల జాప్యం

యూపీఎస్సీ తరహాలో కమిషన్‌ను తీర్చిదిద్దుతాం

ఈ ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు నింపాలి

సమూల ప్రక్షాళనకు సహకరించండి

పారదర్శకతకు మార్గాలు చూపండి

యూపీఎస్సీ చైర్మన్‌ను కోరిన సీఎం రేవంత్

ఉత్తమ్‌తో కలిసి చైర్మన్‌తో గంటన్నర భేటీ

టీఎస్‌పీఎస్సీలో అందరికీ శిక్షణకు విజ్ఞప్తి

అంగీకరించిన యూపీఎస్సీ చైర్మన్ మనోజ్ సోనీ

వెనకబడిన ప్రాంతాలకు 1800 కోట్ల నిధులేవీ?

ఆర్థిక మంత్రి నిర్మలతో భేటీలో రేవంత్ ప్రస్తావన

మిలిటరీ భూములపై రక్షణ మంత్రితో భేటీ



న్యూఢిల్లీ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది చివరికల్లా రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయడానికి వీలుగా తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేయాలనుకుంటున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ ప్రక్షాళన కార్యక్రమానికి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సహాయం కావాలని అభ్యర్థించారు. శుక్రవారం ఆయన తన మంత్రివర్గ సహచరుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి యూపీఎస్సీ కార్యాలయాన్ని సందర్శించారు. యూపీఎస్సీ చైర్మన్ మనోజ్ సోనీ, కార్యదర్శి శశిరంజన్ కుమార్‌తో గంటన్నర పాటు భేటీ అయ్యారు. యూపీఎస్సీ తరహాలో టీఎస్‌పీఎస్సీని తీర్చిదిద్దేందుకు సోనీ సహకారం కోరారు. యూపీఎస్సీలో పారదర్శకత, అవినీతి మరక లేకుండా ఇంత సుదీర్ఘ కాలం పాటు అత్యంత సమర్థవంతంగా పని చేయడంపై సీఎం ఆరా తీశారు. వందేళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన యూపీఎస్సీ నిర్దిష్ట కాలపరిమితిలోనే నోటిఫికేషన్‌లు జారీ చేయడం, పరీక్షలు, ఇంటర్వ్యూల నిర్వహణ, నియామక ప్రక్రియను చేపట్టడం.. అన్నింటా పారదర్శకత పాటించడం అభినందనీయమని ముఖ్యమంత్రి రేవంత్ అన్నారు. టీఎస్పీఎస్సీని యూపీఎస్సీ అడుగుజాడల్లోనే తీర్చిదిద్దాలని భావిస్తున్నామని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల నియామకాలను కూడా

మిగతా 13వ పేజీలో...

వేర్వేరుగా ఉప ఎన్నిక

ఎమ్మెల్యే కోటా 2 ఎమ్మెల్సీ సీట్లూ కాంగ్రెస్‌కే!

ప్రతి సీటుకు 119 ఎమ్మెల్యేలూ ఓటర్లే.. ఎన్నికల సంఘం నిర్ణయం

బూత్‌లు, బ్యాలెట్ వేరేనంటూ అసెంబ్లీ సంయుక్త కార్యదర్శికి లేఖ

పదవీ కాలం ఒకటే ఉన్నా వేర్వేరుగా ఎన్నిక నిర్వహణకు ఆదేశం

రాష్ట్రంలో తొలిసారిగా ఈ తరహాలో ఎన్నికలు

వివరణ కోరుతూ ఈసీకి అసెంబ్లీ కార్యాలయం లేఖ


నిరుడు ఇదే రీతిన జరిగిన ఎన్నికలో యూపీలో 2 సీట్లు గెలిచిన బీజేపీ



హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అయ్యాయి. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, పాడి కౌశిక్ రెడ్డి రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. వీటికి జనవరి 29వ తేదీన ఎన్నికలు జరపాలంటూ కేంద్ర ఎన్నికల కమిషన్ తాజాగా షెడ్యూలు విడుదల చేసింది. ఇది పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. రెండు ఎమ్మెల్సీ స్థానాలనూ కాంగ్రెస్ గెలుచుకోవడానికి, తమకు రావాల్సిందని భావిస్తున్న ఒక ఎమ్మెల్సీ సీటును బీఆర్ఎస్ కోల్పోవడానికీ కారణమవుతోంది. తెలంగాణలోని రెండు సీట్లకు విడివిడిగానే ఎన్నిక నిర్వహించాలని తాజా షెడ్యూల్లో ఈసీ స్పష్టంగా పేర్కొంది. రెండింటికీ బ్యాలెట్ పేపర్లను సైతం వేర్వేరు సెట్స్ సిద్ధం చేయాలని, ఒకటి తెలుపు, మరోటి గులాబీ రంగులో ముద్రించాలని వివరించింది. పోలింగ్ స్టేషన్లనూ విడిగానే ఏర్పాటు చేయాలంది. ఓటర్ల జాబితా కూడా విడివిడిగా రూపొందించాలని నిర్దేశించింది. ఓట్ల లెక్కింపు కూడా విడివిడిగానే జరుగుతుందనీ పేర్కొంది. ఎన్నికల అధికారులు సహా అన్నీ వేర్వేరుగానే ఉండాలని నిర్దేశించింది. అభ్యర్థులు నామినేషన్లలోనే తాము పోటీ చేయాలనుకున్న పదవి (కడియం శ్రీహరి, కౌశిక్‌రెడ్డి) గురించి ప్రస్తావించాలని నిర్దేశించింది. రాష్ట్రంలో రెండు సీట్లు ఖాళీ అయితే రెండింటికీ కలిపి ఒకే నోటిఫికేషన్ జారీ చేయడం ఆనవాయితీగా ఉంది. అప్పుడు మొత్తం ఎమ్మెల్యేల సంఖ్యను ఎన్నుకోవాల్సిన

మిగతా 13వ పేజీలో...

లేటుగా తింటే గుండెజబ్బుల ముప్పు



డిన్నర్‌కు, అల్పాహారానికి మధ్య ఎంత ఎక్కువ

రాత్రి సమయం ఉంటే ఆరోగ్యానికి అంత మేలు

రాత్రి ఎనిమిదిలోపు తినేవారిలో రిస్క్ తక్కువ

బ్రేక్‌ఫాస్ట్ మానేసి నేరుగా భోజనం చేసేవారిలో

ప్రతి గంటకూ 6% మేర పెరిగే హృద్రోగ ముప్పు

లక్ష మందిపై జరిపిన అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): లేట్ నైట్.. అనగా అర్ధరాత్రి వేళ అపరాత్రి వేళ.. హాట్ హాట్‌గా ఏదైనా తినే అలవాటు మీకుందా? అయితే తస్మాత్ జాగ్రత! అలా రాత్రుళ్ల వేళమించి తినేవారికి గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఎక్కువని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఫ్రాన్స్‌లోని యూనివర్సిటీ సోర్బోన్ పారిస్‌నోర్డ్‌కు చెందిన పరిశోధకుల బృందం ఈ స్టడీ చేసింది. అందులో భాగంగా.. 1,03,389 మంది ఆహార, ఆరోగ్య వివరాలను సేకరించి భోజనం చేసే సమయానికి.. కార్డియోవాస్క్యులర్ డిసీజెస్‌కు (గుండె జబ్బులకు) మధ్య ఏమైనా సంబంధం ఉందా? అనే కోణంలో చేసిన అధ్యయనం ఇది. గ్లోబల్ డిసీజ్ బర్డెన్ 2020 అధ్యయనం ప్రకారం ఏటా ప్రపంచవ్యాప్తంగా ప్రతి లక్ష మందిలో సగటున 235 మంది హృద్రోగాలతో మృత్యువాత పడుతున్నారు. మనదేశంలో ఆ సగటు ఏకంగా 272గా ఉంది. ఈ నేపథ్యంలోనే భోజన వేళలకు, హృద్రోగాలకు మధ్య

మిగతా 12వ పేజీలో...

మెదడులో కణితుల్ని మింగే చిట్టి రోబోలు

12

అల్ట్రా సౌండ్ చికిత్సా విధానంతో కణితుల ధ్వంసం

భవిష్యత్తులో అందుబాటులోకి

కీలకంగా ఏఐ టెక్నాలజీ

న్యూరోసర్జరీలో కొత్త చికిత్సలు, పరిణామాలపై హైదరాబాద్‌లో

అంతర్జాతీయ శాస్త్రీయ సదస్సు

రెండు రోజులు ఆర్‌ఎఫ్‌సీలో..

ఆదివారం కిమ్స్ ఆస్పత్రిలో!



రాజేంద్రనగర్ డిపోలో మొక్క నాటిన సజ్జనార్

ప్రత్యేక బస్సుల్లోనూ మహిళలకు ఫ్రీ!

సర్కారు సంక్రాంతి కానుక 13

పండగకు 4,484 ప్రత్యేక బస్సులు

626 బస్సుల్లో ముందుస్తు రిజర్వేషన్

ప్రత్యేక బస్సుల్లోనూ సాధారణ చార్జీలే

అధికారులతో సమీక్షలో ఎండీ సజ్జనార్

కొవిడ్‌తో ఒక్కరోజులో 12 మంది మృతి

దేశంలో కొత్తగా 761 కేసులు: కేంద్రం

2



అరేబియాలో హైజాక్ హైడ్రామా!

సోమాలియా తీరంలో కార్గో నౌక హైజాక్

యుద్ధనౌకతో చుట్టుముట్టిన భారత నేవీ

పారిపోయిన సాయుధ దుండగులు..

15 మంది భారతీయులు సురక్షితం

ఆసియా కుబేరుడు అదానీ

ఒక్కరోజే 770 కోట్ల డాలర్లు పెరిగి 9,760 కోట్ల డాలర్లకు చేరిన సంపద

ప్రపంచ రిచ్ లిస్ట్‌లో 12వ స్థానం

13వ స్థానంలో అంబానీ 11

ఆటోను.. బైక్‌ను.. రోడ్డు దాటుతున్నవారిని ఢీకొట్టి..

వ్యాన్ బీభత్సం

ముగ్గురు చిన్నారులు సహా ఐదుగురి దుర్మరణం

మరో ముగ్గురికి తీవ్రగాయాలు.. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ వద్ద ఘోరం

పోలీసుల నిర్లక్ష్యం వల్లేనంటూ స్థానికుల ఆగ్రహం

జడ్చర్ల రూరల్ సీఐ, బాలానగర్, రాజాపూర్ ఎస్సైలపై దాడికి యత్నం

మరో ఘటనలో బైక్‌ను ఢీకొన్న టిప్పర్

తండ్రి, కొడుకు దుర్మరణం

హైదరాబాద్ శివారు కుంట్లూరు వద్ద ప్రమాదం

12



మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్‌లో వ్యాన్‌కు నిప్పుపెట్టిన స్థానికులు

ఈడీ అధికారులపై దాడి

బెంగాల్‌లో రెచ్చిపోయిన టీఎంసీ మద్దతుదారులు

ముగ్గురు అధికారులకు గాయాలు

మొబైల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను లాగేసుకున్న అల్లరిమూక

800 నుంచి 1000 మంది దాకా దాడికి పాల్పడ్డారు: ఈడీ

రాజ్యాంగపరంగా తగిన చర్యలు తీసుకుంటా: గవర్నర్ బోస్

రాష్ట్రపతి పాలన విధించాలని బీజేపీ, కాంగ్రెస్ డిమాండ్



కోల్‌కతా, జనవరి 5: రేషన్ కుంభకోణానికి సంబంధించి టీఎంసీ నేత షాజహాన్ షేక్ ఇంట్లో సోదాలు చేసేందుకు వెళ్లిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులపై.. ఆయన అనుచరులు, టీఎంసీ మద్దతుదారులు తీవ్ర స్థాయిలో దాడికి పాల్పడ్డారు. వారితోపాటు వచ్చిన

మిగతా 2వ పేజీలో...

మీపై 420 కాదు.. 840 కేసు పెట్టాలి



కేటీఆర్, హరీశ్‌రావుపై జగ్గారెడ్డి ధ్వజం

నా టైమ్ బాగా లేక ఎన్నికల్లో ఓడిపోయా

లేదంటే అసెంబ్లీలో వాళ్లను ఆడుకునేవాడ్ని

గెలికితే.. వాళ్ల బండారం బయటపెడతా

సీఎం రేవంత్ రెడ్డి కష్టపడి పని చేస్తున్నరు

ఆరు గ్యారెంటీల అమలుకు కృషి చేస్తున్నరు

రాష్ట్రంలో నిజమైన ప్రజాపాలన సాగుతోంది

బీజేపీ, బీఆర్ఎస్.. రెండూ ఒక్కటే: జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): "హామీల అమలుకు సంబంధించి కాంగ్రెస్‌పై సెక్షన్ 420 కింద చీటింగ్ కేసు పెట్టాలని కేటీఆర్, హరీశ్‌రావు మాట్లాడుతున్నరు కదా.. అసలు హామీల అమలులో వారు చేసిన మోసానికి, చెప్పిన దొంగ మాటలకు ఎన్ని చీటింగ్ కేసులు పెట్టాలి? 420 కాదు.. కొత్త చట్టం తీసుకొచ్చి 840 కింద కేసు పెట్టాలి" అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి

మిగతా 13వ పేజీలో...

గోదావరి-కావేరి అనుసంధానం..

ఫిబ్రవరిలో సీఎంల భేటీ?

ఛత్తీస్‌గఢ్ వాటా నీళ్లతో అనుసంధానం

20 ఏళ్లలో మహానది నీళ్లు తెస్తారు

ముసాయిదా డీపీఆర్ ఇప్పటికే సిద్ధం

2 వారాల్లో రాష్ట్రాలకు తుది నివేదిక

నెలాఖరున అధికారుల సమావేశం

రాష్ట్రాల మధ్య విబేధించే అంశాలుంటే

సీఎంల సమావేశంలో తుది నిర్ణయం



హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గోదావరి-కావేరి నదుల అనుసంధానంపై వచ్చే నెలలో ముఖ్యమంత్రుల సమావేశం జరిగే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టుపై కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ఆధ్వర్యంలో సీఎంల సమావేశం ఉంటుందని జాతీయ నీటి అభివృద్ధి సంస్థ(ఎన్‌డబ్ల్యూడీఏ) సంబంధిత రాష్ట్రాలకు ప్రాథమికంగా సమాచారం ఇచ్చింది. సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను ఒకటి రెండు వారాల్లో రాష్ట్రాలకు పంపిస్తారు. ఈ నెలాఖరులోగానే ప్రభావిత రాష్ట్రాల ఉన్నతాధికారులతో ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశం కానుంది. ఇప్పటికే ముసాయిదా డీపీఆర్‌ను ఎన్‌డబ్ల్యూడీఏ హైదరాబాద్ విభాగం కేంద్రానికి పంపించింది. ఈ డీపీఆర్‌కు ఎన్‌డబ్ల్యూడీఏ ఆమోదముద్ర వేయగానే రాష్ట్రాలకు పంపిస్తారు. ప్రాజెక్టు నిర్మాణానికి రూ.74,326 కోట్లు అవుతుందని అంచనా వేశారు. ప్రాజెక్టు చేపట్టిన ఐదేళ్లలోపు దీన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. నిర్మాణం పూర్తయితే వివిధ రూపాల్లో ఏటా రూ.9,824.49 కోట్ల ఆదాయం సమకూరనుందని డీపీఆర్‌లో లెక్కకట్టారు. ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డకు దిగువన ఇచ్చంపల్లి వద్ద బ్యారేజీని నిర్మిస్తారు. ఇక్కడ బ్యారేజీ నిర్మాణానికి రూ.3,381 కోట్లు అవుతుందని లెక్క కట్టారు. ఛత్తీస్‌గఢ్ తన వాటాలో వినియోగించుకోని 148 టీఎంసీలను గోదావరి-కావేరి అనుసంధానంలో భాగంగా తరలించాలని కేంద్రం ప్రతిపాదించింది. ఆ నీటిని వాడుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నామని, సర్వే కూడా పూర్తి చేశామని ఛత్తీస్‌గఢ్ ఇదివరకే కేంద్ర ప్రభుత్వానికి చెప్పింది. అయితే, మరో 20 ఏళ్లయినా ఆ నీటిని ఛత్తీస్‌గఢ్ వాడుకొనే అవకాశాలు లేవని ఎన్‌డబ్ల్యూడీఏ స్పష్టం చేసింది. ఈ ఇరవై ఏళ్లలో ఛత్తీస్‌గఢ్ 148 టీఎంసీలను సొంతానికి వాడుకొనే స్థాయికి వచ్చే నాటికి మహానది-గోదావరి నదులను అనుసంధానం చేస్తామని కేంద్రం చెప్పింది. అప్పుడు మహానది నుంచి తరలించే 230 టీఎంసీలను గోదావరిలో పోసి, వాటిని కావేరికి తరలిస్తామని ఛత్తీస్‌గఢ్‌కు హామీ ఇచ్చింది. కేంద్రం ఇచ్చిన ఈ హామీయే గోదావరి-కావేరి అనుసంధానంలో కీలకం కానుంది. నెలాఖరులో జరిగే కార్యదర్శుల స్థాయి సమావేశంలో డీపీఆర్‌ను అందరూ అంగీకరిస్తే అవగాహన ఒప్పందంపై సంతకాలు తీసుకుంటారు. విబేధించే అంశాలుంటే మాత్రం తర్వాత ముఖ్యమంత్రుల సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటారు. అప్పుడే ఎంవోయూపై సంతకాలు ఉంటాయి. ముసాయిదా డీపీఆర్ సిద్ధం కావడంతో దానికి ఎన్‌డబ్ల్యూడీఏ తుదిరూపు ఇచ్చే పనిలో పడింది.



బీఆర్ఎస్‌లో భగ్గుమన్న విభేదాలు!

12

పట్నం, పైలట్ వర్గీయుల వాగ్వాదం

'చేవెళ్ల'పై సమీక్ష సందర్భంగా ఉద్రిక్తత

ఇరు వర్గాలకు సర్దిచెప్పిన హరీశ్‌రావు

ఐవీ బదులు నీళ్లు

2



ఇంజెక్షన్లు అమ్ముకుని బదులుగా నీళ్లు నింపిన నర్సు

అమెరికాలోని ఓ ఆస్పత్రిలో 10 మంది రోగులు మృతి!



12

ఫైనాన్స్ కంపెనీ వేధింపులకు

ఆదివాసీ రైతు బలి

పురుగు మందు తాగిన రామారావు

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఘటన

కో.. అంటే కోటి..!

» ఐఐటీ బాంబే విద్యార్థులకు భారీ జీతాలు.. 85 మంది ఎంపిక

ముంబయి, జనవరి 5: సుమారు 85 మంది ఐఐటీ బాంబే విద్యార్థులు మొదటి దశ ప్లేస్‌మెంట్లలో కోటి రూపాయలకు పైగా వార్షిక వేతనాలతో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సంవత్సరం ప్లేస్‌మెంట్లలో రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం నుంచి ఎక్కువమంది అత్యధిక వేతనాలతో ఎంపికయ్యారు. మొదటి దశ ప్లేస్‌మెంట్లకు సంబంధించిన నివేదికను ఐఐటీ బాంబే గురువారం రాత్రి విడుదల చేసింది. మొదటి దశ ప్లేస్‌మెంట్లలో విద్యార్థులు సగటున 36.9 లక్షల వార్షిక వేతనంతో ఎంపికవగా.. గతేడాది ఇది రూ.32.25 లక్షలుగా ఉంది. మరోవైపు అల్గో ట్రేడింగ్ కారణంగా దెబ్బతిన్న ఆర్థిక రంగంలో గతేడాది సగటు వార్షిక వేతనంతో పోలిస్తే 22% తగ్గుదల నమోదైంది. గతేడాది ఈ విభాగంలో రూ.41.7 లక్షల ప్యాకేజీ ఉండగా.. ఈ ఏడాది రూ.32.4 లక్షలకు పరిమితమైంది. గతేడాదితో పోలిస్తే మొదటి దశ క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో ఐటీ, సాఫ్ట్‌వేర్, కన్సల్టింగ్ విభాగాల్లో వేతనాలు స్వల్పంగా పెరిగాయి.

కొవిడ్‌తో ఒక్కరోజులో 12 మంది మృతి

» కొత్తగా 761 కేసులు: కేంద్ర ఆరోగ్యశాఖ

న్యూఢిల్లీ, జనవరి 5: దేశంలో మరోసారి కొవిడ్ మహమ్మారి వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ఒక్కరోజులో 761 కొవిడ్ కేసులు నమోదయ్యాయి. 24 గంటల్లోనే 12 మంది చనిపోయారని కేంద్ర ఆరోగ్యశాఖ శుక్రవారం వెల్లడించింది. కేరళలో అయిదుగురు, కర్ణాటకలో నలుగురు, మహారాష్ట్రలో ఇద్దరు, ఉత్తరప్రదేశ్‌లో ఒక్కరు మహమ్మారికి బలయ్యారు. ఈ క్రమంలో దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 4,334కు చేరిందని, రికవరీ రేటు 98.81 శాతంగా ఉందని ఆరోగ్యశాఖ తెలిపింది. మరోవైపు దేశంలో కొవిడ్-19 ఉపవేరియంట్ జేఎన్.1 కేసులు గురువారం నాటికి 619కు చేరాయని అధికారులు వెల్లడించారు. వీటిలో కర్ణాటకలో 199, కేరళలో 148, మహారాష్ట్రలో 110, గోవాలో 47, గుజరాత్‌లో 36, ఆంధ్రప్రదేశ్‌లో 30, తమిళనాడులో 26, ఢిల్లీలో 15, రాజస్థాన్‌లో 4, తెలంగాణలో 2, ఒడిశా, హరియాణాలలో ఒక్కొక్కటి చొప్పున కేసులు నమోదయ్యాయని తెలిపారు.

ఐవీ బదులు నీళ్లు

» ఇంజెక్షన్లు అమ్ముకుని బదులుగా నీళ్లు నింపిన నర్సు

» అమెరికాలోని ఓ ఆస్పత్రిలో 10 మంది రోగులు మృతి!

మెడ్‌ఫర్, జనవరి 5: రోగులను కంటికి రెప్పలా చూసుకోవాల్సిన ఓ నర్సు క్రూరంగా ప్రవర్తించింది. తన దొంగతనాలను కప్పిపుచ్చుకునేందుకు ఐవీ ఇంజెక్షన్లలో ఔషధానికి బదులు నీళ్లు నింపి రోగులకు ఇచ్చింది. ఆ నర్సు చేసిన పనికి అమెరికాలోని ఓ ఆస్పత్రిలో కనీసం 10 మంది రోగులు ప్రాణాలు కోల్పోయారు. ఒరెగాన్ రాష్ట్రం మెడ్‌ఫర్డ్‌లోని అసంటే రోగ్ రీజనల్ మెడికల్ సెంటర్‌లో ఈ ఘటన జరిగింది. నొప్పి నుంచి ఉపశమనానికి రోగులకు ఐవీ (నరానికి ఇచ్చే ఇంజెక్షన్) ద్వారా ఇచ్చే ఫెంటనిల్ అనే ఔషధం స్థానంలో ఆ నర్సు నీటిని నింపింది. ఆస్పత్రి నుంచి ఫెంటనిల్ ఔషధాలను మాయం చేసిన ఆ నర్సు.. తన తప్పు కప్పిపుచ్చుకునేందుకు ఈ పనికి పాల్పడింది. సదరు నర్సు 2022 నుంచే ఔషధం స్థానంలో నీళ్లు నింపిన ఇంజెక్షన్లను రోగులకు ఇస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

లోకం తీరు



రామమందిర ప్రారంభోత్సవం.. ఇక్బాల్ అన్సారీకి ఆహ్వానం



అయోధ్య, జనవరి 5: రామమందిర ప్రారంభోత్సవానికి హాజరు కావాలంటూ శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్.. రామజన్మభూమి-బాబ్రీ మసీదు కేసులో కక్షిదారు అయిన ఇక్బాల్ అన్సారీకి కూడా శుక్రవారం ఆహ్వాన పత్రికను అందజేసింది. ట్రస్టు సభ్యులు రామ్‌పథ్ సమీపంలోని కోటియా పంజి టోలాలోని ఆయన ఇంటికి వెళ్లి, ఆహ్వాన పత్రికను అందజేశారు. దీనిపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. అయోధ్య హిందూ, ముస్లిం, క్రైస్తవ, సిక్కులందరి ప్రాంతమని, ఇక్కడ అందరం సంతోషంగా ఉన్నామని తెలిపారు. కాగా అయోధ్య-బాబ్రీ మసీదు కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ముస్లింలు గౌరవిస్తారని గతంలో అన్సారీ పేర్కొన్నారు. అయోధ్యలో రామమందిర భూమి పూజ మొదటి ఆహ్వానాన్ని కూడా ఇక్బాల్ అన్సారీకే అందజేశారు.

'అయోధ్య వాల్మీకి ఎయిర్‌పోర్టు'కు ఆమోదం

న్యూఢిల్లీ, జనవరి 5: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య పట్టణంలో ఉన్న విమానాశ్రయానికి 'మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయం, అయోధ్యధామ్' అనే పేరు పెట్టాలనే ప్రతిపాదనకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. అయోధ్య ఎయిర్‌పోర్టుకు అంతర్జాతీయ విమానాశ్రయం హోదా కల్పిస్తున్నట్లు కేంద్రం తెలిపింది. దీనివల్ల దేశ విదేశాలకు చెందిన యాత్రికులు, భక్తులు అయోధ్యకు తరలి వస్తారని.. తద్వారా అయోధ్య గొప్ప పుణ్యక్షేత్రంగానేగాక ఆర్థికకేంద్రంగానూ మారుతుందని ఈ ప్రకటనలో పేర్కొన్నారు. క్యాబినెట్ నిర్ణయంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేస్తూ.. 'పవిత్ర నగరం అయోధ్యను యావత్ ప్రపంచంతో అనుసంధానించటానికి మా ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది' అని పేర్కొన్నారు. ప్రధాని అధ్యక్షతన శుక్రవారం జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో పలు ఇతర నిర్ణయాలు కూడా తీసుకున్నారు. భూ విజ్ఞానశాస్త్ర పరిశోధనలకు సంబంధించిన ఐదు వేర్వేరు పథకాలను కలుపుతూ పృథ్వీ విజ్ఞాన్ అనే కొత్త పథకానికి క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది.

జమిలి ఎన్నికలపై 15లోగా సలహాలివ్వండి

న్యూఢిల్లీ, జనవరి 5: 'ఒకే దేశం, ఒకే ఎన్నిక'పై మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ జమిలి ఎన్నికలపై ప్రజల సలహాలు, సూచనలను ఆహ్వానించింది. దేశమంతటా ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు గాను ప్రస్తుత చట్టాల్లో చేయాల్సిన మార్పులకు సంబంధించి సలహాలు ఇవ్వాలని కోరింది. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రజలు తమ సలహాలను onoe.gov.in వెబ్‌సైట్‌లో లేదా schlc@gov.inకు ఈ-మెయిల్ ద్వారా ఈ నెల 15లోగా పంపాలని తెలిపింది. 15వ తేదీ వరకు అందిన సలహాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని, వాటినే కమిటీ పరిశీలిస్తుందని వెల్లడించింది.

జైల్లో ఉన్న సంజయ్‌సింగ్‌కు మళ్లీ రాజ్యసభ సభ్యత్వం

న్యూఢిల్లీ, జనవరి 5: మద్యం పాలసీ కేసులో అరెస్టయి జైల్లో ఉన్న ఎంపీ సంజయ్‌సింగ్‌ను వరుసగా రెండోసారి రాజ్యసభకు పంపాలని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సారథ్యంలోని ఆప్ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) నిర్ణయించింది. ఢిల్లీ నుంచి ఆ పార్టీకి చెందిన ముగ్గురు రాజ్యసభ సభ్యులు సంజయ్‌సింగ్, ఎన్‌డీ గుప్తా, సుశీల్ గుప్తాల పదవీకాలం ఈ నెల 27న ముగియనుంది. ఈ నేపథ్యంలో ఆ మూడు స్థానాలకు ఎన్నికల కమిషన్ ఎన్నికలు నిర్వహించనుంది. సంజయ్‌సింగ్, ఎన్‌డీ గుప్తాలను కొనసాగించాలని కేజ్రీవాల్ నిశ్చయించారు. సుశీల్ స్థానంలో ఢిల్లీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ స్వాతి మలివాల్‌కు అవకాశమిచ్చారు. దీంతో ఆమె కమిషన్ ఛైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేశారు. నామినేషన్ల దాఖలుకు ఈ నెల 9వ తేదీ చివరి రోజు. 12వ తేదీ వరకు ఉపసంహరణకు అవకాశం ఉంది. అనివార్యమైతే 19వ తేదీన పోలింగ్ జరుగుతుంది.

డీకే శివకుమార్‌పై హైకోర్టుకు వెళ్లిన సీబీఐ

బెంగళూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి ఆస్తులు, మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌పై దర్యాప్తునకు అనుమతించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ సీబీఐ శుక్రవారం హైకోర్టును ఆశ్రయించింది. గతంలో సీబీఐకి ఇచ్చిన అనుమతులను కర్ణాటక క్యాబినెట్ ఇటీవలే రద్దు చేసింది. కేసును లోకాయుక్తకు అప్పగించింది. దీన్ని సవాలు చేస్తూ సీబీఐ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన ధర్మాసనం.. డివిజన్ బెంచ్‌కు రిఫర్ చేసింది.

అంతరిక్షంలో బ్యాటరీ పరీక్ష విజయవంతం: ఇస్రో

బెంగళూరు, జనవరి 5: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో ఘనత సాధించింది. అంతరిక్షంలో విద్యుత్ ఉత్పత్తి చేసే వ్యవస్థలను విజయవంతంగా పరీక్షించింది. సంప్రదాయ బ్యాటరీల కంటే తక్కువ ఖర్చుతోనే మరింత సమర్థవంతంగా పనిచేసే కొత్త రకం 10ఎంఏహెచ్ సిలికాన్-గ్రాఫైట్-ఎనోడ్ ఆధారిత అధిక శక్తి కలిగిన లి-అయాన్ బ్యాటరీని పరీక్షించింది. ఈ నెల 1న పీఎస్ఎల్వీ-సీ58 రాకెట్‌తోపాటు అంతరిక్షంలోకి పంపిన పీవోఈఎం-3 ప్లాట్‌ఫామ్‌లో రెసిస్టెంట్ లోడ్‌కు శక్తిని అందించడం ద్వారా బ్యాటరీ సెల్ పరీక్షను విజయవంతంగా పూర్తిచేసింది. దీనితోపాటు పాలిమర్ ఎలక్ట్రోలైట్ మెంబ్రేన్ ఫ్యూయెల్ సెల్‌ను కూడా పరీక్షించింది. అంతరిక్షంలో వాటి పనితీరుని విశ్లేషించడంతోపాటు డేటాను సేకరించినట్టు ఇస్రో శుక్రవారం ఎక్స్ (ట్విటర్)లో వెల్లడించింది.

ఈడీ అధికారులపై దాడి

(మొదటి పేజీ తరువాయి)

సీఆర్పీఎఫ్ జవాన్లపైన, అక్కడున్న మీడియాపైనా దాడి చేసి, వారి వాహనాలనూ ధ్వంసం చేశారు. పశ్చిమబెంగాల్‌లోని నార్త్ 24 పరగణాల జిల్లా సందేశ్‌ఖాలీ ప్రాంతంలో జరిగిందీ ఘటన. రేషన్ కుంభకోణానికి సంబంధించి ఈడీ అధికారులు శుక్రవారం పశ్చిమబెంగాల్ వ్యాప్తంగా 15చోట్ల ఏకకాలంలో సోదాలు చేశారు. బెంగాల్ మంత్రి జ్యోతిప్రియ మాలిక్‌కు సన్నిహిత అనుచరుడిగా పేరున్న షాజహాన్ ఇల్లు కూడా వాటిలో ఒకటి. శుక్రవారం సోదాల నిమిత్తం ఈడీ బృందం అక్కడికి చేరుకునేసరికి తాళం వేసి ఉంది. తాళం తీయడం కోసం వారు షాజహాన్‌కు, ఆయన కుటుంబసభ్యులకు పలుమార్లు ఫోన్ చేసినా ఎవరూ ఫోన్ తీయలేదు. దాదాపు గంట తర్వాత.. అధికారులు ఆ ఇంటి తాళం పగలగొట్టేందుకు సిద్ధమయ్యారు. ఆ సమయంలో షాజహాన్ అనుచరులు, స్థానికులు అక్కడికి పెద్ద ఎత్తున చేరుకుని అధికారులను ఘెరావ్ చేశారు. వారిపై దాడికి దిగారు. దీంతో అధికారులు ఆటోలు, బైకులు ఇలా ఏది దొరికితే ఆ వాహనం ఎక్కి ప్రాణాలు అరచేత పట్టుకుని ఆ ప్రదేశానికి దూరంగా వెళ్లిపోయారు. 800 నుంచి 1000 మంది లాఠీలు, రాళ్లు, ఇటుకలతో ఈ దాడిలో పాల్గొన్నారని..



దాడిలో ధ్వంసమైన కారు... తీవ్రంగా గాయపడిన ఈడీ అధికారి

తమ అధికారులు ముగ్గురికి తీవ్రగాయాలు కావడంతో వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నామని ఈడీ అధికారిక ప్రకటనలో తెలిపింది. అధికారుల మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, వారి జేబుల్లో ఉన్న డబ్బు, పర్సులను సైతం.. దాడికి పాల్పడ్డ మూక ఎత్తుకుపోయినట్టు వెల్లడించింది. ఘటనపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు పేర్కొంది.

గవర్నర్ ఆగ్రహం..

జరిగిన ఘటనపై బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్ని ఎన్నికల ముందు జరిగే హింసగా అభివర్ణించిన బోస్.. ప్రజాస్వామ్యంలో ఇలాంటి ఆటవిక దాడులను ఆపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం తన ప్రాథమిక విధిని నిర్వర్తించడంలో విఫలమైతే.. రాజ్యాంగం తన పని తాను చేసుకుపోతుందన్నారు. "గవర్నర్‌గా దీనిపై తగిన చర్య తీసుకోవడానికి సంబంధించి రాజ్యాంగం నాకిచ్చిన అన్ని అవకాశాలనూ పరిశీలిస్తాను" అని హెచ్చరించారు. ఘటనపై కేంద్రం జోక్యం చేసుకుని, ఎన్ఐఏతో దర్యాప్తు జరిపించాలని విపక్ష నేత సువేందు అధికారి అభిప్రాయపడ్డారు. ఇక.. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఈ దాడిని దురదృష్టకరంగా అభివర్ణించింది. ఈడీ తమ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీయడానికి ఉద్దేశపూర్వకంగా ప్రయత్నిస్తోందని ఆరోపించింది.

పవార్ మనుమడి కంపెనీలో సోదాలు

ఎన్సీపీ చీఫ్ శరద్‌పవార్ సోదరుని మనుమడు, ఆ పార్టీ ఎమ్మెల్యే రోహిత్‌పవార్ కంపెనీలో ఈడీ శుక్రవారం సోదాలు చేసింది. బారామతి ఆగ్రో అనే కంపెనీకి ఆయన సీఈఓగా వ్యవహరిస్తున్నారు. కంపెనీకి సంబంధించి కనీసం ఆరు స్థలాల్లో సోదాలు జరిగాయి. మహారాష్ట్ర సహకార బ్యాంకు నుంచి తీసుకున్న రుణాల మళ్లింపులో మనీలాండరింగ్‌కు పాల్పడినట్టు ఈడీ రోహిత్‌పవార్‌పై కేసు నమోదు చేసింది. మహారాష్ట్ర సహకార బ్యాంకులో రూ.25వేల కోట్ల రుణాల కుంభకోణం జరిగినట్టు ఆరోపణలున్నాయి.

కాంగ్రెస్ ఎమ్మెల్యే నివాసంలో ఈడీ సోదాలు

» రూ.5 కోట్ల నగదు, 5 కిలోల బరువున్న మూడు బంగారం బిస్కెట్లు స్వాధీనం

» 100 బాటిళ్ల విదేశీ మద్యం కూడా..

న్యూఢిల్లీ, జనవరి 5: మనీలాండరింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణలపై హరియాణాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే సురేందర్ పన్వర్ నివాసంలో ఈడీ జరిపిన సోదాల్లో భారీగా నగదు, బంగారం లభ్యమైంది. సోనేపట్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయన మైనింగ్ వ్యాపారం చేస్తుంటారు. వ్యాపారంలో అక్రమ మార్గాల ద్వారా నగదు సంపాదించారంటూ 2013లో ఈడీతో పాటు, రాష్ట్ర పోలీసులు పలు కేసులు నమోదు చేశాయి. పన్వర్ ఇళ్లల్లో రూ.5 కోట్ల నగదు, 4-5 కిలోల బరువు ఉన్న మూడు బంగారం బిస్కెట్లు, అక్రమంగా తీసుకొచ్చిన విదేశీ తుపాకులు, 300 తూటాలు, 100 బాటిళ్ల విదేశీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొంది. గురు, శుక్రవారాల్లో ఈ సోదాలు జరిగాయి. గురువారం 15-20 మంది ఈడీ అధికారులు ఆరు వాహనాల్లో ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి తనిఖీలు నిర్వహించారు.

మంత్రిని తొలగించే అధికారం గవర్నర్‌కు లేదు

» స్పష్టం చేసిన సుప్రీంకోర్టు

చెన్నై, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిఫారసు లేకుండా ఏ మంత్రినీ తొలగించే అధికారం గవర్నర్‌కు లేదంటూ మద్రాసు హైకోర్టు వెలువరించిన తీర్పును సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది. తమిళనాడులో అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో సెంథిల్‌బాలాజీ రవాణా శాఖ మంత్రిగా ఉన్నప్పుడు కొందరికి ఆ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ లక్షలాది రూపాయలు వసూలు చేసి మోసగించారనే నేరారోపణలపై ఈడీ ఆయనపై కేసు నమోదు చేసి అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో సెంథిల్‌బాలాజీ తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరి ఓపెన్‌హార్ట్ సర్జరీ చేసుకుని కోలుకున్న తర్వాత పుళల్ సెంట్రల్ జైలుకు తరలించారు. సెంథిల్‌బాలాజీ అనారోగ్య కారణాల దృష్ట్యా ఆయన్ని శాఖ లేని మంత్రిగా కొనసాగిస్తూ గతేడాది జూన్ 16న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఉత్తర్వులు జారీ చేశారు. అదే రోజున సెంథిల్‌బాలాజీని శాఖ లేని మంత్రిగా కొనసాగించేందుకు వీలులేదంటూ రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి డిస్మిస్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే కొద్దిసేపటికే మళ్లీ ఆ ఉత్తర్వులను ఉపసంహరించుకున్నారు. ఈ పరిస్థితుల్లో సెంథిల్‌బాలాజీని శాఖ లేని మంత్రిగా కొనసాగిస్తూ ప్రభుత్వం వెలువరించిన ఉత్తర్వులను, గవర్నర్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ న్యాయవాది ఎంఎల్ రవి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు శాఖ లేని మంత్రిగా సెంథిల్‌బాలాజీని కొనసాగించాలా వద్దా అనే విషయంపై తుది నిర్ణయం ముఖ్యమంత్రిదేనని స్పష్టం చేసింది. దీనిపై సుప్రీంకోర్టులో అప్పీలు పిటిషన్ దాఖలైంది. ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. సీఎం అనుమతి, సిఫారసు లేకుండా ఏ మంత్రినీ రాష్ట్ర గవర్నర్ తొలగించే ఆస్కారమే లేదని, ఆ అధికారం వారికి లేదని స్పష్టం చేసింది.

వీవీప్యాట్‌లను తెచ్చింది కాంగ్రెస్సే

» వాటిపై సందేహాలు అవసరం లేదు: ఈసీ

న్యూఢిల్లీ, జనవరి 5: వీవీప్యాట్‌లపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ చేసిన వ్యాఖ్యలను కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) తోసిపుచ్చింది. జైరాం వ్యాఖ్యల్లో సహేతుకత లేదని, కొత్త కారణాలు కూడా చూపించలేదని పేర్కొంటూ ఆయన వ్యాఖ్యలను ఖండించింది. వీవీప్యాట్లు, స్లిప్పుల విధానాన్ని 2013లో కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకువచ్చిందని ఈసీ తెలిపింది. ఈవీఎంలపైనా పూర్తి విశ్వసనీయత ఉందని పేర్కొంది. ఈవీఎంలను, వీవీప్యాట్ స్లిప్పులను పరిశీలించేందుకు ఇండియా కూటమి ప్రతినిధి బృందాన్ని అనుమతించాలని కోరుతూ జైరాం రమేశ్ డిసెంబరు 30న లేఖ రాసిన నేపథ్యంలో ఈసీ ఈ మేరకు స్పందించింది. మాక్ పోలింగ్ నుంచి కౌంటింగ్ వరకు అన్ని దశల్లోనూ జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించింది. ఈవీఎంలను ట్యాంపరింగ్, హ్యాకింగ్ చేయకుండా ప్రతి చిన్న అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని కట్టుదిట్టమైన వ్యవస్థతో ముందుకు సాగుతున్నామని తెలిపింది. మరోవైపు, ఈవీఎంలు, వీవీప్యాట్‌లపై జమ్ముకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ విమర్శలు గుప్పించారు. ఈవీఎంలు ఇప్పుడున్న స్థితిలోనే వచ్చే ఎన్నికల్లో వినియోగిస్తే అధికారం మళ్లీ బీజేపీకే దక్కుతుందని వ్యాఖ్యానించారు. అంతేకాదు, వీవీప్యాట్ స్లిప్పులను కూడా లెక్కించాలని ఆయన సూచించారు. కాగా, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదివారం నుంచి దేశవ్యాప్తంగా పర్యటించనుంది. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఆయా రాష్ట్రాల్లో సన్నద్ధతను పరిశీలించనుంది. తొలుత ఏడవ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఏపీ, తమిళనాడు రాష్ట్రాల్లో ఈసీ పర్యటించనుంది. ఈ బృందంలో ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్, కమిషనర్లు అనూప్ చంద్ర పాండే, అరుణ్ గోయెల్ ఉండనున్నారు.

ఆశలన్నీ యూపీపైనే!

ఆ రాష్ట్రంలో 11రోజుల పాటు భారత్‌జోడో న్యాయ యాత్ర

» రాహుల్ యాత్ర రూట్‌మ్యాప్‌లో అయోధ్య లేకపోవడంపై చర్చలు

న్యూఢిల్లీ, జనవరి 5: దేశ రాజకీయాల్లో ఉత్తరప్రదేశ్ అత్యంత కీలకం. త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరిగే 543 సీట్లలో ఈ రాష్ట్రంలో అత్యధికంగా 80 స్థానాలు ఉన్నాయి. 2014లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ఇక్కడ ఏకంగా 73 సీట్లు గెలుచుకుంది. ఇక 2019లో 64 స్థానాల్లో విజయం సాధించింది. అప్రతిహత విజయాలతో దూసుకెళ్తున్న బీజేపీకి చెక్ పెట్టడానికి యూపీపై దృష్టి సారించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ప్రస్తుతం ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ నుంచి ఒక్క ఎంపీ మాత్రమే ఉన్నారు. ఈ నేపథ్యంలో యూపీలో గత వైభవాన్ని తిరిగి సాధించే దిశగా కాంగ్రెస్ ప్రయత్నాలు మొదలుపెట్టింది. జనవరి 14న రాహుల్‌గాంధీ చేపట్టనున్న భారత్ జోడో న్యాయ యాత్ర ఈ రాష్ట్రంలోనే అత్యధికంగా 11 రోజుల పాటు సాగేలా ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ వ్యవధిలో ఆయన 1,074 కిలోమీటర్లలో విస్తరించి ఉన్న 20 జిల్లాల్లో పర్యటించనున్నారు. రాహుల్ చేపట్టిన తొలివిడత భారత్ జోడో యాత్ర రూట్ మ్యాప్‌లో తొలుత యూపీ లేదు. చివరి నిమిషంలో ఈ రాష్ట్రాన్ని కూడా చేర్చారు. అప్పట్లో కేవలం మూడు జిల్లాల్లో మాత్రమే ఆయన పర్యటించారు. ఈసారి మాత్రం రెండో విడత యాత్ర కీలక నియోజకవర్గాల మీదుగా సాగేవిధంగా అధిష్ఠానం జాగ్రత్తలు తీసుకుంది. అయితే రామమందిరం నిర్మాణాన్ని ఎన్నికల్లో ప్రధానాస్త్రంగా ఉపయోగించుకోవాలని బీజేపీ భావిస్తున్న అయోధ్య స్థానంలో యాత్ర చేయకూడదని రాహుల్ తీసుకున్న నిర్ణయం చర్చనీయాంశంగా మారింది. రాహుల్ యాత్రను అయోధ్యకు మళ్లించే అవకాశాలు కూడా కొట్టిపారేయలేమని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

వారాణసీలో మోదీని ఢీకొట్టేదెవరు?

ప్రధాని మోదీ నియోజకవర్గమైన వారాణసీలో ప్రియాంక పోటీచేయాలని ఇటీవల మమతా బెనర్జీ ప్రతిపాదించారు. కానీ గాంధీల విషయంలో అంత రిస్క్ తీసుకోవడానికి పార్టీ సిద్ధంగా లేదని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇదిలా ఉండగా, ఒకప్పుడు కాంగ్రెస్‌కు కంచుకోటలైన అమేఠీ, రాయ్‌బరేలీని తిరిగి చేజిక్కించుకోవడమే లక్ష్యంగా ఈ స్థానాల్లో భారత్ జోడో న్యాయ యాత్ర సాగనుంది. గత ఎన్నికల్లో ఇక్కడ స్మృతి ఇరానీ.. రాహుల్‌ను చిత్తుగా ఓడించారు. ఇప్పుడు స్మృతిపై పోటీకి ప్రియాంక పేరును కూడా పరిశీలిస్తున్నారని ఊహాగానాలు వెలువడుతున్నాయి. గత ఎన్నికల్లో రాయ్‌బరేలీ నుంచి గెలిచిన సోనియా ఆ తర్వాత నియోజకవర్గంలో అంతగా పర్యటించ లేదు. ఈసారి ఇక్కడ రాహుల్ పోటీ చేసే అవకాశం ఉందని చెప్తున్నారు.



అభ్యర్థుల వడపోతకు స్క్రీనింగ్ కమిటీలు

లోక్‌సభ ఎన్నికలకు అభ్యర్థుల పేర్లను వడపోయటానికి కాంగ్రెస్ ఐదు స్క్రీనింగ్ కమిటీలను శుక్రవారం ఏర్పాటు చేసింది. దీనికోసం రాష్ట్రాలను, యూటీలను ఐదు క్లస్టర్లుగా విభజించి, ఒక్కో క్లస్టర్‌కు బాధ్యులను నియమించింది. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, లక్షద్వీప్, పుదుచ్చేరిలతో కూడిన క్లస్టర్‌కు స్క్రీనింగ్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా హరీశ్ చౌదరి, సభ్యులుగా జిగ్నేశ్ మేవానీ, విశ్వజీత్ కదమ్‌లను నియమించింది. ఏపీ, మహారాష్ట్ర, గోవా, ఒడిశా, అండమాన్ నికోబార్ దీవులు మరో క్లస్టర్‌గా ఉంటాయి. దీనికి మధుసూదన్ మిస్త్రీ సారథ్యం వహిస్తారు. మరోవైపు కాంగ్రెస్ మహిళా, విద్యార్థి విభాగాలకు కొత్త సారథులను నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు ఖర్గే శుక్రవారం నిర్ణయం తీసుకున్నారు. మహిళా కాంగ్రెస్‌కు అల్కా లాంబాను, ఎన్ఎస్‌యూఐకి వరుణ్ చౌదరిని అధ్యక్షులుగా నియమించారు.

అరేబియాలో హైజాక్ హైడ్రామా!

» సోమాలియా తీరంలో నౌక హైజాక్

» యుద్ధనౌకతో చుట్టుముట్టిన భారత నేవీ

» పారిపోయిన సాయుధ దుండగులు

» 15 మంది ఇండియన్లు సహా 21మంది సేఫ్

న్యూఢిల్లీ, జనవరి 5: అరేబియా సముద్రం సోమాలియా తీరంలో హైజాక్‌కు గురైన కార్గో నౌకను భారత నావికాదళం చుట్టుముట్టి బందీలను కాపాడింది. నేవీ చేపట్టిన రెస్క్యూ ఆపరేషన్ చూసి కంగుతిన్న హైజాకర్లు పారిపోయారు. నౌకలోని 15 మంది భారత సిబ్బందితో సహా మొత్తం 21 మందిని కమాండోలు సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. బ్రెజిల్ నుంచి బహ్రెయిన్‌కు బయలుదేరిన 'ఎంవీ లీలా నోర్ఫోక్' అనే కార్గో నౌక గురువారం సాయంత్రం సోమాలియా తీరానికి చేరగా.. అందులోకి అక్రమంగా ప్రవేశించిన సాయుధులైన దుండగులు దాన్ని హైజాక్ చేశారు. ఈ విషయాన్ని యూకే మేరీటైమ్ ట్రేడ్ ఆపరేషన్ (యూకేఎంటీఓ) ధ్రువీకరించింది. ఐదారుగురు గుర్తుతెలియని సాయుధులు నౌకను హైజాక్ చేసి తీసుకెళ్తున్నారని భారత నేవీకి సమాచారం ఇచ్చింది. నౌకలో కొందరు భారత సిబ్బంది కూడా ఉన్నట్లు తెలిపింది. దీంతో అప్రమత్తమైన నేవీ.. యుద్ధనౌక ఐఎన్ఎస్ చెన్నైతో పాటు హెలికాప్టర్లు, ఓ ఎయిర్‌క్రాఫ్ట్, ప్రిడేటర్ డ్రోన్లను రంగంలోకి దింపింది. హైజాక్ అయిన నౌకను కనిపెట్టి చుట్టుముట్టింది. నౌకను నిలిపేయాలంటూ హైజాకర్లకు హెచ్చరికలు జారీ చేసింది. అయితే నౌక ఆగకపోవడంతో అందులోకి ప్రవేశించిన నేవీ కమాండోలు, మార్కోస్ దాన్ని అదుపులోకి తీసుకున్నారు. నేవీ హెచ్చరికలకు భయపడి హైజాకర్లు తమ ప్రయత్నాన్ని విరమించుకొని పారిపోయారని అధికారులు వెల్లడించారు. నౌకలోని సిబ్బందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చామని తెలిపారు.



హైజాక్ అయిన 'ఎంవీ లీలా నోర్ఫోక్' నౌక

ప్రమాదాల సమాచారం చేరవేతకు డ్రైవర్లకు సాంకేతిక పరిజ్ఞానం

హిట్ అండ్ రన్ కేసులపై కేంద్రం ఆలోచన

న్యూఢిల్లీ, జనవరి 5: భారతీయ న్యాయ సంహితలో హిట్ అండ్ రన్ కేసులు విధించిన శిక్షలు కఠినంగా ఉన్నాయంటూ డ్రైవర్లు ఆందోళన చేసిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాన్ని ప్రతిపాదించింది. ప్రమాదం జరిగితే ఆ విషయాన్ని వెంటనే సాంకేతిక పరిజ్ఞానం సాయంతో సంబంధిత అధికార్లకు తెలపవచ్చని, అలాంటప్పుడు దాన్ని హిట్ అండ్ రన్ కేసుగా పరిగణించరని పేర్కొంది. ఈ సమాచారం పంపిన తరువాత 20-25 కి.మీ దూరంలోని పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. డ్రైవర్లకు ఈ సాంకేతిక పరిజ్ఞానం అందజేసే విషయమై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని కేంద్ర రోడ్డు రవాణా, హైవే శాఖల కార్యదర్శి అనురాగ్ జైన్ చెప్పారు. హిట్ అండ్ రన్ కేసులకు పాల్పడితే పదేళ్ల జైలు శిక్ష, రూ.7 లక్షల జరిమానా విధించాలని 'సంహిత'లో ప్రతిపాదించారు. ప్రమాదాలు జరిగినప్పుడు సంఘటన స్థలాల్లో ప్రజలు తమపై దాడి చేస్తుంటారని, వాటిని తప్పించుకోవడానికే ఆగకుండా వెళ్లిపోతుంటామని డ్రైవర్లు చెప్పారు. వాటిని హిట్ అండ్ రన్ కేసులుగా పరిగణించి కఠిన శిక్షలు వేస్తే ఎలా అని ప్రశ్నిస్తూ మూడు రోజుల పాటు ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం నూతన సాంకేతిక పరిజ్ఞానం ఆవిష్కరణపై దృష్టి పెట్టింది.

ఆసియా-పసిఫిక్‌లో భారతే కీలకం

» భారత్, అమెరికా మధ్య పరస్పర సహకారం, సుస్థిర శాంతికి సంయుక్తంగా కృషి చేస్తున్నాం

» అమెరికన్ కాన్సులేట్ కాన్సుల్ జనరల్ లార్సన్

హైదరాబాద్, జనవరి5: భారత్, అమెరికా మధ్య రక్షణ వాణిజ్యం 25బిలియన్ డాలర్లకు చేరిందని, రెండు దేశాల మధ్య పెరిగిన సాన్నిహిత్యానికి ఇది నిదర్శనమని హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ అన్నారు. అమెరికన్ కాన్సులేట్ సహకారంతో కట్స్ ఇంటర్నేషనల్ సంస్థ శుక్రవారం 'డెలివరబుల్స్ టూ డెలివరీస్' అనే అంశంపై చర్చాగోష్ఠి నిర్వహించింది. ఇందులో లారస్స్ మాట్లాడుతూ రక్షణరంగంతోపాటు పర్యావరణం, అంతర్జాతీయ చట్టాలు, మానవ హక్కులు, నైపుణ్య రంగాల్లో భారత్, అమెరికాలు ఉమ్మడిగా కృషి చేస్తున్నాయన్నారు. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో శాంతి నెలకొంటేనే ప్రపంచశాంతి సాధ్యమని అమెరికా భావిస్తోందని, భారత్ సహకారంతోనే అది సాధ్యమవుతుందని పేర్కొన్నారు. క్వాడ్ ఏర్పాటుతోపాటు ఉమ్మడి సైనిక విన్యాసాల ద్వారా ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో సుస్థిర శాంతికి కృషి చేస్తున్నామన్నారు. రెండు దేశాల మధ్య కొన్ని విషయాల్లో అభిప్రాయ భేదాలున్నా పరస్పర సహకారానికి అవి అడ్డుకావని అభిప్రాయపడ్డారు. గల్వాన్‌లో చైనా దురాక్రమణకు పాల్పడుతున్న విషయం అమెరికా ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా మొదట సమాచారం అందిందని, తద్వారా సకాలంలో స్పందించగలిగామని రిటైర్డ్ మేజర్ జనరల్ పవన్ ఆనంద్ తెలిపారు.



జెన్నిఫర్ లారెన్స్

భారత్-అమెరికా దేశాధినేతల మధ్య సుహృద్భావం నెలకొందని, అయినా ఇరు దేశాల మధ్య మరింత విశ్వాసం పెంపొందాల్సిన అవసరం ఉంద న్నారు. సమావేశంలో కట్స్ ఇంటర్నేషనల్ అసోసియేట్ డైరెక్టర్ అర్నబ్ గంగూలీ, రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ అనిల్ కపూర్, రిటైర్డ్ కెప్టెన్ సరబ్‌జీత్, ఇంటెలిజెన్స్ మాజీ అనలిస్ట్ హరీందర్ షెకాన్, పొలిటియా రీసెర్చ్ ఫౌండేషన్ సారథి సంజయ్ పులిపాక తదితరులు పాల్గొన్నారు.

ఏరోస్పేస్ హబ్‌గా హైదరాబాద్

ప్రముఖ ఏరోస్పేస్ కంపెనీలు హైదరాబాద్‌లో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాయని తెలంగాణ ఏరోస్పేస్, డిఫెన్స్ విభాగం డైరెక్టర్ పీఏ ప్రవీణ్ తెలిపారు. మేక్ ఇన్ ఇండియాతోపాటు అమెరికాతో మైత్రీ బంధం ఫలితంగా రక్షణరంగం వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఏరోస్పేస్, రక్షణ సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసే సంస్థల హబ్‌గా హైదరాబాద్ నిలవడానికి ఇది ఎంతో తోడ్పడుతోందని చెప్పారు. ఇప్పటికే వెయ్యికి పై గా కంపెనీలు రక్షణ, సాంకేతిక విభాగాల్లో రాణిస్తున్నాయని, వీటిలో కనీసం 200కంపెనీలు అద్భుత ఫలితాలు సాధిస్తున్నాయన్నారు.



అన్నతో 'ఢీ'!

జగన్‌ను అధికారం నుంచి దించేయడమే లక్ష్యం.. కాంగ్రెస్ పెద్దలకు షర్మిల స్పష్టం

- మా ఇద్దరికీ సంబంధాలు సరిగా లేవు
- నా రాజకీయ ఆకాంక్షలను జగన్ తొక్కిపెట్టాడు
- ఖర్గే, కేసీ వేణుగోపాల్‌తో షర్మిల భేటీ
- పీసీసీ చీఫ్, కర్ణాటక నుంచి రాజ్యసభ?
- రాహుల్ సిద్ధంగా ఉన్నారని వెల్లడి!

(న్యూఢిల్లీ - ఆంధ్రజ్యోతి)

'జగనన్న వదిలిన బాణం'.. దిశ మార్చుకుని జగన్‌పైకే వదిలిన బాణంలా మారుతోంది. కాంగ్రెస్ కండువా కప్పుకొన్న సీఎం జగన్ సోదరి షర్మిల... ఏపీలో జగన్‌ను గద్దెదించి, కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చేందుకు సంపూర్ణంగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిసింది. వైఎస్సార్ తెలంగాణ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసిన షర్మిల... శుక్రవారం హైదరాబాద్ తిరిగి వెళ్లే ముందు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో కీలక మంతనాలు జరిపారు. ఖర్గేతో జరిగిన సమావేశంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్ కూడా పాల్గొన్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం... జగన్ పాలనపై షర్మిల తన అభిప్రాయాలను సూటిగా చెప్పారు. "జగన్ పాలన చాలా అస్తవ్యస్తంగా ఉంది. ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. జగన్ ఏ ప్రజా ప్రతినిధినీ కలుసుకోరు. తాడేపల్లి ప్యాలెస్‌కే పరిమితమవుతున్నారు" అని చెప్పారు. ఇక... తన రాజకీయ ఆకాంక్షలపై జగన్ నీళ్లు చల్లారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన జైలు పాలైనప్పుడు రాష్ట్రమంతటా తిరిగి వైసీపీని నిలబెట్టానని షర్మిల వివరించారు. తమ మధ్య సంబంధాలు సరిగా లేవని చెప్పారు. తన తండ్రి వైఎస్ కలను నెరవేర్చేందుకే తాను కాంగ్రెస్‌లో చేరానని, కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చేందుకు శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జగన్ తీసుకున్న తప్పుడు నిర్ణయాలు, బాబాయి వివేకానంద రెడ్డి హత్య, ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోవడం, ఒంటెత్తు పోకడలు అవలంబించడం తదితర అంశాలను ఆమె సమగ్రంగా వివరించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం వైసీపీలో ఉన్న పలువురు సీనియర్లు, నేతలు తనతో టచ్‌లో ఉన్నారని కూడా ఆమె చెప్పినట్లు సమాచారం.

పీసీసీ... రాజ్యసభపై సంకేతాలు..

జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు శాయశక్తులా పోరాడాలని షర్మిలను అధిష్ఠానం పెద్దలు కోరారు. ఆమెకు పీసీసీ పగ్గాలు అప్పగించాలని రాహుల్ గాంధీ భావిస్తున్నారని, ఆయన అంచనాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. ఏప్రిల్‌లో కర్ణాటక నుంచి షర్మిలకు రాజ్యసభ సీటు ఇచ్చేందుకు కూడా సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. "కాంగ్రెస్ పార్టీకి వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేసిన సేవలు మరువలేం. కానీ... జగన్ మూలంగా ఏపీలో పార్టీ తీవ్రంగా దెబ్బతింది. ఆ నష్టాన్ని పూరించే బాధ్యతను మీకు అప్పగిస్తున్నాం" అని షర్మిలకు ఖర్గే, వేణుగోపాల్ చెప్పినట్లు సమాచారం. ఢిల్లీ నుంచి కాంగ్రెస్ పూర్తి అండదండలిస్తుందని, సాధ్యమైనంత త్వరలో జనంలోకి వెళ్లాల్సి ఉంటుందని వారు చెప్పినట్లు తెలిసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పునరుత్థానానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికను కూడా రూపొందించాలని, ఇతర పార్టీల నుంచి, ముఖ్యంగా వైసీపీ నుంచి సీనియర్ నేతలను చేర్చుకోవడం, జగన్ పాలనలో వైఫల్యాలను ఎండగడుతూ శ్వేతపత్రాన్ని రూపొందించడం వంటి అంశాలపై ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలు షర్మిలతో చర్చించినట్లు తెలుస్తోంది. జగన్ ఓటు బ్యాంకుగా భావిస్తున్న దళిత క్రైస్తవులను ఆకర్షించేందుకు తాను బ్లూప్రింట్‌ను రూపొందిస్తానని షర్మిల భర్త అనిల్ కూడా చెప్పినట్లు సమాచారం. త్వరలో ఆయన పర్యటించనున్నట్లు తెలిసింది. కాగా... తన కుమారుడి వివాహానికి రావాల్సిందిగా షర్మిల పార్టీ పెద్దల్ని ఆహ్వానించారు. ఢిల్లీలో, హైదరాబాద్‌కు తిరిగి వచ్చాక శంషాబాద్ విమానాశ్రయం వద్ద ఆమె మీడియాతో మాట్లాడారు. ఏపీలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు కృషి చేస్తానన్నారు. ఏ బాధ్యతలు అప్పగించినా స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నానని, దీనిపై చర్చలు జరుగుతున్నాయని, ఒకటి రెండు రోజుల్లో స్పష్టత లభిస్తుందని షర్మిల చెప్పారు.

ఖర్గేతో రుద్రరాజు చర్చలు

ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మశ్రీ సుంకర తదితరులు శుక్రవారం సాయంత్రం మల్లికార్జున ఖర్గేను ఆయన నివాసంలో కలిశారు. ఏపీలో జగన్ పాలన ఘోరంగా ఉందని ఖర్గేకు వివరించారు. త్వరలో రాష్ట్రంలో పర్యటించాలని ఖర్గేను కోరామని, ఆయన అందుకు సుముఖత వ్యక్తం చేశారని రుద్రరాజు తెలిపారు. షర్మిల రాకతో పార్టీలో కొత్త ఉత్సాహం నెలకొందని తెలిపారు.

ఏసీబీ వలలో కేయూ ఆడిట్ అసిస్టెంట్ రిజిస్ట్రార్

- కాంట్రాక్టర్ నుంచి రూ. 50 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత



హనుమకొండ క్రైం/ కేయూ క్యాంపస్, జనవరి 5: కాకతీయ విశ్వవిద్యాలయం ఆడిట్ విభాగంలో లంచం తీసుకుంటున్న ఓ అధికారిని ఏసీబీ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంది. ఆడిట్ విభాగంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సిగసారపు కిష్టయ్య ఓ పాల కాంట్రాక్టర్ నుంచి శుక్రవారం రూ.50వేలు లంచం తీసుకుంటుండగా అధికారులు పట్టుకున్నారు. వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య కేసు వివరాలను వెల్లడించారు. వరంగల్‌లోని కాశిబుగ్గకు చెందిన పెండెం రాజేందర్ పదిహేనేళ్లుగా కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నడుస్తున్న మహిళలు, పురుషుల హాస్టళ్లలో పాలు, పెరుగు సరఫరా చేస్తున్నాడు. ఇందుకు ప్రతీ నెల కేయూ ఆడిట్ విభాగం నుంచి వచ్చే డబ్బులను తీసుకుంటాడు. ఈ క్రమంలో రెండేళ్లకు గానూ రూ.15లక్షల బిల్లులు రాజేందర్‌కు రావాల్సి ఉంది. దీని కోసం రాజేందర్ పలుమార్లు అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్యను కలిసి తనకు రావాల్సిన బిల్లులు ఇవ్వాలని కోరారు. కిష్టయ్య వినిపించుకోలేదు. బిల్లులు మంజూరు చేయాలంటే రూ.75వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. చేసేదిలేక రాజేందర్ రెండు విడతల్లో రూ.25 వేలు ఇస్తానని, తర్వాత రూ.50వేలు ఇస్తానని ఒప్పుకొన్నాడు. ఒకసారి రూ.15వేలు, మరోసారి రూ.10వేలు ఆయనకు ఫోన్‌పే కూడా చేశాడు. ప్రతిగా కిష్టయ్య రూ.8 లక్షల చెక్కును రాజేందదర్‌కు అప్పగించాడు. మిగతా రూ.7లక్షలకు సంబంధించి రూ.50వేలు ముందుగానే ఇవ్వాలని కిష్టయ్య ఒత్తిడి తెచ్చాడు. రాజేందర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సలహా మేరకు రూ.50వేలతో శుక్రవారం కేయూకు వెళ్లాడు. పరిపాలనా విభాగం ఆడిట్ కార్యాలయంలో తెచ్చిన ఆ డబ్బును కిష్టయ్యకు అందించాడు. అక్కడే మాటువేసిన ఏసీబీ అధికారులు నగదును స్వాధీనం చేసుకుని వారు అప్పటికే తెచ్చిన రసాయనాలలో పరీక్షించారు. నగదును స్వాధీనం చేసుకుని కిష్టయ్యను హైదరాబాద్‌లోని ఏసీబీ కార్యాలయానికి తరలించారు. విచారణ అనంతరం ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ సాంబయ్య తెలిపారు.

జగన్‌కు 'కాపు' గుడ్‌బై!

అమరావతి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పాలకపక్షం వైసీపీలో మరో వికెట్ పడింది. సీఎం జగన్మోహన్‌రెడ్డికి సన్నిహితుడైన ఇంకో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పార్టీకి గుడ్‌బై చెప్పారు. సర్వేల పేరు చెప్పి రాయదుర్గం టికెట్ నిరాకరించి.. తన గొంతు కోశారని వాపోయారు. వారం రోజులుగా ఆయన సీఎం అపాయింట్‌మెంట్ కోసం తాడేపల్లి ప్యాలెస్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పిలిచారు. 'సర్వేలు అనుకూలంగా లేవు.. టికెట్ ఇవ్వలేనని సీఎం చెప్పమన్నారు'అని అనడంతో తీవ్ర మనస్తాపం చెందారు.

నియంతను ఇంటికి పంపండి

సైకో పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలి.. ఈ బాధ్యత ప్రజలందరిదీ: చంద్రబాబు



కనిగిరి సభకు తరలివచ్చిన జనం.. వారిని ఉద్దేశించి మాట్లాడుతున్న చంద్రబాబు

ఒంగోలు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఏపీలో ప్రజాస్వామ్యం అన్నది లేకుండా చేసిన నియంత ప్రభుత్వాన్ని ఇంటికి పంపించి.. మళ్లీ మంచి రోజులు రావాలని రాష్ట్ర ప్రజలంతా సంకల్పం తీసుకోవాలని టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు పిలుపిచ్చారు. అక్రమ కేసులు, దాడులతో తెలుగు సమాజాన్ని భయపెడుతున్న సైకో పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవడం ప్రజలందరి బాధ్యత అని స్పష్టం చేశారు. 'రా.. కదలిరా' పేరుతో చేపట్టిన ఎన్నికల శంఖారావ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రకాశం జిల్లా కనిగిరి నుంచి చంద్రబాబు ప్రారంభించారు. పట్టణ సమీపంలో వెలిగొండ సాధన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఒంగోలు పార్లమెంటు స్థాయి బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.

ఐదేళ్ల నుంచి ఒక్కరూ సంతోషంగా లేరు

"వైసీపీ పాలనలో ఐదేళ్లుగా రాష్ట్రంలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరు. ఎవరికీ న్యాయం జరగలేదు. సంక్షేమం పేరుతో జగన్ రూ.10 ప్రజలకు ఇచ్చి వారి నుంచి రూ.100 దోచుకుంటున్నాడు. ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడు. రూ.13 లక్షల కోట్ల అప్పులు చేసిన ఈ సీఎం ఒక్కరికైనా ఉపాధి కల్పించలేదు. జాబ్ కేలెండర్ అని చెప్పి అధికారంలోకి వచ్చి ఎవరికి ఉద్యోగాలు ఇచ్చాడు? టీడీపీ పాలనలో దేశంలో అధికంగా ఉద్యోగాలిచ్చే జాబితాలో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉంటే.. నేడు నిరుద్యోగుల జాబితాలో ముందుంది. అన్ని రకాల ధరలూ పెరిగి ప్రజలు జీవించలేని స్థితికి వచ్చారు. నాడు పెట్టుబడులు, పరిశ్రమలు.. నేడు గంజాయి, డ్రగ్స్ నాటి టీడీపీ పాలనలో రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలు వస్తే.. నేడు గంజాయి, డ్రగ్స్ సరఫరా అవుతున్నాయి. విశాఖలో దళిత బాలికపై 13 మంది అత్యాచారం చేశారంటే శాంతిభద్రతలు, ప్రజలకు రక్షణ ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. జగన్ పాలనలో మద్యం, మైన్స్ అన్నింటిలోనూ కుంభకోణాలే. అందులో వాటాలు తాడేపల్లి కొంపకు చేరుతున్నాయి. ఈ సీఎం పాలనలో రైతుల ఆత్మహత్యలు పెరగ్గా ప్రాజెక్టులు రివర్స్ అయ్యాయి. చివరకు నాసిరకం మద్యంతో ప్రజలను అనారోగ్యపాల్జేసి వారి రక్తాన్ని జలగల్లా తాగుతున్నాడు. టీడీపీ అధికారంలోకి వచ్చాక తగ్గింపు ధరలకు నాణ్యమైన మద్యం సరఫరా అయ్యేలా చూస్తాం. జగన్ తాజాగా తెచ్చిన భూ చట్టం వల్ల ప్రజల చేతుల్లో భూమి ఉండే అవకాశం లేదు. ప్రకాశం జిల్లాలో జరిగిన భూదందాలపై సిట్ ఏర్పాటు చేసి తేలుస్తాం" అని చంద్రబాబు అన్నారు.

అధైర్యపడొద్దు... అండగా ఉంటాం

విశాఖపట్నం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): కేడర్‌కు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడవద్దని చంద్రబాబు సతీమణి భువనేశ్వరి భరోసా ఇచ్చారు. 'నిజం గెలవాలి' యాత్ర రెండో దశలో భాగంగా ఆమె శుక్రవారం నగరంలో పర్యటించారు. చంద్రబాబు అరెస్టు సమయంలో మనస్తాపానికి గురై మృతి చెందిన ఆరుగురి కుటుంబాలను పరామర్శించారు. విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధిలోని వెంకటేశ్వర మెట్టలో జాగారపు చిన్న, జ్ఞానాపురానికి చెందిన మలిశెట్టి రమణ, ఉత్తరం నియోజకవర్గ పరిధి తాటిచెట్లపాలెంలో పంచిరెడ్డి కనకరాజు, గాజువాక నియోజకవర్గ పరిధిలోని అజీమాబాద్‌లో కోరుకొండ మంగ, భానోజీతోటలో సరోజిని, షీలానగర్‌లో పమిడిముక్కల రాధాకృష్ణమూర్తి కుటుంబాలను ఆమె పరామర్శించి రూ.3 లక్షల చొప్పున సాయం అందజేశారు.

పుట్టిన ఊరి రుణం తీర్చుకుంటా

- మంత్రినైనా మీ బిడ్డనే: సీతక్క
- స్వగ్రామంలో ఘన స్వాగతం



తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకుంటున్న మంత్రి సీతక్క

ములుగు, జనవరి 5: తనకు జన్మనిచ్చి, ఎదుగుదలకు ఊతమిచ్చిన జగ్గన్నపేట గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, రుణం తీర్చుకుంటానని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖల మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) అన్నారు. రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆమె తొలిసారిగా ములుగు మండలంలోని తన స్వగ్రామానికి వచ్చారు. అభిమాన నాయకురాలికి గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. ఆరాధ్య దైవమైన పుట్ట మల్లన్నను దర్శించుకున్న సీతక్క, అక్కడి నుంచి నేరుగా తన ఇంటికి వెళ్లి తల్లిదండ్రులు సమ్మక్క-సమ్మయ్యల ఆశీర్వాదం తీసుకున్నారు. తన సోదరుడు సాంబయ్య సమాధికి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామస్థులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన సభలో పాల్గొన్నారు. పూలమాలలు, శాలువాలతో సీతక్కను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తాను ఎంత ఎదిగినా ఎప్పుడూ మీ ఆడబిడ్డనేనని, తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా జగ్గన్నపేట గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. మూడుసార్లు తనను ఎమ్మెల్యేగా గెలిపించిన ములుగు నియోజకవర్గాన్ని ప్రగతిలో ముందువరుసలో నిలబెడతానని హామీ ఇచ్చారు.

భారతీ సిమెంట్స్‌కు సుప్రీం షాక్

- ఈడీ జప్తు చేసిన ఎఫ్‌డీల విడుదలకు నో
- టీ-హైకోర్టు ఉత్తర్వుల కొట్టివేత

న్యూఢిల్లీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): భారతీ సిమెంట్స్‌కు సుప్రీంకోర్టు గట్టి షాక్ ఇచ్చింది. జగన్ అక్రమాస్తుల కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తు చేసిన ఆ సంస్థకు చెందిన రూ.150 కోట్ల ఎఫ్‌డీలను విడుదల చేయాలని ఆదేశిస్తూ తెలంగాణ హైకోర్టు గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను కొట్టివేసింది. బ్యాంకు గ్యారెంటీలను తీసుకుని ఎఫ్‌డీలను విడుదల చేయాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఈడీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ సంజయ్ కరోల్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. దీనిపై విచారణ ముగిసిందని.. ఏమైనా అభ్యంతరాలుంటే హైకోర్టులోనే తేల్చుకోవాలని పేర్కొంది. బ్యాంకు గ్యారెంటీలను తీసుకున్న తర్వాత కూడా ఎఫ్‌డీలను ఈడీ జప్తు చేసుకుందని భారతీ సిమెంట్స్ తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ కోర్టుకు తెలిపారు. ఎఫ్‌డీలను జప్తు చేసినా కనీసం వాటిపై వచ్చిన వడ్డీనైనా విడుదల చేయాలంటూ ఆ సంస్థ దాఖలు చేసిన మరో పిటిషన్‌పైనా హైకోర్టుకే వెళ్లాలని సుప్రీంకోర్టు సూచించింది. బ్యాంకు గ్యారెంటీలను వెనక్కి తీసుకోవడంపై నిర్ణయాన్ని భారతీ సిమెంట్స్‌కు వదిలిపెట్టింది.

'ఆర్-5 జోన్'లో ఏం జరుగుతోందో తెలుసు

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి వ్యాఖ్యలు
- జగన్ ప్రభుత్వ పిటిషన్‌పై తక్షణ జోక్యానికి నో



న్యూఢిల్లీ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. అమరావతిలోని 'ఆర్-5 జోన్' వ్యవహారంపై తక్షణం జోక్యం చేసుకుని విచారణ జరపాలన్న ప్రభుత్వ అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది. "ఆర్-5 జోన్‌లో ఏం జరుగుతోందో మాకు తెలుసు. తక్షణం జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదు" అని ధర్మాసనంలోని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ధర్మాసనం ఏప్రిల్‌కు వాయిదా వేసింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిపింది. పేదలకు సెంటు భూమి ఇచ్చి ఇళ్లు నిర్మించేందుకు రాష్ట్రప్రభుత్వం చేసిన ప్రయత్నాలను అడ్డుకున్నారని ప్రభుత్వం తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. రాజధానిపై దాఖలు చేసిన ప్రధాన పిటిషన్ ఇదే ధర్మాసనం ముందు ఉందని అమరావతి రైతుల తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ధర్మాసనంలోని న్యాయమూర్తి జోక్యం చేసుకుని.. "ఆర్-5 జోన్‌లో ఏం జరుగుతోందో మాకు అన్నీ తెలుసు" అని వ్యాఖ్యానించారు. ఏప్రిల్‌లో నాన్ మిస్లేనియస్ డేలో ఈ పిటిషన్‌పై తుది విచారణ జరుపుతామని పేర్కొన్నారు.



డ్రాగన్ ఫ్రూట్ తోటను పరిశీలిస్తున్న తుమ్మల

తక్కువ శ్రమతో ఎక్కువ లాభాలు పొందాలి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఖమ్మంలో డ్రాగన్‌ఫ్రూట్ తోట పరిశీలన

రఘునాథపాలెం, జనవరి 5 : రైతులు తక్కువ శ్రమ, తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు, లాభాలు వచ్చే పంటలను పండించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. శుక్రవారం ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలో పర్యటించిన ఆయన శివాయిగూడెంలోని బానోత్ భీమ్లా అనే రైతుకు చెందిన డ్రాగన్‌ఫ్రూట్ తోటను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి రైతులతో మాట్లాడిన తుమ్మల పంటల సాగు గురించి తెలుసుకున్నారు. పలు పంటల గురించి వారికి వివరించారు. ఏళ్ల తరబడి ఒకే రకమైన పంటలు సాగు చేయకుండా తక్కువ నీటి వినియోగం ఉండే పంటలు వేసుకోవాలన్నారు. కాలానుగుణంగా పంటమార్పిడి చేసి, ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆయన ఆకాంక్షించారు. డ్రాగన్‌ఫ్రూట్ మంచి సైజు వచ్చిందని, మంచి యాజమాన్య చర్యలు తీసుకున్నారంటూ రైతు భీమ్లాను మంత్రి తుమ్మల అభినందించారు.

హామీలు అమలు చేయలేమని కాంగ్రెస్‌కు భయం పట్టుకుంది

- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



సూర్యాపేట(కలెక్టరేట్), జనవరి 5: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేమని కాంగ్రెస్ పార్టీకి భయం పట్టుకుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జి. జగదీశ్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ గుర్తింపును రద్దు చేయాలన్న కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదుపై స్పందిస్తూ శుక్రవారం ఆయన జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం నడపలేక అయోమయంలో ఉన్న కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ గుర్తింపును రద్దు చేయాలని పిచ్చి పిచ్చి ఉత్తరాలు రాస్తున్నారని మండిపడ్డారు. అధికారం కోసం ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చారని తాము ముందే చెప్పామని, మాటిచ్చి మోసం చేసే వాళ్లను 420 కాకుండా ఇంకా ఏమంటారని ఆయన ప్రశ్నించారు. విద్యుత్ బిల్లుల వసూలుపై ప్రజలు కాంగ్రెస్‌ను నిలదీయాలని పిలుపునిచ్చారు. రైతుబంధు ఏ పద్ధతిలో ఇస్తారో ఇప్పటికీ స్పష్టత లేదన్నారు. ఇంకా తాము సరిగ్గా నిలదీయడం మొదలుపెట్టలేదని, తాము మొదలుపెడితే తట్టుకోలేరని ఆయన అన్నారు.



కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ చేయించుకున్న వారితో డాక్టర్ వినయకుమార్, వైద్యులు

కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలో అపోలో రికార్డు

హైదరాబాద్ సిటీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీల్లో అపోలో ఆస్పత్రి అరుదైన రికార్డును సాధించిందని, 2500 సర్జరీలు పూర్తి చేసి దేశంలో ఈ ఘనత సాధించిన మొట్టమొదటి ఆసుపత్రిగా నిలిచిందని ఈఎన్‌టీ విభాగం అధిపతి డాక్టర్ ఈసి వినయకుమార్ తెలిపారు. వినికిడి లోపంతో బాధపడుతున్న 9 నెలల శిశువు నుంచి 87 ఏళ్ల వృద్ధుల వరకు సర్జరీ చేసి కాక్లియర్ ఇంప్లాంట్ చేసినట్లు శుక్రవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరించారు. వినికిడి లోపంతో ఎలాంటి శబ్దాలు వినలేక ఇబ్బందిపడుతున్న వ్యక్తుల జీవితాల్లో కాక్లియర్ ఇంప్లాంటేషన్ కొత్త వెలుగులు ప్రసాదించిదని వినయకుమార్ ప్రశంసించారు. ఈ సందర్భంగా.. ఈ సర్జరీ చేసుకున్న పలువురు తమ అభిప్రాయాలను వివరించారు.

కన్హా శాంతివనానికి 5 వేల కొవిడ్ కిట్ల పంపిణీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

షాద్‌నగర్, జనవరి 5(ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా నందిగామ మండల పరిధిలోని కన్హా శాంతివనానికి 5 వేల కొవిడ్ నిర్ధారణ కిట్లను పంపిణీ చేసినట్లు షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జయలక్ష్మి తెలిపారు. 'కన్హా శాంతివనంలో కొవిడ్ కలకలం' అనే శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా వైద్యాధికారులు స్పందించారు. 5 వేల కొవిడ్ నిర్ధారణ కిట్లను పంపిణీ చేయడమే కాకుండా, మహమ్మారి బారిన పడిన వారికి చికిత్స అందించేందుకు ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేశామన్నారు. విదేశాల నుంచి వచ్చేవారిని ఐసలేషన్‌లో ఉంచేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు.



పరిగి శివారులో ఇజ్తిమా సభలు నిర్వహించే ప్రాంగణం

నేటి నుంచి ఇజ్తిమా సభలు

పరిగిలో మూడు రోజుల పాటు నిర్వహణ.. 3-5 లక్షల మంది ముస్లింలు వచ్చే చాన్స్

పరిగి, జనవరి 5: తబ్లీగీ జమాత్ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా పరిగిలో నిర్వహించే సుబాఈ దీనీ ఇజ్తిమా సభలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. పరిగి మునిసిపాలిటీ శివారులోని న్యామత్‌నగర్‌లో మూడు రోజుల పాటు జరిగే ఈ సభలకు 3-5 లక్షల వరకు ముస్లింలు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. దాదాపు 300 ఎకరాల స్థలంలో 5 లక్షల మందికిపైగా కూర్చునే విధంగా ఏర్పాట్లు చేశారు. తెలంగాణ, ఏపీ, కర్ణాటకతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల వారు హాజరు కానున్నారు. భోజన వసతుల కోసం ప్రత్యేకంగా 26 వంట శాలలను ఏర్పాటు చేశారు. నీటి వసతి, మరుగుదొడ్లు, మూత్రశాలలను కూడా ఏర్పాటు చేశారు. ఇజ్తిమా నిర్వహణ కోసం ప్రభుత్వం రూ.2.45 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులతో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారు జిల్లాలు, ప్రాంతాల వారీగా కూర్చునే విధంగా బోర్డులు ఏర్పాటు చేశారు. పార్కింగ్ కోసం వంద ఎకరాల వరకు జిల్లాల వారీగా ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్రం నుంచే ఇజ్తిమా సభల కోసం జనం తరలివస్తున్నారు. ఎస్పీ కోటిరెడ్డి పర్యవేక్షణలో భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

జైల్లోనూ కులవివక్షే!

జైళ్లలోనూ కులవివక్ష అమలయ్యే రీతిలో పదమూడు రాష్ట్రాల్లోని ప్రిజన్ మాన్యువల్స్ ఉన్నాయంటూ దాఖలైన ప్రజాప్రయోజనవ్యాజ్యం మీద మూడురోజుల క్రితం సుప్రీంకోర్టు స్పందించింది. ఖైదీలకు వారి కులం ప్రాతిపదికన వివిధ పనులు కేటాయించేందుకు, వారు ఉండాల్సిన బ్యారక్స్‌ను నిర్ణయించేందుకు ఈ మాన్యువల్స్‌లో ఉన్న నిబంధనలు ఉద్దేశిస్తున్నాయంటూ దాఖలైన ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలోని ముగ్గురు సభ్యుల బెంచ్ కేంద్రప్రభుత్వానికీ, రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. నోటీసులు అందుకున్నవాటిలో ఉభయ తెలుగు రాష్ట్రాలూ ఉన్నాయి.

'ద వైర్' జర్నలిస్టు సుకన్యశాంత దాఖలు చేసిన ఈ పిటిషన్ ఈ వివక్ష మూడురూపాలుగా అమలు జరుగుతోందని పేర్కొంది. కులం ఆధారంగా పనులు అప్పగించడం, వేర్వేరు బ్యారెక్స్ కేటాయించడం, డీ నోటిఫైడ్ ట్రైబ్స్, హాబిట్యువల్ అఫెండర్స్ పేర్లతో కొందరు ఖైదీలపట్ల ప్రత్యేక వివక్ష ప్రదర్శించడం పిటిషన్‌దారు ప్రధానంగా ప్రస్తావించారు. ఇటువంటి వివక్షాపూరిత విధానం అమల్లో ఉన్నట్టు తనకు తెలియదని, ఇది ఆమోదయోగ్యమైన విధానం కాదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఆశ్చర్యపోయినప్పుడు, ఈ విషయంలో కోర్టుకు మీ సహకారం చాలా అవసరం అని చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్యానిస్తే, మెహతా అంగీకరించారు. ఈ రాష్ట్రాల్లోని జైల్‌మాన్యువల్స్ అన్నింటినీ క్రోడీకరించి నాలుగువారాల్లో తనముందు ఉంచాల్సిందిగా న్యాయస్థానం పిటిషనర్ తరపు న్యాయవాది మురళీధర్‌ను ఆదేశించింది.

ఈ జైల్ మాన్యువల్స్ నిబంధనలు కులవివక్షను పాటించడంతోపాటు, దళితుల్లో నిర్బంధపు చాకిరీని అమలుచేస్తున్నాయని, రాజ్యాంగంలోని 14, 15, 17, 23 అధికరణలను ఉల్లంఘిస్తున్న ఈ నిబంధనలను రాజ్యాంగహితంగా మార్చవలసిన అవసరం ఉన్నదని పిటిషన్‌దారు అభ్యర్థించారు. జైళ్ళ నిర్వహణ రాష్ట్రాల పరిధిలో ఉంటూ, గత కొన్ని దశాబ్దాలుగా మాన్యువల్స్‌లో ప్రగతిశీలకమైన మార్పుచేర్పులు కొన్ని జరిగినప్పటికీ ఇంకా చాలా రాష్ట్రాల్లో వివక్షాపూరిత నిబంధనలు మిగిలిపోవడం ఆశ్చర్యాన్ని కలిగించే విషయం. ఉదాహరణకు, మధ్యప్రదేశ్ జైల్ మాన్యువల్ మానవమలాన్ని చేత్తో ఎత్తిపోయడం, మరుగుదొడ్ల పరిశుభ్రత వంటివి షెడ్యూల్డ్ కులానికి చెందిన మెహతర్‌లు నిర్వహిస్తారని స్పష్టంచేస్తోంది. రాజస్థాన్ జైల్‌మాన్యువల్‌లోనూ ఇటువంటి పలురకాల వివక్షలుంటే, మూడేళ్ళ క్రితం 'ది వైర్' కథనం ఆధారంగా ఆ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు డెబ్బయ్యేళ్ళ తరువాత రూల్‌బుక్‌లో మార్పులు జరిగాయి, కులాధారిత ప్రస్తావనలు తొలగిపోయాయి. ఇతర రాష్ట్రాలకు ఈ మార్పులు పట్టని విషయాన్ని ఈ పిటిషన్ గుర్తుచేసింది. తుడవడం, కడగడం వంటివి దళితులు చేస్తారని, క్షురకుల వంటి క్లాస్–ఎ కింద వర్గీకరించిన కులాలవారు మాత్రమే వంటచేయాలని పశ్చిమబెంగాల్ జైల్‌కోడ్ చెబుతోంది. డీనోటిఫైడ్ ట్రైబ్స్ విషయంలో, కేవలం వారి పుట్టుక ఆధారంగా ఈ జైళ్ళ మాన్యువల్స్ మరింత దుర్మార్గమైన వివక్షను ప్రదర్శిస్తున్నాయి. సమాజంలో వారు ఎదుర్కొంటున్న వివక్ష, జైళ్ళకు పోయిన తరువాత కూడా వారిని వెంటాడుతున్నదని మురళీధర్ కోర్టుకు తెలియచేశారు. తిరునల్వేలి కారాగారంలో ఆధిపత్యకులానికి చెందిన దేవర్‌లను ఆ కులస్తులకు చెందిన బ్యారక్‌లోకే పంపుతారు. అలాగే, ఎస్సీలైన పల్లార్ కులస్తులను వారికోసం ప్రత్యేకించిన బ్యారక్‌లోనే ఉంచుతారు. 2011లో అరుళ్ అనే ఒక పిటిషన్‌దారు ఈ అంశాన్ని మద్రాస్ హైకోర్టు దృష్టికి తెచ్చినప్పుడు, కులవైరాలు, వైషమ్యాలను నివారించడానికి ఈ విధానం తప్పనిసరి అని ఆ రాష్ట్ర ప్రభుత్వం సమర్థించుకుంది. విచిత్రం ఏమిటంటే, మద్రాస్ హైకోర్టు దానిని ఆమోదించింది. ఆ ఆదేశాలను కూడా పిటిషనర్ ఇప్పుడు సవాల్ చేశారు.

జైళ్ళ మాన్యువల్స్‌లో అనాదిగా కొనసాగుతున్న పలురకాల వివక్షలను వెలికితీసిన 'ది వైర్' కథనాలు ప్రశంసనీయమైనవే గాక, సదరు జర్నలిస్టు ఈ పిటిషన్ ద్వారా వాటిని సరిదిద్దేందుకు సంకల్పించడం అభినందించాల్సిన విషయం. నోటీసులు అందుకున్న కేంద్రప్రభుత్వం, ఆయా రాష్ట్రాలు సానుకూలంగా స్పందించి సుప్రీం-

కథకుడుగా కవనచంద్రుడు

ముకుంద రామారావు కవిత్వ పక్షపాతి. వేలెత్తి చూపించకుండా ఉండడానికి కొన్ని కథలు రాసి వదిలేశారు. అది నాకు నచ్చలేదు. కవిత్వం ఎలాగూ రాస్తాడాయన. రాయకుండా చదవకుండా ఉండలేడు. పుంజీడు కథలు మాత్రం రాసి ఎందుకూరుకున్నారు? అందుకనే పై నిందా వాక్యంతో మొదలుపెట్టేను.

ముకుంద రామారావు మంచి కవి. ఇటీవల అనువాదాల కోసం ఆయన ఎంత శ్రమపడ్డారో నాకు తెలుసు. ఆ కృషి సామాన్య విషయం కాదు. ఆయన నిగర్వి, పెద్దమనిషి, స్నేహశీలి — కేవలం పొడగరి అవడం వల్ల కాదు. తన కోసం ఒక నిలయ వాద్య బృందాన్ని ఆయన చేరదీయలేదు. తనకంటే చిన్నవాళ్లయిన కవుల్ని మచ్చిక చేసుకోలేదు. ఆయనకి చదువుకోవడం, రాసుకోవడం ఇష్టం. మిగతా ప్రయాసలు పడలేదాయన. ఆయన రచనలో లోపం ఏదైనా ఎత్తి చూపించినా, నచ్చలేదన్నా నొచ్చుకోడాయన. అటువంటి తెలుగు రచయితలు ఎంతమంది ఉన్నారో చెప్పండి.

ముకుంద రామారావు పద్నాలుగు కథలు రాశారు. అందులో రెండు అనువాదాలు. మళ్లీ ఎందుకో కథల జోలికి పోలేదు. ఈ రాసిన కథలు కూడా ఆయన అనువాద కవిత్వ సముద్రంలోకి దిగకముందు రాసినవి. ఈ కథలన్నీ అందరూ ఏదో ఒక సందర్భంలో గమనించినవీ, అనుభవించినవీ. కారణం, వాటిలో అనూహ్యమైన మలుపులు గానీ, గహనమైన వస్తుక్లిష్టత గానీ లేకపోవడమే. చిన్న చిన్న అలవాట్లలో, మాటల్లో, ఇష్టాయిష్టాలలో, కోరికల్లో, లోపాల్లో మనలో ఉన్న నిజమైన వ్యక్తి బయటపడతాడు. కేవలం మంచి చెడులనే కాదు. మనలో నిద్రలో ఉన్న ఆకాంక్షలు, ఆశలు వగైరా అనేక చిన్న విషయాల్లో వ్యక్తం అవుతూంటాయి. వీటిని మనం గమనించం. అనేక సందర్భాలలో మనం నోరు జారి మాట్లాడే మాటల్ని పొరపాటని సర్దుకుపోతుంటాం. కానీ నువ్వు అనదల్చుకున్న మాట అదేనని నీక్కూడా తెలియదు. దీన్నే 'ఫ్రాయిడియన్ స్లిప్' అంటారు. నిత్యజీవితంలో సర్వసాధారణం అనుకునే శతానేక విషయాలను జాగ్రత్తగా రచయిత, మానసిక శాస్త్రవేత్త గుర్తించగలరు. ఈ కథల్లో ముకుంద రామారావు ఈ పనే చేశారు. కథా వస్తువుగా ఉన్న స్పష్టత, సారళ్యం రచయిత కథనంలో కూడా కనిపిస్తుంది. ఆయన కథన శైలి ఆయనలాగే ఉంటుంది.

'నా ఇల్లెక్కడ!' కథ చూడండి. మతిమరుపు మనుషులు మనందరికీ గొప్ప కాలక్షేపం. వృద్ధాప్యంలో అన్నీ మర్చిపోతుండటం సహజం. అల్జీమర్స్ అనే మతిమరుపు వ్యాధి మాత్రం భయంకరమైనది. అంటే ఈ వ్యాధి లక్షణం అటువంటిది. మనం ఎవరో మనం మర్చిపోతాం. ఏదీ జ్ఞాపకం ఉండదు. మనకు అస్తిత్వం ఉండదు. ఈ వ్యాధి పూర్తిగా ముదరక ముందు ఏర్పడే మానసిక స్థితి గురించిన కథ అది. కథ చదివిన తరువాత అనేక విషయాల గురించి ఆలోచిస్తారు పాఠకులు.

'అసలు రంగులు' అని మరో ఆసక్తికరమైన కథ. కథలో మెహతా అనే వ్యక్తి ప్రధాన పాత్ర. ఒక ఐటీ కంపెనీలో ఉన్నత స్థాయి అధికారి. ఆయనంటే అందరికీ భయం. ఎవర్నీ మెచ్చుకోడు. మృదువైన మనిషి కాడు. అదే అతని ఇమేజ్. కథకుడు ఆయనతో స్పెయిన్ వెళ్ళవలసి వస్తుంది. అటువంటి బాస్‌తో విదేశాలకు వెళితే ఏమి సంతోషం మిగుల్తుంది? మొత్తానికి బార్సిలోనా వెళ్లారు. అనేక నగరాల్లో విదేశీయులని పసిగట్టి ఏదోరకంగా మోసం చేసే జ్ఞానులుంటారు. అట్లా వీళ్లిద్దరూ కూడా మోసపోయి డబ్బులు పోగొట్టుకుంటారు. సర్వం తెలుసుననీ, ఏదైనా నిర్వహించుకు రాగలనని మెహతా నమ్మకం. కానీ, మోసపోయాడు. చండశాసనుడనుకునే ఒక అధికారి మామూలు మనిషని తేలిపోయింది. జరిగిన విషయం ఎవరికీ చెప్పవద్దనీ, తన పరువుపోతుందనీ మెహతా మాట తీసుకుంటాడు. మెహతా వ్యక్తిత్వం, గాంభీర్యం, ఆత్మవిశ్వాసం అతి చిన్న సంఘటన మీద ఆధారపడి ఉండడం, దాన్ని కాపాడుకోవడం కోసం ఆయన పడే తాపత్రయం కథ వస్తువు. కొంతమంది వ్యక్తులను మనం ఒక నేపథ్యంలో చూసి అలాగే ఫోటో ఫ్రేమ్ లా గుర్తుంచుకోవడానికి అలవాటుపడతాం. ఉదాహరణకి ఒక జిల్లా కలెక్టర్ ఎవరూ లేని చోట జారిపడి, లేచి ఎవరైనా చూశారేమోనని భయంతో బట్టలు దులుపుకొని, ఏమీ కానట్టు నటించడం మన కళ్లబడితే బిగించి ఉంచిన ఆ దర్పం ఫ్రేము ఊడిపోతుంది. ఈ వివరణ అంతా రచయిత చెయ్యడు, మనకి వదిలేస్తాడు.



ముకుంద రామారావు పద్నాలుగు కథలు రాశారు. అందులో రెండు అనువాదాలు. మళ్లీ ఎందుకో కథల జోలికి పోలేదు. ఈ రాసిన కథలు కూడా ఆయన అనువాద కవిత్వ సముద్రంలోకి దిగకముందు రాసినవి. ఈ కథలన్నీ అందరూ ఏదో ఒక సందర్భంలో గమనించినవీ, అనుభవించినవీ. కారణం, వాటిలో అనూహ్యమైన మలుపులు గానీ, గహనమైన వస్తుక్లిష్టత గానీ లేకపోవడమే.

ఇంటర్–జెనరేషనల్ ప్రాబ్లమ్ అంటూంటారు. గంభీరంగా ఉంటుంది వినడానికి. అది తరాల మార్పు అనుకుంటే చాలు. అయితే దీనికి అనేక పార్శ్వాలున్నాయి. ఒక తరం పెద్దలకి కుర్ర కారు దుస్తులు గానీ, భాష గానీ, తినే తిండి గానీ ఏదీ నచ్చదు. మార్పు సహజం అనుకోరు. తమ ఆలోచనలూ, అలవాట్లూ, అభిరుచులూ పిల్లల మీద రుద్దాలని పెద్దరికం ఆయుధంతో ప్రయత్నిస్తుంటారు. మధ్యతరగతి ఇళ్లల్లో మనం రోజూ ఒకసారైనా వినే మాట 'మా రోజుల్లో'. అత్తగారు తాను ఒకప్పుడు కోడల్నని మరిచిపోయినట్టు, పెద్దలు కూడా ఒకప్పుడు 'మా రోజుల్లో' వినే ఉంటారు గదా. ఈ అంతరం అనివార్యం. నొప్పింపక తానొవ్వక సూత్రం కొంతవరకు పనికి వస్తుంది గానీ, ఘర్షణ తప్పదు. గాయాలు తప్పవు. మానవు. కొన్ని దశాబ్దాల క్రితం కంటే ఇప్పుడు ఈ బాధ ఎక్కువగా ఉంది ప్రతి ఇంట్లో. ఈ తరాల సమస్య యావత్ సమాజాన్ని బలంగా కుదిపేస్తోంది. ఇటువంటి ఎన్నో ఆలోచనలనూ, అనుభవాలనూ రేకెత్తించే చిన్న కథ 'న్యూడెన్', కొత్త బట్టలు. కథగా ఇది అల్పమైన వస్తువనిపిస్తుంది. కారణం ఇది దరిదాపు రోజూ చూస్తుంటాం. మరి అంత అల్పమైన, అతి సాధారణ విషయాలు ఎందుకు ఎంచుకున్నట్టు రచయిత? ముందే ప్రస్తావించాను. నిత్యజీవితంలో మనకు నిత్యం కనిపించే సాధారణ విషయాలు, సంఘటనల వెనుక కొండంత కథలుంటాయి. ఆ కొండంత విషయాన్ని సూచనప్రాయంగా చెప్పి మిగతాది పాఠకుల ఊహకు విడిచిపెడతాడు రచయిత. ఈ కథ అటువంటిదే. రోజుకి కనీసం పదిసార్లు మనకు ఎదురవుతుంది.

బెంగాలీ, ఒరియాల నుంచి రెండు అనువాద కథలు కూడా ఉన్నాయి. ముకుంద రామారావు పదమూడు కథలలో కేవలం మూడు కథల్నే పరామర్శించడానికి కారణం, మిగతా కథలు కూడా అందరికీ సుపరిచితమైన సంఘటనలు కావడమే. ఉదాహరణకి ఉద్యోగించే ఊరొకటీ, ఉంటున్న ఊరొకటీ అయినప్పుడు, వాటి మధ్య దూరం ఎక్కువ కానప్పుడు అనేకమంది ఉదయం రైలెక్కి మళ్లీ సాయంత్రం ఇంటికి చేరతారు. ఈ క్రమంలో ఇబ్బందులు అలా ఉంచి బాగా కాలక్షేపంగా ఉండి ప్రయాణ క్లేశం ఒక అనుభవంగా మిగిలిపోతుంది. మధ్యలో మిత్ర బృందంలో ఎవరికైనా బదిలీ అవుతూంటుంది. గొప్ప స్నేహాలు ఏర్పడతాయి. కష్ట సుఖాలు పంచుకుంటారు. ఇవన్నీ కళ్ళకు కట్టినట్లు చూపించారు రచయిత 'ఉద్యోగం ఒక జీవిత ప్రయాణం' అనే కథలో. అలా తిరిగి ఉద్యోగించి విశ్రాంత జీవితం గడుపుతున్న వాళ్ళకి గతం సంతోషంగా జ్ఞాపకం వస్తుంది. రేగువడియం లాగ.

కవిత్వం కొన్నాళ్ళు పక్కనపెట్టి, విస్తృతమైన తన జీవితానుభవంలోంచి కథలు రాయమని ముకుంద రామారావు గారిని కోరుతున్నాను. మిత్రుడికి హార్దిక శుభాకాంక్షలు.

■ తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి

(ముకుంద రామారావు జనవరి 7న ఆజో–విభో–కందాళం ఫౌండేషన్ వారి 'ప్రతిభామూర్తి జీవితకాల సాధన పురస్కారం' అందుకుంటున్న సందర్భంగా)

సంతోషం సంపన్నులకే సొంతం!

కొత్త సంవత్సరం (2024)లో ఇది నా మొదటి కాలమ్. గత ఏడాది నా చివరి కాలమ్ (డిసెంబర్ 30, 'పార్లమెంటు ప్రాధాన్యం తగ్గిస్తున్నారా?') ను, అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ ముగించాను. ప్రతీ ఒక్కరికి నా శుభాకాంక్షలు మళ్లీ తెలుపుతున్నాను. అందరూ బాగుండాలన్నదే నా శుభ కామన. అయితే దేశ వాస్తవాలు శుభస్కరంగా ఉన్నాయా?



■ పి. చిదంబరం

'పళని' పలుకు

అనేక అంశాల కలయికే ఆనందం. మన సువిశాల భారతావనిలో 142 కోట్ల మంది వ్యక్తులు ఉన్నారు. ధనికులు — దరిద్రులు, కులీనులు — శ్రామికులు, ప్రభువులు — సామాన్యులు... ఇలా ఎన్నో ఆర్థిక, సామాజిక, రాజకీయ తారతమ్యాలు వారిలో కనిపిస్తాయి. మరి ఈ సంఖ్యానేక సహోదర భారతీయులలో ఎంతమంది సంతోషంగా ఉన్నారు? జీవనానందం కృశించిపోతున్న వారు ఎందరు? ఈ వాస్తవాలను నేను తెలుసుకోవాలనుకుంటున్నాను.

ఇటీవలి రోజుల్లో నేను అనేక పత్రికా వ్యాసాలు చదివాను. ఈ దేశ పౌరులు ప్రతీ ఒక్కరూ సుఖ సంతోషాలతో విలసిల్లుతున్నారని మహారాజశ్రీ మోదీ సర్కార్ అతిశయంతో పదే పదే చెప్పుకోవడాన్ని ఆ వ్యాసాలన్నీ గట్టిగా సమర్థించాయి. వాటి వాదనకు ప్రాతిపదిక ఏమిటి? ఇండియా, అదే మన భారత్ ఒక అపూర్వ ఆర్థికాభివృద్ధిని సాధించింది, ఆ పురోగతిని మరింతగా వేగవంతం చేసుకొంటోంది. మరీ ముఖ్యమైన విషయమేమిటంటే ఆ అసాధారణ ఆర్థిక సమున్నతి ఫలాలు సమాజంలోని ప్రతీ ఒక్కరికీ అందుతున్నాయి— ఇదీ ఆ వ్యాసకర్తల మాట.

నిజమే, భారత ఆర్థిక వ్యవస్థ తన శక్తి సామర్థ్యాలను సంపూర్ణంగా ప్రదర్శిస్తోంది. అయితే అది ఇప్పుడు సాధిస్తున్న అభివృద్ధి, ఇంతకు ముందు మనం ఎన్నడు చూడని రీతిలో సంభవిస్తోందా? లేదు, కచ్చితంగా అలా జరగడం లేదు. 'ఆర్థికాభివృద్ధి స్వర్ణ యుగం' గురించి మాట్లాడాలంటే అది నిస్సందేహంగా యూపీఏ ప్రభుత్వ జమానా (కాలం)లో మాత్రమే ఉన్నది. డాక్టర్ మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ మొదటి హయాంలో 2005–08 సంవత్సరాల మధ్య మన స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వార్షిక వృద్ధిరేట్లు వరుసగా మూడు సంవత్సరాల పాటు 9.5; 9.6, 9.3 శాతంగా నమోదయ్యాయి. మరి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో గత తొమ్మిది సంవత్సరాలుగా సగటున 5.7 శాతం వార్షిక వృద్ధిరేటుతో మాత్రమే మన జీడీపీ పెరుగుతోంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మన ఆర్థిక వ్యవస్థ పెరుగుదల 6.5 శాతంగా ఉండగలదనేది మన ప్రభుత్వ ఆర్థికవేత్తల అంచనా. పోనీ, దీన్ని సైతం అదనంగా చేర్చుకుని గణిస్తే తేలేదేమిటి? గత తొమ్మిది సంవత్సరాల మోదీ పాలనలో వార్షిక వృద్ధిరేటు 5.8 శాతం మాత్రమే! మరి ఈ ఆర్థికాభ్యుదయం గతంలో మనం ఎన్నడు చూడనిది ఎలా అవుతుంది? ప్రస్తుత పురోగతి అద్భుతమైనది కానే కాదు. కాకపోతే అది సంతృప్తికరమైన పెరుగుదల, సందేహం లేదు. అయినా ఈ ఆర్థికాభివృద్ధి విస్తృతమైనదేమీ కాదు, పెరుగుతోన్న అవసరాలను తీర్చగల సామర్థ్యమున్నదీ కాదు. మరి ఇదెలా అపూర్వమైన ఆర్థికాభివృద్ధి అవుతుంది?

ప్రధాని మోదీ ప్రభుత్వ ఆర్థిక విధానాలు అల్ప ప్రత్యక్ష పన్నులు, అధికతర పరోక్ష పన్నుల వైపే మొగ్గు చూపుతున్నాయి. ఉపరితల రహదారులు, రైల్వేలు, నౌకాశ్రయాలు, విమానాశ్రయాల నిర్మాణం, అభివృద్ధికై మూలధన పెట్టుబడులను భారీ పరిమాణంలో పెడుతోంది. అయితే విద్యా వైద్యరంగాలకు కేటాయింపులను తగ్గిస్తోందన్న వాస్తవాన్ని విస్మరించకూడదు. ఏమైనా ఈ సంతృప్తికరమైన ఆర్థికాభివృద్ధి కొన్ని వర్గాలను సంతోషంగా ఉంచుతున్నదనడంలో సందేహం లేదు. మరి వీరెవరో చూడండి: బడా, మధ్యతరహా కార్పొరేట్ అధిపతులు; అత్యధిక నికర ఆదాయపరులు; బ్యాంకర్లు; స్టాక్ మార్కెట్ మదుపర్లు, వ్యాపారులు, దళారులు; వ్యాపార, వాణిజ్య దిగ్గజాలు; జడ్జీలు, చార్టర్డ్ అకౌంటెంట్‌లు, డాక్టర్లు, న్యాయవాదులు మొదలైన వృత్తి నిపుణులు; విశ్వవిద్యాలయ ఆచార్యులు, కళాశాల అధ్యాపకులు; ప్రభుత్వ ఉద్యోగులు; భూస్వాములు; వడ్డీ వ్యాపారులు.

ఇది భారతీయ సమాజ జీవనంలోని ఆశామయ దృశ్యం. ఇప్పుడు నిరాశామయ దృశ్యాన్ని మరింత విపులంగా చూద్దాం. పలు వర్గాలవారు అభివృద్ధిలో వెనుకబడిపోయారు. మరెన్నో వర్గాల సంక్షేమాన్ని అభివృద్ధి ఆరాటంలో పూర్తిగా వదిలివేస్తున్నారు. మరి ఈ వర్గాల వారే దేశ జనాభాలో అత్యధికంగా ఉన్నారు. అభివృద్ధిలో వెనుకబడినవారు 82 కోట్లకు పైగానే ఉన్నారు. వీరికి ఒక్కొక్కరికి నెలకు 5 కిలోలు చొప్పున ఆహారపదార్థాలను ఉచితంగా ఇస్తున్నారు. ఉచిత ఆహార పంపిణీ పథకం ఆర్థికాభివృద్ధి లేదా సౌభాగ్య సమృద్ధిని సూచించదు. అటువంటి వితరణ గౌరవప్రదమైనది కాదు. ఉచిత ఆహార పంపిణీ అనేది పోషకాహార లోపం, ఆకలి మంటలకు చిహ్నమని నిక్కచ్చిగా చెప్పక తప్పదు. దేశ జనాభాలో సగం కుటుంబాలు బియ్యం లేదా గోధుమలు మొదలైన ప్రాథమిక ఆహార పదార్థాలను సైతం ఎందుకు కొనుగోలు చేసుకోలేకపోతున్నాయి? అల్పాదాయం, లేదంటే నిరుద్యోగిత. ఈ రెండే అసలు కారణాలు. మరి ఈ రెండు తీవ్ర సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వానికి ఒక విధానమే లేదు! సమస్యల పరిష్కారం పట్ల విధాన రాహిత్యం అనేది పాలకుల నిర్లక్ష్యాన్ని మాత్రమే సూచిస్తుంది.

పేదల సంక్షేమాన్ని మోదీ ప్రభుత్వం ఎంతగా ఉపేక్షిస్తుందో గ్రామీణ ఉపాధి హామీ పథకమే ఒక ఉదాహరణ. చాలా అల్పంగా ఉన్న కుటుంబ ఆదాయాన్ని పెంపొందించేందుకు, ఆ స్వల్ప రాబడికి ఇంకా మరికొంత సమకూర్చేందుకు ఉద్దేశించిన 'గ్రామీణ ఉపాధి హామీ' పట్ల మోదీ సర్కార్ మొదటి నుంచీ వ్యతిరేకంగానే ఉన్నది. ఏప్రిల్, 2022 నుంచి, ఆ పథకం కింద నమోదయిన గ్రామీణ కార్మికుల జాబితా నుంచి 7.6 కోట్ల మందిని తొలగించింది. సరికొత్తగా ఆధార్ ఆధారిత చెల్లింపుల పద్ధతిని ప్రవేశపెట్టిన ఫలితంగా గ్రామీణ ఉపాధి హామీ నమోదిత కార్మికులలో 8.9 కోట్ల మంది, పనులు పొందిన 1.8 కోట్ల మంది కార్మికులు గ్రామీణ ఉపాధి హామీ లబ్ధికి అనర్హులయ్యారు. పేదల పొట్టకొట్టే ఈ పరిణామం పూర్తిగా గర్హనీయం కాదా? ఉపాధి పనులు లభించని పక్షంలో ఈ కోట్లాది గ్రామీణ శ్రామికులు ఎలా బతకాలి? జీవనాధారాలను కోల్పోయిన వారు సంతోషంగా ఎలా ఉండగలుగుతారు?



నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ స్వల్ప స్థాయిలో అభివృద్ధిని సాధించింది. ఆ ప్రగతి ఫలాలూ సమాజంలోని అన్ని వర్గాల వారికీ అందలేదు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత సమస్యలను పరిష్కరించడంలో మోదీ సర్కార్ విధానాలు విఫలమవడం వల్లే ఈ దుస్థితి. ప్రస్తుత ప్రభుత్వానికి మార్గదర్శకంగా ఉన్న విధానాలు సంపన్నుల కోసం, సంపన్నుల చేత రూపొందించబడి సంపన్నులచే అమలవుతున్నాయి. పైగా అవి సంపన్నులలో బిలియనీర్లు, కుబేరులకు మాత్రమే అనుకూలంగా ఉంటున్నాయి.

పాలకుల నిర్లక్ష్యానికి గురవుతోన్న మరో ప్రధాన వర్గం ఉద్యోగాలు లేనివారు. అంటే నిరుద్యోగిత సుడిలో చిక్కుకున్న వారు. ప్రభుత్వం ఇంకెంత మాత్రం ఉద్యోగాల సృష్టి గురించి మాట్లాడడం లేదు. స్వయం ఉపాధి పొందుతున్న వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోందని పదే పదే మాట్లాడడం ద్వారా ప్రజలను ముఖ్యంగా నిరుద్యోగులను భ్రమల్లో ఉంచవచ్చని పాలకులు భావిస్తున్నట్టుగా ఉన్నది. బాలలు పాఠశాల విద్యాభ్యాసంలో ఏడు లేదా ఎనిమిది సంవత్సరాలు గడిపే సమాజంలో ఎటువంటి నైపుణ్యాల శిక్షణ లేకుండా స్వయం ఉపాధి కల్పించుకోవడమంటే వాస్తవంగా నిరుద్యోగంలో కునారిల్లడమే. స్వయం ఉపాధి కల్పించుకున్నట్టుగా చెప్పబడుతున్న యువతీయువకులు క్రమబద్ధమైన పని అవకాశాలు కొరవడినవారే. దీనర్థం వారికి ఒక క్రమబద్ధమైన ఆదాయం లేదా వేతనం లేనివారే. ఇది నిష్ఠుర సత్యం. మరి ప్రస్తుత ద్రవ్యోల్బణ పరిస్థితులలో క్రమబద్ధమైన వేతనాలు పొందే వారితో ఈ 'స్వయం పోషకుల' జీవన స్థితిగతులను పోల్చి చూడండి. ఈ అభాగ్యుల పరిస్థితి ఎంత దుర్భరంగా ఉందో అర్థమవుతుంది. యువజనులలో నిరుద్యోగిత రేటు 10 శాతంగా ఉన్నది. 25 సంవత్సరాల వయసు లోపు పట్టభద్రులలో నిరుద్యోగిత 42 శాతంగా ఉన్నది! మరి ఈ లక్షలాది యువజనులు సంతోషంగా ఉండడం ఎలా సాధ్యం?

సంతోషదాయక బతుకులు లేని జనశ్రేణులన్నీ ద్రవ్యోల్బణ పీడితులే. అంటే దేశ సంపదలో 60 శాతానికి ఆసాములు, జాతీయ ఆదాయంలో 57 శాతాన్ని ఆర్జిస్తున్న ఉన్నతస్థాయి 10 శాతం మంది మినహా మిగతా వారందరూ ఆనందప్రదమైన జీవితాలు లేనివారే. 2022లో సగటు ద్రవ్యోల్బణం 6.7 శాతం. 2023లో అది 2నుంచి 6 శాతం ఎగువ అవధిని మించిపోయింది. 2023 నవంబర్‌లో ద్రవ్యోల్బణం 5.55 శాతంగా ఉన్నది. ఆహార ద్రవ్యోల్బణం ప్రస్తుతం 7.7 శాతంగా ఉన్నది. ద్రవ్యోల్బణం ఇంకా పెరుగుతుందని ఆర్బీఐ బులెటిన్ (డిసెంబర్, 2023) వెల్లడించింది. ద్రవ్యోల్బణం అనివార్యంగా వినియోగం, కుటుంబ పొదుపుల తగ్గుదలకు, కుటుంబ రుణాల పెరుగుదలకు కారణమవుతుంది. ద్రవ్యోల్బణాన్ని తగ్గించడం ప్రభుత్వ విధ్యుక్త ధర్మం. అయితే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆ బాధ్యతను వదిలివేసింది. ఆర్బీఐకి ఆ బాధ్యతను అప్పగించింది. మరి పరోక్ష పన్నులను తగ్గించేందుకు మన కేంద్ర బ్యాంకు పూర్తిగా ప్రతికూలం. పరోక్ష పన్నులను తగ్గించని పక్షంలో పేదలపై ధరల పెరుగుదల భారం ఎలా తగ్గుతుంది?

నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ స్వల్ప స్థాయిలో అభివృద్ధిని సాధించింది. అయితే ఆ ప్రగతి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాల వారికీ అందలేదు. కారణమేమిటి? మోదీ సర్కార్ అనుసరించిన విధానాలు ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత సమస్యలను పరిష్కరించడంలో విఫలమవడంవల్లే కాదూ? మరొక ముఖ్య వాస్తవాన్ని కూడా మనం విస్మరించకూడదు. మోదీ ప్రభుత్వానికి మార్గదర్శకంగా ఉన్న విధానాలను సంపన్నుల కోసం, సంపన్నుల చేత రూపొందించబడి సంపన్నులచే అమలవుతున్నాయి. పైగా ఆ విధానాలు సంపన్నులలో బిలియనీర్లు, కుబేరులకు మాత్రమే అనుకూలంగా ఉంటున్నాయి. సంపద కేంద్రీకృతమయ్యేందుకు మాత్రమే అవి దోహదం చేస్తున్నాయి. కొత్త సంవత్సరం కొంత మందిని మాత్రమే సంతోషభరితులను చేస్తుంది. అత్యధికులకు పాత బాధలు, తిప్పలు, సమస్యలనే కొనసాగిస్తుంది.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి,

పంచవర్ష ప్రగతికి బలమైన అడుగులు

తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి పాలన పగ్గాలు స్వీకరించి రేపటికి నెల. 20 ఏళ్ల ప్రతిపక్ష నాయకుడిగా, పీసీసీ అధ్యక్షుడిగా ప్రజల సమస్యలను దగ్గరగా చూసిన రేవంత్ రెడ్డి ఈ నెలరోజుల పాలనలోనే తనదైన ముద్ర వేశారు. డ్రగ్స్‌పై ఉక్కుపాదం, కాళేశ్వరం ప్రాజెక్టుపై న్యాయ విచారణ, పాలనను సామాన్యులకందుబాటులోకి తేవడంతో పాటు ప్రగతి భవన్, సచివాలయంలోకి సామాన్య ప్రజానీకానికి ప్రవేశం కల్పించారు. ఆరు గ్యారెంటీల అమలుపై అందరి అనుమానాలను పటాపంచలు చేస్తూ, బాధ్యతలు చేపట్టిన రెండు రోజుల్లోనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, కార్పొరేట్ ఆసుపత్రుల్లో పేదలకు పది లక్షల వరకు విలువైన వైద్య చికిత్సలు వంటివి ప్రారంభించారు. మిగతాగ్యారంటీల అమలుదిశగా, సరైన లబ్దిదారులను గుర్తించడానికి ప్రజాపాలనలో అభయహస్తం దరఖాస్తులను స్వీకరించే ప్రక్రియను ఆరంభించారు.



రాష్ట్ర యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా ఉండేందుకు యాంటీ నార్కోటిక్స్ బ్యూరోను పటిష్టపరిచారు. గత పదేళ్లుగా యువతలో ఏర్పడ్డ నిరాశ, నిస్పృహలు తొలగించటానికి జాబ్స్ క్యాలెండర్‌ను సంకల్పించారు. యూపీఎస్సీ నిర్వహిస్తున్న పోటీపరీక్షల విధానాన్ని అధికారులతో అధ్యయనం చేయించారు, తాను స్వయంగా తెలుసుకుంటున్నారు. రెండు లక్షల ఉద్యోగాల నియామకాలకు చర్యలు తీసుకోవడంతో పాటు, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయడానికి డీఎస్సీని కూడా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతీ గ్రామ పంచాయితీ, గిరిజన తండాలో ఒక్క ప్రాథమిక పాఠశాలైనా ఉండేలా చర్యలు చేపట్టారు. టాటా టెక్నాలజీస్ లాంటి దిగ్గజ సంస్థ భాగస్వామ్యంతో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఐటీఐలలో విద్యార్థులకు శిక్షణ అందించే ఏర్పాట్లు చేశారు. యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాల కోసం పది స్కిల్ యూనివర్సిటీలను ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. హైదరాబాద్ నగరాభివృద్ధిపై స్పష్టమైన ప్రణాళికలను ప్రకటించారు. పాతబస్తీ సహా మెట్రో రైలు మార్గాలను విస్తరించడం, తక్కువ ఖర్చయ్యే మార్గాలను రూపొందించడం జరుగుతోంది. ఔటర్ రింగ్ రోడ్‌కు వెలుపల ఫార్మా పరిశ్రమలను ఏర్పాటుకు మొగ్గు చూపించారు. హైకోర్టు నూతన భవన నిర్మాణానికి వంద ఎకరాలను కేటాయించారు. ప్రతి మంత్రికీ సంబంధిత శాఖలపై పూర్తి పట్టు సాధించేలా స్వేచ్ఛనిచ్చారు. నెలరోజుల్లోనే రేవంత్ రెడ్డి పాలనపై ప్రజల్లో విశ్వాసం ఏర్పడింది.

– కన్నెకంటి వెంకటరమణ
జాయింట్ డైరెక్టర్, సమాచార పౌర సంబంధాల శాఖ

పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ ఓటు బీజేపీకే!

తెలంగాణలో వరుసగా మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఆశించిన కేసీఆర్ ఆశలను వమ్ముచేస్తూ తెలంగాణ ప్రజలు రాష్ట్రంలో మార్పుకు ఓటు వేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అసంతృప్తి కలిసి రావడంతో బొటాబొటి ఆధిక్యతతో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సరళిని పరిశీలిస్తే 2018తో పోలిస్తే 2023లో బీజేపీ ఓట్ల శాతాన్ని రెట్టింపు చేసుకోవడంతో ఆ పార్టీ రాష్ట్రంలో క్రియాశీలకంగా మరబోతోందని చెప్పవచ్చు.

వాస్తవానికి తెలంగాణలో మొదటి నుంచి కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా వ్యతిరేక విధానాలను పెద్దఎత్తున ఎండగడుతూ బీజేపీయే ప్రజలకు చేరువయ్యింది. ఆ సమయంలో రాష్ట్ర కాంగ్రెస్‌లోని పలువురు నేతలు అధికార పార్టీతో కుమ్మక్కు కావడంతోపాటు పార్టీలో పదవుల కోసం కొట్లాడుతూ ప్రజా సమస్యల గురించి పట్టించుకోలేదు.

ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీల అమలు విషయంలో పొంతనలేని మాటలతో కాంగ్రెస్ మభ్య పెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు గమనిస్తుండడంతో రాబోయే లోక్‌సభ ఎన్నికలు ఓటర్ల విజ్ఞతకు మరోసారి పరీక్షగా మారనున్నాయి. దీంతో ప్రస్తుతం రాష్ట్రంలో బీఆర్ఎస్ మునిగిపోయిన నావ కాగా, కాంగ్రెస్ మునిగిపోతున్న నావగా ఉంది.

నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ పట్ల తెలంగాణ ప్రజలు పూర్తి సానుకూలంగా మారుతున్నారని అసెంబ్లీ ఎన్నికల ఫలితాల విశ్లేషణ ద్వారా వెల్లడవుతోంది. 2018లో కేవలం 6.8 శాతం ఓట్లతో ఒక్క సీటు మాత్రమే గెల్చుకున్న బీజేపీ, ఈ సారి ఓట్లను వంద శాతానికిపైగా పెంచుకొని 14 శాతం ఓట్లతో 8 సీట్లను సాధించింది. రాష్ట్రంలో అందరినీ ఆకర్షించిన కామారెడ్డి నియోజకవర్గంలో ప్రధాన నేతలు కేసీఆర్, రేవంత్ రెడ్డి ఇద్దరినీ ఓడించి బీజేపీ సంచలనం సృష్టించింది.

గతంలో ఎన్నడూ లేనివిధంగా తెలంగాణ వ్యాప్తంగా బీజేపీకి ఆదరణ పెరుగుతోందని 2023 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. అసెంబ్లీకి స్థానిక పరిస్థితుల దృష్ట్యా తాము ఓటు వేస్తున్నా, లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం జాతీయ అంశాల దృష్ట్యా బీజేపీకే ఓటు వేస్తామని అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పలుచోట్ల ప్రజలు బహిరంగంగానే చెప్పడం గమనార్హం.

అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే ఆత్రుతతో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు పోటీపడి అలవిగాని హామీలతో ప్రజలను ఆకట్టుకొనే ప్రయత్నాలు చేశాయి. మరోవైపు బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే అంటూ కాంగ్రెస్ గ్రామస్థాయి వరకు దుష్ప్రచారం చేసి, ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను అనుకూలంగా మల్చుకోగలిగింది. కేసీఆర్ ప్రభుత్వంలో పెత్తనం చెలాయించిన పలువురు ఉన్నతాధికారుల వ్యవహారాలను విమర్శించిన కాంగ్రెస్ అధికారం చేపట్టాక వారికి కీలక పోస్టింగులు ఇస్తుండటాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు.

కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో జరిగిన లక్షల కోట్ల రూపాయల అవినీతిని బట్టబయలు చేయకుండా, ఈ అంశాన్ని నిర్వీర్యపరిచే ప్రయత్నాన్ని స్వయంగా రాష్ట్ర ఇరిగేషన్ మంత్రే చేస్తున్నారు. ఎన్నికల సమయంలో మేడిగడ్డ కుంగిపోయిన ఘటనపై సీబీఐ విచారణకు డిమాండ్ చేసిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టాక సిట్టింగ్ జడ్జీతో విచారణ అంటూ కాలయాపనకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే తలకు మించిన కేసులతో సతమతమవుతున్న మన న్యాయస్థానాలు సిట్టింగ్ జడ్జీలను విచారణ కోసం వినియోగించే పరిస్థితుల్లో ఉన్నాయా?

బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కన్నా అధికారమే పరమావధిగా సాగుతున్నాయి. అంతేకాక దేశంలో ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉన్న పెద్ద రాష్ట్రాలు కర్ణాటక, తెలంగాణ మాత్రమే కావడంతో జాతీయ స్థాయిలో లోక్‌సభ ఎన్నికలకు పార్టీకి నిధులను సమకూర్చాల్సిన భారం ఈ రెండు ప్రభుత్వాలపై పడుతోంది. ఈ పరిణామాలతో రాష్ట్రంలోని అవినీతిపరులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకొనే అవకాశాలు కనిపించడం లేదు.

మరోవైపు గత పదేళ్లలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశాన్ని ఐదవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్ది, ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రూపొందేలా చర్యలు తీసుకుంటోంది. నేడు భారత్‌ను ప్రపంచంలో ఒక బలమైన ఆర్థిక, రాజకీయ, సైనిక శక్తిగా బీజేపీ ప్రభుత్వం నిలబెట్టింది. మోదీ ప్రభుత్వం తెలంగాణలో 9 లక్షల కోట్ల రూపాయలను వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం ఖర్చు పెట్టింది. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో రహదారులు, రైల్వే పథకాలు, సాగునీటి పథకాలకు వనరులను సమకూరుస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేసింది. తెలంగాణలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి పెద్ద ఎత్తున సహకరిస్తున్న కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి తనవంతు తోడ్పాటు, సహకారం అందిస్తుందని, ఇది మోదీ గ్యారంటీ అంటూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రధాని మోదీ ప్రజలకు భరోసా ఇచ్చారు.


ప్రస్తుతం తెలంగాణలో ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్రంలో చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యం లేకుండా అమలు చేయలేని పరిస్థితులున్నాయి. తెలంగాణ అభివృద్ధిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ట్రైబల్ యూనివర్సిటీ, పసుపు బోర్డు వంటి పలు నూతన కార్యక్రమాలను చేపట్టింది. సంపన్న తెలంగాణను అప్పుల కుప్పగా మార్చిన ఘనత కేసీఆర్‌కు దక్కింది. కేసీఆర్ తెలంగాణను అప్పులమయంగా మార్చారని ప్రధాని మోదీకి ఫిర్యాదు చేసిన రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధుల సాయాన్ని కోరారు. అయితే ఏ యే పథకాలకు, ఏ మేరకు నిధులు అవసరమో నిర్దిష్టమైన ప్రతిపాదనలను మాత్రం ఆయన కేంద్రం ముందు ఉంచలేకపోతున్నారు. ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల్లో ఆరు గ్యారంటీల అమలుకు ఏ విధంగా నిధులు సమకూర్చుకుంటారో చెప్పలేని పరిస్థితులలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉంది.

పుష్కలమైన వనరులు, నైపుణ్యతను కలిగి ఉన్న తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేలా అభివృద్ధి చేయాలంటే కేంద్రంలోని బీజేపీ మద్దతు తప్పనిసరి. దేశంలో కాంగ్రెస్ నేతృత్వంలో ప్రతిపక్షాలు కూటమిగా ఏర్పడినా ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్రంలో వరుసగా మూడోసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటయ్యే అవకాశాలున్నట్లు దాదాపు అన్ని సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. ప్రధాని పదవికి సంబంధించి మోదీకి ఇతర పార్టీల నేతలెవరూ పోటీ ఇవ్వలేకపోతున్నారు. తెలంగాణలో నిర్వహించిన పలు సర్వేలలో కూడా మోదీయే ప్రజాదరణ నేతగా కనిపిస్తున్నారు. ఈ పరిణామాల దృష్ట్యా దేశంతోపాటు తెలంగాణలో కూడా వేగవంతమైన అభివృద్ధి, పురోగతి కోసం రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు మూకుమ్మడిగా బీజేపీకి ఓటు వేయవలసిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది.

నరేంద్ర మోదీని మూడోసారి ప్రధానిగా గెలిపించేందుకు తెలంగాణలో బీజేపీని 35 శాతం ఓట్లతో కనీసం పది స్థానాల్లో గెలిపించి స్పష్టమైన తీర్పును ఇవ్వాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇటీవల హైదరాబాద్ పర్యటన సందర్భంగా రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. మోదీ నాయకత్వం పట్ల తెలంగాణ ప్రజలు చూపుతున్న ఆసక్తి ఆయనలో విశ్వాసం కలిగిస్తున్నట్లు చెప్పవచ్చు.


దేశంలో అవినీతిరహిత పాలన, సమర్థవంతమైన నాయకత్వం, సుస్థిర ప్రభుత్వం, వేగవంతమైన అభివృద్ధి, దేశ రక్షణ, దేశ సమైక్యత, దేశ సమగ్రత మోదీ నాయకత్వంలోనే సాధ్యమని దేశ ప్రజలు బీజేపీపై ఎంతో భరోసాతో ఉన్నారు. గతంలో అతుకులబొంతల సంకీర్ణ ప్రభుత్వాలతో దేశం అభివృద్ధిలో వెనకబడి ఎంతో నష్టపోయింది. దీంతో ప్రజలు సంకీర్ణ ప్రభుత్వాలంటే విసుగెత్తిపోయారు. మోదీ చరిష్మాను అడ్డుకునేందుకు మరోసారి కాంగ్రెస్ నేతృత్వంలో పలు పార్టీలు 'ఇండియా' కూటమి పేరుతో లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. అధికారమే లక్ష్యంగా ముందుకొస్తున్న ఈ కూటమి నేతలకు స్వప్రయోజనాలు మినహా దేశ అభివృద్ధి పట్ల, ప్రజా సమస్యల పట్ల ఏ మాత్రం ఆసక్తి లేదని ఇటీవల ఆ కూటమిలో ఏర్పడుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

ఇటువంటి పరిస్థితులలో తెలంగాణ ప్రజలు మరోసారి మోదీ నాయకత్వానికి అండగా నిలబడాల్సిన సమయం ఆసన్నమైంది. 2024 లోక్‌సభ ఎన్నికల అనంతరం కేంద్రంలో ఏర్పడబోయే ప్రభుత్వంలో తెలంగాణకు తగురీతిలో భాగస్వామ్యం ఉండే విధంగా అత్యధిక ఎంపీ సీట్లలో బీజేపీని గెలిపించాల్సిన ఆవశ్యకత రాష్ట్ర ప్రజలపై ఉంది.



ప్రస్తుతం తెలంగాణలో ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్రంలో చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యం లేకుండా అమలు చేయలేని పరిస్థితులున్నాయి. పుష్కలమైన వనరులు, నైపుణ్యత కలిగి ఉన్న తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేలా అభివృద్ధి చేయాలంటే కేంద్రంలోని బీజేపీ మద్దతు తప్పనిసరి. దేశంతోపాటు తెలంగాణలో కూడా వేగవంతమైన అభివృద్ధి, పురోగతి కోసం రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు మూకుమ్మడిగా బీజేపీకి ఓటు వేయవలసిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది.

• బండి సంజయ్ కుమార్
కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు,

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
శనివారం 6 జనవరి 2024





'కేసీఆర్ కిట్' బకాయిలేవీ!?

- నగదు చెల్లింపుల్లో మొండిచేయి
- అస్పత్రుల చుట్టూ తిరుగుతున్న బాలింతలు
- ఉమ్మడి జిల్లాలో రూ.72.87కోట్ల బకాయిలు
- మూడేళ్లుగా జమకాని డబ్బులు
- స్పష్టత ఇవ్వని రేవంత్ ప్రభుత్వం
- ఎంసీహెచ్‌గా కిట్ పేరు మార్పు

హనుమకొండ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్ పథకం అమలు మూణ్నాళ్ల ముచ్చటే అయింది. 2017లో ఈ పథకం ప్రారంభమైనప్పుడు కనిపించిన ఉత్సాహం.. ఆ తర్వాత లేకుండా పోయింది. ఈ పథకం పేరుతో కేసీఆర్ సర్కార్ ప్రచారమైతే బాగానే చేసుకున్నది. కిట్లపై కేసీఆర్ ఫొటోతో ప్రభుత్వం హంగామా చేసింది. కానీ కిట్‌తోపాటు ఇవ్వాల్సిన నగదు ప్రోత్సాహకం చెల్లింపు విషయంలో మొండిచేయి చూపింది.

కిట్ల పథకం అమలులో కేసీఆర్ సర్కార్ చిత్తశుద్ధి తర్వాత కాలంలో కొరవడింది. పథకం ఫలాలు బాలింతలు, గర్భిణులకు అందకుండా పోయాయి. ఈ పథకం కింద చెల్లించాల్సిన నగదు ప్రోత్సాహకాల కోసం వారు ఆస్పత్రుల చుట్టూ చంటిబిడ్డలను పట్టుకొని ఇప్పటికీ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు.. కనుక తామేమీ చేయలేమని వైద్యాధికారులు చేతులు ఎత్తేస్తున్నారు. కేసీఆర్ కిట్ పథకం కింద కిట్‌తోపాటు మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవమైన తర్వాత వారికి విడతల వారీగా నగదు సాయం అందించాల్సి ఉంటుంది. కానీ ప్రసవం అనంతరం కిట్ ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు తప్ప నగదు చెల్లించడం లేదు.

మూడేళ్లుగా గర్భిణులు, బాలింతలకు ప్రోత్సాహక నగదు అందడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ. కోట్లలో బకాయిలు ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కొత్త ప్రభుత్వం అయినా తమ బకాయిలను చెల్లిస్తుందన్న ఆశతో గర్భిణులు, బాలింతలు ఉన్నారు.

రూ.72.87కోట్ల బకాయిలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,688 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 2020-21, 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాలకు గాను 57,716 మంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించారు. ఇందులో 1,910 మందికి నాలుగు విడతలుగా నగదు ప్రోత్సాహకం రూ.2.43కోట్లు అందచేశారు. మిగతా 55,806 మందికి రూ.72.87కోట్లు రావలసి ఉంది. పథకం ప్రారంభం అనంతరం అస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య రెట్టింపు అయింది. కేసీఆర్ కిట్‌తో పాటు నగదు అందచేయడంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన గర్భిణులు ప్రభుత్వ అస్పత్రుల వైపు మొగ్గుచూపారు. అంతవరకు బాగానే ఉన్నా ప్రోత్సాహకాలు మూడేళ్లుగా జమకావడం లేదు. దీంతో లబ్ధిదారులు బ్యాంకుల చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నాలుగు విడతలుగా..

కేసీఆర్ కిట్ పథకం కింద యాంటి నేటల్ కేసీ (ఏఎన్‌సీ) చెకప్ పూర్తయిన తర్వాత నగదు మొత్తాన్ని విడతలవారీగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలి. గర్భిణిగా నిర్ధారణ అయి రెండు దఫాలుగా వైద్య పరీక్షల తర్వాత మొదటి విడత రూ.3వేలు అందించాలి. ఐదు నెలలు నిండిన తర్వాత రెండో విడత ఎఎన్‌సీ చెకప్ పూర్తయిన తర్వాత రూ.2వేలు చెల్లించాలి. మూడో విడత పూర్తయిన తర్వాత రూ.2వేలు జమ చేయాలి. ప్రసవం తర్వాత నాలుగో విడతగా ఒకవేళ ఆడబిడ్డ పుడితే రూ.5వేలు మగ బిడ్డ పుడితే రూ.4వేలు జమ కావాలి. మొత్తంగా ఆడపిల్ల అయితే రూ.13వేలు, మగబిడ్డ అయితే రూ.12 ఎఎన్‌సీ పూర్తయిన తర్వాత అందచేయాలి. కానీ మూడేళ్లుగా ఇదేది జరగడం లేదు.

కొత్త సర్కార్ అయినా..

ఉమ్మడి జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు బాలింతలు, గర్భిణులకు కేసీఆర్ కిట్ పథకం కింద చెల్లించాల్సిన నగదు వివరాలను ఎప్పటికప్పుడు గత ప్రభుత్వానికి నివేదించుకుంటూ వచ్చారు. ఎంత మొత్తం బకాయిలు ఉన్నాయి నివేదికలను సమర్పించారు. కానీ కేసీఆర్ సర్కార్ దీని గురించి పెద్దగా పట్టించుకోలేదు. ఈ పథకం అమలుకు మొదట్లో చూపిన శ్రద్ధను తర్వాత చూపలేదు. ప్రచారార్భాటమే తప్పా పథకం ఫలాలు బాలింతలకు, గర్భిణులకు అందలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఈ బకాయిల విషయంలో కొత్త ప్రభుత్వం నిర్ణయం ఏమిటో ఇంకా స్పష్టం కాలేదు. ఈ పథకంపై సీఎం రేవంత్‌రెడ్డి వైద్య, ఆరోగ్య శాఖ సమీక్ష సమావేశంలో చర్చించినప్పటికీ తుది నిర్ణయం తీసుకోలేదు. కొత్త ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగిస్తుందా? లేక పేరు మార్చి సరికొత్తగా అమలు చేస్తుందా అనేది తెలియాల్సి ఉంది.

ఎంసీహెచ్ కిట్

గర్భిణులను పోషకాహార లోపం, రక్తహీనత నుంచి కాపాడేందుకు ప్రసావనంతరం బాలింతలకు 16 రకాల వస్తువులతో కూడిన కేసీఆర్ కిట్ కూడా ఇచ్చేవారు. ఇప్పుడు అవి కూడా సరిగా అందడం లేదు. గత ప్రభుత్వం దీనిని న్యూట్రిషన్ కిట్ పథకంగా ప్రవేశపెట్టింది. రక్త హీతన అధికంగా నమోదైన జయశంకర్ భూపాలపల్లి జిల్లాతో పాటు తొమ్మిది జిల్లాలో దీనిని పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించింది, మంచి ఫలితాలు రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా అమలులోకి తీసుకువచ్చింది. అయితే కొత్త ప్రభుత్వం కేసీఆర్ కిట్‌ను ఎంసీహెచ్‌కిట్‌గా మార్చింది. కేసీఆర్ కిట్‌తో ఉన్న ఆర్థిక సాయాన్ని కొనసాగిస్తారా? లేదా అనే విషయంలో స్పష్టత లేదు. దీనితో పాటు రూ 2వేల విలువైన వస్తువుల కిట్‌ను కొనసాగిస్తారా? లేదా అన్నదానిపై స్పష్టత లేదు. ఇప్పటికైతే గర్భిణుల పేర్లను ప్రభుత్వ అస్పత్రుల్లో నమోదు చేసుకుంటున్నారు. ఆర్థిక సాయం ఎంతా అనేదానిపై ఇంకా ఎలాంటి ఆదేశాలు జారీ కాలేదు.


ఏఆర్ కిష్టయ్యను విచారిస్తున్న ఏసీబీ అధికారులు

కేయూలో కలకలం

- ఏసీబీ వలలో ఆడిట్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్య
- పాల బిల్లులు మంజూరు చేసేందుకు లంచం డిమాండ్
- విసిగి వేసారి ఏసీబీని ఆశ్రయించిన కాంట్రాక్టర్
- రూ.50వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత


ఏసీబీకి పట్టుబడిన ఏఆర్ కిష్టయ్య

హనుమకొండ క్రైం/ కేయూ క్యాంపస్, జనవరి 5: కాకతీయ యూనివర్సిటీలోని ఆడిట్ విభాగంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సిగసారపు కిష్టయ్య ఓ పాల కాంట్రాక్టర్ నుంచి రూ.50వేల లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు అడ్డంగా దొరికిపోయాడు. శుక్రవారం మధ్యాహ్నం 12గంటలకు క్యాంపస్‌లో పెండెం రాజేందర్ అనే వ్యక్తి నుంచి లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం..

వరంగల్ కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన పెండెం రాజేందర్ 15 ఏళ్లుగా కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని మహిళలు, పురుషుల హాస్టళ్లకు పాలు, పెరుగు సరఫరా చేస్తున్నాడు. ఇందుకు ప్రతీ నెల కేయూ ఆడిట్ విభాగం నుంచి డబ్బులను తీసుకుంటాడు. ఈ క్రమంలో రెండేళ్లకు గానూ రూ.15లక్షల బిల్లులు రావాల్సి ఉంది. దీని కోసం రాజేందర్ పలుమార్లు అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్యను కలిసి తనకు రావాల్సిన బిల్లులు ఇవ్వాలని కోరారు. అయితే బిల్లులు మంజూరు చేయాలంటే రూ.75వేలు లంచం ఇవ్వాలని కిష్టయ్య డిమాండ్ చేశాడు. దీంతో చేసేదేమీలేక రాజేందర్ ఒకసారి రూ.15వేలు, మరోసారి రూ.10వేలు ఆన్‌లైన్‌లో పంపించాడు. రెండు విడతల్లో రూ.25 వేలు ఇస్తానని, తర్వాత రూ.50వేలు ఇస్తానని ఒప్పుకున్నాడు. ఇద్దరి ఒప్పందం ప్రకారం గత నెల రెండుసార్లు ఆన్‌లైన్‌లో రూ.25వేలు పంపించగా రూ.8 లక్షల చెక్కును అప్పగించాడు. మిగతా రూ.7లక్షలకు రూ.50వేలు ముందుగానే ఇవ్వాలని ఒత్తిడి తెచ్చాడు.

ఈ క్రమంలో రాజేందర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సలహా మేరకు రూ.50వేలతో శుక్రవారం వ్సనటీ క్యాంపస్‌కు వెళ్లాడు. పరిపాలన విభాగం ఆడిట్ కార్యాలయంలో ముందే నిర్దేశించిన ప్లాన్ ప్రకారం తాను తెచ్చిన రూ.50వేల డబ్బును కిష్టయ్యకు అందించాడు. ఇదే సమయంలో అక్కడే మాటువేసి ఉన్న అవినీతి నిరోధక శాఖ అధికారులు మూకుమ్మడిగా దాడిచేశారు. నగదును స్వాధీనం చేసుకుని అప్పటికే తెచ్చిన రసాయనాలలో పరీక్షించారు. అనంతరం కిష్టయ్యను హైదరాబాద్‌లోని ఏసీబీ కార్యాలయానికి తరలించారు. విచారణ తర్వాత ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ సాంబయ్య తెలిపారు. ఈ దాడులలో అవినీతి నిరోధక శాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు శ్యాంసుందర్, కె.శ్రీనివాస్, నీలం రవితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

10 శాతం ఇస్తేనే బిల్లు చేస్తానన్నాడు..

- బాధితుడు రాజేందర్



పాలు, పెరుగు సరఫరా బిల్లుల కోసం కార్యాలయం చుట్టూ చెప్పులరిగేలా తిరిగాను. రూ.15లక్షల బిల్లులు చేయాలని అడిగితే 10 శాతం కావాలని కిష్టయ్య డిమాండ్ చేశాడు. బతిమిలాడితే రూ.75వేలకు ఒప్పుకున్నాడు. ముందుగా రూ.25వేలు ఇచ్చాను. కొంత బిల్లు చేశాడు. మిగతా డబ్బుల కోసం తీవ్ర ఇబ్బందులకు గురి చేశాడు. ఎంత బతిమలాడినా కనికరించకుండా డబ్బులు డిమాండ్ చేశాడు. దిక్కుతోచని స్థితిలోనే ఏసీబీని ఆశ్రయించాను.


సమావేశంలో మాట్లాడుతున్న వినయభాస్కర్

రాజకీయాల్లో గెలుపోటములు సహజం

- మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్

సుబేదారి, జనవరి 5: రాజకీయాల్లో గెలుపోటములు సహజమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్ అన్నారు. బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గెలుపునకు పొంగిపోను, ఓటమికి కుంగిపోను.. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల మధ్యలోనే ఉంటా..' అని స్పష్టం చేశారు. రాబోయే ఎంపీ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్ స్థానంలో గులాబీ జెండా ఎగురవేద్దామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో 'కుడా' మాజీ చైర్మన్లు సుందర్‌రాజ్ యాదవ్, మర్రి యాదవరెడ్డి, బీఆర్ఎస్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ జనార్దన్ గౌడ్, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఉన్మాదం

- కన్నతల్లిని రోకలితో కొట్టి చంపిన కొడుకు
- అడ్డువచ్చిన మరో మహిళపైనా దాడి
- సైకో తీరుతో వణికిపోయిన తిరుమలగిరి గ్రామస్థులు
- నిందితుడిని బంధించిన చిన్నకోడెపాక ప్రజలు


ఉన్మాది రాజిరెడ్డిని తాళ్లతో బంధించిన దృశ్యం


హైమ (ఫైల్)

రేగొండ, జనవరి 5: మతి స్థిమితం తప్పిందో... ఉన్మాదమో తెలియదుగానీ అతడు.. తన కన్న తల్లినే దారుణంగా హత్య చేశాడు. అడ్డు వచ్చిన మరో మహిళపైనా దాడికి దిగాడు. తీవ్ర గాయాలతో ఆమె మృత్యువుతో పోరాడుతోంది. ఈ దారుణ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం తిరుమలగిరిలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఉన్మాది తీరుతో గ్రామస్థులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. తల్లిని చంపిన అనంతరం ఉన్మాది అక్కడి నుంచి పరారై మరో గ్రామంలో తిరుగుతుండగా గ్రామస్థులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. నవమాసాలు మోసి కనిపెంచిన తల్లిని కొడుకే కడతేర్చడం ప్రతీ ఒక్కరిని నివ్వెరపరిచింది.

కుటుంబ సభ్యులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం తిరుమలగిరికి చెందిన కంచర్లకుంట్ల మోహన్‌రెడ్డి-హైమ దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు రాజిరెడ్డి(42) భార్య సరితతో కలిసి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతని ఇద్దరు కుమారులు హనుమకొండలో ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్నారు. అయితే రాజిరెడ్డి కొంతకాలంగా మానసిక రుగ్మతతో బాధపడుతూ అప్పుడప్పుడు భార్యతో గొడవ పడేవాడు. ఐదేళ్లుగా ఎలాంటి సమస్య లేకుండా ఉన్న రాజిరెడ్డి... గత పది రోజులుగా నిద్రపోకుండా గొడవ చేస్తూ తనకు శక్తి ఆవహించిందని చెప్పడం మొదలు పెట్టాడు. దీంతో అతనికి భార్య సరిత, తల్లి హైమ తాయత్తు కట్టించారు.

ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి రాజిరెడ్డి మళ్లీ గొడవకు దిగాడు. తెల్లవారాక ఆస్పత్రికి వెళ్దామని పడుకోమని చెప్పగా 'నన్ను ఏం చేస్తున్నారు.. చంపుతారా..' అంటూ తల్లి, భార్యపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ దుర్భాషలాడాడు. దీంతో తల్లి హైమ, భార్య సరిత భయంతో ఎదురుగా ఉన్న తమ ఇంట్లోకి వెళ్లి పడుకున్నారు. అయితే రాజిరెడ్డి ఊరుకోకుండా బయటికి రాకపోతే ఇంట్లో ఉన్న పత్తి కాలబెడుతా అంటూ హెచ్చరించడంతో తల్లి బయటకు వచ్చింది. ఈ సమయంలో రాజిరెడ్డి పక్కనే ఉన్న రోకలి తీయడంతో తల్లి, భార్య చెరో వైపు పరిగెత్తారు. తొలుత తల్లి హైమ(60) తలపై విచక్షణ రహితంగా దాడి చేయగా, ఆమె తల భాగం మొత్తం ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందింది.

ఇదే సమయంలో పక్కింట్లో ఉన్న ఊకంటి జ్యోతి బయటకు వచ్చి అడ్డుకోబోగా ఆమెపై దాడి చేయడంతో తీవ్ర గాయాలతో కింద పడిపోయింది. నిందితుడి భార్య పారిపోయి చుట్టుపక్కల వారిని తీసుకువచ్చేలోగా 'ఇద్దరిని చంపేసిన.. ఎవరు వస్తారో రండి.. అందరిని చంపుతా..' అని రాజిరెడ్డి ముందుకు రావడంతో అందరూ భయంతో ఇళ్లల్లోకి వెళ్లిపోయారు. అనంతరం నిందితుడు రోకలితో పారిపోయాడు. గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ వేణు చందర్, ఐదుగురు ఎస్సైలు, పోలీసు సిబ్బందితో గ్రామానికి చేరుకున్నారు. గాయపడిన జ్యోతిని అంబులెన్సులో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం ఉదయం వరకు నిందితుడి కోసం గాలించారు.

కాగా, గోరికొత్తపల్లి మండలంలోని చిన్నకోడెపాకలో రాజిరెడ్డి అనుమానాస్పదంగా తిరుగుతుండగా గ్రామస్థులు పట్టుకుని కట్టేసి పోలీసులకు సమాచారం అందిచారు. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి సిబ్బందితో చేరుకుని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డీఎస్పీ రాములు తిరుమలగిరిలోని సంఘటన స్థలాన్ని పరిశీలించి ప్రత్యక్ష సాక్షులు, కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

తండ్రిని రాయితో కొట్టి చంపిన కొడుకు

- ఆస్తి తగాదాలే కారణం - 7లో..
- గూడూరు మండలం తీగలవేణిలో విషాదం



పార్లమెంట్ ఎన్నికలను సమన్వయంతో నిర్వహించాలి

- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలు అందించండి
- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

8


సమావేశంలో మాట్లాడుతున్న అరూరి రమేష్

పార్టీ శ్రేణులను కాపాడుకుంటా..

- మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్

సుబేదారి, జనవరి 5: వర్ధన్నపేట నియోజకవర్గంలోని బీఆర్ఎస్ శ్రేణులను కంటికి రెప్పలా కాపాడుకుంటానని బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం హసన్‌పర్తి మండల కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని ప్రతీ ఒక్కరికి పార్టీ తరపున అన్ని విధాలుగా అండగా ఉంటానన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ హసన్‌పర్తి మండల అధ్యక్షుడు బండి రజినికుమార్, ఎంపీపీ సునిత రాజు, జడ్పీటీసీ సునిత ప్రసాద్, వైస్ ఎంపీపీ రత్నాకర్ రెడ్డి, పాక్స్ చైర్మన్ రమేష్ గౌడ్, రైతు బంధు కోఆర్డినేటర్ విజయ్‌తో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

వస్తోంది.. వస్తోంది.. మల్లన్న జాతర

- 13 నుంచి 15 వరకు...
- ముస్తాబవుతున్న ఐనవోలు
- మొదలైన ఏర్పాట్లు



ఐనవోలు, జనవరి 5: లక్షలాది మందిని భక్తిభావంలో ముంచెత్తే ఐనవోలు మల్లన్న జాతర ఉత్సవాల ఏర్పాట్లకు అధికారులు శ్రీకారం చుట్టారు. ప్రతీ ఏటా మకర సంక్రమణంతో ప్రారంభమయ్యే జాతర ఉత్సవాలు ఉగాది వరకు కొనసాగుతాయి. స్వామి వారికి దృష్టికుంభం డిసెంబరు 17 ఆదివారం (ధనుసంక్రమణ) నిర్వహించారు. ఈ నెల 13న శనివారం ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ధ్వజారోహణం, నూతన వస్త్రాలంకరణం చేయనున్నారు. 14న ఆదివారం భోగి పండుగ నాడు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి దర్శించుకుంటారు. 15న సోమవారం మకర సంక్రాంతి రోజున రాత్రి దేవుడి రథం(బండ్లు) ఆలయం చుట్టూ తిరుగుతాయి. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి సైతం భక్తులు భారీగా తరలివస్తారు. 17న బుధవారం మహాసంప్రోక్షణ క్రతువు సమారాధన పూజ కార్యక్రమాలు జరుగుతాయి. ఫిబ్రవరి 14న బుధవారం వసంత పంచమి శ్రీభ్రమరాంబిక అమ్మవారి దశమ వార్షికోత్సవం, 24న శనివారం రేణుకాదేవి (ఎల్లమ్మదేవత) పండగ నిర్వహించనున్నారు.

శివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలు

శివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మార్చి 6 నుంచి 10 వరకు పాంచాహ్నిక దీక్షతో త్రికుండాత్మకంగా భ్రమరాంభికా మల్లికార్జునస్వామి వారి కల్యాణ బ్రహ్మోత్సవాలు శైవాగమోక్తంగా నిర్వహించనున్నారు. 6న బుధవారం సూర్య, చంద్ర ప్రభ వాహనసేవలు, 7న గురువారం ఆశ్వవాహన సేవ, శేషవాహనసేవ, 8న శుక్రవారం మహాశివరాత్రి శివ కల్యాణం, పెద్దపట్నం, సింహవాహనసేవ, రాత్రి 7 గంటలకు శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి వారి కల్యాణం, తదుపరి నంది వాహనసేవ నిర్వహిస్తారు. 9న శనివారం రావణ వాహనసేవ, రథోత్సవం, పుర వీధి సేవ, 10న ఆదివారం పర్వతవాహనసేవ, వంసతోత్సవం, పండితసన్మానాలు నిర్వహిస్తారు. ఏప్రిల్ 7న ఆదివారం పెద్దపట్నం కల్యాణం, 9న మంగళవారం ఉగాదిని పురస్కరించుకుని పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు.

వారంతపు జాతర

జనవరి 21 నుంచి ఏప్రిల్ 3 వరకు వారంతపు జాతరలు ప్రతీ ఆది, బుధ వారాల్లో జరుగుతాయి. ఈ సంవత్సరం మొత్తం 12 ఆదివారాలు, 11 బుధవారాల వారాంతపు జాతరలు నిర్వహిస్తారు. జాతరలకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు వచ్చి దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకుంటారని, సకల ఏర్పాట్లు చేస్తామని ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్ తెలిపారు.

బ్రహ్మకుమారిల స్వర్ణోత్సవాలు

- నేడు రేపు కార్యక్రమాలు
- హాజరు కానున్న మంత్రులు

తండ్రిని రాయితో కొట్టి చంపిన కొడుకు


మృతిచెందిన కందళం లింగాచారి

గూడూరు(మహబూబాబాద్ జిల్లా), జనవరి 5 : ఆస్తి తగదాల విషయంలో తండ్రిని కుమారుడు రాయితో కొట్టి చంపిన ఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం తీగలవేణిలో శుక్రవారం చోటు చేసుకుంది. గూడూరు ఎస్సై రాణాప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం..

తీగలవేణి గ్రామానికి చెందిన కందళం దేవేంద్రమ్మ-లింగాచారి (70) దంపతులకు బ్రహ్మాచారి, కృష్ణ, రమేష్ సంతానం. లింగాచారికి ఆరెకరాల వ్యవసాయ భూమి ఉంది. ముగ్గురు కుమారులకు సమానంగా ఆ భూవిని పంచి, ఇచ్చాడు. లింగాచారిలో వీరబ్రహ్మేంద్రస్వా మి దేవాలయంలో అర్చకుడిగా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. చిన్నకుమారుడు రమేష్ ఏం పనిచేయకుండా మద్యానికి బానిసై తండ్రి, సోదరులతో తరుచూ గొడవ పడుతుండేవాడు. మద్యం సేవించి వచ్చిన రమేష్ మద్యం మత్తులో లింగాచారి నిద్రిస్తుండగా రాయితో కొట్టి, చంపాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు బ్రహ్మాచారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాణాప్రతాప్ తెలిపారు.

నేడు, రేపు బ్రహ్మకుమారిల స్వర్ణోత్సవాలు

సుబేదారి, జనవరి 5: వరంగల్ కేంద్రంగా ఆధ్యాత్మిక సేవలు ప్రారంభించి 50 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా శని, ఆదివారం రెండు రోజుల పాటు బ్రహ్మకుమారీల ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో హనుమకొండ హంటర్‌రోడ్డులోని డి-కన్వెన్షన్ హాల్‌లో స్వర్ణోత్సవాలు నిర్వహించనున్నట్లు బ్రహ్మకుమారి శ్రీదేవి తెలిపారు. డి-కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీదేవి మాట్లాడుతూ.. ఈ స్వర్ణోత్సవాలకు ముఖ్య అతిథిగా మంత్రులు కొండా సురేఖ, సీతక్కలు హాజరవుతారని అలాగే ఉమ్మడి జిల్లాలో ఉన్న 12 నియోజకవర్గ ఎమ్మెల్యేలు పాల్గొంటారన్నారు. శనివారం ఉదయం అన్ని ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో ఒక కొత్త ఆరంభానికి సాకారాత్మక పరివర్తన అంశంపై ఆధ్యాత్మిక కార్యక్రమం, సాయంత్రం 4:30 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజుతో ఆరోగ్య ప్రసంగం, సామూహిక రాజయోగ ధ్యానం అనంతరం బహిరంగ సభ ఉంటుందన్నారు. 7వ తేదీ ఉదయం 6:30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర నుంచి వచ్చే సుమారు 4 వేల మంది బ్రహ్మకుమారీల సభ్యులతో ఆధ్యాత్మిక సమావేశం, సేవలు అందించిన వారికి సత్కారాలు ఉంటాయని తెలిపారు.

పాలిటెక్నిక్ రెండో సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సుబేదారి, జనవరి 5: ఐటీఐలో రెండేళ్ల వ్యవధిగల కోర్సుల్లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు పాలిటెక్నిక్‌లో రెండో సంవత్సరంలో ప్రవేశం కోసం బ్రిడ్జి కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలని వరంగల్ ప్రభుత్వ ఐటీఐ(బాలుర) ప్రిన్సిపాల్ ఎల్.జుమ్లానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జుమ్లా నాయక్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



బీకామ్ విద్యార్థులకు 3 మార్కులు

కేయూ క్యాంపస్, జనవరి 5: కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ బీకామ్ మూడో ఏడాది ఐదో సెమిస్టర్ ప్రశ్నపత్రం ఈ-కామర్స్ సబ్జెక్టులో ఒకే ప్రశ్న రెండుదఫాలుగా వచ్చిన అంశాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలికితీసిన నేపథ్యంలో వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారులు స్పందించారు. డిగ్రీ ఈ- కామర్స్ పరీక్షలకు హాజరైన విద్యార్థులందరికీ తప్పుడు ప్రశ్నకు అదనంగా 3 మార్కులను కేటాయిస్తామని ప్రకటించారు. జరిగిన తప్పిదంపై సంబంధిత అధికారులపై చర్యలుంటాయని తెలిపారు.

గురుకులంలో ప్రవేశ పరీక్ష

హనుమకొండ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : దేవన్న పేట ప్రభుత్వ గురుకులంలో 2024-25 విద్యా సంవత్సరానికిగాను 5వ తరగతి (ఇంగ్లీష్ మీడియం) ప్రవేశాలకు ఫిబ్రవరి 11న ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వ హించనున్నట్లు టీటీడబ్ల్యుయూఆర్‌జెసీ (బాలిక లు) హనుమకొండ ప్రిన్సిపాల్ ఆర్.విమల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈవిద్యా సంవత్సరంలో (2023-24) 4వ తరగతి చదువుతున్న అర్హులైన వారు ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ (ఆర్ఎస్) కింద ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో ఈనెల 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అంతా ఆయనే..

హాస్టల్స్ బిల్లుల చెల్లింపుల్లో ఎ.ఆర్. కిష్టయ్యపై పలు ఆరోపణలు


ఏసీబీ ట్రాప్‌తో బెంబేలెత్తుతున్న కేయూ ఉద్యోగులు

గతంలో పరీక్షల విభాగంపై పోలీసుల విచారణ

కేయూ క్యాంపస్, జనవరి 5: కాకతీయ యూనివర్సిటీలో ఏసీబీ దాడులతో అవినీతి ఉద్యోగుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. వర్సిటీ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో శుక్రవారం అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎస్.కిష్టయ్య పట్టుకోవడంతో వర్సిటీలో కలకలం రేగింది. గతంలో పరీక్షల విభాగంలో సర్టిఫికెట్ల జారీలో అక్రమాలు జరిగాయనే ఫిర్యాదులు పెద్ద ఎత్తున రాష్ట్ర ప్రభుత్వానికి అందాయి. దీంతో అప్పటి కాజీపేట ఏసీపీ కోయ ప్రవీణ్‌కుమార్ ప్రత్యేక విచారణ అధికారిగా నియమించి సర్టిఫికెట్ల జారీ, పరీక్షల విభాగంలో చోటు చేసుకున్న అక్రమాల దందాలను బయటికి తీశారు. తర్వాత అప్పటి పరీక్షల నియంత్రణాధికారులపై కేసులు నమోదు చేసిన విచారణ చేపట్టారు. అయితే అప్పటి కేసు అతీగతి లేకుండా పక్కన పెట్టారు. ఇదిలా ఉండగా, వర్సిటీలో తాజాగా పి.రాజేందర్ అనే పాలు, పెరుగు కాంట్రాక్టర్ ఫిర్యాదుతో ఏసీబీ పోలీసులు వలపన్ని కిష్టయ్యను పట్టుకున్నారు.

ఆది నుంచి వివాదాస్పదుడే..

ఏఆర్ కిష్టయ్య ఆది నుంచి వివాదాస్పదుడనే ఆరోపణలున్నాయి. సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాలలో ఎక్కువ కాలం అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించారు. అక్కడ పలు అక్రమాలకు పాల్పడ్డారనే ఫిర్యాదులు రావడంతో వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ఆదేశాల మేరకు అప్పటి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.వెంకట్రామిరెడ్డి ఇద్దరు అసిస్టెంట్ రిజిస్ట్రార్లతో విచారణ కమిటీని నియమించారు. అయితే విచారణ కమిటీ ఇప్పటి వరకు రిపోర్టు ఇవ్వలేదు.



అవినీతి ఆరోపణలపై కమిటీ విచారణను ఎదుర్కొంటున్న కిష్టయ్యను వర్సిటీలోని కీలకమైన పదవిలో నియమించి అవినీతికి ఊతం ఇచ్చారనే చర్చలు జరుగుగుతున్నాయి. ఈయన హాస్టల్స్ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా, అడిట్ అధికారిగా రెండు పదవుల్లో కొనసాగుతున్నారు. హాస్టల్స్ కార్యాలయంలో బిల్లులను స్వయంగా తయారు చేసి, ఆయనే చెల్లించే వెలుసుబాటు ఉంది. అందుకే కాంట్రాక్టర్లను డబ్బులు అడిగారనే ఆరోపణలున్నాయి. ఒకే అధికారి బిల్లు రూపొందించే పదవిలో కొనసాగుతూ అదే బిల్లును చెల్లింపు చేసే అధికారం కల్పించడంతోనే అవినీతికి బీజం పడిందని తెలుస్తోంది.

ఫోన్ రికార్డులు లీక్

ఏసీబీ అధికారులకు చిక్కిన కేయూ అడిట్ ఆఫీసర్ కిష్టయ్య కాంట్రాక్టర్ పి.రాజేందర్‌తో జరిపిన ఫోన్ రికార్డులు వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్నాయి. కాంట్రాక్టర్ రాజేందర్‌తో పాటు ఇతర సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్ల నుంచి లంచాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఏసీబీ అధికారులకు కిష్టయ్య బాధితుడు ఫోన్ రికార్డులను కూడా అందచేశారు.

వర్సిటీ ఉద్యోగుల గుండెల్లో రైళ్లు

వర్సిటీలో కొందరు ఉద్యోగుల అవినీతికి అడ్డూ అదుపూ లేదు. నేరుగా కళాశాలల అధికారులు డబ్బులు వసూలు చేసుకుంటున్నారని తెలుస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి వచ్చే కళాశాలల ప్రిన్సిపాల్‌తోపాటు ప్రయివేటు కళాశాలల యాజమాన్యాల నుంచి విచ్చలవిడిగా లంచాలు తింటున్నారనే ఆరోపణలున్నాయి. డబ్బులు చెల్లించని కళాశాలలకు నిబంధనల పేరుతో అనుమతులను ఆపేస్తారనే అపవాదులున్నాయి డబ్బులిస్తే అన్ని ఆల్‌రైట్ అనే చర్చ జరుగుతోంది. కళాశాలల తనిఖీల పేరుతో వర్సిటీ ఉన్నతాధికారులకు నచ్చిన అధికారులను బృందాలుగా ఏర్పాటు చేసుకుని వాటాలు పంచుకుంటున్నారని తెలుస్తోంది. పరీక్షల విభాగంలో విద్యార్థుల నుంచి సర్టిఫికెట్ల నుంచి మొదలుకుని ఇతర పనులన్నింటికీ డబ్బులు వసూలు చేస్తారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

అందుబాటులో ఉండి సేవ చేస్తా..

నియోజకవర్గంలో ప్రతీ ఎకరాకు సాగు నీరు అందిస్తా.. : రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

ఎల్కతుర్తి, జనవరి 5: మంత్రి పదవి హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు తనకు ఇచ్చిన గౌరవమని, అన్ని వేళలా అందుబాటులో ఉంటూ సేవ చేసుకుంటానని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఎల్కతుర్తి మండల కేంద్రానికి మంత్రి పొన్నం మొదటి సారి రాగా, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో మండల కేంద్రానికి చేరుకున్నారు. బస్టాండ్ కూడలి వద్ద మంత్రికి పూలమాలలు వేసి బాణాసంచా పేల్చుతూ స్వాగతం పలికారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిరు వ్యాపారులను కలుస్తూ ఆప్యాయంగా పలకరించారు. మంత్రితో సెల్ఫీ తీసుకుంటూ ప్రజలు సందడి చేశారు. అనంతరం ఎస్ఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో గ్రామాల వారీగా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గ్రామాల్లో అనేక సమస్యలు నెలకొన్నాయన్నారు. వాటి పరిష్కారానికి గ్రామాల్లో ఎన్నికల సమయంలో ఏ విధంగా పర్యటించానో ఆదే విధంగా వచ్చి దశల వారీగా సమస్యలను పరిష్కరిస్తానన్నారు. హుస్నాబాద్ నియోజకపరిధిలో ఉన్న ప్రాజెక్టుల ద్వారా ప్రతీ ఎకరాకు సాగు నీరు అందించే విధంగా చర్యలు చేపడుతానని హామీ ఇచ్చారు. గౌరవెల్లి, వరద కాలువ ఫేస్ - 2, శ్రీరాం సాగర్, దేవాదుల కాలువల ద్వారా ఎంత వీలైతే అంత ఎక్కువగా సాగు నీరు అందించేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో అనారోగ్యం బారిన పడిన వ్యక్తులకు ఆస్పత్రుల్లో నాణ్యమైన చికిత్స అందించడానికి నియోజక వర్గంలో ప్రత్యేక వ్యక్తిని ఏర్పాటు చేసినట్లుగా తెలిపారు. రోడ్లు, కుల సంఘాలు, తాగునీటి సమస్యలు, బస్సుల కొరత వంటి సమస్యల తీవ్రతను బట్టి పరిష్కారానికి ముందుకు తీసుకెళ్లతానని హామీ ఇచ్చారు. భారీ మోజారిటీతో గెలిపించి తనకు రాష్ట్ర కేబినెట్‌లో స్థానం కలుగడానికి కృషి చేసిన ప్రజలందరికీ రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, టీపీసీసీ సభ్యులు బొమ్మనపెల్లి అశోక్‌రెడ్డి, సర్పంచ్‌లు చల్లా మల్లారెడ్డి, రవిందర్‌రెడ్డి, రాము, నాయకులు గొలి రాజేశ్వర్ రావు, సంతాజీ, రమేష్, అక్తర్, మహేందర్, శ్రీకాంత్, రాజు, నవీన్, సంపత్, గంగాధర్, శ్రీధర్, వెంకటేష్, స్వరూప, సుష్మ, తోకల శ్రీనివాస్, పున్నం పాల్గన్నారు.


ఎల్కతుర్తిలో కార్యకర్తలతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్


మంత్రికి పూలమాల వేస్తున్న నాయకులు

వినతుల వెల్లువ

మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో దశాబ్దాలుగా నెలకొన్న సమస్యలపై గ్రామస్థులు, కార్యకర్తలు వినతి పత్రాలను మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అందజేశారు. గ్రామాల్లో రోడ్లు, కమ్యూనిటీ భవనాలు లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని నాయకులు వాపోయారు. రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు. మండల కేంద్రంలో ప్రభుత్వ భూమిలో ఏర్పాటుచేసుకున్న నివాసాలకు విద్యుత్, డ్రెయినేజీ సౌకర్యం కల్పించాలని కాలనీవాసులు విన్నవించుకున్నారు. మోడల్ పాఠశాల విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని పాఠశాల ఉపాధ్యాయులు వినతి పత్రాన్ని అందజేశారు.

ఆంధ్రజ్యోతి HANUMAKONDA CITY
శనివారం 6 జనవరి 2024
హనుమకొండ సిటీ
• హనుమకొండ • కాజీపేట • హసన్‌పర్తి • ఐనవోలు • ధర్మసాగర్ • వేలేరు



రామాలయ అంక్షితల శోభయాత్ర

ఐనవోలు, జనవరి 5: అయోధ్య రాములవారి అక్షింతల శోభయాత్ర శుక్రవారం ఐనవోలులో కొనసాగింది. డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎంపీపీ మార్నేని మధుమతి, బీజేపీ జిల్లా కోశాధికారి బొల్లేపల్లి మహేష్‌గౌడ్, గౌడ సంఘం నాయకుడు కోట నర్సయ్యగౌడ్, మాజీ దేవస్థానం చైర్మన్‌లు మునిగాల సంపత్‌కుమార్, వడిచర్ల శ్రీనివాస్, ఉపసర్పంచ్ అడ్డగూడి సతీష్, పట్టాపురం ఎల్లగౌడ్, పరమేష్ గౌడ్‌తోపాటు గ్రామ పురప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.



శోభయాత్రలో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ గ్రామ పుర ప్రముఖులు

పార్లమెంట్ ఎన్నికలను సమన్వయంతో నిర్వహించాలి

కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ రూరల్, జనవరి 5: రాష్ట్ర సాధారణ ఎన్నికలను జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించామని, అదే విధంగా రానున్న పార్లమెంట్ ఎన్నికలను కూడా సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఇంటెలిజెన్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. హనుమకొండ జిల్లా పరిధిలోని రెండు నియోజకవర్గాలైన పరకాల, వరంగల్ పశ్చిమ శాసనసభ స్థానాల పరిధిలో ఉన్న సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలను అందజేయాలన్నారు. సెక్టార్ పోలీస్ అధికారుల నియామకం త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. గతంలో ఎన్నికల సమయంలో ఎన్ని కేసులు నమోదు అయ్యాయని, వాటి వివరాలు అందజేయాలన్నారు. పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల సమయంలో ఎంత నగదు, మద్యం, ఆభరణాల సీజ్ వివరాలను వెంటనే అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

అనంతరం సీపీ అంబర్ కిశోర్‌ఝా మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో శాంతి భద్రతల నిర్వహణ ఎంతో కీలకమన్నారు. ఎన్నికల ఏర్పాట్లను చేయడంలో రెవెన్యూ, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు శాఖల బాధ్యతలు అత్యంత కీలకంగా ఉంటాయని తెలిపారు. గత ఎన్నికల్లో వివిధ శాఖల సమన్వయంతో ఎన్నికల విజయవంతానికి కృషి చేశారని, రాబోయే ఎన్నికలను అదే విధంగా సమన్వయంతో విజయవంతం చేయాలని ఆదేశించారు. గత ఆరు నెలల నుంచి బ్యాంకుల్లో ఎక్కువగా నగదు లావాదేవీలు జరిగిన వివరాలు, ఎక్కువ మొత్తంలో జరిగిన ఆన్‌లైన్ చెల్లింపులను అధికారులు పరిశీలించాలన్నారు.

ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ ఎం.ఎ.బారీ, ఏసీపీలు జితేందర్‌రెడ్డి, కిరణ్ కుమార్, కిశోర్ కుమార్, ఆర్‌డీవో ఎల్.రమేశ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, జిల్లా సహకార అధికారి జి.నాగేశ్వర్‌రావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

ఆన్‌లైన్‌లో ప్రజాపాలన దరఖాస్తులు పకడ్బందీగా నమోదు చేయాలి

హనుమకొండ రూరల్ : ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల డేటాను సరైన విధంగా ఆన్‌లైన్‌లో పకడ్బందీగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తుల డేటాపై వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లకు జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసేటప్పుడు దరఖాస్తుదారు పేరు, ఏ పథకానికి దరఖాస్తు చేసుకున్నారు, రేషన్, ఆధార్‌కార్డుల వివరాలను, దరఖాస్తులో నమోదు చేసిన ఇతర సమాచారాన్ని పక్కాగా నమోదు చేయాలన్నారు. దరఖాస్తుదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసే డేటాతోనే ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందుతాయి కాబట్టి ఆన్‌లైన్‌లో నమోదు చేసేటప్పుడు ఆపరేటర్లు చాలా జాగ్రత్త వహించాలన్నారు. దరఖాస్తు పారాలను సైతం భద్రంగా ఉంచాలని సూచించారు. హైదరాబాద్‌లో శిక్షణ పొందిన ఐదుగురు ఆపరేటర్లు ప్రజాపాలన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను ఏ విధంగా ప్రజాపాలన వెబ్‌సైట్‌లో నమోదు చేయాలనే అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఆపరేటర్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, డీఆర్‌డీవో శ్రీనివాస్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, జడ్పీ సీఈవో వెంకటేశ్వర్‌రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామసభలను సందర్శించిన కలెక్టర్

ఐనవోలు : శుక్రవారం మండలంలోని నర్సింహులగూడెం, ముల్కలగూడెం గ్రామాల్లో జరిగిన ప్రజాపాలన గ్రామసభలను కలెక్టర్ సిక్తాపట్నాయక్ సందర్శించి తనిఖీ చేశారు. ఎన్ని కుటుంబాలు ఉన్నాయి? ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ఎన్ని కౌంటర్లు పెట్టారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? ఉంటే ఎలాంటివని ఆరా తీశారు. గ్రామాల్లో ప్రజలు గడువులోగా దరఖాస్తులు చేసుకునేవిధంగా చూడాలని తెలిపారు. గ్రామాల నుంచి స్వీకరించిన దరఖాస్తుల వివరాలను సకాలంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కంప్యూటర్ ఆపరేటర్లను ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారి డీసీవో నాగేశ్వర్‌రావు, తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎంపీడీవో వెంకటరమణ, ఎంపీవో రఘుపతిరెడ్డి, సర్పంచ్‌లు కట్కూరి సునిత, బండి పర్వతాలు, ఎంపీటీసీ పొలేపల్లి సరితశంకర్‌రెడ్డి, ఆర్‌ఐ మల్లయ్య, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పుట్టిన ఊరి రుణం తీర్చుకుంటా..

▸▸ సీతక్కకు స్వగ్రామంలో ఘన స్వాగతం



సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు, జనవరి 5: తనకు జన్మనిచ్చి ఎదుగుదలకు ఊతమిచ్చిన జగ్గన్నపేట గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటానని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) అన్నారు. రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి శుక్రవారం ములుగు మండలంలోని స్వగ్రామానికి వెళ్లారు. అభిమాన నాయకురాలికి గ్రామస్తులు ఎదురేగి స్వాగతం పలికారు. ఆరాధ్య దైవమైన పుట్టమల్లన్నను దర్శించుకున్న సీతక్క నేరుగా తన ఇంటికి వెళ్లి తల్లిదండ్రులు సమ్మక్క-సమ్మయ్యల ఆశీర్వాదం తీసుకున్నారు. తన సోదరుడు సాంబయ్య సమాధిని సందర్శించి నివాళులు అర్పించారు. ఆతర్వాత గ్రామస్థులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన సభలో సీతక్క పాల్గొన్నారు. పూలమాలలు శాలువాలతో సీతక్కను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. చిన్ననాటి స్నేహితులు, ఆత్మీయులను సీతక్క పలకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తాను మంత్రిగా ఎదిగినా ఎప్పుడూ మీ ఆడబిడ్డనేనని అన్నారు. మీరు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా జగ్గన్నపేట గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కూచన రవళిరెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సూర్య, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపెల్లి రాజేందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రేగ కళ్యాణి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లాడి రాంరెడ్డి, పార్టీ ములుగు మండల అధ్యక్షుడు ఎమ్డీ.చాంద్‌పాషా, జగ్గన్నపేట ఉపసర్పంచ్ సదానందం, నాయకులు నూనేటి శ్యామ్, అర్రెం వెంకన్న, ఇర్సవడ్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడిలో డీపీఎస్ విద్యార్థుల ప్రతిభ

ధర్మసాగర్, జనవరి 5: 13వ క్రిష్ణరంగ్ మహోత్సవంలో భాగంగా ఇటర్నేషనల్ మల్టీ లింగ్వల్‌ప్లే డాన్స్, నృత్యం, మ్యూజిక్ పోటీలలో డీపీఎస్ పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించినట్లు పాఠశాల చైర్మన్ రవికిరణ్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. గతనెల ఉత్తర ప్రదేశ్‌లోని మధురలో నిర్వహించిన ఈ పోటీలలో భరత నాట్యం జూనియర్ విభాగంలో సనయ కృతి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుందన్నారు. కూచిపూడి జూనియర్ విభాగంలో కె.సమీక్షారెడ్డి, జి.కృతివెన్య ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. కూచిపూడి సూపర్ జూనియర్ విభాగంలో ఎం.జస్నిక తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుందని తెలిపారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ రవికిరణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మంజుమోల్ శివశంకర్, వైస్ ప్రిన్సిపాల్ కిరణ్మయి, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న డీపీఎస్ చైర్మన్, ప్రిన్సిపాల్

భారత జాగృతిలో పలువురి చేరిక

వడ్డెపల్లి, జనవరి 5: భారతీయ జనతా యువ మోర్చ (బీజేవైఎం) రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ కల్లూరి పవన్, 53వ డివిజన్ బీజేవైఎం సెక్రటరి ధీరజ్ భారత జాగృతి సంస్థలో చేరారు. భారత జాగృతి వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత ఆదేశం మేరకు భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్ భాస్కర్ వారికి తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సంస్థలో చేర్చుకున్నారు. కల్లూరి పవన్‌కు భారత జాగృతి జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో భారత జాగృతి జిల్లా అధ్యక్షుడు మూల రాముగౌడ్, 53వ డివిజన్ కార్పొరేటర్ సోదా కిరణ్, బీఆర్ఎస్ డివిజన్ సెక్రటరి విజయ్‌కుమార్, యూత్ సెక్రటరి దామెర అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



కల్లూరి పవన్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న జాగృతి రాష్ట్ర నేత దాస్యం విజయ్ భాస్కర్

ప్రజా పాలన నిరంతర ప్రక్రియ

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

హసన్‌పర్తి, జనవరి 5: ప్రజా పాలన నిరంతర ప్రక్రియ అని, ప్రజలు ఆగం కావొద్దని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. శుక్రవారం హసన్‌పర్తి మండల కేంద్రంలోని ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసి, ప్రజలకు సలహాలు, సూచనలు ఇస్తూ దరఖాస్తులను స్వీకరించాలని అధికారులకు సూచించారు. అవసరమైతే ప్రభుత్వం కొద్ది రోజులు ఈ కార్యక్రమాన్ని పొడిగిస్తుందన్నారు.

విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు నోట్‌బుక్స్, పరీక్షాప్యాడ్స్, పెన్నులు, కంపాస్ బాక్స్‌లను పంపిణీ చేశారు. విద్యార్థులు పరీక్షల్లో మంచి జీపీఏను సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు, ప్రఖ్యాతులు తీసుకరావాలన్నారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

ఎర్రగట్టుగుట్ట వద్ద ఏర్పాటు చేసిన దేవాన్షిక మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే నాగరాజు ప్రారంభించారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం టీఎస్‌ఎన్‌పీడీసీఎల్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి రౌతు రమేశ్‌కుమార్ భారత రాజ్యాంగం పుస్తకాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ కార్యక్రమంలో 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తంగెళ్ళపెల్లి తిరుపతి, డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, నాయకులు బల్సుకూరి శ్రీనివాస్, దూడల ప్రకాశ్, నన్నంశెట్టి స్వామి, నన్నంశెట్టి రుషికుమార్, పెంబర్తి సర్పంచ్ జోరుక పూల తదితరులు పాల్గొన్నారు.



హసన్‌పర్తి ప్రజా పాలనలో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

నాయీ బ్రాహ్మణులకు ఉచిత కరెంటు సబ్సిడీని కొనసాగిస్తాం

▸▸ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

వడ్డెపల్లి, జనవరి 5: గత ప్రభుత్వం ఇచ్చిన మాదిరిగానే తమ ప్రభుత్వం నాయీ బ్రాహ్మణులు, రజకులకు ఉచిత కరెంటు సబ్సిడీని యథావిధిగా కొనసాగిస్తామని రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో నాయీ బ్రాహ్మణ యువసేన జిల్లా అధ్యక్షుడు సింగారపు శ్యామ్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలిపాక సతీష్‌లు మంత్రి ప్రభాకర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువా కప్పి ఘనంగా సత్కరించి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ.. నాయీ బ్రాహ్మణుల సెలూన్లకు, దోబీ ఘాట్లకు 250 యూనిట్ల ఉచిత కరెంటు సబ్సిడీ ఇచ్చేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. మంత్రి ప్రకటన పట్ల నాయీ బ్రాహ్మణుల సంఘం నేతలు హర్షం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో నాయీ బ్రాహ్మణుల సంఘం నేతలు సూత్రపు కిరణ్, మొగిలిచర్ల ప్రసాద్, చందర్లపాటి మణికుమార్, పుట్టపాక పవన్ తదితరులు ఉన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘం నేతలు

ఇంటింటికీ శ్రీరామ అక్షింతల పంపిణీ



గాంధీ నగర్‌లో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

వడ్డెపల్లి, జనవరి 5 : గ్రేటర్ వరంగల్ 57వ డివిజన్ గాంధీ నగర్‌లోని శ్రీరాముడి భక్తులు శుక్రవారం నగర సంకీర్తన, శోభాయాత్రను భక్తి శ్రద్ధలతో నయనానంద కరంగా నిర్వహించారు. మేళ తాళాలు, కుంకుభరణిలతో మహిళలు ఇంటింటికీ వెళ్లి అయోధ్య రామ మందిరం నుంచి తీసుకొచ్చిన అక్షింతలను పంపిణీ చేశారు. శ్రీరాముడి నామ స్మరణతో గాంధీనగర్ మార్మోగింది. తొలుత గాంధీ నగర్‌లోని హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ బొంగు రాజు, గాంధీ నగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెరుకు వెంకటరాజిరెడ్డి, ప్రతినిధులు మాడిశెట్టి వీరేందర్, మాదాడి రాజిరెడ్డి, చిట్టిరెడ్డి తిరుపతిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, గందె కృష్ణమూర్తి, మహేందర్, డిల్లీ కమలాకర్‌రావు, రజినీకర్, నంగునూరు రాజేష్, రామకృష్ణ, రాంబాబుతోపాటు పూజారి సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, పార్కింగ్ స్థలాల పనులు త్వరగా పూర్తి చేయాలి

▸▸ ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశం

మేడారం, జనవరి 5: మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర కోసం చేపట్టిన రోడ్లు, పార్కింగ్ స్థలాల పనులను ఫిబ్రవరి 1వ తేదీ లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. శుక్రవారం తాడ్వాయి మండలంలోని మేడారం పరిసరాల్లో కొనసాగుతున్న పనులను ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. పస్రా-మేడారం, మేడారం-భూపాలపల్లి, తాడ్వాయి-మేడారం రూట్లలో చేపట్టిన రోడ్ల మరమ్మతులను స్వయంగా పరిశీలించారు. ఆయా చోట్ల ఏర్పాటు చేస్తున్న పార్కింగ్ ప్రదేశాలు, చిలుకలగుట్ట, జంపన్నవాగు ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న పార్కింగ్ ప్రదేశాలను కలెక్టర్ పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. జంపన్న వాగుపై ఊరట్టం వద్ద నిర్మిస్తున్న కాజ్‌వే పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. మేడారం, ఊరట్టంలోని గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో జాతర విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి వసతి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్, ఏపీవో వసంతరావు, ఈఈ ప్రేమలత, పీఆర్ ఈఈ అజయ్‌కుమార్, ఆయా ఇంజనీరింగ్ శాఖల డీఈలు రఘువీర్, చందర్, రవీందర్, స్టాటిస్టిక్ అధికారి రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ పార్టీని వీడేది లేదు..



సమావేశంలో మాట్లాడుతున్న పున్నంచందర్

హనుమకొండ క్రైం, జనవరి 5: బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎంత మంది ఇతర పార్టీలకు వెళ్లిపోయినా భయపడేది లేదని, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌తోనే తమ ప్రయాణం అని బీఆర్ఎస్ 5వ డివిజన్ అధ్యక్షుడు బొల్లంపెల్లి పున్నంచందర్ అన్నారు. శుక్రవారం డివిజన్‌లోని దాసరివాడలో బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పున్నంచందర్ మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలోనే డివిజన్ అభివృద్ధి జరిగిందన్నారు. కొందరు అవకాశవాదులు వారి స్వార్థం కోసం అమ్మలాంటి పార్టీని వీడి కాంగ్రెస్‌లో కలుస్తున్నారని, వారి ఎత్తులకు భయపడేది లేదన్నారు. బీఆర్ఎస్‌ను వీడిన వారు చరిత్రహీనులుగా మిగిలిపోతారని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో నాయకులు సాయి. రవి, రఘు, సమ్మన్న, బింగి శ్రీనివాస్, సోమేశ్వర్, విశాల్, మహేశ్, నారాయణగిరి రాజు, జనార్ధన్, ప్రవళిక పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్

కాజీపేట, జనవరి 5: కాజీపేట బాపూజీనగర్‌లో శుక్రవారం తేజోమై మాల కులసంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి 47వ డివిజన్ కార్పొరేటర్ సంకు నర్సింగరావు హాజరై క్యాలెండర్ ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు మర్యాల కృష్ణ, ప్రధాన కార్యదర్శి బండి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ కోశాధికారి పప్పుల గోవర్ధన్, నాయకులు తండమల్ల వేణు, కొత్త రవి, కాందారి రాజమౌళి, మైలారం శంకర్, బండి రాజేందర్, బొట్టు రాజు, శేఖర్, రాజ్‌కుమార్‌తో పాటు స్థానికులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ రాధిక గుప్తాను కలిసిన ఐఎంఏ కార్యవర్గం



అదనపు కలెక్టర్ రాధిక గుప్తాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఐఎంఏ కార్యవర్గ సభ్యులు

హనుమకొండ అర్బన్, జన వరి 5: ఇటీవల నూతనంగా ఎన్నికైన ఐఎంఏ కార్యవర్గ సభ్యు లు హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తాను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఐనవోలు జాతరలో భక్తులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించాలని కోరారు. ఈనెల 12 నుంచి 16 వరకు ఐనవోలు జాతరలో స్పెషలిస్టు వైద్యులతో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మహ్మద్ అన్వర్, డాక్టర్ బింగి శ్రీనివాస్, కోశాధికారి డాక్టర్ శ్రావణ్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ నరేశ్ కుమార్‌తోపాటు డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

మరో రెండు కొవిడ్ కేసులు నమోదు

హనుమకొండ అర్బన్, జనవరి 5: ఎంజీఎం ఆస్పత్రిలో శుక్రవారం మరో రెండు కొవిడ్ కేసులు నిర్ధారణ అయ్యాయి. 34 మంది రోగుల నుంచి నమూనాలను సేకరించగా ఇద్దరికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. వీరు కొవిడ్‌తో వార్డులో చికిత్స పొందుతున్నారని ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్ తెలిపారు.

ఎంజీఎం ఆస్పత్రి సందర్శన

హనుమకొండ అర్బన్, జనవరి 5: ఎంజీఎం హాస్పిటల్‌లోని బీటీ రోడ్లు, పార్కింగ్ ప్రాంతాలను అటవీశాఖ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు ఓఎస్‌డీ టి.కృష్ణ శుక్రవారం పరిశీలించారు. ఎంజీఎం ఆస్పత్రిలో గార్డెనింగ్‌తోపాటు వివిధ అభివృద్ధి పనులను పరిశీలించి సమగ్ర నివేదికను మంత్రికి అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏ.ప్రసాద్, డాక్టర్ అభి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రిని సందర్శిస్తున్న టి.కృష్ణ

పక్షుల మనుగడే మానవాళి మనుగడ


సుబేదారి, జనవరి 5: పక్షుల మనుగడే మానవాళి మనుగడ అని పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక అధ్యక్షుడు కాజీపేట పురుషోత్తం అన్నారు. హనుమకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో పక్షి జాతిని కాపాడుకుందాం- పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం అనే అంశంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ.. పక్షులను కాపాడుకుందామన్నారు. ఈ సదస్సులో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ బాబు, వైల్డ్ లైఫ్ సొసైటీ అధ్యక్షులు ఇందారపు నాగేశ్వర్‌రావు, ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి టి. శ్రవణ్ కుమార్, కోశాధికారి నల్లెల రాజయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పురుషోత్తం

వ్యక్తి ఆత్మహత్య

కాజీపేట, జనవరి 5: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పా ల్పడ్డాడు.. కాజీపేట ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు తెలిపిన వివరాలు ఉన్నాయి.. కాజీపేట దర్గాకి చెందిన ఎస్.కె. యాకూబ్(42) సుబేదారిలో ఓ కార్ వాషింగ్ సెంటర్ లో పని చేస్తుంటాడు. యాకూబ్ ఇల్లు కట్టుకోవడానికి ఓ ప్రైవేట్ ఫైనాన్స్‌లో లోన్ తీసకున్నాడు.. లోన్ కట్టకుండా పెండింగ్ ఉండటం ఓ వైపు, ఆర్థిక ఇబ్బంది లు మరో వైపు ఉండటంతో తీవ్ర మనస్తాపానికి గురై శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య షేక్‌ఫైసిన్ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎం తరలించామని, భార్య షేక్ ఫైసిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



బలాన్నిచ్చే... ప్రొటీన్ ఫుడ్

తినే తిండి బలాన్ని ఇవ్వకపోతే ఉపయోగమే లేదు. అందుకే తరచుగా ప్రొటీన్ ఫుడ్ తీసుకోమంటారు వైద్యులు. కండ కలగాలంటే.. శరీరం గట్టిగా ఉండాలంటే ప్రొటీన్లుండే ఆహారాన్ని తీసుకోవాల్సిందే. పిండి చోలె, ఓట్స్ ఆమ్లెట్, కజ్జు సోయాలాంటి రుచికరమైన ప్రొటీన్ వంటకాలను సులువుగా చేసుకోండిలా..

పిండి చోలె

కావాల్సిన పదార్థాలు

తెల్ల శనగలు- కప్పు, టీబ్యాగ్స్-2, దాల్చిన చెక్క-1, బిర్యానీ ఆకులు- 2, యాలకులు-6, లవంగాలు-5, బేకింగ్ సోడా- పావు టీస్పూన్, ఉప్పు- అర టీస్పూన్, జీరా- అర టీస్పూన్, ధనియాలు- టీస్పూన్, సాజీరా- పావు టీస్పూన్, యాలకులు- పావు టీస్పూన్, సోంపు- పావు టీస్పూన్, కసూరి మేథి- 1 టీ స్పూన్, ఎండు మిరపకాయలు-3, ఆమ్‌చూర్- పావు టీస్పూన్, పసుపు- కొద్దిగా, నూనె- మూడు టీస్పూన్లు, ఉల్లిపాయ-1 (సన్నగా తరగాలి), అల్లం, వెల్లుల్లి పేస్ట్- 1 టీస్పూన్, పచ్చిమిర్చి-2, టొమాటోలు- 2 (చిన్న ముక్కలుగా తరగాలి),



తయారీ విధానం

బౌల్‌లో శనగలు వేశాక నీళ్లు వేసి రాత్రంతా కనీసం ఎనిమిది గంటలపాటు నానబెట్టాలి. వంట చేసేప్పుడు నీళ్లను తీసేసి నానబెట్టిన శనగలను కుక్కర్‌లో వేయాలి. అందులో రెండు చిన్న టీబ్యాగ్స్, దాల్చిన చెక్క, ఒక బిర్యానీ ఆకు, మూడు యాలకులు, మూడు లవంగాలు, బేకింగ్ సోడా, ఉప్పు వేసిన తర్వాత మూడు కప్పుల నీళ్లు పోసి కుక్కర్‌పై మూత పెట్టాలి. ఐదు విజిల్స్ వచ్చేంత వరకూ ఉండాలి. ఆ తర్వాత కుక్కర్ మూత తీసి టీబ్యాగ్స్ తీసేయాలి.

ప్యాన్‌లో జీరా, ధనియాలు, సాజీరా, యాలకులు, సోంపు, మూడు లవంగాలు, రెండు యాలకులు, ఎండు మిరపకాయలు వేశాక లోఫ్లేమ్‌లో రోస్ట్ చేసుకోవాలి. మంచివాసన వస్తుంది. దీన్ని చల్లార్చి మిక్సీ పట్టుకోవాలి. మరో ప్యాన్ తీసుకుని అందులో మసాలా మిశ్రమంతో పాటు పసుపు, ఆమ్‌చూర్ వేసి కలిపి పక్కన ఉంచుకోవాలి. అదే ప్యాన్‌లో నూనె వేశాక బిర్యానీ ఆకు, ఉల్లిపాయ ముక్కలు వేసి రంగు మారేంత వరకూ కలపాలి. అల్లం- వెల్లుల్లి పేస్ట్, పచ్చిమిర్చి వేసి బాగా రెండు నిముషాల పాటు కలిపి మసాలా పౌడర్ వేసి బాగా కలిపాక టమోటా ముక్కలు వేయాలి. గరిటెతో కదుపుతూ ఉంటే నూనె పైకి తేలినట్లు ఉంటే బాగా వేగినట్లు. వెంటనే కుక్కర్‌లోని శనగల మిశ్రమం వేసి ఉప్పును చెక్ చేసుకోవాలి. లేకుంటే సరిపడినంత ఉప్పు వేయాలి. మిశ్రమాన్ని కలిపి ప్యాన్ మూత మూసేసి పదిహేను నిముషాల పాటు లోఫ్లేమ్‌లో కుక్ చేయాలి. మాష్ చేసినట్లు గరిటెతో కదపాలి. కొత్తిమీరతో సర్వ్ చేసుకుని దింపిన తర్వాత.. పూరీ, దోశ, చపాతీ, పరోటాల్లో తినాలి.

ఓట్స్ ఆమ్లెట్

కావాల్సిన పదార్థాలు

ఓట్స్- పావు కప్పు, పాలు- అరకప్పు, కోడిగుడ్లు-2, ఉప్పు- తగినంత, పసుపు- పావు టీస్పూన్, బ్లాక్ పెప్పర్- అర టీస్పూన్, పింక్ హిమాలయన్ సాల్ట్- కొద్దిగా, క్యాప్సికమ్ ముక్కలు- 2 టేబుల్ స్పూన్లు, టొమాటో- 1 (చిన్నది), ఉల్లిపాయ ముక్కలు- 2 టేబుల్ స్పూన్లు, క్యారెట్ ముక్కలు- 2 టేబుల్ స్పూన్లు, కొత్తిమీర- టీస్పూన్, మునగాకు- 2 టేబుల్ స్పూన్లు, నూనె- 2 టేబుల్ స్పూన్లు,

తయారీ విధానం

ప్యాన్‌లో ఓట్స్ వేసి లోఫ్లేలో వేయించాలి. వీటిలో ఫైబర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. ఇక రంగుమారిన తర్వాత ఓట్స్‌ను ఇంకో ప్లేట్‌లోకి తీసుకుని చల్లబర్చాలి. ఆ తర్వాత మిక్సీ పట్టి మెత్తటి పిండిలా చేసుకున్న తర్వాత పాలను కొద్ది కొద్దిగా పోస్తూ స్పూన్‌తో కలపాలి. ఐదు నిముషాల పాటు అలానే ఉంచాలి.

బౌల్‌లో రెండు కోడిగుడ్ల సొన తీసుకున్న తర్వాత తగినంత ఉప్పు, పసుపు బ్లాక్ పెప్పర్ వేశాక ఫోర్క్ సాయంతో గిలక్కొట్టినట్లు వేగంగా మిశ్రమాన్ని కలిపితే బుడగల్లా వస్తుంది. ఆ తర్వాత ఓట్స్ పిండి మిశ్రమంలో హిమాలయన్ సాల్ట్ వేసి కలిపాక క్యాప్సికమ్ ముక్కలు, టమోటా ముక్కలు, క్యారెట్ ముక్కలు, కొత్తిమీర, ఉల్లిపాయ ముక్కలు వేశాక మునగాకును తుంచి వేయాలి. ఈ మిశ్రమాన్నంతా బాగా కలపాలి. అవసరం అనుకుంటే మష్రూమ్ ముక్కలను కూడా వేసుకోవచ్చు. ఓట్స్ మిశ్రమంలోకి కోడిగుడ్ల సొన వేసి మిశ్రమాన్ని బాగా కలపాలి. చివరగా ప్యాన్‌మీద నూనె వేసిన తర్వాత ప్యాన్ అడుగంతా కదిలేట్లు తిప్పిన తర్వాత ఆమ్లెట్ వేసుకోవాలి. దోశలా రెండు వైపులా కాల్చుకోవాలి. ఈ ఆమ్లెట్‌లో ఫైబర్‌తో పాటు ప్రొటీన్లు ఉండటం వల్ల బరువు తగ్గేవాళ్లు ఇలాంటి ఫుడ్ చేసుకుని తినొచ్చు.

కజ్జు సోయా

కావల్సిన పదార్థాలు

సోయా ముక్కలు- 1 కప్పు, నూనె- మూడు టేబుల్ స్పూన్లు, బిర్యానీ ఆకులు-2, మీడియం సైజ్ ఉల్లిపాయలు-2 (సన్నగా తరగాలి), పచ్చిమిర్చి-2 (నిలువునా చీరి రెండుగా కట్ చేసుకోవాలి), కరివేపాకు- ఆరు ఆకులు, అల్లం,వెల్లుల్లి పేస్ట్- అర టీస్పూన్, ఉప్పు- తగినంత, పసుపు- చిటికెడు, కారం- టీస్పూన్, జీడిపప్పు-10, ధనియాల పొడి- అర టీస్పూన్, జీలకర్ర పొడి- అరటీస్పూన్, మసాలా పౌడర్- అరటీస్పూన్,



తయారీ విధానం

ముందుగా గ్యాస్‌మీద చిన్న గిన్నెలో నీళ్లు పోసి బాగా వేడి చేసుకోవాలి. ఇందులో సోయా గ్రాన్యుల్స్ వేయాలి. గరిటెతో సోయా ముక్కలను వేడి నీళ్లలో ముంచుతూ కలపాలి. ఆ తర్వాత పది నిముషాలపాటు అలానే వదిలేయాలి. ఆ తర్వాత వడగట్టుకోవాలి. సోయా గ్రాన్యుల్స్‌లో నీళ్లు లేకుండా వత్తుకోవాలి. ఈ మిశ్రమాన్ని పక్కన ఉంచుకోవాలి. దీన్నే సోయా కీమా అంటారు.

ప్యాన్‌లో నూనె వేసి బిర్యానీ ఆకులు, ఉల్లిపాయ ముక్కలు వేసి గరిటెతో కలియబెట్టాలి. ఉల్లిపాయల రంగు మారిన తర్వాత పచ్చిమిర్చి ముక్కలు, కరివేపాకు వేసి రెండు నిముషాల పాటు కుక్ చేయాలి. అల్లం, వెల్లుల్లి పేస్ట్ వేశాక నిముషం పాటు గరిటెతో కలిపిన తర్వాత ఉప్పు, పసుపు, కారం వేసి గరిటెతో మూడు నిముషాల తర్వాత జీడిపప్పు వేసి కలపాలి. జీలకర్ర పొడి, ధనియాల పొడి, మసాలా పౌడర్ వేసి నిముషం పాటు కలిపిన తర్వాత నానబెట్టిన సోయా గ్రాన్యుల్స్ వేయాలి. మిశ్రమాన్ని కలిపిన తర్వాత కొత్తిమీర వేసుకుని దించేసుకోవాలి. నాలుగైదు జీడిపప్పులతో గార్నిష్ చేసుకుని చపాతీలోకి తినాలి. రుచిగా ఉంటుంది.

'అల్లం చల్ల' పానీయం

తక్రం చిరం క్వథితమర్పిత శృంగవేరం బాహ్లీక సైంధవ రజోమరీచాల్పచూర్ణమ్!

ఏలాభవేన రజాసా సురభీకృతం తత్ తూర్ణ ప్రదీప యతి శాంతతనూనపాదమ్!!

చల్లని మజ్జిగ అని కూడా వ్యవహరిస్తుంటారు. ఆరోగ్యం రీత్యా పాల కన్నా పెరుగు మంచిది. పెరుగు కన్నా చల్ల మంచిది. ఏకవచనంలో ఉన్న పెరుగుని చల్ల కవ్వంతో చిలకగానే చల్ల అనే బహువచనంగా మారిపోతోంది. 'పెరుగు ఉంది' అంటాం. 'మజ్జిగ ఉన్నాయి' అంటాం. పాలు, పెరుగుల్లో లేని సుగుణాలేవో అదనంగా ఉన్నాయి కాబట్టే, చల్ల లేదా మజ్జిగ బహువచనంలా ద్విగుణం బహుళంగా మారిపోతున్నాయి.

చల్ల తాగితే జలుబు చేస్తుందని కొందరి అపోహ. చల్లను ఫ్రిజ్‌లో పెట్టటంవల్లే జలుబు వస్తుంది. చల్ల తాగితే సరిపడదనే వారు ఇలా అల్లపు చల్లని తాగి చూడండి. సాధారణంగా సరిపడకపోవటం అనేది ఉండదు. చల్లని సగానికి సగం మరిగించటంవల్ల దానిలోని దోషాలు చాలావరకూ పోయి సౌమ్యత కలుగుతుంది.



కవ్వంతో చిలకడం వల్ల ఆ చల్లలో లఘుత్వం ఏర్పడి, తేలికగా వంటబట్టే స్వభావం సమకూరుతుంది. ఇంతకన్నా ఏం కావాలి? పెరుగులో లేని గుణం ఇది. ఎంత చిలికితే అంత తేలికదనం వస్తుంది. వెన్నశాతం ఎక్కువగా ఉన్న చిక్కని పాలను తోడు పెట్టుకుని, చిలికి వెన్న తీస్తే కమ్మని ఆరోగ్యదాయకమైన చల్లతో పాటు వెన్న కూడా సమృద్ధిగా దక్కుతుంది.

ఈ చల్లని 'ప్రోబయాటిక్' అంటారు. ఇందులో.. ఉపయోగపడే బాక్టీరియా సమృద్ధిగా ఉంటుంది. ఈ బాక్టీరియా మన పేగుల్ని బలసంపన్నం చేసి, చెడ్డ బాక్టీరియాని ఎదుర్కొంటుంది. పేగుల్లో జరిగిన నష్టాన్ని సరి చేస్తుంది. జీర్ణప్రక్రియను వేగవంతం చేస్తుంది. అల్సర్లను మానేలా చేస్తుంది.

చల్ల, అల్లం ఇవి రెండూ చక్కని నేస్తాలు. ఈ రెండిటినీ కలిపితే మనం ఆశించిన ప్రయోజనం ఎక్కువగా పొందవచ్చు. అల్లం కలిసిన చల్లకు గుణాలెక్కువ. రాత్రి పడుకోబోయే ముందు ఒక గ్లాసు చిక్కని చల్ల తీసుకుని, అదే గ్లాసుతో 3 గ్లాసుల నీళ్లు కలపండి. మూతబెట్టి ఈ చల్ల నీళ్లని ఫ్రిజ్‌లో కాకుండా, బయటే ఉంచండి. ఆ చల్లలో ఉన్న మంచి బాక్టీరియా అందులో కలిపిన నీళ్లలో తెల్లవార్లూ పెరగటం మొదలెట్టి, ఒక గ్లాసు బాక్టీరియా నాలుగు గ్లాసుల బాక్టీరియా అవుతుంది. అల్లాన్ని సైంధవ లవణంతో కలిపి, మెత్తగ నూరి ఓ సీసాలో ఉంచి ఫ్రిజ్‌లో భద్రపరచుకోండి. పొద్దున్నే ఈ చల్లలో ఒక చెంచాడు అల్లం ముద్దని కలిపి తాగితే జీర్ణకోశానికి తిరుగులేని శక్తి కలుగుతుంది. ఆకలి, అరుగుదల పెరుగుతాయి. అమీబియాసిస్, ఐబియస్ లాంటి వ్యాధుల్లో, వాత వ్యాధుల్లోనూ, మలబద్ధకానికి చల్లను ఇలా తాగటమే మంచిది.

అజీర్తికి ఔషధంలా...

అజీర్తి అనేది అన్ని రోగాలకూ తలుపులు తెరిచే ఒక లక్షణం. దీన్ని సరి చేసుకోగలిగితేనే ఏ వ్యాధికైనా ఉపశమనం. కీళ్లవాతం రోగి... అజీర్తిని సరి చేసుకోకుండా ఎన్ని నొప్పిబిళ్లలు మింగినా ఉపయోగం ఉండదు. అలాగే అన్ని వ్యాధుల్లోనూ జీర్ణశక్తిని పెంచుకోవటం అనేది చికిత్సలో మొదటి అడుగు కావాలి. అందుకనే, వ్యాధులు రాకుండానూ, వచ్చిన వ్యాధులు దీర్ఘవ్యాధులుగా మారకుండానూ, దీర్ఘవ్యాధులు త్వరగా తగ్గటానికి కూడా ఈ 'అల్లం చల్ల పానీయం' ఎంతగానో తోడ్పడుతుంది. ఇందులో కొద్దిగా కొత్తిమీర తరిగి కలుపుకొంటే కమ్మగా ఉంటుంది.

ఎలాగైనా తీసుకోవచ్చు...

అల్లం చల్లని అన్నంలో కలుపుకొని తినొచ్చు. లేదంటే నేరుగా తాగవచ్చు. శీతాకాలంలో కలిగే ఇబ్బందుల్ని ఈ పానీయం నివారిస్తుంది. వేసవిలో వడదెబ్బ తగలకుండా కాపాడుతుంది. వర్షాకాలంలో దగ్గు, జలుబు రాకుండా చేస్తుంది. మూడు కాలాలకూ ఉపయోగపడే పానీయం ఇది. పిల్లాపెద్దా అందరికీ మంచిది. బడికివెళ్లే పిల్లల్లో ఈ చల్ల మేధాశక్తిని పెంచుతుంది. ఎముక పుష్టి ఇస్తుంది. మెనోపాజ్ సమస్యలతో బాధపడే మహిళలకు ఉపశమనం కలిగిస్తుంది.

క్షేమ కుతూహలం

మరగ కాచి...

ఈ అల్లం కలిపిన చల్లని మరగ కాచి కమ్మని పానీయం తయారు చేసుకునే ఇంకో విధానం కూడా ఉంది. క్షేమశర్మ తన 'క్షేమకుతూహలం' గ్రంథంలో జీర్ణశక్తిని పెంచే ఔషధంగా దీన్ని వివరించాడు. చల్లలో తగినంత నూరిన అల్లం కలిపి, సగం ఆవిరయ్యేంతవరకు మరగనివ్వాలి. దీనివల్ల అందులో ఉపయోగపడే బాక్టీరియా నశించినప్పటికీ మిగిలిన పోషకాలన్నీ బహుళం అవుతాయి. అల్లంతో మరిగించటంవల్ల అల్లపుసారం అంతా ఈ చల్లకు పట్టుకొంటుంది. ఇలా మరిగిన చల్లలో, ఇంగువ పొడి, సైంధవ లవణం, మిరియాలు, ఏలకుల పొడి తగినంత కలిపి ఇంకొద్దిసేపు మరగనివ్వాలి. ఇలా తయారైన అల్లం చల్ల పానీయం జాఠరాగ్నిని ప్రజ్వరిల్లజేస్తుందన్నాడు క్షేమశర్మ.

● గంగరాజు అరుణాదేవి

మేకప్

కాస్మటిక్స్ కొనేటప్పుడు...

మేకప్‌తో చర్మ ఆరోగ్యం దెబ్బతినకుండా, రెట్టింపు ఆకర్షణీయంగా కనిపించాలి. అందుకోసం కాస్మటిక్స్ ఎంపికలో కొన్ని చిట్కాలు పాటించాలి.

పొడిబార్చేలా ఉంటే...

వేర్వేరు కాస్మటిక్స్ వేర్వేరు చర్మాల మీద వేర్వేరు ప్రభావాలు చూపిస్తాయి. ఒక బ్రాండ్‌కు చెందిన ఐ షాడో బ్రహ్మాండంగా సూట్ అయినంత మాత్రా, అదే బ్రాండ్ లిప్‌స్టిక్ కూడా సూటవుతుంది అనుకుంటే పొరపాటు. కాబట్టి, కాస్మటిక్స్ ఎంపికలో ఆచితూచి వ్యవహరించాలి. అలాగే చర్మాన్ని పొడిబార్చే ఫౌండేషన్‌కు దూరంగా ఉండాలి. ఏ కాస్మటిక్స్ చర్మానికి నప్పుతుందో తెలుసుకోవడం కోసం వేర్వేరు కాస్మటిక్స్‌ను ఉపయోగించి చూడాలి.

స్కిన్ టోన్ కీలకం

కాస్మటిక్స్ చర్మపు రంగును పూర్తిగా మార్చేసేలా ఉండకూడదు. చర్మపు రంగుతో మ్యాచ్ అయిపోయి, మచ్చలను చర్మంలో కలిసిపోయేలా చేసేదై ఉండాలి. చర్మపు రంగుకు సరిపోలని కాస్మటిక్స్‌ను ఎంచుకుంటే, సహజసిద్ధమైన అందం మరుగున పడిపోయి, కృత్రిమత్వం పెరుగుతుంది. కాబట్టి ఫౌండేషన్ ఎంపికలో రెట్టింపు జాగ్రత్తగా వ్యవహరించాలి.

నాణ్యమైన వాటినే...

కాస్మటిక్స్ నాణ్యత విషయంలో రాజీ పడిపోకూడదు. ఖరీదైన నాణ్యమైన కాస్మటిక్స్ చర్మం మీద అంటుకుపోయి న్యాచురల్ లుక్‌ను తెచ్చి పెడతాయి. చవక రకం కాస్మటిక్స్ చర్మం మీద పైపొరలా ఏర్పడి, ప్లాస్టిక్ లుక్‌ను తెచ్చి పెడతాయి.



నవ్య 'స్మార్ట్ పేజీ'లో ఆసక్తికర కథనాలు కోసం...
ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/ntKSbuqలో చదవండి.

మార్పు సాధనం... గిరిజన 'చిత్రం'



ఎంతో శక్తిమంతమైన దృశ్య మాధ్యమాన్ని తను కోరుకొనే మార్పుకు సాధనంగా ఎంచుకున్నారు సంధ్యా లక్రా. జార్ఖండ్‌కు చెందిన ఈ 29 ఏళ్ళ మహిళ గిరిజన జీవితాల్లోని వెతలను చలనచిత్రాలుగా రూపొందిస్తున్నారు. ఈ నెలలో ఫిలిమ్ ఫెస్టివల్ నిర్వహణ ద్వారా స్థానిక యువతలో స్ఫూర్తి రగిలించేందుకు సిద్ధమవుతున్న సంధ్య కథ ఆమె మాటల్లోనే...

"మాది జార్ఖండ్ రాష్ట్రం ఛత్రా జిల్లా సంఘారీ అనే గ్రామం. ఛత్రాలో ప్రాథమిక విద్య పూర్తిచేశాను. రాంచీలో డిగ్రీ వరకూ చదివాను. మా కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రం కావడంతో... ఉన్నత విద్య అభ్యసించాలన్నా కుదరలేదు. తిరిగి మా సంఘారీకి చేరుకున్నాను. మా ఊరుకు అన్ని వైపులా అడవులే. బాల్యం నుంచీ కొండలు, నదులు, జలపాతాలు, పచ్చని చెట్లే నా నేస్తాలు. చదువుకొనే సమయంలో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ అంటే ఆసక్తి ఏర్పడింది. తీరిక సమయాల్లో కెమేరా తీసుకొని అడవుల్లోకి వెళ్ళేదాన్ని. వీడియోగ్రఫీలో 'ఛేంజ్ గ్రీన్ హట్ ఫెలోషిప్' కోసం దరఖాస్తు చేసి, ఎంపికయ్యాను. ఎన్నో మెళకువలు నేర్చుకోడానికి ఆ ఫెలోషిప్ నాకు చాలా ఉపయోగపడింది. రాంచీలోని 'ఆశా సంస్థ'లో ఇంటెర్న్‌షిప్ చేస్తున్న కాలంలో... ఆ సంస్థ కార్యకలాపాల గురించి, ఇటుకల బట్టీల్లో పని చేస్తున్న పిల్లల గురించి, మానవ అక్రమ రవాణా గురించి డాక్యుమెంటరీలు తీశాను. కన్హా టైగర్ రిజర్వ్‌లో... జీవ వైవిధ్యం, ప్రకృతి పరిరక్షణపై జరిగిన మూడు రోజుల వర్క్ షాప్‌లో పాల్గొన్నాను. సత్పురా టైగర్ రిజర్వ్, టిల్హా వైల్డ్ లైఫ్ సాంక్చువరీ, కెరవా ఫారెస్ట్ లాంటి ప్రదేశాలను సందర్శించాను. ఇవన్నీ అడవులపైనా, ప్రకృతిపైనా కొత్త దృక్పథాన్ని అందించాయి. నేను చిత్రించినవాటికి గుర్తింపు రావడం మొదలైంది.

ఆ ఆవేదనతోనే...

ఈలోగా టాటా స్టీల్ ఫౌండేషన్ 'సంవాద్ ఫిలిమ్ ఫెస్టివల్' నిర్వహిస్తున్నట్టు తెలిసింది. ఇది ట్రైబల్ ఫిల్మ్‌మేకర్స్ కోసం ఉద్దేశించినది. గిరిజన వలస కుటుంబాల పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యల మీద తీసిన నా డాక్యుమెంటరీని ఎంట్రీగా పంపాను. మన దేశంలో వేలాది గిరిజన కుటుంబాలు వలస వెళుతున్నాయి. వారి పిల్లలకు కనీసమైన చదువు కూడా ఉండడం లేదు. దీని వల్ల ఒక తరం నాశనమైపోతుందనే ఆవేదనతో దాన్ని చిత్రీకరించాను. నాదీ గిరిజన కుటుంబమే కాబట్టి ఈ సమస్య గురించి నాకు బాగా తెలుసు. నా డాక్యుమెంటరీ ఎంపిక కావడంతో అయిదు రోజులపాటు జరిగిన 'సంవాద్-2003'లో పాల్గొనాలని ఆహ్వానం వచ్చింది. అక్కడ దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ట్రైబల్ ఫిల్మ్‌మేకర్స్‌ను కలుసుకొని, అభిప్రాయాలు పంచుకొనే అవకాశం వచ్చింది. నా డాక్యుమెంటరీని జ్యూరీ ఉత్తమమైనదిగా ఎంపిక చేసింది. ఫెలోషిప్ పూర్తయిన తరువాత... మా ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు జీవ వైవిధ్యం, ప్రకృతి సంరక్షణ గురించి అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాను. చెట్లు, మొక్కలు, పువ్వులు, ఆకులు, కాయలు, పండ్లలో ఉండే ఔషధ గుణాల గురించి, వన్య ప్రాణుల గురించీ డాక్యుమెంటరీలు ప్రదర్శించాను.

వారి కోసం ప్రత్యేకంగా...

నేను తీసే డాక్యుమెంటరీల్లో స్థానికులే ప్రధాన పాత్రధారులు. వాటిపట్ల పిల్లల ఆసక్తి చూసిన తరువాత... స్వయంగా ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించాలనే ఆలోచన వచ్చింది. ఆ దిశగా ఏర్పాట్లు ప్రారంభించాను. గిరిజనుల జీవన విధానం, సంస్కృతి, సంగీతం, ఆహారం, జానపద కథలు, సమస్యలతో పాటు గ్రామీణాభివృద్ధి, విద్య, పర్యావరణ పరిరక్షణ, స్వయం ఉపాధి, సేంద్రియ వ్యవసాయం, భవిష్యత్ భారతదేశం లాంటివి ప్రధానాంశాలుగా... కేవలం జార్ఖండ్ నుంచే కాకుండా దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచీ చిత్రాలను ఆహ్వానించాను.



దానికి ఔత్సాహికుల నుంచే కాదు అనుభవజ్ఞులైన ఫిల్మ్‌మేకర్స్ నుంచి సైతం మంచి స్పందన వచ్చింది. ఈ నెల తొమ్మిది, పది తేదీల్లో ఛత్రా జిల్లా కేంద్రంలో నిర్వహించే ఫిల్మ్ ఫెస్టివల్‌లో... సామాజిక అంశాలపై స్థానిక యువత రూపొందించిన చిత్రాలను కూడా ఒక ప్రత్యేక విభాగంలో ప్రదర్శిస్తాం. గిరిజన గ్రామాల్లో జీవనోపాధి అవకాశాలను పొందడం అతి పెద్ద సవాలు. మా గ్రామంలో అసమానతలను, నేరాలను, హింసను నేను ప్రత్యక్షంగా చూశాను. వాటిని ఖండిస్తూ, సామాజికంగా సానుకూల మార్పును నా చిత్రాల ద్వారా తీసుకురావాలన్నదే నా లక్ష్యం. అలాగే గిరిజనుల సాంస్కృతిక గుర్తింపును ప్రధానంగా చాటిచెప్పాలి. దేశంలోని గిరిజన వర్గాల అభివృద్ధి కోసం ప్రత్యామ్నాయ మార్గాలను ప్రోత్సహించాలి. నేను నిర్వహించబోయే ఫిల్మ్ ఫెస్టివల్ ఆ దిశగా మరికొంతమందికి స్ఫూర్తి కలిగిస్తుందని ఆశిస్తున్నాను."



కొలస్ట్రాల్‌కు విరుగుడు!

చెడు కొలస్ట్రాల్ వల్ల రకరకాల సమస్యలు ఏర్పడతాయి. చెడు కొలస్ట్రాల్ మన రక్తనాళాలలో పేరుకుపోతుంది. దాని వల్ల రక్తప్రసారానికి ఇబ్బంది కలుగుతుంది. దీనిలో గుండె జబ్బులు వచ్చే అవకాశముంటుంది. ఇలాంటి పరిస్థితులు రాకుండా ఉదయాన్నే గ్రీన్‌టీ, పసుపు పాలు, బీట్‌రూట్ క్యారెట్ జ్యూస్‌లను తాగితే మంచిదని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ పానీయాల వల్ల లాభాలేమిటో చూద్దాం.

గ్రీన్ టీ: గ్రీన్‌టీలో కేటీచిన్స్ అనే పదార్థం ఉంటుంది. ఈ టీలో నిమ్మరసం, తేనె కలుపుకుంటే అనేక ఆరోగ్యప్రయోజనాలు ఉంటాయి. చాలా మంది గ్రీన్‌టీ అంటే- టీ ఆకులు వేసి బాగా మరగపెడతారు. ఇలా మరగపెట్టడం వల్ల అదనపు ప్రయోజనం ఉండదు. పైగా రుచి కూడా మారిపోతుంది.

పసుపు పాలు: పసుపులో కుర్‌క్యుమిన్ అనే పదార్థం ఉంటుంది. ఇది కొలస్ట్రాల్ విలువలను తగ్గిస్తుంది. పసుపు పాలను ఎలా చేయాలో చూద్దాం..

● ఒక కప్పు పాలను తీసుకోవాలి. అవి బాగా కాగిన తర్వాత దానిలో ఒక పావు స్పూను పసుపు వేయాలి. రుచికి తగినట్లుగా మిరియాల పొడి కూడా వేయాలి. కొద్దిగా తేనె వేస్తే కూడా మంచిది. పాలను కిందకు దింపి చల్లార్చి తాగాలి.


బీట్‌రూట్ క్యారెట్ జ్యూస్:

బీట్‌రూట్, క్యారెట్‌లలో యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. ఫైబర్ కూడా ఉంటుంది. వీటి వల్ల కొలస్ట్రాల్ విలువలు అదుపులో ఉంటాయి. ఈ జ్యూస్‌ను ఎలా చేయాలో చూద్దాం.

● ఒక మీడియం బీట్‌రూట్, రెండు క్యారెట్‌లను తీసుకోవాలి. వీటి పైతొక్క తీసి చిన్న చిన్న ముక్కలుగా తరగాలి. ఒక చిన్న అల్లం ముక్క కూడా వేయాలి. ఒక గ్లాసు నీళ్లు పోసి జ్యూసర్ లేదా మిక్సీలో బాగా తిప్పాలి. బీట్‌రూట్, క్యారెట్‌లలో ఫైబర్ ఎక్కువ ఉంటుంది కాబట్టి దీనిని వడగొట్టకుండా తాగటమే మంచిది.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
శనివారం • 6 జనవరి 2024
cinema@andhrajyothy.com






రామ్‌చరణ్ సినిమాలో శివన్న?

బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందనున్న 'రామ్‌చరణ్ 16' పై వస్తున్న అప్‌డేట్‌లు మెగా అభిమానుల్లో ఆసక్తిని రెట్టింపు చేస్తున్నాయి. కోస్తా నేపథ్యంలో సాగే ఈ స్పోర్ట్స్ డ్రామాకు సంగీత దర్శకుడిగా ఏఆర్ రెహమాన్ తీసుకున్నారు. సీనియర్ హీరోయిన్ లయ ఈ సినిమాతో రీఎంట్రీ ఇవ్వనున్నట్టు తెలిసింది. ఇక ఇందులో చరణ్‌కు జోడీగా ముందు జాన్వీకపూర్ పేరు వినపడింది. తర్వాత ఆ స్థానంలో సాయిపల్లవి వచ్చి చేరింది. కథానాయికగా ఆమె దాదాపు ఖరారైనట్టు తెలిసింది. ఇప్పుడు మరో విశేషమేంటంటే.. ఈ సినిమాలో కన్నడ అగ్ర నటుడు శివరాజ్‌కుమార్ కీలక పాత్ర పోషించనున్నారట. ఈ విషయాన్ని స్వయంగా ఆయనే చెన్నైలోని ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. 'ఆర్‌సీ16'లో తను నటించనున్నట్టు, ప్రస్తుతం ఆ విషయం చర్చల దశలో ఉన్నట్టు ఆయన తెలిపారు. శివరాజ్‌కుమార్ ఇటీవలే రజనీకాంత్ 'జైలర్'లో ప్రత్యేకపాత్రలో మెరిశారు. నిడివి తక్కువే అయినా.. ఆ పాత్ర సినిమాకు హైలైట్‌గా నిలిచింది. మళ్లీ 'ఆర్‌సీ 16'లో కనిపించనున్నారు. ఇది మెగా అభిమానులకు నిజంగా శుభవార్తే.

స్నేహానికి అద్దంపట్టే నా సామిరంగ



నాగార్జున సంక్రాంతి కోడిపుంజు 'నా సామిరంగ'పై రోజురోజుకీ అభిమానుల్లో అంచనాలు పెరుగుతున్నాయి. చాలాకాలం తర్వాత నాగ్ పూర్తిస్థాయి మాస్ పాత్ర చేయడంతో అభిమానులు సినిమాకోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. దర్శకుడు విజయ్ బిన్నీ వినూత్నమైన కాన్సెప్ట్‌తో సినిమాను తెరకెక్కించినట్టు చిత్రబృందం చెబుతోంది. ఇప్పటివరకూ విడుదలైన పాటలు యువతరాన్ని బాగా ఆకట్టుకున్నాయి. శుక్రవారం 'దేవుడే తన చేతిలో..' అంటూ సాగే పాటను విడుదల చేశారు. ఎం.ఎం.కీరవాణి రాసి స్వరపరిచిన ఈ పాట సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు. నాగార్జున, అల్లరి నరేశ్ పాత్రల స్నేహాన్ని అద్దంపట్టేలా ఈ పాటను చిత్రీకరించడం జరిగిందని, స్నేహం గొప్పతనం తెలిసేలా కీరవాణి సాహిత్యం సాగిందని వారు అన్నారు. ఆశికా రంగనాథ్ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో రాజ్‌తరుణ్, మిర్నామీనన్, రుక్సార్ థిల్లాన్ ఇతర తారాగణం కాగా, ఈ చిత్రానికి రచన: ప్రసన్నకుమార్ బెజవాడ, కెమెరా: శివేంద్ర దాశరథి.



బ్రహ్మరాక్షసుడు వచ్చాడ్రా

గోపీచంద్ కథానాయకుడిగా రూపొందుతున్న యాక్షన్ ఎంటర్టైనర్ 'భీమా'. కన్నడ దర్శకుడు ఎ హర్ష తెరకెక్కిస్తున్నారు. కేకే రాధామోహన్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 16న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. శుక్రవారం చిత్రబృందం టీజర్‌ను విడుదల చేసి ప్రచార కార్యక్రమాలను ప్రారంభించింది. 'రాక్షసుల్ని వేటాడే బ్రహ్మరాక్షసుడు వచ్చాడ్రా' అనే బ్యాగ్రౌండ్ వాయిస్‌తో మొదలైన టీజర్ గోపీచంద్ పాత్ర ఎలా ఉండబోతోందో చెప్పింది. పరిచయ సన్నివేశంలో గోపీచంద్ ఖాకీ యూనిఫాంలో ఎద్దుపై కూర్చొని మాస్ ఎంట్రీ ఇచ్చిన తీరుతో ఆయన పాత్ర ఎంత శక్తిమంతంగా ఉండబోతోందో తెలుస్తోంది. రవి బస్రూర్ నేపథ్య సంగీతం ఆకట్టుకుంది. ఈ చిత్రంలో ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ కథానాయికలు. సినిమాటోగ్రఫీ: స్వామి గౌడ



తనేంటో నాకు తెలుసు

'ప్రేమకు పునాది నమ్మకం. ప్రేమించిన తర్వాత నమ్మాలి. నమ్మకం లేని చోట ప్రేమ నిలువదు' అంటున్నారు ఇలియానా. ఇటీవల తన ప్రియుడు మైకేల్ గురించి తన వ్యక్తిగత సాంఘిక మాధ్యమంలో మాట్లాడారు ఇలియానా. అంతేకాదు, ప్రియుడితో తన జీవితాన్ని, కుటుంబసభ్యుల భరోసానీ అన్నీ ఈ సందర్భంగా పంచుకున్నారు. 'ప్రసవం తర్వాత చాలామంది స్త్రీలు డిప్రషన్‌లోకి వెళ్లిపోతారని విన్నాను. నేనూ అలాగే డిప్రషన్‌లోకి వెళ్లిపోయాను. కొన్ని రోజులు గది నుంచి బయటకు రాలేదు. ఆ సమయంలో నా కుటుంబం నాకు అండగా నిలిచింది. నేను అమ్మని అయ్యాక కానీ కుటుంబం గొప్పతనం నాకు తెలీలేదు. మైకేల్ నన్ను పసిపాపలా చూసుకున్నాడు. నిజంగా మైకేల్ లాంటి పాట్నర్ దొరకడం నా అదృష్టం. మా ప్రేమ గురించి తెలియగానే చాలామంది తన గురించి చెడుగా మాట్లాడారు. అందుకే.. మా ఇద్దరికి సంబంధించిన విషయాలను అందరితో పంచుకునేదాన్ని కాదు. ఇప్పుడు తన గురించి ఎవరు ఏం మాట్లాడినా ఐ డోంట్ కేర్. తనేంటో నా మనసుకు తెలుసు.' అంటూ తన అభిప్రాయాలను పంచుకున్నారు ఇలియానా.

వెంకటేశ్‌తో సినిమా కోరిక తీరింది

వెంకట్ బోయనపల్లి



అందరూ 'సైంధవ్' చిత్రంలో పోరాట ఘట్టాల గురించి ఎక్కువగా మాట్లాడుతున్నారు కానీ మనసుకు హత్తుకునే కుటుంబ అనుబంధాల గురించి దర్శకుడు హృద్యంగా తెరకెక్కించారు. థియేటర్ నుంచి బయటికొచ్చేటప్పుడు ప్రేక్షకుల కళ్లు చెమ్మగిల్లుతాయి' అని నిర్మాత వెంకట్ బోయనపల్లి అన్నారు. వెంకటేశ్ కథానాయకుడిగా శైలేష్ కొలను దర్శకత్వం వహించిన చిత్రమిది. ఈనెల 13న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆయన సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- వెంకటేశ్ గారు నా అభిమాన హీరో. ఆయనతో నిర్మాతగా ఓ సినిమా చేయాలనేది నా కోరిక. దర్శకుడు శైలేష్ కొలను చెప్పిన కథ నచ్చడంతో ఆయన వెంటనే 'సైంధవ్' చిత్రం చేసేందుకు అంగీకరించారు. ఒక్క రోజులోనే ప్రాజెక్ట్ ఓకే అవ్వడం ఆశ్చర్యం కలిగించింది. వెంకటేశ్ గారి 75వ చిత్రం చేసే అవకాశం నాకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నాను.
- ఈ సినిమాకు వెంకటేశ్‌గారిని ఒప్పించిన ఘనత శైలేష్‌కే దక్కుతుంది. మా ప్రయత్నం మేం చేశాం. ఇలాంటి కాంబినేషన్ కుదరడం విధిరాత అని వెంకటేశ్ అన్నారు. నవాజుద్దీన్ సిద్దిఖీ, ఆర్య, ఆండ్రియా లాంటి అగ్ర తారలు భాగమవడం, భారీ స్థాయిలో నిర్మించడం వల్ల ఖర్చు ఎక్కువే అవుతుందని తెలుసు. అందుకు ముందుగానే సిద్ధమయ్యాం. సంతోష్ నారాయణ్ సంగీతం సినిమాకు ప్రత్యేకాకర్షణ. అన్నీ కుదిరితే నాని, వెంకటేశ్ గారితో మల్టీస్టారర్ చేయాలనుంది.

ప్రభాస్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న పాన్ ఇండియా చిత్రం 'కల్కి 2898 ఏడీ'. నాగ్ అశ్విన్ దర్శకుడు. అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. దీపికా పదుకొనే కథానాయిక. శుక్రవారం ఆమె పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం దీపిక లుక్‌తో ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. దేన్నో అన్వేషిస్తున్నట్టు సీరియస్ లుక్‌లో దీపిక కనిపించారు. ప్రభాస్ ఇన్‌స్టాగ్రామ్‌లో దీపికకు



అందగత్తెకు జన్మదిన శుభాకాంక్షలు

శుభాకాంక్షలు తెలిపారు. 'గొప్ప సౌందర్యవతి దీపికా పదుకొనేకు జన్మదిన శుభాకాంక్షలు, ఈ ఏడాది మీకు అద్భుతంగా ఉండాలని కోరుకుంటున్నాను' అని పేర్కొన్నారు. వైజయంతీ మూవీస్ పతాకంపై సి. అశ్వనీదత్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

యువతరం శ్రీరంగనీతులు



'యువతరం తమకు తాము ఐడెంటిఫై చేసుకునే పాత్రలతో.. భావోద్వేగాలతో.. కథలతో.. మనసుకు హత్తుకునే సన్నివేశాలతో.. సహజత్వానికి దగ్గరగా ఉండే సినిమాలు అరుదుగా వస్తుంటాయి. సరిగ్గా అలాంటి సినిమానే 'శ్రీరంగనీతులు'.. శుక్రవారం విడుదలైన ఈ సినిమా టీజర్ ప్రారంభంలో వినిపించే తనికెళ్ల భరణి మాటలివి. అందుకు తగ్గట్టే సినిమా కూడా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. సుహాస్, కార్తీక్‌రత్నం, రుహానిశర్మ, విరాజ్ అశ్విన్ కీలక పాత్రధారులుగా, ప్రవీణ్‌కుమార్ వీఎస్ఎస్ దర్శకత్వంలో వెంకటేశ్వరరావు బల్మూరి నిర్మించిన ఈ సినిమా ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. ఈ సందర్భంగా టీజర్‌ని విడుదల చేశారు. ఈతరం యువతరం ఆలోచనలు, వారి ఉద్వేగాలు ఎలా ఉంటున్నాయో ఇందులో చూపించామని, ఆసక్తికరమైన కథ, కథనాలతో మనసుకు హత్తుకునేలా సినిమా ఉంటుందని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా: టీజో టామీ, సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, అజయ్ అరసాడ.

మూడు తరాలు ఒకే ఫ్రేమ్‌లో

మోహన్‌బాబు మనవడు, విష్ణు తనయుడు అవ్రామ్ బాలనటుడిగా వెండితెరకు పరిచయమవబోతున్నాడు. మంచు విష్ణు టైటిల్ పాత్ర పోషిస్తున్న 'కన్నప్ప' చిత్రంతో అతడు తెరంగేట్రం చేయనున్నాడు. ఇందులో మోహన్‌బాబు కీలకపాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. అంటే మోహన్‌బాబు విష్ణు, అవ్రామ్ ఒకే కుటుంబానికి చెందిన మూడు తరాల నటులు ఒకే ఫ్రేమ్‌లో అలరించనున్నారన్నమాట. శుక్రవారం విష్ణు ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా తెలిపారు. 'నా కొడుకు అవ్రామ్ 'కన్నప్ప' చిత్రంలో కీలకపాత్రలో నటిస్తున్నందుకు గర్వంగా ఉంది. ఇది మా కుటుంబంలోని మూడు తరాల కలయికలో వస్తున్న అరుదైన చిత్రం. మా కుటుంబంలో నూతన అధ్యాయానికి 'కన్నప్ప' నాంది పలుకుతుంది' అని చెప్పారు. ఈ చిత్రంలో ప్రభాస్ శివుడి పాత్రలో కనిపించనున్నారు. ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మోహన్‌లాల్, శరత్‌కుమార్, బ్రహ్మానందం ప్రధాన తారాగణం.



భుజం తట్టి ప్రోత్సహించారు





ఇటీవలే దివంగతులైన తమిళ హీరో విజయ్‌కాంత్‌ను తలచుకొని సూర్య కన్నీరు పెట్టుకున్నారు. విజయ్‌కాంత్ కన్నుమూసిన సమయంలో సూర్య విదేశాల్లో షూటింగ్‌లో ఉన్నారు. దాంతో చివరి చూపు దక్కలేదు. తిరిగొచ్చాక ఆయన గురువారం చెన్నైలోని విజయ్‌కాంత్ సమాధి వద్ద నివాళి అర్పించారు. ఈ సందర్భంలో విజయ్‌కాంత్‌ను గుర్తు చేసుకొని సూర్య తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. కెరీర్ ఆరంభంలో అపజయాలు రావడంతో నిరాశలో ఉన్న నన్ను విజయ్‌కాంత్ ఎంతగానో ప్రోత్సహించారు అని చెప్పారు. 'పెరియన్నా' సినిమాలో ఆయనతో కలసి నటించాను, ఆ సమయంలో ఆయన నన్ను ఆదరించిన తీరు ఎప్పటికీ మరువలేనని పేర్కొన్నారు.

శ్రీవారి సేవలో నటి జాన్వీ కపూర్



నటి శ్రీదేవి కుమార్తె, బాలీవుడ్ హీరోయిన్ జాన్వీ కపూర్ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తన పిన్నమ్మ అయిన నటి మహేశ్వరి, స్నేహితులతో కలిసి ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల (ఆంధ్రజ్యోతి)



భాస్కర్ నారాయణ రాగాలు

శివ కందుకూరి, రాశి సింగ్ జంటగా రూపొందుతోన్న క్రైమ్ థ్రిల్లర్ 'బూతద్దం భాస్కర్ నారాయణ'. పురుషోత్తంరాజ్ దర్శకుడు. స్నేహాల్, శశిధర్, కార్తీక్ నిర్మాతలు. ఫిబ్రవరిలో సినిమాను విడుదల చేయనున్నారు. ఈ సినిమాకు చెందిన టైటిల్‌సాంగ్‌ని శుక్రవారం విడుదల చేశారు. పురుషోత్తంరాజ్, సురేశ్ బనిశెట్టి రాసిన ఈ పాటను శ్రీచరణ్ పాకాలా స్వరపరిచారు. యువతరం మెచ్చే సంగీత సాహిత్యాలతో ఈ పాట రూపొందిందని, విజువల్స్ కూడా ఎట్రాక్టివ్‌గా వున్నాయని మేకర్స్ చెప్పారు. అరుణ్‌కుమార్, దేవిప్రసాద్, వర్షిణి సౌందరరాజన్, శివకుమార్, షఫీ, శివన్నారాయణ తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: గౌతమ్ జార్జ్.

ఆ పాత్ర చేస్తున్నప్పుడు నాలో తెలీని వైబ్రేషన్..



'నా కెరీర్‌లో గుర్తుండిపోయే సినిమా 'ఎమర్జన్సీ'. ఒక నటిగా, ఒక దర్శకురాలిగా, నిర్మాతగా నేను చేస్తున్న పెద్ద సాహసం ఈ సినిమా. త్వరలోనే సినిమాను విడుదల చేస్తాం. ప్రేక్షకుల స్పందన కోసం ఇప్పటినుంచే ఆతృతతో ఉన్నా..' అన్నారు కంగనా రనౌత్. ఆమె స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తూ, నటిస్తున్న చిత్రం 'ఎమర్జన్సీ' నిర్మాణం పూర్తి చేసుకొని విడుదలకు సిద్ధమైంది. ఈ సినిమా గురించి కంగనా మాట్లాడారు. 'లెజెండ్ అనే పదానికి నిర్వచనం ఇందిరాగాంధీ. స్త్రీలను తల ఎత్తుకునేలా చేసిన మహాశక్తి ఆమె. ఆ పాత్ర చేస్తున్నప్పుడు నాలో ఏదో తెలీని వైబ్రేషన్. మహామహా మగధీరులను ఒంటికాలిపై నిలబెట్టిన ఘనత ఇందరది. సాహసోపేతమైన నిర్ణయాలు, దేశంకోసం ఏమైనా చేసే తెగువ ఇవన్నీ ఒక స్త్రీలో అనాడే ఉండటం నిజంగా ఆశ్చర్యం. నేడు స్త్రీలు పురుషులకు దీటుగా ఎదుగుతున్నారని అందరూ అంటుంటారు. కానీ ఆ రోజుల్లోనే శ్రీమతి ఇందిరాగాంధీ పురుషాధిక్య సమాజాన్ని సైతం శాసించగలిగారు. ఆమె పాత్ర చేయడం పట్ల ఒక స్త్రీగా గర్విస్తున్నా. దర్శకురాలిగా ప్రాణంపెట్టి పనిచేశాను. ఫలితం కోసం ఎదురు చూస్తున్నా..' అంటూ ఉద్వేగంగా చెప్పుకొచ్చారు కంగనా..

మహాభారతం తీస్తే ముఖ్య పాత్రధారులు వారే..



'హను-మాన్'తో టాక్ ఆఫ్ ఇండస్ట్రీ అయ్యారు దర్శకుడు ప్రశాంత్‌వర్మ. ఇండియన్ ఒరిజినల్ సూపర్‌హీరో కాన్సెప్ట్‌తో ఆయన రూపొందించిన 'హను-మాన్' ఈ సంక్రాంతికి విడుదల కానుంది. ఆంజనేయుని శక్తి సామాన్యుడిలో ప్రవేశించడం వల్ల ఎదురైన పరిణామాల నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని టాక్. ఈ సినిమా ప్రమోషన్‌లో భాగంగా ప్రశాంత్‌వర్మ ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. ఈ సందర్భంగా ఆసక్తికరమైన విషయాలను మీడియాకు వెల్లడించారు. 'మహాభారతం' తీయడం తన జీవితాశయమని, రాజమౌళి నుంచి చాలామంది దర్శకుల జీవితాశయం ఇదే అయినా.. తాను మాత్రం దైవం సహకరిస్తే 'మహాభారతం' చేస్తానని ఆయన అన్నారు. ఇప్పటికిప్పుడు చేస్తే అందులో పాత్రలకు ఎవరెవరు సరిపోతారు? అనే విషయంపై ఆయన మాట్లాడుతూ 'ధర్మరాజు పాత్రకు మెగాస్టార్ చిరంజీవి, అర్జునుడి పాత్రకు రామ్‌చరణ్, భీముడిగా తారక్, సహదేవుడిగా విజయ్‌దేవరకొండ, నకులుడిగా నాని, కృష్ణునిగా మహేశ్‌బాబు, దుర్యోధనుడిగా డా.మోహన్‌బాబు, కర్ణుడిగా పవన్‌కల్యాణ్, ద్రౌపదిగా నయనతార బావుంటారని ఆయన సరదాగా చెప్పుకొచ్చారు. ఇందులో ఒకరిద్దరు మినహా మిగతావారంతా సరిగ్గా సరిపోతారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఆసియా కుబేరాగ్రజుడు అదానీ

సంపదలో అంబానీని దాటేశాడు..

- ఒక్కరోజే 770 కోట్ల డాలర్లు పెరిగి మొత్తం 9,760 కోట్ల డాలర్లకు చేరిక
- ప్రపంచ రిచ్ లిస్ట్‌లో 12వ స్థానం

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ అధిపతి గౌతమ్ అదానీ ఆసియాలో అత్యంత ధనవంతుడిగా అవతరించారు. ఇప్పటివరకు అగ్రస్థానంలో ఉన్న ముకేశ్ అంబానీని వెనక్కి నెట్టి ఆసియా కుబేర కిరీటాన్ని మళ్లీ చేజిక్కించుకున్నారు. బ్లూంబర్గ్ బిలియనీర్స్ రియల్‌టైం ఇండెక్స్ ప్రకారం.. అదానీ వ్యక్తిగత సంపద ఒక్క రోజే 770 కోట్ల డాలర్లు వృద్ధి చెంది మొత్తం 9,760 కోట్ల డాలర్లకు ఎగబాకింది. దాంతో ఆయన ప్రపంచ బిలియనీర్ల లిస్ట్‌లోనూ 12వ స్థానానికి ఎగబాకారు. కాగా, 9,700 కోట్ల డాలర్ల నెట్‌వర్త్‌తో అంబానీ 13 స్థానంలో కొనసాగారు. హిండెన్‌బర్గ్ ఆరోపణల కేసులో సుప్రీంకోర్టు తీర్పు అదానీకి భారీ ఊరట కల్పించడంతో గ్రూప్ కంపెనీల షేర్లు ఈ వారంలో భారీగా పుంజుకున్నాయి. దాంతో అదానీ నెట్‌వర్త్ కూడా అనూహ్యంగా పెరిగింది. ఈ ఏడాదిలో గడిచిన ఐదు రోజుల్లో అదానీ ఆస్తి 1,330 కోట్ల డాలర్లు పెరగగా.. అంబానీ సంపదలో కేవలం 66.5 కోట్ల డాలర్ల వృద్ధి నమోదైంది. గతంలోనూ గ్రూప్ కంపెనీల షేర్లు దూసుకెళ్లడంతో 2022 సెప్టెంబరులో అదానీ 14,900 కోట్ల డాలర్ల సంపదతో ప్రపంచంలో మూడో అత్యంత ధనవంతుడిగా ఎదిగారు. కానీ, 2023 జనవరి 24న విడుదలైన హిండెన్‌బర్గ్ నివేదిక ఆరోపణలతో గ్రూప్ షేర్లు భారీగా పతనమయ్యాయి. దాంతో గత ఫిబ్రవరి చివరినాటికి గ్రూప్ మార్కెట్ విలువ 15,000 కోట్ల డాలర్లు, అదానీ సంపద 3,770 కోట్ల డాలర్ల మేర క్షీణించింది. హిండెన్‌బర్గ్ నివేదిక విడుదలైన ముందు రోజు నాటికి అదానీ ప్రపంచ కుబేరుల్లో నాలుగో స్థానంలో ఉన్నారు.

- టయోటా కిర్లోస్కర్ మోటార్ కంపెనీ ఈ నెల ఒకటో తేదీ నుంచి తన కార్ల ధరలు పెంచింది. మోడల్‌ను బట్టి ఈ పెరుగుదల అర శాతం నుంచి 2.5 శాతం ఉందని కంపెనీ తెలిపింది. పెరిగిన ఉత్పత్తి వ్యయాలు తట్టుకునేందుకు ఈ పెంపు తప్పలేదని పేర్కొంది.

ఈ ఏడాది జీడీపీ వృద్ధి 7.3%



న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24)లో 7.3 శాతం వృద్ధిని నమోదు చేయవచ్చని ప్రభుత్వం అంచనా వేసింది. గనులు, క్వారీ, తయారీ రంగాలతో పాటు సేవల రంగంలోని కొన్ని విభాగాలు ప్రదర్శిస్తున్న అద్భుతమైన పురోగతి వృద్ధికి ఊతంగా నిలుస్తుందని జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) శుక్రవారం విడుదల చేసిన తొలి అడ్వాన్స్ అంచనాల్లో తెలిపింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక వ్యవస్థ 7.2 శాతం వృద్ధిని సాధించింది. ఈ ఏడాది తయారీ రంగం వృద్ధి రేటు గత ఏడాదితో పోల్చితే 1.3 శాతం నుంచి 6.5 శాతానికి పెరగవచ్చని, అలాగే గనుల రంగం వృద్ధి రేటు 8.1 శాతం (గత ఏడాది 4.1 శాతం); ఆర్థిక సర్వీసులు, రియల్ ఎస్టేట్, వృత్తిపరమైన సర్వీసుల రంగం 8.9 శాతం (గత ఏడాది 7.1 శాతం) వృద్ధిని నమోదు చేయవచ్చని పేర్కొంది. మొత్తం మీద స్థిర ధరల (2011-12) ప్రకారం జీడీపీ పరిమాణం రూ.171.79 లక్షల కోట్లుండవచ్చని ఎన్ఎస్ఓ తన నివేదికలో తెలిపింది. 2022-23లో ఇది రూ.160.06 లక్షల కోట్లుంది. జీడీపీ వృద్ధిపై ఎన్ఎస్ఓ అంచనా ఆర్‌బీఐ ప్రకటించిన 7 శాతం కన్నా కూడా అధికంగానే ఉంది. అయితే ప్రస్తుత ధరల ప్రకారం (2023-24) జీడీపీ పరిమాణం రూ.296.58 లక్షల కోట్లు లేదా 3.57 లక్షల కోట్ల అమెరికన్ డాలర్లుండవచ్చని (అమెరికన్ డాలరుకు రూ. 83గా లెక్కిస్తే), అంటే గత ఏడాదితో పోల్చితే 8.9 శాతం వృద్ధి నమోదు కావచ్చని కూడా తెలిపింది.

వ్యవసాయం నీరసమే...

- ఈ ఏడాది వ్యవసాయ రంగం వృద్ధి అంతంత మాత్రంగానే ఉండవచ్చు. గత ఏడాదితో పోల్చితే ఈ రంగం వృద్ధి రేటు 4 శాతం నుంచి 1.8 శాతానికి దిగజారే ఆస్కారం ఉంది.
- వాణిజ్యం, హోటల్, రవాణా, కమ్యూనికేషన్, బ్రాడ్‌కాస్టింగ్ సర్వీసుల రంగాల వృద్ధి 14 శాతం నుంచి 6.3 శాతానికి తగ్గవచ్చు.
- నిర్మాణ రంగం వృద్ధి రేటు 10 శాతం నుంచి 10.7 శాతానికి పెరగవచ్చు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రక్షణ, ఇతర సేవల రంగాల వృద్ధి రేటు 7.2 శాతం నుంచి 7.7 శాతానికి చేరవచ్చు.
- మౌలిక ధరల ఆధారంగా జీవీఏ (గ్రాస్ వాల్యూ యాడెడ్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.9 శాతం ఉండవచ్చు. గత ఏడాది ఇది 7 శాతం ఉంది.

ఐక్యరాజ్య సమితి అంచనా 6.2 శాతం

తయారీ, సేవల రంగాలు అందించే ఊతంతో భారత్ 2024 సంవత్సరంలో 6.2 శాతం వృద్ధిని నమోదు చేయవచ్చని ఐక్యరాజ్యసమితి తాజా అంచనాలు తెలుపుతున్నాయి. 2023 సంవత్సరానికి ప్రకటించిన అంచనా 6.3 శాతం కన్నా ఇది స్వల్పంగా దిగువన ఉంది. ఈ ఏడాది కూడా భారత్ ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థగా తన స్థానం నిలబెట్టుకుంటుందంటూ భారత్ అందించే మద్దతుతో దక్షిణాసియా మొత్తం మీద జీడీపీ వృద్ధిరేటు 5.2 శాతం ఉండవచ్చని కూడా తాజా నివేదికలో తెలిపింది. 2025లో భారత వృద్ధి రేటు 6.6 శాతం ఉండవచ్చని కూడా అంచనా వేసింది. వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం గత ఏడాదితో పోల్చితే 5.7 శాతం నుంచి 4.5 శాతానికి తగ్గవచ్చని పేర్కొంది. దేశంలో నిరుద్యోగిత కూడా సెప్టెంబరులో 7.1 శాతం ఉన్నదని, ఏడాదిలో ఇది కనిష్ఠ స్థాయి అని తెలిపింది.

రుతుపవనాలు బలహీనంగా ఉన్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగిత తగ్గడం విశేషమని పేర్కొంది. కాగా ప్రభుత్వం మౌలిక వసతుల ప్రాజెక్టులకు ఇస్తున్న ప్రాధాన్యత, బహుళ జాతి సంస్థల పెట్టుబడుల ఆధారంగా భారత్ 2023లో పెట్టుబడుల ఆకర్షణలో కూడా బలంగానే ఉన్నదని సమితి స్పష్టం చేసింది. సంపన్న ఆర్థిక వ్యవస్థల కన్నా వర్ధమాన ఆర్థిక వ్యవస్థలే పెట్టుబడుల్లో మెరుగ్గా ఉన్నాయని తెలిపింది.

విద్యుత్ ఉపకరణాలకు కొత్త నాణ్యతా నిబంధనలు

న్యూఢిల్లీ: విద్యుత్ ఉపకరణాలకు తప్పనిసరిగా పాటించవలసిన నాణ్యతా నిబంధనలను కేంద్ర ప్రభుత్వం జారీ చేసింది. ప్రమాణబద్ధంగా లేని చౌకబారు ఉపకరణాల దిగుమతికి పగ్గాలు వేసి దేశీయ తయారీని ప్రోత్సహించడం దీని లక్ష్యం. డీపీఐఐటీ.. విద్యుత్ పరికరాల (క్వాలిటీ కంట్రోల్) ఆర్డర్, 2023ని జనవరి ఒకటో తేదీన జారీ చేసింది. ఈ ఆర్డర్ కింద బీఐఎస్ మార్క్ లేని వస్తువుల ఉత్పత్తి, విక్రయం, వ్యాపారం, దిగుమతి, నిల్వ వంటి కార్యకలాపాలు ఎవరూ చేయకూడదు. నోటిఫికేషన్ జారీ అయిన నాటి నుంచి ఆరు నెలల తర్వాత ఈ ఉత్తర్వు అమలులోకి వస్తుందని ప్రభుత్వం తెలియచేసింది. ఎవరైనా బీఐఎస్ నిబంధనలు తొలిసారి ఉల్లంఘించినట్టయితే రెండు సంవత్సరాల వరకు జైలు శిక్ష రూ.2 లక్షల జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. తదుపరి ఉల్లంఘనలకు కనీస జరిమానా రూ.5 లక్షలు కాగా దాన్ని వస్తువు విలువపై 10 రెట్ల వరకు పెంచే ఆస్కారం ఉంటుంది.

పోస్టాఫీసుల్లోనూ రూ.2000 నోట్ల మార్పిడి

ముంబై: ప్రజలు తమ వద్ద ఉన్న రూ.2000 నోట్లను పోస్టాఫీసుల్లో కూడా మార్చుకోవచ్చని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ప్రకటించింది. తమ వెబ్‌సైట్‌లో తరచుగా అడిగే ప్రశ్నలు (ఎఫ్ఏక్యూ) విభాగంలో ప్రజలు పోస్టాఫీసుల ద్వారా తమ 19 కార్యాలయాల్లో ఎక్కడికైనా ఆ నోట్లను పంపవచ్చని తెలియచేసింది. ప్రజలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న ఒక దరఖాస్తు ఫారం నింపి నోట్ల మార్పిడి అభ్యర్థన పంపవచ్చని పేర్కొంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,270 ▼	58,000 ▼	78,100 ▲
ముంబై	62,540 ▼	57,287 ▼	71,550 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



5వ తేదీ		విజయవాడ	585
హైదరాబాద్	582	విశాఖపట్నం	625
6 జనవరి		వరంగల్	584
చిత్తూరు	598	దజను గుడ్లు రూ.72	
గోదావరి	585		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	75	గోదావరి	84
వరంగల్	75	విజయవాడ	84
కరీంనగర్	75	గుంటూరు	82
మహబూబ్‌నగర్	75	ఒంగోలు	82
కర్నూలు	75	చిత్తూరు	80
విశాఖపట్నం	79		

మళ్లీ 72,000పైకి సెన్సెక్స్

వరుసగా రెండో రోజూ లాభాల్లో సూచీలు

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా రెండో రోజూ లాభాల్లో ముగిశాయి. ఐటీ, టెక్నాలజీతో పాటు క్యాపిటల్ గూడ్స్ రంగ షేర్లలో కొనుగోళ్లతో పాటు విదేశీ ఇన్వెస్టర్ల కొత్త పెట్టుబడులు వారాంతంలో మార్కెట్ ర్యాలీకి దోహదపడ్డాయి. శుక్రవారం సెన్సెక్స్ ఒక దశలో 309 పాయింట్ల వరకు పెరిగి 72,156 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసుకున్నప్పటికీ, చివరికి 178.58 పాయింట్ల లాభంతో 72,026.15 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 52.20 పాయింట్లు పెరిగి 21,710.80 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో సగం లాభపడ్డాయి.

- గత నెల 29తో ముగిసిన వారానికి విదేశీ మారకం (ఫారెక్స్) నిల్వలు మరో 275 కోట్ల డాలర్ల మేర పెరిగి మొత్తం 62,320 కోట్ల డాలర్లకు చేరుకున్నాయని ఆర్‌బీఐ వెల్లడించింది. 2021 అక్టోబరులో ఫారెక్స్ నిల్వలు ఆల్‌టైం రికార్డు స్థాయి 64,500 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి.

మొబీక్విక్ రూ.700 కోట్ల ఐపీఓ: రెండేళ్ల క్రితం పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ప్రతిపాదనను విరమించుకున్న ఫిన్‌టెక్ కంపెనీ మొబీక్విక్.. మళ్లీ రంగం సిద్ధం చేసుకుంటోంది. ఐపీఓకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. అయితే, పబ్లిక్ ఇష్యూ ద్వారా నిధుల సమీకరణ లక్ష్యాన్ని రూ.700 కోట్లకు తగ్గించుకుంది. తొలి ప్రయత్నంలో నిర్దేశించుకున్న రూ.1,900 కోట్ల టార్గెట్‌తో పోలిస్తే చాలా తక్కువిది. కాగా, ప్రభుత్వ రంగానికి చెందిన ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ (ఐఐఎఫ్‌సీఎల్) వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25)లో పబ్లిక్ ఇష్యూకు రావాలనుకుంటోంది.

కావేరీ సీడ్స్ రూ.325 కోట్ల షేర్ల బైబ్యాక్

హైదరాబాద్‌కు చెందిన కావేరీ సీడ్స్ బోర్డు శుక్రవారం రూ.325 కోట్ల విలువైన సొంత షేర్ల తిరిగి కొనుగోలు (బైబ్యాక్)కు ఆమోదం తెలిపింది. టెండర్ ఆఫర్ పద్ధతిన జరగనున్న ఈ బైబ్యాక్‌లో ఒక్కో షేరుకు చెల్లించనున్న ధరను కంపెనీ రూ.725గా నిర్ణయించింది. ప్రస్తుత షేరు ధరతో పోలిస్తే దాదాపు 10 శాతం అధికమిది. వారాంతం ట్రేడింగ్‌లో కావేరీ సీడ్స్ షేరు బీఎస్ఈలో 1.18 శాతం పెరిగి రూ.662.60 వద్ద ముగిసింది. బైబ్యాక్‌లో భాగంగా కంపెనీ గరిష్ఠంగా 44,82,758 షేర్లను కొనుగోలు చేయనుంది. కంపెనీ పెయిడప్ క్యాపిటల్‌లో 8.01 శాతం వాటాకు సమానమిది.

కాగా, ధామ్‌పూర్ షుగర్ మిల్స్ కంపెనీ మొత్తం పెయిడప్ క్యాపిటల్‌లో 1.50 శాతం వాటాకు సమానమైన 10 లక్షల షేర్లను ఒక్కోటీ రూ.300 చొప్పున తిరిగి కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించింది.

షార్ట్ సెల్లింగ్ లావాదేవీలకు చెక్

మార్కెట్ ఆటుపోట్లకు బ్రేక్!

న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్లో తీవ్ర ఆటుపోట్లను కట్టడి చేసేందుకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ మరో కీలక చర్య తీసుకుంది. ఇక నుంచి షార్ట్ సెల్లింగ్ చేసే సంస్థాగత మదుపరులు షార్ట్ సెల్లింగ్ పొజిషన్లు తీసుకుంటుంటే.. ఆ విషయం ఆర్డర్ ప్లేస్ చేసేటప్పుడే వెల్లడించాలని స్పష్టం చేసింది. రిటైల్ మదుపరులు మాత్రం ఈ విషయాన్ని ఆర్డర్ ప్లేస్ చేసిన ట్రేడింగ్ రోజు చివర్లో వెల్లడించాలని కోరింది. బ్రోకర్లు ఈ విషయాన్ని అదే రోజు షార్ట్ సెల్లింగ్‌లో ఉన్న షేర్ల వివరాలను, షేర్ల వారీగా స్టాక్ ఎక్స్ఛేంజీల వెబ్‌సైట్లలో అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేసింది. స్టాక్ ఎక్స్ఛేంజీలు ఈ వివరాలను కనీసం వారానికి ఒకసారి తమ వెబ్‌సైట్స్‌లో అప్‌డేట్ చేయాలని కోరింది.

షార్ట్ సెల్లింగ్ అంటే: ఒక కంపెనీ షేరు ధర పడిపోతుందనే నమ్మకం ఉంటే.. ఆ కంపెనీ షేర్లు తమ వద్ద లేకపోయినా ప్రస్తుత ధరకు అమ్మి.. ఆ షేర్ల ధరలు తగ్గగానే కొని లావాదేవీని పూర్తి చేయడాన్ని షార్ట్ సెల్లింగ్ అంటారు. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ వంటి సంస్థాగత మదుపరులు కావాలని దుష్ప్రచారం చేసి.. తమ గ్రూప్ కంపెనీల షేర్ల ధరలను షార్ట్ సెల్లింగ్ ద్వారా పడగొట్టి సొమ్ము చేసుకున్నాయన్న అదానీ గ్రూప్ ఆరోపణల నేపథ్యంలో సెబీ ఈ చర్య తీసుకుందని భావిస్తున్నారు.

టాటా 'పంచ్ ఈవీ' బుకింగ్స్ షురూ

దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటార్స్.. కాంపాక్ట్ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ 'పంచ్ ఈవీ' బుకింగ్స్‌ను ప్రారంభించింది. ఆన్‌లైన్‌లో రూ.21,000 డౌన్ పేమెంట్‌తో ఈ మోడల్‌ను బుక్ చేసుకోవచ్చని తెలిపింది. దీనికి తోడు 'యాక్టి.ఈవీ' పేరుతో మరో ఈవీ మోడల్‌ను అభివృద్ధి చేస్తోంది. అత్యాధునిక ఫీచర్లతో అభివృద్ధి చేస్తున్న ఈ ఎలక్ట్రిక్ కారు బ్యాటరీ ఒకసారి చార్జింగ్ చేస్తే 300 నుంచి 600 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని కంపెనీ తెలిపింది. ఈ ప్లాట్‌ఫామ్ ఆధారంగా వచ్చే ఏడాదిన్నరలో ఐదుకు పైగా ఈవీ మోడల్స్ మార్కెట్లోకి విడుదల చేస్తామని కంపెనీ ప్రకటించింది.

బ్రూక్‌ఫీల్డ్ చేతికి ఏటీసీ భారత వ్యాపారం

న్యూఢిల్లీ: అమెరికన్ టవర్ కార్పొరేషన్ (ఏటీసీ) భారత వ్యాపారాన్ని కెనడాకు చెందిన బ్రూక్‌ఫీల్డ్ కొనుగోలు చేయనుంది. ఈ ఒప్పందం విలువ 250 కోట్ల డాలర్లు. ప్రస్తుత మారకం రేటు ప్రకారం మన కరెన్సీలో సుమారు రూ.21,000 కోట్లు. నియంత్రణ సంస్థల అనుమతులకు లోబడి ఈ ఏడాది ద్వితీయార్థంలో ఒప్పందం పూర్తి కావచ్చని అంచనా. డీల్‌లో భాగంగా ఏటీసీ విలువను 200 కోట్ల డాలర్లు (రూ.16,500 కోట్లు)గా లెక్కగట్టినట్లు బ్రూక్‌ఫీల్డ్ తెలిపింది. దాంతోపాటు 2023 అక్టోబరు 1 నుంచి డీల్ పూర్తయ్యేవరకు చెల్లించాల్సిన టికింగ్ ఫీజుతో కలిపి డీల్ విలువ మొత్తం రూ.21,000 కోట్లకు చేరుకోనుందని వెల్లడించింది. టెలికాం మౌలిక వసతులు కల్పించే ఏటీసీ ఇండియా.. దేశవ్యాప్తంగా 78,300 మొబైల్ టవర్లను నిర్వహిస్తోంది. భారత్‌లో బ్రూక్‌ఫీల్డ్ 2,500 కోట్ల డాలర్ల విలువైన ఆస్తులను కలిగి ఉంది.

బోణీ ఘనంగా..

- షఫాలీ, మంధాన అర్ధసెంచరీలు
- 9 వికెట్ల తేడాతో భారత్ విజయం
- టిటాస్‌కు నాలుగు వికెట్లు
- తొలి టీ20లో ఆసీస్ ఓటమి





ముంబై: వన్డేల్లో వరుస ఓటములతో డీలా పడిన భారత మహిళల క్రికెట్ జట్టు పొట్టి ఫార్మాట్ తొలి మ్యాచ్‌లో ఆల్‌రౌండ్‌షోతో ఆకట్టుకుంది. శుక్రవారం ఆస్ట్రేలియాతో జరిగిన తొలి టీ20లో 19 ఏళ్ల టీనేజర్ టిటాస్ సాధు కెరీర్‌లో ఉత్తమ గణాంకాల (4-0-17-4)తో చెలరేగింది. ఆ తర్వాత స్వల్ప ఛేదనను ఓపెనర్లు షఫాలీ వర్మ (44 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 64 నాటౌట్), స్మృతి మంధాన (52 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్‌తో 54) సునాయాసంగా ఛేదనను ముగించారు. దీంతో 9 వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించిన భారత్ మూడు టీ20ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ 19.2 ఓవర్లలో 141 పరుగులకు ఆలౌటైంది. లిచ్‌ఫీల్డ్ (49), పెర్రీ (37) ఆకట్టుకున్నారు. ఛేదనలో భారత్ 17.4 ఓవర్లలో వికెట్ నష్టానికి 145 పరుగులు చేసి గెలిచింది. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా టిటాస్ సాధు నిలిచింది.

ఓపెనర్లే బాదేశారు: ఛేదనలో భారత ఓపెనర్లు షఫాలీ, మంధాన తొలి వికెట్‌కు 137 పరుగుల భారీ భాగస్వామ్యం అందించడం విశేషం. భారత్‌కు పవర్‌ప్లేలో జట్టు 59 పరుగులు సాధించింది. ఇక 12వ ఓవర్‌లో షఫాలీ 6,4తో అర్ధసెంచరీ పూర్తి చేసుకుంది. ఈ ఓవర్‌లో మొత్తంగా 24 పరుగులు వచ్చాయి. ఛేదనను ఓపెనర్లే ముగిస్తారనిపించినా పిప్పీ పూర్తి చేశాక మంధానను వేర్‌హమ్ అవుట్ చేసింది. దీంతో తొలి వికెట్ భాగస్వామ్యం ముగిసింది. అప్పటికి 5 పరుగులే చేయాల్సి ఉండగా జెమీమా (6 నాటౌట్) ఫోర్‌తో మరో 14 బాల్స్ ఉండగానే మ్యాచ్‌ను ముగించింది.

వహ్వా.. టిటాస్ : టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ తొలి వికెట్‌కు 28 పరుగులు జత చేరినా.. టిటాస్ ధాటికి పవర్‌ప్లేలోనే నాలుగు వికెట్లు కోల్పోయింది. ఈ సమయంలో తను మూడు ఓవర్లలో 8 రన్స్‌కు మూడు వికెట్లు తీయడం విశేషం. మొదట జోరు మీదున్న ఓపెనర్ మూనీ (17) వికెట్ తీయగా.. ఆరో ఓవర్ వరుస బంతుల్లో తహిలా, గార్డ్‌నర్‌లను డకౌట్లుగా పెవిలియన్ చేర్చింది. హీలీ (8)ని రేణుక అవుట్ చేసింది. 33/4 స్కోరుతో ఇబ్బందుల్లో పడిన జట్టును పెర్రీ, లిచ్‌ఫీల్డ్ ఆదుకున్నారు. లిచ్‌ఫీల్డ్‌ను అవుట్ చేయడం ద్వారా ఈ జోడీని 15వ ఓవర్‌లో అమన్‌జోత్ విడదీసింది. అనంతరం వికెట్ల పతనం వేగంగా సాగింది.

స్కోరుబోర్డు


ఆస్ట్రేలియా: హీలీ (సి) హర్మన్‌ప్రీత్ (బి) రేణుకా సింగ్ 8; మూనీ (సి) హర్మన్‌ప్రీత్ (బి) టిటాస్ 17; తహిలా (సి) వస్త్రాకర్ (బి) టిటాస్ 0; ఎలిస్ (సి) అమన్‌జోత్ (బి) దీప్తి శర్మ 37; గార్డ్‌నర్ (సి అండ్ బి) టిటాస్ 0; లిచ్‌ఫీల్డ్ (సి) హర్మన్‌ప్రీత్ (బి) అమన్‌జోత్ 49; హ్యారిస్ (ఎల్బీ) శ్రేయాంక 1; సదర్లాండ్ (సి) హర్మన్‌ప్రీత్ (బి) టిటాస్ 12; వేర్‌హమ్ (సి) అమన్‌జోత్ (బి) శ్రేయాంక 5; మెగాన్ షట్ (ఎల్బీ) దీప్తి శర్మ 1; బ్రౌన్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 19.2 ఓవర్లలో 141 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-28, 2-32, 3-32, 4-33, 5-112, 6-119, 7-135, 8-135, 9-137, 10-141; **బౌలింగ్:** రేణుక 4-0-24-1; వస్త్రాకర్ 2-0-28-0; సాధు 4-0-17-4; శ్రేయాంక 3.2-0-19-2; దీప్తి శర్మ 4-0-24-2; అమన్‌జోత్ 2-0-23-1.

భారత్: మంధాన (సి) తహిలా (బి) వేర్‌హమ్ 54; షఫాలీ (నాటౌట్) 64; జెమీమా (నాటౌట్) 6; **ఎక్స్‌ట్రాలు: 21; మొత్తం: 17.4 ఓవర్లలో 145/1. వికెట్ పతనం:** 1-137. **బౌలింగ్:** బ్రౌన్ 2-0-10-0; షట్ 4-0-26-0; సదర్లాండ్ 2-0-21-0; గార్డ్‌నర్ 4-0-24-0; మెక్‌గ్రాత్ 2-0-31-0; వేర్‌హమ్ 3.4-0-20-1.

టీ20 ప్రపంచకప్ షెడ్యూల్ వచ్చేసింది

జూన్ 9న భారత్-పాక్ పోరు

- న్యూయార్క్‌లో సమరం
- 20 జట్లు..4 గ్రూపులు
- గత టోర్నీకంటే నాలుగు టీమ్‌లు అదనం



న్యూఢిల్లీ: ప్రపంచ క్రికెట్ ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్న పురుషుల టీ20 వరల్డ్ కప్ షెడ్యూల్ వచ్చేసింది. వెస్టిండీస్/అమెరికా సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నమెంట్ జూన్ ఒకటిన మొదలవనుంది. అదేనెల 29న బార్బడోస్‌లో జరిగే ఫైనల్‌తో ముగియనుంది. శుక్రవారం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం.. మొత్తం 20 జట్లు 4 గ్రూపులుగా విడిపోయి తలపడతాయి. ఆస్ట్రేలియాలో జరిగిన గత ప్రపంచ కప్‌లో 16జట్లు తలపడ్డాయి. ఈసారి కెనడా, అమెరికా, ఉగాండ జట్లు తొలిసారి బరిలో దిగుతున్నాయి. గ్రూపు దశలో ప్రతి జట్టూ మరో జట్టుతో ఒకసారి ఆడతాయి. ప్రారంభ మ్యాచ్‌లో అమెరికా-కెనడా జట్లు డాలస్‌లో ఢీకొంటాయి. డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ జూన్ 8న ఆస్ట్రేలియాతో మ్యాచ్‌తో టోర్నీని ఆరంభిస్తుంది. ఇక టోర్నమెంట్ బ్లాక్‌బస్టర్ భారత్-పాకిస్థాన్ పోరు జూన్ 9న జరగనుంది. న్యూయార్క్ లోని ఐసెన్ హోవర్ పార్క్ స్టేడియం ఈ సమరానికి వేదిక కానుంది. మెన్ ఇన్ బ్లూ తన ప్రారంభ మ్యాచ్‌లో జూన్ 5న ఐర్లాండ్‌ను ఢీకొంటుంది. గ్రూపులో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్-8కి క్వాలిఫై అవుతాయి. సూపర్-8లో నాలుగేసి జట్లు రెండు గ్రూపులుగా తలపడతాయి. రెండు గ్రూపుల్లో మొదటి రెండు స్థానాలు సాధించిన జట్లు సెమీస్‌కు చేరతాయి.

టీమిండియా గ్రూప్ షెడ్యూల్

గ్రూప్ 'ఎ'లో బరిలో దిగుతున్న టీమిండియా.. మొదటి మూడు మ్యాచ్‌లను న్యూయార్క్‌లో, నాలుగో పోటీని ఫ్లోరిడాలో ఆడుతుంది.

- జూన్ 5: ఐర్లాండ్‌తో
- జూన్ 9: పాకిస్థాన్‌తో
- జూన్ 12: అమెరికాతో
- జూన్ 15: కెనడాతో

మొత్తం 55 మ్యాచ్‌లు..


టోర్నీలో మొత్తం 55 మ్యాచ్‌లు.. వెస్టిండీస్‌లోని ఆరు వేదికల్లో, అమెరికాలో మూడు స్టేడియాల్లో జరుగుతాయి. గ్రూప్ 'ఎ' టీమ్‌ల మ్యాచ్‌లన్నీ అమెరికాలో నిర్వహిస్తారు. గ్రూప్ 'బి', గ్రూప్ 'సి' జట్లన్నీ.. వెస్టిండీస్‌లో తమ మ్యాచ్‌లు ఆడతాయి. గ్రూప్ 'డి' టీమ్‌ల మ్యాచ్‌లు మాత్రం వెస్టిండీస్/అమెరికాల్లో జరుగుతాయి. జూన్ ఒకటి నుంచి 18 వరకు గ్రూపు దశ మ్యాచ్‌లు నిర్వహిస్తారు.

గ్రూప్ 'ఎ'	భారత్, పాకిస్థాన్, ఐర్లాండ్, కెనడా, యూఎస్ఏ
గ్రూప్ 'బి'	ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, నమీబియా, స్కాట్లాండ్, ఒమన్
గ్రూప్ 'సి'	న్యూజిలాండ్, వెస్టిండీస్, అఫ్ఘానిస్థాన్, ఉగాండ, పపువా న్యూ గినీ
గ్రూప్ 'డి'	సౌతాఫ్రికా, శ్రీలంక, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్, నేపాల్

సూపర్-8లో ఇలా.. (జూన్ 19-24)

మొదటి గ్రూపు	ఎ1, బి2, సి1, డి2
రెండో గ్రూపు	ఎ2, బి1, సి2, డి1
జూన్ 26	తొలి సెమీఫైనల్ (గయానా)
జూన్ 27	రెండో సెమీఫైనల్ (ట్రినిడాడ్)
జూన్ 29	ఫైనల్ (బార్బడోస్)

ఓటమి బాటలో పాక్



హాజెల్‌వుడ్ (4/9)

సిడ్నీ: పాకిస్థాన్‌తో మూడో టెస్ట్‌లో ఆస్ట్రేలియా విజయం దిశగా సాగుతోంది. ప్రత్యర్థికి స్వల్ప తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కోల్పోయిన ఆతిథ్య జట్టు రెండో ఇన్నింగ్స్‌లో హాజెల్‌వుడ్ (4/9) విజృంభణతో మ్యాచ్‌పై పూర్తిగా పట్టు బిగించింది. అతడి ధాటికి పాక్ రెండో ఇన్నింగ్స్‌లో శుక్రవారం ఆట ఆఖరికి 68 పరుగులకే 7 వికెట్లు చేజార్చుకుంది. సాయిమ్ అయూబ్ (33), బాబర్ ఆజమ్ (23) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. మొదటి ఇన్నింగ్స్‌లో లభించిన 14 రన్స్‌తో కలిపి పర్యాటక జట్టు మొత్తంగా..82 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. అంతకుముందు ఓవర్‌నైట్..116/2 స్కోరుతో మూడోరోజు మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్..పేసర్ ఆమెర్ జమాల్ (6/69) ధాటికి 299 రన్స్‌కే ఆలౌటైంది. లబుషేన్ (60), మిచెల్ మార్ష్ (54) అర్ధ శతకాలు చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో పాక్ 313 రన్స్ చేసిన సంగతి తెలిసిందే.

టెస్టుల్లో నెంబర్1 ఆసీస్

దుబాయ్: ఐసీసీ టెస్టు టీమ్ ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా అగ్రస్థానానికి దూసుకెళ్లింది. పాకిస్థాన్‌తో జరుగుతున్న మూడు టెస్టుల సిరీస్‌లో 2-0 ఆధిక్యంలో ఉన్న ఆసీస్ 118 రేటింగ్ పాయింట్లతో భారత్ (117)ను వెనక్కినెట్టింది. దక్షిణాఫ్రికాతో సిరీస్‌ను 1-1తో డ్రా చేసుకోవడంతో భారత్ రెండో స్థానానికి పడిపోయింది. వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో మాత్రం భారత్ టాప్‌లో కొనసాగుతోంది. ఆడిన 4 టెస్టుల్లో 2 విజయాలు, ఒక ఓటమి, ఒక డ్రా ఉన్నాయి. సౌతాఫ్రికా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

సురేఖ ఆవేదనలో అర్థం ఉంది!



- ఖేల్‌రత్న కోసం ఆమె వినతిని పరిగణించండి
- ఈ నెల 8లోగా నిర్ణయాన్ని వెల్లడించండి
- కేంద్ర క్రీడాశాఖ మంత్రికి హైకోర్టు ఆదేశం
- అనురాగ్ ఠాకూర్, ఎంపిక కమిటీకి నోటీసులు
- విచారణ ఫిబ్రవరి 5వ తేదీకి వాయిదా

అమరావతి (ఆంధ్రజ్యోతి): మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డుకు తనను ఎంపిక చేయకపోవడాన్ని సవాల్ చేస్తూ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ దాఖలుచేసిన పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. కేంద్ర ప్రభుత్వంతో పాటు ఖేల్‌రత్న అవార్డు ఎంపిక కమిటీకి నోటీసులు జారీచేసింది. ఖేల్‌రత్న కోసం సురేఖ ఇచ్చిన వినతిపత్రంపై ఈ నెల 8లోగా నిర్ణయం తీసుకోవాలని కేంద్ర క్రీడాశాఖ మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్‌ను ఆదేశించింది. కోర్టుముందు ఉంచిన రికార్డులను పరిశీలిస్తే జ్యోతి సురేఖ ఆవేదనలో న్యాయం ఉందనిపిస్తోందని ప్రాథమికంగా అభిప్రాయపడింది. అయితే వ్యాజ్యంపై లోతైన విచారణ జరపాల్సిన అవసరం ఉందని పేర్కొంది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న అవార్డు ఎంపిక కమిటీ ఛైర్మన్, సభ్యులకు నోటీసులు జారీచేసింది. విచారణను ఫిబ్రవరి 5వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్య శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు.

2023 ఏడాదికిగానూ ఖేల్‌రత్న అవార్డుకు తన పేరును ఎంపిక చేసేలా ఎంపిక కమిటీని ఆదేశించాలని కోరుతూ ఆర్చర్ జ్యోతి సురేఖ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా పిటిషనర్ తరపున న్యాయవాది ఉన్నం శ్రవణ్ కుమార్ వాదనలు వినిపించారు. ఖేల్‌రత్న అవార్డుకు పిటిషనర్ అన్నివిధాలా అర్హురాలని వివరించారు. ఆమె తీసుకున్న అవార్డులు, సాధించిన పాయింట్లను కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు, ఎంపిక విధానాన్ని పరిగణలోకి తీసుకొంటే పిటిషనర్‌కు 148.74 శాతం పాయింట్లు ఉన్నాయన్నారు. పిటిషనర్ కన్నా తక్కువ పాయింట్లు ఉన్న ఆటగాళ్లను ఖేల్‌రత్న అవార్డుకు ఎంపిక చేశారని పేర్కొన్నారు.

ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ రేసులో కోహ్లీ, జడేజా

దుబాయ్: విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజా ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్-2023 అవార్డుకు నామినేట్ అయ్యారు. సర్ గ్యారీఫీల్డ్ సోబర్స్ పేరిట బహూకరించే ఈ ట్రోఫీ కోహ్లీకి లభిస్తే అత్యధిక సార్లు (3) గెలుచుకున్న ఆటగాడిగా నిలుస్తాడు. ఆసీస్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌తో పాటు ట్రావిస్ హెడ్ కూడా ఈ అవార్డు రేసులో ఉన్నారు.

రాహుల్ సింగ్ ద్విశతకం

- తిలక్ వర్మ సెంచరీ
- హైదరాబాద్ 474/5 డిక్లేర్డ్
- నాగాలాండ్‌తో రంజీ

దిమాపూర్ (నాగాలాండ్): రాహుల్ సింగ్ (214), కెప్టెన్ తిలక్ వర్మ (100 నాటౌట్) శతకాలతో చెలరేగడంతో నాగాలాండ్‌తో శుక్రవారం ప్రారంభమైన రంజీ ప్లేట్ గ్రూప్ మ్యాచ్‌లో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌ను 474/5 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. రాహుల్ సింగ్, తిలక్ వర్మ మూడో వికెట్‌కు 118 పరుగులు జోడించారు. ఇక..రాహుల్, తన్మయ్ అగర్వాల్ (80) రెండో వికెట్‌కు ఏకంగా 227 రన్స్ జత చేయడం విశేషం. అనంతరం మొదటి ఇన్నింగ్స్ చేపట్టిన నాగాలాండ్ తొలి రోజు ఆఖరికి వికెట్ నష్టానికి 35 పరుగులు చేసింది.

జైలు నుంచి పిస్టోరియస్ విడుదల



ప్రిటోరియా: ఒలింపిక్, పారా ఒలింపిక్ రన్నర్ ఆస్కార్ పిస్టోరియస్ శుక్రవారం జైలు నుంచి పెరోల్‌పై విడుదలయ్యాడు. గర్ల్‌ఫ్రెండ్ రీవా స్టీన్‌క్యాంప్‌ను 2013లో దారుణంగా హత్య చేసిన పిస్టోరియస్‌ను 2015లో కోర్టు దోషిగా తేల్చి 13 ఏళ్ల జైలు శిక్ష విధించింది. దాదాపు తొమ్మిది సంవత్సరాలు శిక్ష పూర్తి చేసుకున్న 37 ఏళ్ల ప్రిటోరియస్ పెరోల్‌పై బయటకు వచ్చాడు.

సెమీస్‌లో తెలుగు యోధాస్

కటక్: అల్టిమేట్ ఖో-ఖో లీగ్‌లో సెమీఫైనల్ బెర్త్ దక్కించుకున్న తొలి జట్టుగా తెలుగు యోధాస్ నిలిచింది. శుక్రవారం ఇక్కడ జరిగిన పోరులో యోధాస్ 38-30 పాయింట్ల తేడాతో చెన్నై క్విక్ గన్స్‌ను ఓడించింది. ఇప్పటిదాకా 8 మ్యాచ్‌లాడిన తెలుగు జట్టు 6 విజయాలు, 2 ఓటములతో 18 పాయింట్లు సాధించి టేబుల్ టాపర్‌గా సెమీస్ చేరింది.

పథకాల రద్దుకు సర్కారు కుట్ర

- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నియోజకవర్గ కేంద్రాల్లో నిరసనలు
- పార్టీ నేతలతో కేటీఆర్, హరీశ్ టెలీకాన్ఫరెన్స్




హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు లబ్ధి చేకూర్చే పథకాలను రద్దు చేసేందుకు కాంగ్రెస్ సర్కారు కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా తమ పార్టీ తరఫున నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. శుక్రవారం ఆయన మాజీ మంత్రి హరీశ్‌తో కలిసి పార్టీ ఎమ్మెల్యేలు, మాజీలు, ఇన్‌చార్జిలతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారం చేపట్టాక రాజకీయ అక్కసుతో బీఆర్ఎస్ అమలు చేసిన అనేక పథకాలను రద్దు చేస్తోందన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. ప్రభుత్వ వ్యవస్థ శాశ్వతం అనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. గృహలక్ష్మి, దళిత బంధు, గొర్రెల పంపిణీ వంటివి రద్దు చేయడమంటే పేదలకు ద్రోహం చేసినట్లేనన్నారు. ఇప్పటికే గృహలక్ష్మిని రద్దు చేస్తూ జీవో ఇచ్చిందని, పథకానికి ఎంపికైన లబ్ధిదారుల పరిస్థితి ఏంటో వెల్లడించాలని డిమాండ్ చేశారు. తమ పార్టీ ప్రజల తరఫున పోరాటం చేస్తుందని వారు వెల్లడించారు.

అంతర్‌రాష్ట్ర బదిలీలను వేగవంతం చేయండి

- సీఎం రేవంత్‌కు లేఖ అందజేసిన కూనంనేని

హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన సమయంలో ఆప్షన్లు ఇవ్వలేక మిగిలిపోయిన ప్రభుత్వ ఉద్యోగుల్లో జిల్లా, జోనల్, మల్టీ జోనల్ ఉద్యోగులను వారు కోరుకున్న రాష్ట్రానికి వెళ్లేలా బదిలీలు వేగవంతం చేయాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డికి లేఖను అందజేశారు. ఏపీ నుంచి తెలంగాణకు 1,808 మంది వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు, తెలంగాణ నుంచి ఏపీకి 1,396 మంది ఉద్యోగులు గత ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు, సర్క్యులర్ల ప్రకారం దరఖాస్తు చేసుకుని ఉన్నట్లు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఏపీ నుంచి తెలంగాణకు వచ్చేందుకు దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు రాష్ట్రప్రభుత్వ అనుమతి కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. మానవతా దృక్పథంతో వీరి బదిలీల సమస్య పరిష్కరించాలని కోరారు.

సీబీఐ దర్యాప్తుపై వెనుకంజ ఎందుకు?:బీజేపీ

హైదరాబాద్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో సీబీఐ దర్యాప్తుకు ఎందుకు వెనుకంజ వేస్తున్నారని బీజేపీ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జ్ పి. మురళీధర్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌ను బెదిరించి పొలిటికల్ మ్యాచ్ ఫిక్సింగ్ కోసమే సీబీఐని వద్దంటున్నారా..? అని నిలదీశారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మురళీధర్‌రావు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణకు డిమాండ్ చేసిందని గుర్తుచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో గతంలో సీబీఐ దర్యాప్తు కోసం డిమాండ్ చేసి, ఇప్పుడు జ్యుడీషియల్ విచారణకు ఆదేశిస్తామని చెప్పడం వెనుక మతలబు ఏంటని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. కాంగ్రెస్ ద్వంద్వ విధానాలకు ఇది ఒక ఉదాహరణ అని ఒక ప్రకటనలో తెలిపారు.

మాజీ అయ్యాక ఎక్కడ ఉండాలి? ఏం చేయాలి?

- కేసీఆర్‌ను జగన్ సలహా అడిగారు: నారాయణ

చెన్నై, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌ను గురువారం ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి పరామర్శించడంపై సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తనదైన శైలిలో చలోక్తులు విసిరారు. తాను మాజీ అయ్యాక ఎక్కడ ఉండాలో, ఏం చేయాలో కేసీఆర్‌ను జగన్ సలహా అడిగి ఉంటారని ఎద్దేవా చేశారు. తమిళనాడు సీపీఐ ఇన్‌చార్జిగా వున్న నారాయణ శుక్రవారం చెన్నైలో జరిగిన ఆ పార్టీ రాష్ట్ర స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. 'ఎన్నికల్లో ఓడిపోయి ఫాంహౌస్‌కు పరిమితమైన కేసీఆర్‌ను.. లోక్‌సభ ఎన్నికల తరువాత తానెక్కడ ఉండాలో చెప్పాలని జగన్ సలహా అడిగినట్లు నాకు తెలిసింది. జగన్ వదిలిన బాణం షర్మిల ప్రస్తుతం ఏపీ రాజకీయాల్లో ప్రవేశించడం వల్ల పెనుమార్పులు జరిగే అవకాశముంది' అని నారాయణ పేర్కొన్నారు.

ఐఐటీహెచ్‌లో ఇన్నోవేషన్ ఫెయిర్

కంది, జనవరి 5: ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా దేశంలోని విద్యాసంస్థలు, పరిశ్రమల అనుసంధానం కోసం ఈ నెల 19, 20 తేదీల్లో ఐఐటీహెచ్‌లో 'ఇన్వెంటివ్-2024' పేరుతో మెగా ఇన్నోవేషన్ ఫెయిర్ నిర్వహించనున్నట్లు బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి తెలిపారు. ఐఐటీహెచ్‌లో తొలిసారిగా మెగా రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డీ) ఫెయిర్ 2వ ఎడిషన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో దేశంలోని అన్ని ఐఐటీలు, ఎన్ఐటీలు, ఐఐఐటీలతోపాటు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు కలిగిన 120 ఉన్నత విద్యాసంస్థలు పాల్గొననున్నాయని పేర్కొన్నారు.

ధరణిని ఉంచుతారా? తీసేస్తారా?: హైకోర్టు

హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూముల రికార్డుల నిర్వహణకు తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌ను అలాగే కొనసాగిస్తారా? తీసేస్తారా? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. ధరణిలోని సమస్యలను ప్రస్తావిస్తూ దాఖలైన పలు పిటిషన్‌లపై జస్టిస్ కె. లక్ష్మణ్ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధరణి పోర్టల్‌ను కొనసాగిస్తారా, లేదా అని అడ్వకేట్ జనరల్ ఎ. సుదర్శన్‌రెడ్డి ప్రశ్నించింది. ఇందుకు ఆయన సమాధానం ఇస్తూ ధరణి లోటుపాట్లపై ప్రభుత్వం పరిశీలన జరుపుతోందని చెప్పారు. సమాధానం ఇచ్చేందుకు నాలుగు వారాల సమయం ఇవ్వాలని కోరారు. ధరణిలో ఉన్న లోపాలను సవరించాలని గత ఏడాది ఏప్రిల్‌లో 20 అంశాలతో తాము ఆదేశాలు జారీచేశామని, వాటిని అమలు చేశారా? అని ధర్మాసనం ప్రశ్నించింది. గత ఆదేశాల అమలుపై నివేదిక ఇవ్వాలని సీసీఎల్ఏకు ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

గోదావరి తీరంలో ఘనంగా తెలుగు పండుగ

- 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభలు ప్రారంభం
- దక్షిణాది రాష్ట్రాల్లో తెలుగుకు ప్రత్యేక విశిష్టత
- ఛత్తీస్‌గఢ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్
- మాతృభాషను చంపేస్తున్న రెండు రాష్ట్రాలూ: స్వరూపానంద



రాజమహేంద్రవరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాల్లో తెలుగు భాషకు ప్రత్యేక విశిష్టత ఉందని ఛత్తీస్‌గఢ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ పేర్కొన్నారు. రాజరాజ నరేంద్రుడి పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవాలకు నీరాజనంగా, మహాభారతాన్ని నన్నయ ఆంధ్రీకరించి వెయ్యేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థలు సంయుక్తంగా రాజమహేంద్రవరంలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభలు శుక్రవారం కన్నుల పండువగా ప్రారంభమయ్యాయి. విశ్వభూషణ్ హరిచందన్ జ్యోతి ప్రజ్వలన చేసి సభలకు అంకురార్పణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాల్లో తెలుగుకు ఒక ప్రత్యేకత ఉందన్నారు. విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి అభిభాషణం చేస్తూ తెలుగు భాష పట్ల రెండు తెలుగు రాష్ట్రాలూ అనుసరిస్తున్న తీరుపై అసహనం వ్యక్తం చేశారు. సంస్కృతం కంటే గొప్పదైన తెలుగు భాషను రెండు తెలుగు రాష్ట్రాలూ చంపేస్తున్నాయని ఆక్షేపించారు. బీజేపీ జాతీయ నేత రామ్‌మాధవ్ మాట్లాడుతూ 'ప్రపంచంలో అన్ని భాషలూ గొప్పవే. తల్లులందరూ గొప్పవారే. అయితే మన తల్లి పట్ల ఎంతటి అభిమానం ఉంటుందో అలాగే మన మాతృభాష పట్ల అభిమానం ఉండడం సహజమే కాకుండా అవసరం కూడా. తెలుగుభాష చాలా గొప్ప భాష. ప్రపంచంలో ఇన్ని అక్షరాలు ఉన్న భాషలు వేరే లేవు. అవధానాల భాష తెలుగు భాష. ఈ అవధాన ప్రక్రియ కేవలం తెలుగులోనే ఉంది' అని కొనియాడారు.

మెదడులో కణితుల్ని మింగే చిట్టి రోబోలు

- అల్ట్రా సౌండ్ విధానంతో కణితుల ధ్వంసం
- న్యూరోసర్జరీల్లో కొత్త వైద్య చికిత్సలపై హైదరాబాద్‌లో అంతర్జాతీయ సదస్సు

హైదరాబాద్ సిటీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): శస్త్రచికిత్స అవసరం లేకుండా.. మెదడులోని కణితులకు చికిత్స చేసే చిట్టి రోబోలు అందుబాటులోకి రాబోతున్నాయి. కేవలం ఒక సెంటీమీటరు పరిమాణంలో ఉండే ఆ చిన్న రోబోను.. చిన్న రంధ్రం చేసి కణితి వద్ద పంపిస్తే చాలు.. అది ఆ కణితిని తినేస్తుంది. పనైపోయాక అదే రంధ్రం ద్వారా దాన్ని బయటకు తీసేయొచ్చు. ప్రస్తుతం ప్రయోగాల దశలో ఉన్న ఈ టెక్నాలజీ అందరికీ అందుబాటులోకి రావడానికి మరో పదేళ్లు పడుతుంది. అలాగే.. సర్జరీ అవసరం లేకుండా అల్ట్రా సౌండ్ ద్వారా మెదడు కణితులను ధ్వంసం చేసే విధానం మరొకటి. అది రానున్న రెండు మూడేళ్లలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందట!! న్యూరోసర్జరీలలో సరికొత్త వైద్య చికిత్సలు, పరిణామాలపై.. శుక్రవారంనాడు రాజధాని నగరంలో మొదలైన అంతర్జాతీయ స్థాయి శాస్త్రీయ సదస్సులో (సొసైటీ ఫర్ ఇమేజ్ గైడెడ్ న్యూరోఇంటర్వెన్షన్స్-సైన్) న్యూరాలజిస్టులు పరిచయం చేసిన సరికొత్త వైద్య పరిజ్ఞానాలివి. 12 దేశాలకు చెందిన 125 మంది న్యూరోసైన్సెస్ నిపుణులు ఈ సదస్సులో పాల్గొని.. ఈ రంగంలో జరుగుతున్న పరిశోధనల గురించి, అందుబాటులోకి రానున్న కొత్త పరిజ్ఞానాల గురించి వివరిస్తున్నారు. రెండు రోజుల పాటు రామోజీ ఫిలింసిటీ(ఆర్ఎఫ్‌సీ)లో, ఆదివారం సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు కిమ్స్ ఆస్పత్రికి చెందిన సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ మానస్ కుమార్ పాణిగ్రాహి వివరించారు. న్యూరోసర్జరీల్లో రాబోయే కొన్నేళ్లల్లో విప్లవాత్మక పరిణామాలు చోటు చేసుకోబోతున్నాయని ఆయన వెల్లడించారు. అయితే శుక్రవారం నాటి సదస్సులో పరిచయం చేసిన అల్ట్రా సౌండ్ చికిత్సా విధానం క్యాన్సర్ కణితులు కానివాటికే ఉపయోగపడుతుందని పాణిగ్రాహి వివరించారు.



సదస్సులో పాల్గొన్న వైద్య నిపుణులు

ఎంఆర్ఐ విశ్లేషణలో ఏఐ పరిజ్ఞానం

బ్రెయిన్ స్ట్రోక్ కేసుల్లో ఎంఆర్ఐకి ఏఐ పరిజ్ఞానాన్ని జత చేయడం వల్ల ఖచ్చితమైన నిర్ణయాలు, తక్కువ సమయంలోనే తీసుకునేందుకు వీలు కలుగుతుందని వైద్యనిపుణులు వివరించారు. సాధారణంగా ఎంఆర్ఐ ఫిల్ములు చూసినప్పుడు వైద్యులు తమ అనుభవాన్ని బట్టి సమస్యను అంచనా వేయగలుగుతారు. అదే పని ఏఐ ద్వారా చేయిస్తే కచ్చితత్వం మరింత పెరుగుతుందని వైద్యులు పేర్కొన్నారు. దానివల్ల ఏ తరహా చికిత్స చేయాలన్న విషయం వెంటనే తేలిపోతుంది. ఇలా పలు కొత్త టెక్నాలజీలను సదస్సు తొలిరోజున వైద్యనిపుణులు పరిచయం చేశారు. గతంలో అమెరికా, యూరప్‌లో జరిగిన ఈ సదస్సు మన దేశంలో జరగడం ఇదే మొదటిసారని డాక్టర్ పాణిగ్రాహి చెప్పారు. న్యూరోసర్జరీల తీరుతెన్నులను సమూలంగా మార్చే పరిజ్ఞానాలను ఈ సదస్సు పరిచయం చేస్తుందని కిమ్స్ ఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు అన్నారు.

ఆటోను.. బైక్‌ను.. రోడ్డు దాటుతున్నవారిని ఢీకొట్టి..

బీభత్సం సృష్టించిన వ్యాన్

ముగ్గురు చిన్నారులు సహా ఐదుగురి దుర్మరణం.. మరో ముగ్గురికి తీవ్రగాయాలు



కుతాడి కుమార్, ప్రదీప్ (ఫైల్)

జడ్చర్ల/బాలానగర్, మనూరాబాద్, జనవరి 5: మృత్యు శకటంలా దూసుకొచ్చిన ఓ వ్యాను బీభత్సమే సృష్టించింది. రోడ్డును దాటుతున్న ఆటోను, ఓ బైక్‌ను ఢీకొట్టింది! ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు చిన్నారులు సహా నలుగురు.. రోడ్డు దాటుతున్న ఓ బాలుడు దుర్మరణం పాలయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండల కేంద్రంలోని ప్రధానకూడలి వద్ద శుక్రవారం సాయంత్రం ఈ ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. చెల్లాచెదురుగా పడ్డ మృతదేహాలు.. రక్త ధారలతో ఘటనాస్థలిలో భీతావహ పరిస్థితి నెలకొంది. బాలానగర్ మండల కేంద్రంలోని సంతబజారులో ఎప్పటిలాగే శుక్రవారం సంత జరిగింది. మోతీఘనపూర్, నందారం, కల్లేపల్లి గ్రామాలకు చెందిన 15 మంది అంగట్లో కూరగాయలు కొనుక్కొని ఆటోలో తిరుగు ప్రయాణమయ్యారు. ఈ ఆటో రోడ్డు దాటుతుండగానే హైదరాబాద్ నుంచి జడ్చర్ల వైపు వెళ్తున్న డీసీఎం అతివేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టింది. అదే వేగంలో ఓ బైకును ఢీకొట్టింది. ఆటోలో ఉన్నవారిలో బీటీనగర్‌కు చెందిన జున్ను (2), పన్నీ (65), మోతీఘనపూర్‌కు చెందిన పింకీ (8), అక్కడికక్కడే మృతిచెందారు. ఆటోలోని ప్రయాణికుల్లో మోతీఘనపూర్‌కు చెందిన సునీత (32) తీవ్ర గాయాలయ్యాయి. ఇక తల్లిదండ్రులతో కలిసి రోడ్డు దాటుతుండగా ప్రమాదానికి గురైన ఆటో తగలడంతో బాలానగర్‌కు చెందిన జశ్వంత్ (10)కూ గాయాలయ్యాయి. సునీత, జశ్వంత్‌ను మహబూబ్‌నగర్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. రోడ్డు దాటుతుండగా మౌనిక అనే మహిళ, బైకుపై ఉన్న ఇద్దరూ తీవ్ర గాయాలయ్యాయి. ఈ ముగ్గురూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

స్థానికుల రాస్తారోకో

బాలానగర్ మండల కేంద్రంలోని ముఖ్య కూడలిలో మృతుల కుటుంబసభ్యులు, స్థానికులు ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ప్రమాదానికి పోలీసుల అలసత్వమే కారణమంటూ జాతీయ రహదారిపై బైఠాయించారు. పరిస్థితి ఉద్రిక్తతంగా మారడం, దాడులు జరిగే అవకాశం ఉండటంతో అక్కడి నుంచి బాలానగర్ ఎస్సై శ్రీనివాసులు వెళ్లిపోయారు. తర్వాత అక్కడికి జడ్చర్ల రూరల్ సీఐ జమ్ములప్ప, రాజాపూర్ ఎస్సై వెంకటొరెడ్డి చేరుకోగా వారిపై జనం దాడికి ప్రయత్నించారు. అనంతరం ఆటో, బైకును ఢీ కొట్టిన డీసీఎంకు బాధిత కుటుంబాల సభ్యులు, స్థానికులు నిప్పంటించారు. మృతుల కుటుంబసభ్యులు, స్థానికులు 2 గంటలపాటు రోడ్డుపై బైఠాయించడంతో రహదారికి ఇరువైపులా 10 కిలోమీటర్ల మేర వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

టిప్పర్ ఢీకొట్టడంతో తండ్రీకొడుకులు..

హైదరాబాద్ శివారు కుంట్లూరు సమీపంలో ఘోరం జరిగింది. ఓ బైక్‌ను టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు తండ్రీకొడుకులు దుర్మరణంపాలయ్యారు. టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణం అని భావిస్తున్నారు. పోలీసులు, మృతుల బంధువుల కథనం ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుత్బుల్లాపూర్‌లో కుతాడి కుమార్ (40), సుగుణ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి కుమారులు ప్రశాంత్, ప్రదీప్(13), మదన్ ఉన్నారు. కుంట్లూరు రావినారాయణరెడ్డి కాలనీకి సమీపంలో సీపీఐ ఆధ్వర్యంలో సుమారు ఏడాది కిందట గుడిసెలు వేశారు. ఆ గుడిసెల్లో కుమార్ దంపతులు కూడా ఒక గుడిసె వేసుకున్నారు. గురువారం రాత్రి కుమార్, సుగుణ తమ రెండో కుమారుడు ప్రదీప్‌ను తీసుకొని గుడిసె వద్దకు వెళ్లారు. రాత్రి అక్కడే పడుకున్నారు. తాను పనికి వెళ్లాల్సి ఉండటం, ప్రదీప్ బడికి వెళ్లాల్సి ఉండటంతో కొడుకును బైక్‌పై ఎక్కించుకొని కుమార్ తెల్లవారుజామున 4:45కు కుత్బుల్లాపూర్‌లోని ఇంటికి బయలుదేరాడు. పాపయ్యగూడ చౌరస్తా వద్ద వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టింది. కుమార్‌పై నుంచి టిప్పర్ చక్రాలు వెళ్లడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. టిప్పర్ ముందు భాగంలో బైకుతో పాటు ప్రదీప్ ఇరుక్కుపోగా సుమారు 100 మీటర్ల మేర ముందుకు లాక్కుపోయింది. ఈ క్రమంలో బైకు పెట్రోల్ ట్యాంక్ పగిలి మంటలు చెలరేగాయి. ఆ మంటల్లోనే బాలుడు ప్రదీప్ మృతదేహం పూర్తిగా కాలిపోయింది. బయలుదేరిన కొద్దిసేపటికే భర్త, కుమారుడు ఇక లేరని తెలిసి.. సుగుణ గుండెలవిసేలా రోదించింది.

లేటుగా తింటే గుండె జబ్బుల ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

సంబంధాన్ని తెలుసుకునేందుకు ఈ స్టడీ చేశారు. ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తీసుకోకుండా... నేరుగా (ఆలస్యంగా) భోజనం చేసేవారిలో హృదయ సంబంధిత జబ్బుల బారినపడే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని గుర్తించారు. అలా ఆలస్యమయ్యే ప్రతి గంటకూ.. హృద్రోగ ముప్పు 6 శాతం మేర పెరుగుతుందని పేర్కొన్నారు. అంటే.. ఉదయం 8 గంటలకు బ్రేక్‌ఫాస్ట్ చేసేవారితో పోలిస్తే 9 గంటలకు తినేవారిలో హృద్రోగాల బారిన పడే ప్రమాదం 6 శాతం అధికమన్నమాట. అలాగే.. రాత్రి 8 గంటల కంటే ముందే తినేవారితో పోల్చితే 9 తర్వాత భోజనం చేసే వారిలో 28 శాతం మందికి గుండెజబ్బుల రిస్కు ఎక్కువని వారు పేర్కొన్నారు. ఈ ముప్పు మహిళల్లో ఎక్కువని కూడా వారు హెచ్చరించారు. అలాగే డిన్నర్‌కు, బ్రేక్‌ఫాస్ట్‌కు నడుమ 'రాత్రి సమయం' ఎంత ఎక్కువ ఉంటే అంత మంచిదని వెల్లడించారు. అంటే.. రాత్రి భోజనం 8 గంటలకు, బ్రేక్‌ఫాస్ట్ ఉదయం 8 గంటలకు తినడం కన్నా, రాత్రి భోజనాన్ని 7 గంటలకే ముగించి బ్రేక్‌ఫాస్ట్ పొద్దున ఎనిమిదింటికి తినడం వల్ల ఆరోగ్యానికి ఎక్కువ ప్రయోజనం అన్నమాట. ఇలా చేసేవారిలో శరీరంలోని జీవగడియారం చక్కగా పనిచేస్తుందని.. రక్తపోటు, స్ట్రోక్ ముప్పు తగ్గుతాయని పరిశోధకులు వెల్లడించారు.

భారత్‌లో ఐదో వంతు..

ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం 2020లో ప్రపంచవ్యాప్తంగా మొత్తం 17.7 మిలియన్ల గుండె జబ్బుల మరణాలు సంభవిస్తే...అందులో ఐదోవంతు ఒక్క మన దేశానివే కావడం గమనార్హం. ఇందులో కూడా ఎక్కువగా యువతే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో తాజా అధ్యయనం ప్రాముఖ్యాన్ని గుర్తించాలని, ఆరోగ్యకరమైన ఆహారపుటలవాట్లు అలవర్చుకోవడంతోపాటు.. రాత్రి భోజనాన్ని వీలైనంత త్వరగా ముగించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. రాత్రివేళ ఎక్కువ సమయం కడుపును ఖాళీగా ఉంచేందుకు ప్రాధాన్యమివ్వాలని కోరుతున్నారు. గతంలో అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషియన్ కూడా ఇదే అంశంపై ఓ అధ్యయన నివేదికను ప్రచురించింది. అదీ.. భోజన వేళలకు, గుండెజబ్బులకు మధ్య సంబంధం ఉందని తేల్చిన అధ్యయనమే. కాగా.. సాయంత్రం వేళల్లో త్వరగా భోజనం చేయడం ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచుతుందని, గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుందని హైదరాబాద్ యశోద ఆస్పత్రికి చెందిన సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. చీకటి పడ్డాక త్వరగా తినేయడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను మరింత సమర్థంగా నియంత్రించవచ్చని, హృదయనాళ వ్యవస్థపై ఒత్తిడిని తగ్గించవచ్చని ఆయన పేర్కొన్నారు. అలాగే సరైన భోజనవేళలను పాటించడం వల్ల మంచి నిద్ర పడుతుందని, పరోక్షంగా అది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని కూడా ఆయన వివరించారు.

బీఆర్ఎస్‌లో భగ్గుమన్న విభేదాలు!

- పట్నం, పైలట్ వర్గీయుల వాగ్వాదం
- 'చేవెళ్ల'పై సమీక్ష సందర్భంగా ఉద్రిక్తత
- ఇరు వర్గాలకు సర్దిచెప్పిన హరీశ్‌రావు




హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ భవన్ వేదికగా బీఆర్ఎస్ నేతల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. లోక్‌సభ ఎన్నికలకు పార్టీ శ్రేణులను సిద్ధం చేసే ప్రక్రియలో భాగంగా శుక్రవారం చేవెళ్ల నియోజకవర్గంపై చేపట్టిన సమీక్ష రచ్చకు దారి తీసింది. తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డిని వేదిక మీద కూర్చోబెట్టడంపై ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి వర్గం అభ్యంతరం వ్యక్తం చేసింది. వేదిక మీద నుంచి దిగిపోవాలని పట్టుబట్టింది. ఈ క్రమంలో పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆ తర్వాత పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడే సమయంలో రోహిత్ వర్గం నినాదాలు చేసింది. ఈ క్రమంలో ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అయితే అంతలోనే లంచ్ బ్రేక్ ప్రకటించడంతో వివాదం మరింత ముదరకుండా ఆగిపోయింది. తన ముందే గొడవ జరగడంతో మహేందర్‌రెడ్డి, పైలట్ రోహిత్‌రెడ్డిని పిలిపించుకొని హరీశ్‌రావు మాట్లాడినట్లు తెలుస్తోంది. ఆయనే కలగజేసుకొని ఇరువర్గాలకు సర్దిచెప్పినట్లు సమాచారం. కాగా, పార్టీ అధిష్ఠానం తీరుపై వికారాబాద్ జిల్లాకు చెందిన కొందరు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఇటువంటి సమీక్షలు ఎందుకు జరపలేదని ప్రశ్నించారు. తాండూరులో ఎమ్మెల్యే అభ్యర్థిని మార్చేసి ఉంటే.. కచ్చితంగా గెలిచి ఉండే వాళ్లమని మహేందర్‌రెడ్డి వర్గం నేత ఒకరు పేర్కొన్నారు. ఇలాంటి సమీక్షలు పెట్టకపోవడమే పార్టీ ఓటమికి కారణమైందన్నారు. అంతకుముందు లోక్‌సభకు ఎన్నికల సన్నద్ధతపై కేశవరావు, హరీశ్‌రావు, కడియం శ్రీహరి, నిరంజన్ రెడ్డి, మధుసూదనాచారి దిశా నిర్దేశం చేశారు.

సమష్టిగా కృషి చేస్తాం: మహేందర్‌రెడ్డి

చేవెళ్ల లోక్‌సభ పరిధిలో ఎంపీ రంజిత్‌రెడ్డిని మరోసారి గెలిపిస్తామని, అందరం సమష్టిగా కృషి చేస్తామని ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి మీడియాతో పేర్కొన్నారు. సమావేశంలో జరిగిన రచ్చపై ఆయన స్పందిస్తూ... "కుటుంబాల్లో సమస్యలు ఉండవా?.. అలాగే పార్టీలోనూ చిన్న పాటివి ఉంటాయి. రోహిత్‌రెడ్డితో చిన్నపాటి వాగ్వాదం జరిగింది. అంతా సద్దుమణిగింది. మేమంతా బీఆర్ఎస్ కోసం పని చేస్తాం" అని వెల్లడించారు.

ఫైనాన్స్ కంపెనీ వేధింపులు తాళలేక

ఆదివాసీ రైతు ఆత్మహత్య

- పురుగు మందు తాగి అఘాయిత్యం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- భద్రాద్రి జిల్లాలో ఘటన


కొమరం రామారావు(55)

దుమ్ముగూడెం, జనవరి 5 : రుణమిచ్చిన ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ వేధింపులు తాళలేక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఓ ఆదివాసీ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పురుగు మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం గోవిందాపురానికి చెందిన కొమరం రామారావు(55) ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ నుంచి రుణం తీసుకుని 2021లో వరికోత యంత్రాన్ని కొనుగోలు చేశాడు. ఆ యంత్రాన్ని కిరాయిలకు తిప్పుతూ వాయిదా(ఈఎంఐ)లు చెల్లిస్తూ జీవనోపాధి పొందేవాడు. రామారావు కొద్ది నెలలుగా వాయిదాలు కట్టకపోవడంతో ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు అతని హెచ్చరించేవారు. ఈ క్రమంలో రామారావుకు చెందిన వరికోత యంత్రం చర్ల మండలం పెదమిడిసిలేరులోని ఓ రైతు పొలంలో ఉందని తెలుసుకున్న కంపెనీ ప్రతినిధులు గురువారం అక్కడికి వచ్చారు. బకాయి కోసం రామారావును నిలదీసి వరికోత యంత్రాన్ని స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. పంట డబ్బు రాగానే వడ్డీ చెల్లిస్తానని రామారావు చెప్పినా వినిపించుకోలేదు. దీంతో మనస్తాపం చెందిన రామారావు పురుగు మందు తాగాడు. గమనించిన స్థానికులు రామారావును భద్రాచలం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. రామారావు కుటుంబసభ్యుల ఫిర్యాదుతో చర్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

రోకలితో తల్లిని కొట్టి చంపిన సైకో!

- కొన్నాళ్లుగా నిందితుడికి మానసిక రుగ్మత
- 10రోజులుగా నిద్రపోకుండా భార్య, తల్లితో గొడవ
- ఇద్దరిపైనా దాడికి యత్నం.. తప్పించుకున్న భార్య
- వారించబోయిన మరో మహిళపైనా దాడి
- తీవ్రగాయాలతో ఆమె కోమాల్లో.. భుపాలపల్లి జిల్లాలో ఘటన


హైమ (ఫైల్)

రేగొండ, జనవరి 5: కొన్నిరోజులుగా మానసిక సంతులత కోల్పోయిన ఓ వ్యక్తి ఉన్మాదిగా మారి కన్నతల్లిని రోకలితో కొట్టి చంపాడు. భార్యనూ చంపేందుకు ప్రయత్నించగా ఆమె తప్పించుకుంది. తల్లిపైన దాడిని ఆపే ప్రయత్నం చేసిన పొరుగింటి మహిళపైనా అతడు రోకలితో కొట్టడంతో ఆమె తీవ్ర గాయాలతో కోమాలోకి వెళ్లిపోయింది. భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం తిరుమలగిరి గ్రామంలో ఈ ఘోరం జరిగింది. తల్లిని చంపి.. మరో మహిళను ప్రాణాపాయ స్థితిలోకి నెట్టిన ఆ ఉన్మాది రోకలి పట్టుకొని ఊరంతా తిరుగుతూ వీరంగం సృష్టించడంతో గ్రామస్థులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. కుటుంబసభ్యులు, స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కంచర్లకుంట్ల మోహన్‌రెడ్డి-హైమ (60) దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు రాజిరెడ్డి(42) భార్య సరితతో కలిసి వ్యవసాయం చేసుకుంటున్నాడు. రాజిరెడ్డి ఇద్దరు కుమారులు హనుమకొండలోని ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్నారు. రాజిరెడ్డి మానసిక రుగ్మతలో బాధపడుతూ భార్యతో గొడవ పడేవాడు. పది రోజుల నుంచైతే రాత్రుళ్లు నిద్రపోకుండా గొడవ చేస్తూ 'నాకు శక్తి ఆవహించింది' అంటూ పిచ్చి పిచ్చిగా అరుస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి భార్యతో గొడవపడ్డాడు. తెల్లవారుజామున లేచి ఆస్పత్రికి వెళదామని.. పడుకోమని ఆమె సముదాయించినా రాజిరెడ్డి వినిపించుకోలేదు. 'నన్ను ఏం చేయాలనుకుంటున్నారు? చంపుతారా ఏం?' అంటూ తల్లి, భార్యను బూతులు తిట్టాడు. అతడి తీరుకు భయపడిపోయిన తల్లి హైమ, భార్య సరిత ఎదురుగా ఉన్న మరో ఇంట్లోకి వెళ్లి తలుపులు పెట్టుకున్నారు. అక్కడికీ వెళ్లిన రాజిరెడ్డి ఇంట్లోంచి బయటికి రాకపోతే బయట ఉన్న పత్తినంతా తగులబెడతానంటూ హెచ్చరించాడు. దీంతో హైమ, సరిత బయటకు వచ్చారు. వెంటనే పక్కనే ఉన్న రోకలిని రాజిరెడ్డి చేతుల్లోకి తీసుకోవడంతో ఇద్దరూ ప్రాణభయంతో చెరోవైపు పరుగు తీశారు. తల్లి హైమ తలపై రాజిరెడ్డి రోకలితో కొట్టడంతో తల ఛిద్రమైపోయి ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. పక్కింట్లో ఉన్న ఊకంటి జ్యోతి అనే మహిళ గొడవకు నిద్రలేచి బయటకొచ్చి అడ్డుకునే ప్రయత్నం చేసింది. ఆమె తలపైనా రోకలితో కొట్టాడు రాజిరెడ్డి. ఆమె తీవ్ర గాయాలతో కింద పడిపోయింది. అప్పటికే పారిపోయిన భార్య సరిత చుట్టుపక్కల వారిని తీసుకువచ్చేలోగా.. 'ఇద్దరిని చంపేసిన.. ఎవరు వస్తారో రండి.. అందర్నీ చంపుతా' అంటూ అని రాజిరెడ్డి వెంటపడడంతో జనం ఇళ్లలోకి పరుగెత్తి తలుపులు వేసుకున్నారు. తర్వాత రాజిరెడ్డి అక్కడి నుంచి పారిపోయాడు. పోలీసులొచ్చి గాయపడిన జ్యోతిని అంబులెన్సులో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఆమె కోమాలో ఉందని వైద్యులు వెల్లడించారు. కాగా గోరికొత్తపల్లి మండలం చిన్నకోడెపాకలో రాజిరెడ్డి అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో స్థానికులు పట్టుకొని కట్టేశారు. పోలీసులు అక్కడికి వెళ్లి అతడిని అదుపులోకి తీసుకున్నారు. కాగా జ్యోతి చిన్న కుమారుడు పది నెలల క్రితం పరకాలలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంవత్సరం లోపే సైకో దాడిలో ఆమె ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లడంతో గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగం కోసం ఒకరికి బదులుగా

మరొకరు పరీక్షకు..

- ఉద్యోగానికి ఎంపికవడంతో అపాయింట్‌మెంట్ లెటర్ జారీ
- పరీక్ష రాసిన వ్యక్తి, ఉద్యోగంలో చేరేందుకు వచ్చిన వ్యక్తి ఫొటోల్లో తేడా
- పోలీసులకు అధికారుల ఫిర్యాదు.. ఒకరి అరెస్ట్


బాల్‌రాజ్

అల్వాల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం కోసం ఓ వ్యక్తి మరొకరితో పరీక్ష రాయించాడు. ఉద్యోగానికి ఎంపికయ్యాడు. అయితే ఉద్యోగంలో చేరేందుకు వెళ్లినప్పుడు పరీక్ష రాసింది వేరే వ్యక్తి అని తేలడంతో అతన్ని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అల్వాల్ ఎస్ఐ సురేష్‌కుమార్ వివరాల ప్రకారం.. హరియాణా ప్రాంతానికి చెందిన బాల్‌రాజ్(23) గతేడాది నవంబరులో తెలంగాణ అటవీ శాఖలో ఉద్యోగం కోసం పోటీ పరీక్ష రాయాలనుకున్నాడు. అయితే అతని స్నేహితుడు అజయ్(బ్రోకర్) తనకు తెలిసిన వ్యక్తి పరీక్ష రాస్తే పక్కాగా ఉద్యోగం వస్తుందని నమ్మించాడు. దీంతో బాల్‌రాజ్ తనకు బదులుగా వేరే వ్యక్తితో అల్వాల్ లయోలా అకాడమీలో పోటీ పరీక్ష రాయించాడు. దీంతో బాల్‌రాజ్ ఉద్యోగానికి అర్హత సాధించడంతో అటవీ శాఖ అధికారులు అతనికి అపాయింట్‌మెంట్ లెటర్ పంపారు. అయితే ఉద్యోగంలో చేరేందుకు వచ్చిన వ్యక్తి పరీక్ష రాసిన వ్యక్తి ఫొటో వేర్వేరుగా ఉండటంతో సంబంధిత అధికారులకు అనుమానంతో బాల్‌రాజ్‌ను నిలదీయగా పరీక్ష రాసింది వేరే వ్యక్తి అని చెప్పాడు. దీంతో అధికారులు బాల్‌రాజ్‌పై అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని శుక్రవారం అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పరీక్ష రాసిన వ్యక్తి, అజయ్ పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.



రాజేంద్రనగర్ ఎస్‌హెచ్‌వో నాగేంద్ర బాబుకు ట్రోఫీ అందజేస్తున్న షా

దేశంలోనే నం.1 ఠాణాగా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్

హైదరాబాద్, రాజేంద్రనగర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పోలీసులు మరోసారి జాతీయ స్థాయిలో సత్తా చాటారు. దేశంలోనే బెస్ట్ పోలీస్‌స్టేషన్‌గా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ నిలిచింది. కేసులు సత్వర పరిష్కారం, ఆధారాల సేకరణ, కేసుల దర్యాప్తులో టెక్నాలజీ వాడకం, నేరం రుజువుచేసి నిందితులకు న్యాయస్థానంలో శిక్ష పడేలా చేయడం, ఫైళ్లను భద్రపర్చడం.. వంటి అనేక అంశాల్ని ప్రామాణికంగా తీసుకుని కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన బెస్ట్ పోలీస్ స్టేషన్-2023 జాబితాలో రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ మొదటిస్థానంలో నిలిచింది. రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో శుక్రవారం జరిగిన పోలీసు డైరెక్టర్ జనరల్స్/ఇన్‌స్పెక్టర్ జనరల్స్ అఖిల భారత సదస్సులో కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేతులమీదుగా రాజేంద్రనగర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్(ఎస్‌హెచ్‌వో) బి.నాగేంద్రబాబు.. ఉత్తమ పోలీస్‌స్టేషను ట్రోఫీని అందుకున్నారు. దేశంలోనే అత్యుత్తమ పోలీస్‌స్టేషన్‌గా రాజేంద్రనగర్ పీఎస్ నిలవడం పట్ల ఆ స్టేషను సిబ్బందికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. ప్రతిష్ఠాత్మకమైన ఈ ట్రోఫీ సాధించడం పట్ల ఎస్‌హెచ్‌వో నాగేంద్రబాబును డీజీపీ రవిగుప్తా అభినందించారు. సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, ఇతర అధికారులకు అభినందనలు తెలిపారు.

గ్రంథాలయ చైర్మన్ల తొలగింపు.. ఉత్తర్వుల జారీ

హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జిల్లా, సిటీ గ్రంథాలయ సంస్థల చైర్మన్లను తొలగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శుక్రవారం విద్యాశాఖ కార్యదర్శి వెంకటేశం ఉత్తర్వులను జారీ చేశారు. దీని ప్రకారం గత ప్రభుత్వంలో నియామకమైన గ్రంథాలయ సంస్థల చైర్మన్ల పదవులు రద్దయ్యాయి.

డీడీలు వాపస్ ఇవ్వమంటున్నారు.. ఏం చేయాలి?

- రాష్ట్ర ప్రభుత్వానికి పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ లేఖ
- గొర్రెల పంపిణీపై స్పష్టత ఇవ్వాలని వినతి
- 'ఆంధ్రజ్యోతి' కథనంలోని అంశాల ప్రస్తావన

డీడీలు వాపస్ ఇవ్వాలని గొర్రెల పంపిణీ పథకం లబ్ధిదారులు ఒత్తిడి చేస్తున్నారని, ఏంచేయాలో తమకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ రాంచందర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై ప్రభుత్వానికి శుక్రవారం ఆయన లేఖ రాశారు. రెండో విడత గొర్రెల పంపిణీ నిలిచిపోయిందని, మిగిలిన లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీ చేయటానికి ఇంకా రూ.4,023 కోట్లు అవసరమవుతాయని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. అయితే డీడీలు చెల్లించిన లబ్ధిదారులు 82 వేల మంది ఉన్నారని, వారు గొర్రెలు ఇస్తారా? డీడీలు వాపస్ చేస్తారా? అని అడుగుతున్నారని లేఖలో పేర్కొన్నారు. వారికి ఎలా సమాధానం ఇవ్వాలో తెలియటంలేదని, ఈ విషయంలో స్పష్టత ఇవ్వాలని కోరారు. కాగా 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'గొర్రెలైనా ఇవ్వండి.. డీడీలైనా వాపస్ చేయండి!' శీర్షికతో శుక్రవారం ప్రచురితమైన కథనం చర్చనీయాంశంగా మారింది. కథనంలోని పలు అంశాలను ప్రభుత్వానికి రాసిన లేఖలో పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ రాంచందర్ ప్రస్తావించినట్లు సమాచారం.

అదనపు అప్పు పుట్టేనా!?

- వెయ్యి కోట్ల అప్పుకే అనుమతి ఇవ్వని కేంద్రం
- 9న ఆర్‌బీఐ ఈ-వేలానికి రాష్ట్రం దూరం

హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆశించిన అదనపు అప్పుపై ఇంకా స్పష్టత రాలేదు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి రాకపోవడంతో ఈ నెల 9న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) నిర్వహించే ఈ-వేలంలోనూ రాష్ట్ర ప్రభుత్వం పాల్గొనడం లేదు. 2023-24 బడ్జెట్‌లో రూ.40,615 కోట్ల అప్పును ప్రతిపాదించిన అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం... డిసెంబరు నాటికే రూ.39,051 కోట్ల అప్పును తీసుకుంది. దీంతో చివరి త్రైమాసికం(జనవరి, ఫిబ్రవరి, మార్చి)లో రూ.1,000 కోట్ల కన్నా ఎక్కువ అప్పు తీసుకునే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం... అదనపు అప్పు కోసం కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేస్తోంది. చివరి త్రైమాసికంలో రూ.13వేల కోట్ల అప్పు తీసుకోవడానికి అనుమతి ఇవ్వాలని అభ్యర్థిస్తోంది. ఇప్పటికే ప్రధాని మోదీని సీఎం రేవంత్‌రెడ్డి కలిసి విజ్ఞప్తి చేశారు. కానీ.. కేంద్రం నుంచి ఇప్పటిదాకా ఎలాంటి స్పష్టత రాలేదు. మరోవైపు.. బహిరంగ మార్కెట్ రుణాల కోసం మంగళవారం(9న) ఆర్‌బీఐ నిర్వహించే వేలం పాటలో పాల్గొనేందుకు దేశంలోని 8రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతం కలిపి రూ.19,330కోట్ల అప్పులకు ఇండెంట్లు పెట్టాయి. అయితే, కేంద్రం నుంచి అనుమతి రాకపోవడం వల్లే తెలంగాణ ప్రభుత్వం ఇండెంట్ పెట్టలేకపోయింది. అందుకే సెక్యూరిటీ బాండ్లను కూడా విడుదల చేయలేదు. కానీ..ఈ నెలలో ఎప్పుడైనా కేంద్రం నుంచి అనుమతి లభించవచ్చని అధికారవర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. ఎంత మేర అప్పు తీసుకోవాలో నిర్ణయించుకుని ఇండెంట్లు పెడతామని చెబుతున్నాయి.

ప్రత్యేక బస్సుల్లోనూ మహిళలకు ఫ్రీ!

మగువలకు సర్కారు సంక్రాంతి కానుక.. పండగకు 4,484 ప్రత్యేక బస్సులు

626 బస్సుల్లో ముందుస్తు రిజర్వేషన్.. ప్రత్యేక బస్సుల్లోనూ సాధారణ చార్జీలే

'మహాలక్ష్మి'లో 7 కోట్ల మంది ఉచిత ప్రయాణం.. అధికారులతో సమీక్షలో ఎండీ సజ్జనార్

హైదరాబాద్/సిటీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు సంక్రాంతి కానుక ఇవ్వాలని నిర్ణయించింది. పండగ సందర్భంగా టీఎస్‌ఆర్టీసీ ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లో కూడా 'మహాలక్ష్మి' పథకాన్ని వర్తింపజేయాలని నిర్ణయించారు. అంటే మహిళలకు ప్రత్యేక బస్సుల్లోనూ ఉచిత ప్రయాణమే! ఇక పండగ రద్దీ దృష్ట్యా 4,484 ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించినట్లు ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెలిపారు. ఇందులో దూర ప్రాంతాలకు వెళ్లే వచ్చే 626 సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. ఈ నెల 7 నుంచి 15 వరకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. సంక్రాంతికి ప్రత్యేక బస్సుల ఏర్పాటు, మహాలక్ష్మి పథకం అమలు, ప్రయాణికులకు కల్పించాల్సిన సౌకర్యాలపై శుక్రవారం బస్‌భవన్‌లో ఆర్టీసీ ఉన్నతాధికారులతో సజ్జనార్ సమీక్ష నిర్వహించారు. మహాలక్ష్మి పథకం అమలు నేపథ్యంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా సంక్రాంతి పండగకు ప్రత్యేక బస్సులు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పండగ సందర్భంగా ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్ రోడ్స్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి, తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. అక్కడ ప్రయాణికుల సౌకర్యార్థం పండల్స్, షామియానాలు, కుర్చీలు, తాగునీరు, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. సంక్రాంతి పండగకు బస్సు చార్జీల్లో ఎలాంటి పెంపూ ఉండదని, సాధారణ చార్జీలతోనే ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతామని తెలిపారు. సంక్రాంతికి నడిపే పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణం అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. మహాలక్ష్మి పథకంతో రాష్ట్రవ్యాప్తంగా 7 కోట్ల మంది మహిళలు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారని సజ్జనార్ వెల్లడించారు. ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రకటించిన 48 గంటల్లోనే ఉచిత ప్రయాణం అమలు చేయడం వెనక ఆర్టీసీ సిబ్బంది కృషి ఎంతో ఉందని కొనియాడారు. రాజేంద్రనగర్ డిపోలో నిర్వహించిన వనభోజనాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని.. ఉద్యోగులతో కలిసి భోజనం చేశారు.



రాజేంద్రనగర్ డిపోలో ఆర్టీసీ ఉద్యోగులతో కలిసి భోజనం చేస్తున్న సంస్థ ఎండీ వీసీ సజ్జనార్

రాజకీయాల్లేకుండా..!

(మొదటిపేజీ తరువాయి)

రాజకీయం చేసిందని, దాన్నే రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చిందని, ఆ కారణంగానే వరుసగా పేపర్ లీకులు జరిగాయని ఈ సందర్భంగా రేవంత్ ప్రస్తావించారు. టీఎ్‌సపీఎస్సీ ఆధ్వర్యంలో జరిగిన నోటిఫికేషన్ల జారీ, పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడి మొత్తం ఒక ప్రహసనం లాగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. నీళ్లు, నిధులు, నియామకాలే లక్ష్యంగా తెలంగాణ ఏర్పడితే, కేసీఆర్ నేతృత్వంలోని గత ప్రభుత్వం నిర్లక్ష్యం, అసమర్థత కారణంగా నియామకాల లక్ష్యం నెరవేర్చడంలో తీవ్ర జాప్యం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలోనే రాజకీయ ప్రమేయం లేకుండా చైర్మన్, సభ్యుల నియామకం చేపట్టాలని నిర్ణయించామని ముఖ్యమంత్రి వెల్లడించారు. టీఎస్‌పీఎస్సీలో అవకతవలకు తావు లేకుండా సిబ్బందిని శాశ్వత ప్రాతిపదికన నియమిస్తామని చెప్పారు. రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో నూతన విధానాలు, పద్ధతులను పాటించాలని భావిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియామకాల ప్రక్రియ మీద దృష్టి సారించడం అభినందనీయమని యూపీఎస్సీ చైర్మన్ ప్రశంసించారు. యూపీఎస్సీలోనూ చైర్మన్, సభ్యుల నియామకంలో రాజకీయ ప్రమేయానికి తావు ఉండదని చెప్పారు. సమర్థత ఆధారంగా ఎంపిక ఉంటుందని తెలిపారు. టీఎస్‌పీఎస్సీని యూపీఎస్సీ తరహాలో తీర్చిదిద్దేందుకు రాష్ట్ర కమిషన్‌లో చైర్మన్‌తోపాటు సభ్యులందరికీ శిక్షణ ఇచ్చేందుకు యూపీఎస్సీ చైర్మన్ అంగీకరించారు. టీఎస్‌పీఎస్సీ సచివాలయ సిబ్బంది కూడా అవగాహన తరగతులు నిర్వహించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సీఎం ప్రిన్సిపల్ కార్యదర్శి వి.శేషాద్రి, టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్, అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి వాణీ ప్రసాద్ పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నిధులు విడుదల చేయండి

రేవంత్, ఉత్తమ్‌లు శుక్రవారం సాయంత్రం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలసీతారామన్‌తో ఆమె కార్యాలయంలో భేటీ అయ్యారు. తెలంగాణకు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కింద కొన్నేళ్లుగా పేరుకుపోయిన బకాయిలు రూ.1800 కోట్లు విడుదల చేయాలని రేవంత్ విజ్ఞప్తి చేశారు. 15వ ఆర్థిక సంఘం నుంచి తెలంగాణకు రావాల్సిన రూ.2,233.54 కోట్లు త్వరగా విడుదల చేయాలని కోరారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

రక్షణ శాఖ భూములు బదలాయించండి

హైదరాబాద్‌లో రహదారులు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి రక్షణ శాఖ పరిధిలో ఉన్న భూములను కేటాయించాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను ముఖ్యమంత్రి రేవంత్ విజ్ఞప్తి చేశారు. ఉత్తమ్‌తో కలిసి రేవంత్ రక్షణ మంత్రిని ఆయన నివాసంలో కలిశారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు మెహదీపట్నం రైతు బజార్ వద్ద స్కైవాక్ నిర్మిస్తున్నామని, ఇందుకోసం అక్కడ ఉన్న రక్షణ శాఖ భూమి 0.21 హెక్టార్లను బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆ కొద్ది భాగం తప్ప మిగతా స్కైవే పూర్తయిందని తెలిపారు. రక్షణ మంత్రి అందుకు సుముఖత వ్యక్తం చేశారు. రాజీవ్ రహదారిలో ప్యారడైజ్ జంక్షన్ నుంచి అవుటర్ రింగు రోడ్డు జంక్షన్ వరకు 11.30 కిలోమీటర్ల పొడవున ఆరు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం, ఎంట్రీ, ఎగ్జిట్ ర్యాంపుల నిర్మాణానికి 83 ఎకరాల రక్షణ శాఖ భూమి బదిలీ చేయాలని రేవంత్ ప్రస్తావించారు. నాగ్‌పూర్ హైవే(ఎన్‌హెచ్-44)పై ప్యారడైజ్ జంక్షన్ నుంచి అవుటర్ రింగ్ రోడ్డు వరకు 18.30 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ ప్రతిపాదించామని, 12.68 కిలోమీటర్ల పొడవున ఉన్న 56 ఎకరాల రక్షణ శాఖ భూములు బదిలీ చేయాలని కోరారు. రాష్ట్రంలో సైనిక పాఠశాల ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఢిల్లీలో బిజీబిజీగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

గురువారం ఉదయం హైదరాబాద్ నుంచి ఢిల్లీకి వచ్చిన సీఎం రెండు రోజుల పాటు తీరిక లేకుండా గడిపారు. తొలి రోజు గురువారం రాష్ట్ర పునర్విభజన చట్టం సమస్యలపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో భేటీ అయ్యారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కోసం జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను, హైదరాబాద్ మెట్రో విస్తరణ, మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం కేంద్ర గృహ నిర్మాణ పట్టణాభివృద్ధి మంత్రి హర్‌దీప్‌సింగ్ పురీతో భేటీ అయ్యారు. రెండో రోజూ ఢిల్లీలో అంతే బిజీగా గడిపిన సీఎం రాత్రి హైదరాబాద్‌కు బయలుదేరారు.

గవర్నర్ నిర్ణయంపై న్యాయ సమీక్ష చేయొచ్చా?

- హైకోర్టు ప్రశ్న
- దాసోజు, కుర్ర పిటిషన్లపై విచారణ

హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ తీసుకున్న నిర్ణయంపై న్యాయ సమీక్షకు అవకాశం ఉందా అని శుక్రవారం హైకోర్టు ప్రశ్నించింది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రవణ్ కుమార్, కుర్ర సత్యనారాయణల అభ్యర్థిత్వాలను గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై విచారణ సందర్భంగా ఈ ప్రశ్న వేసింది. దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణలను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేయాలని అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి మంత్రివర్గం గవర్నర్‌కు సిఫార్సు చేసింది. అయితే ఆ అభ్యర్థులకు ఆయా రంగాల్లో ప్రత్యేకతలు, నైపుణ్యాలు, కృషి లేవని పేర్కొంటూ గత ఏడాది సెప్టెంబర్ 9న వారి అభ్యర్థిత్వాలను గవర్నర్ తిరస్కరించారు. ఇందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 171 (5) కింద లభించిన అధికారాలను ఉపయోగించుకున్నారు. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాసోజు శ్రవణ్ కుమార్, కుర్ర సత్యనారాయణలు హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు. వీటిపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ సూరేపల్లి నందల ధర్మాసనం విచారణ చేపట్టింది. గవర్నర్ తీసుకున్న నిర్ణయంపై న్యాయ సమీక్షకు అవకాశం ఉంటుందా? అని ప్రశ్నించింది. పిటిషన్‌ల విచారణార్హతను తొలుత తేల్చాల్సి ఉంటుందని వ్యాఖ్యానించింది. ఈ మేరకు తమ అభ్యంతరాలను లిఖితపూర్వకంగా దాఖలు చేయాలని గవర్నర్ కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. పిటిషనర్‌ల తరఫున సీనియర్ న్యాయవాదులు, ఆదిత్య సోంధి, మయూర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ క్యాబినెట్ పిటిషన్‌ల పేర్లు సిఫార్సు చేసిందని తెలిపారు. క్యాబినెట్ సిఫార్సులకు వ్యతిరేకంగా గవర్నర్ నిర్ణయం తీసుకోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. గవర్నర్ కార్యదర్శి తరఫున సీనియర్ న్యాయవాది అశోక్ ఆనంద్ కుమార్ వాదనలు వినిపిస్తూ పిటిషన్‌లకు అసలు విచారణార్హత లేదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదిస్తూ ప్రభుత్వం తరఫున సైతం అభ్యంతరాలను సమర్పిస్తామని పేర్కొన్నారు. ఈ దశలో మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని చెప్పిన ధర్మాసనం తదుపరి విచారణను వాయిదా వేసింది.

మీపై 420 కాదు.. 840 కేసు పెట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

ధ్వజమెత్తారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డి, కాంగ్రెస్ ఫిషర్‌మెన్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు సాయికుమార్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణకు దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని చెప్పి మోసం చేసింది కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. దళిత కుటుంబాలకు 3 ఎకరాల చొప్పున భూమి, నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వంటి హామీల్లో ఏ ఒక్కటైనా సక్రమంగా అమలు చేశారా? అని నిలదీశారు కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. రుణమాఫీని నాలుగు కిస్తీలకు లాగి, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తివేసి, పేపర్ లీక్ చేసి.. మోసం చేసినందుకు కేసీఆర్ కుటుంబంపై ఎన్ని కేసులు పెట్టాలి? అని మండిపడ్డారు. "అసెంబ్లీలో కేటీఆర్, హరీశ్‌రావు బాగా రెచ్చిపోతున్నారు. టైమ్ బాగా లేక నేను ఓడిపోయాను కానీ.. సభలో నేను ఉంటే వారిని ఒక ఆట ఆడుకునేవాడిని" అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 24 గంటల్లోనే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం హామీని అమలు చేసిందని గుర్తు చేశారు. కేసీఆర్ కుటుంబమంతా బెంజ్ కార్లలో తిరుగుతారు కాబట్టి ఉచిత ప్రయాణం విలువ వారికి తెలియదని ఎద్దేవా చేశారు. ఇప్పటి దాకా ఆరున్నర కోట్ల మంది మహిళలు బస్సుల్లో ఉచిత ప్రయాణం చేశారని తెలిపారు. దీనిపై అమర వీరుల స్థూపం వద్ద చర్చకు సిద్ధమేనా.. అని కేటీఆర్, హరీశ్‌కు సవాల్ విసిరారు. తమది ప్రజాపాలన అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారని, బీఆర్ఎస్ హయాంలో ఎనాడైనా అలా ప్రకటించారా? అని కేటీఆర్, హరీశ్‌ను జగ్గారెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నిజమైన ప్రజా పాలన సాగుతోందని పేర్కొన్నారు. "ప్రభుత్వం అన్నాక ప్రజలకు జిమ్మేదారిగా ఉండి... అందానిపై నడపాలి. కానీ బిడ్డల్లా చూసుకోవాల్సిన ప్రజలను కేసీఆర్ అప్పుల పాలు చేసిండు. ఆయన సొంత బిడ్డలకు మాత్రం ఆస్తులు ఇచ్చిండు"అని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి సిన్సియర్‌గా పని చేస్తున్నారని, కేంద్ర మంత్రులను కలిసి నిధులు సమకూర్చుకునే పనిలో ఉన్నారని కితాబు ఇచ్చారు. పాలనను పరుగులు పెట్టిస్తున్నారని పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా మంత్రులందరూ వారి శాఖల సమీక్షల్లో బిజీగా ఉన్నారని పేర్కొన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను ఎలా అమలు చేయాలన్న అంశంపైనే అందరూ పని చేస్తున్నారని తెలిపారు. పాలోళ్లు పగటిపూట కొట్లాడుకుని రాత్రి పూట కల్లు దుకాణం వద్ద కలిసినట్లుగా బీజేపీ, బీఆర్ఎస్ తీరు ఉందని ధ్వజమెత్తారు.



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

గంజాయి బ్యాచ్‌లా వారిద్దరి తీరు

రేవంత్‌రెడ్డిని గెలికితే హరీష్, కేటీఆర్ బండారమంతా బయటపెడతానని జగ్గారెడ్డి హెచ్చరించారు. వారు గంజాయి బ్యాచ్‌లా తయారయ్యారని, తాము ఎంత పని చేసినా బద్‌నాం చేసే పనిలో ఉన్నారని ధ్వజమెత్తారు. జగ్గారెడ్డికి పేరే బ్రాండ్ అని, పదవులతో తనకు ఆ బ్రాండ్ రాలేదన్నారు. పార్టీ తనకు చాలా అవకాశాలు కల్పించిందని తెలిపారు. ప్రస్తుతం తాను ఫ్రీగానే ఉన్నానని, వారానికి రెండు రోజులు పార్టీకి కేటాయిస్తానని చెప్పారు.

ఎమ్మెల్యేల భూ కబ్జాలు.. రక్షించండి!

ఎమ్మెల్యేలు ప్రేమ్‌సాగర్‌రావు, మల్లారెడ్డిపై ప్రజావాణిలో బాధితుల ఫిర్యాదులు, ఆందోళన

- ప్లాట్లను బలవంతంగా గుంజుకుంటున్నారు
- ఇళ్లు కట్టుకుంటే కూల్చివేస్తున్నారు
- కోర్టు తీర్పులు ఉన్నా బేఖాతరు
- ప్లాట్ల యజమానుల ఆవేదన

బేగంపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కంచే చేను మేస్తే.. కొందరు 'ప్రజాప్రతినిధుల' వ్యవహారం ఇలాగే ఉంది. వీళ్ల అక్రమాలకు, అన్యాయాలకు ప్రతినిధులేగానీ.. ప్రజలకు కాదని సాక్షాత్తు ప్రజలే చెబుతున్నారు. ప్రభుత్వం శుక్రవారం నిర్వహించిన ప్రజావాణికి.. 'ప్రజాప్రతినిధుల' బాధితులు తరలివచ్చారు. కష్టపడి డబ్బు కూడబెట్టి కొనుక్కున్న ప్లాట్లను రౌడీలను పెట్టి కబ్జా చేశారని, కోర్టు నుంచి ఆదేశాలు తెచ్చుకొని, ధైర్యం కూడదీసుకొని తమ సొంతప్లాట్లలో ఇళ్లు కట్టుకుంటే కూలగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కాప్రా పరిధిలోని వంపుగూడలో సుమారు 500 ప్లాట్ల యజమానులను మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, రౌడీలను పెట్టి బెదిరిస్తున్నాడని బాధితులు ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో పాటు ప్రజావాణి వద్ద ఆందోళన జరిపారు. వంపుగూడలో సర్వే నెంబరు 632/1, 633/1, 644/1, 648, 654లలోని 61 ఎకరాల భూమిని 1983లో కొనుగోలు చేసి 702 ప్లాట్లు వేసుకున్నామని, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఈ ప్లాట్ల వద్ద రౌడీలను పెట్టి తమను బెదిరిస్తున్నాడని, కొన్ని ప్లాట్లను బెదిరించి కొనుగోలు చేశాడని తెలిపారు. మిగిలిన వారిని ప్లాట్ల వద్దకు పోకుండా గూండాలతో అడ్డుకుంటున్నాడని, ఇళ్లు నిర్మించుకుంటే అధికారులపై ఒత్తిడి తెచ్చి కూల్చేయించాడని ఆరోపించారు. '2004 నుంచి ఇప్పటి వరకు ప్రేమ్‌సాగర్‌రావు ఆగడాలతో ఇబ్బందులు పడుతున్నాం. కోర్టు తీర్పు మాకు అనుకూలంగా వచ్చినా ప్లాట్ల వద్దకు పోకుండా భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. ఎమ్మెల్యే అరాచకాల నుంచి మమ్మల్ని రక్షించాలని కొన్ని రోజులుగా ప్రజావాణిలో ప్లాట్ల యజమానులం పలు దఫాలుగా ఫిర్యాదులు చేస్తున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి' అని కృష్ణానగర్ ప్లాట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు చెందిన వెంకటేష్, భువనేశ్వర్‌రెడ్డి, కృష్ణ, నాగభూషణం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మరోవైపు, మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే మల్లారెడ్డిపైనా ఇటువంటి ఫిర్యాదులు వచ్చాయి. గుండ్లపోచంపల్లిలోని తమ భూమిని, ప్లాట్లను మల్లారెడ్డి గత ప్రభుత్వ అండతో దౌర్జన్యంగా ఆక్రమించటంతోపాటు, మిగిలిన ప్లాట్ల యజమానులను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని గుండ్లపోచంపల్లి గ్రామానికి చెందిన శ్రీ మల్లికార్జున నగర్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. 'గుండ్ల పోచంపల్లి గ్రామంలోని సర్వే నెంబరు 648, 650, 650/2లలోని శ్రీ మల్లికార్జున నగర్ హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో 27 ఎకరాల్లో 366 ప్లాట్లు వేశాం. గత ప్రభుత్వ అండతో మల్లారెడ్డి ఒక్కొక్కరిని బెదిరించి 110 మందికి చెందిన సుమారు 230 ప్లాట్లను (కొందరికి ఒకటి కన్నా ఎక్కువ ఉన్నాయి) బలవంతంగా తీసుకున్నాడు. పోలీసులచే వేధింపులకు గురిచేయడంతోపాటు రౌడీలతో బెదిరించి ప్లాట్ల వద్దకు పోకుండా అడ్డుకునేవాడు. ఈ భూమిలోని 16 ఎకరాలకు మల్లారెడ్డి అనుచరుడు శ్రీనివాస్‌రెడ్డి ఏటా రైతుబంధు తీసుకుంటున్నాడు. మాకు పట్టాలు, ఈసీ, ఎల్‌ఆర్‌ఎస్‌తో పాటు రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నాయి. అయినా మా ప్లాట్ల వద్దకు మమ్మల్ని పోనీయకుండా బెదిరిస్తున్నాడు. ప్రజావాణిలో అన్ని వివరాలతో ఫిర్యాదు చేశాం' అని బాధితులు వెల్లడించారు.



ప్రజావాణి వద్ద ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు భూ బాధితుల ఆందోళన

18 ఏళ్లుగా రూ.2 వేల జీతం

ప్రజావాణికి 2,200 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో భూ కబ్జాలపై ఫిర్యాదులతోపాటు పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, జీతాల పెంపు తదితర అంశాలకు సంబంధించినవి ఉన్నాయి. 18 ఏళ్లుగా ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో స్వీపర్, వాచ్‌మెన్ తదితర పనులు నిర్వహిస్తున్న తమకు అప్పటి నుంచి కేవలం 2 వేల జీతమే చెల్లిస్తున్నారని తెలంగాణ ప్రభుత్వ జూనియర్ కళాశాల కాంటిజెన్స్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు లక్ష్మీనారాయణ, లఖన్‌నాయక్, రవినాయక్‌లు వినతి పత్రం సమర్పించారు. 2007 నుంచి గాంధీ ఆసుపత్రిలో ఔట్‌సోర్సింగ్ విధానంలో స్టాఫ్‌నర్సులుగా విధులు నిర్వహిస్తున్న తమకు నర్సుల ఎంపికలో ప్రాధాన్యం కల్పించాలని, జీతాలు పెంచి, పర్మినెంట్ చేయాలని మహిళా నర్సులు కోరారు. దివ్యాంగులు, బుద్ధిమాంద్యం ఉన్న పిల్లలకు ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్న సిబ్బంది.. తమకు ఇచ్చే రూ.3 వేల పింఛన్‌ను 2020లో నిలిపివేశారని, ఇప్పటికైనా పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధి హామీ సిబ్బందిని రెగ్యులర్ చేయాలి

ఉపాధిహామీ పథకం కింద 12,395 మంది ఉద్యోగులం కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ నిధులతో చేసే ఈ పనులను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుంది. విధుల్లో నిర్ణీత పని వేళలు లేకపోయినా గత కొన్నేళ్లుగా పని చేస్తున్నాం. అయినా కూడా జీతాలు పెంచడం లేదు, కాంగ్రెస్ ప్రభుత్వంలో అయినా జీతాలు పెంచి, రెగ్యులర్ చేస్తారనే ఆశతో ప్రజావాణిలో వినతి పత్రం సమర్పించాం.

- ఉపాధిహామీ పథకం ఉద్యోగుల సంఘం నేత పార్థసారథి

వేర్వేరుగా ఉప ఎన్నిక

(మొదటిపేజీ తరువాయి)

సభ్యుల సంఖ్య +1 తో భాగించి.. వచ్చిన సంఖ్యకు ఒకటి కలుపుతారు. అంతమంది ఎమ్మెల్యేల బలం ఉన్నవారు ఎన్నికైనట్లు ప్రకటిస్తారు. ఉదాహరణకు, 120 మంది ఎమ్మెల్యేలు ఉన్నారనుకుంటే దానిని మూడుతో భాగిస్తారు. వచ్చిన 40కి ఒకటి కలిపి 41 మంది ఎమ్మెల్యేల బలం వచ్చిన వారిని గెలిచినట్లు ప్రకటిస్తారు. ఇక, రాజీనామా చేసిన ఇద్దరు ఎమ్మెల్సీలకూ వేర్వేరు పదవీ కాలాలు ఉన్నప్పుడు మాత్రమే వేర్వేరుగా నోటిఫికేషన్లు జారీ చేసి, వేర్వేరుగా ఎన్నికలు నిర్వహిస్తారు. అప్పుడు మొత్తం ఎమ్మెల్యేలు ఆయా అభ్యర్థులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. కానీ, ఇక్కడ కడియం, కౌశిక్ రెడ్డి ఇద్దరి పదవీ కాలాలూ నవంబరు 30, 2027తో ముగుస్తున్నాయి. అయినా, ఇద్దరూ ఖాళీ చేసిన పదవులను విడివిడిగా భర్తీ చేయడానికి ఈసీ షెడ్యూలు విడుదల చేసింది. ఇప్పుడు ఒక్కో ఎమ్మెల్సీని ఎన్నుకోవడానికి మొత్తం 119 మంది ఎమ్మెల్యేలూ ఓటర్లుగా ఉంటారు. అప్పుడు మెజారిటీ ఓట్లు ఉన్నవారే గెలుస్తారు. రాష్ట్ర అసెంబ్లీలో కాంగ్రెస్‌కే మెజారిటీ ఉంది. కనక రెండు సీట్లనూ కాంగ్రెస్ పార్టీయే గెలుచుకునే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో సీఈసీ వివరణ కోరుతూ అసెంబ్లీ కార్యాలయ వర్గాలు లేఖ రాశాయి. శనివారం కేంద్ర ఎన్నికల సంఘం అధికారులను సంప్రదిస్తామని చెప్పాయి.

యూపీలో ఏం జరిగింది?

ఉత్తరప్రదేశ్ 2023 మే 29న జరిగిన శాసనమండలి ఎన్నికల్లో రెండు క్యాజువల్ వేకెన్సీలకు పోలింగ్ జరిగింది. ఆ రెండు పదవుల టర్మ్‌లు వేర్వేరుగా ఉన్నాయి. ఖాళీ చేసిన రెండు స్థానాల్లో ఒక దానికి 2027 జనవరి 30 వరకు పదవీకాలం ఉండగా, రెండో దానికి 2028 జూలై 6 వరకు పదవీకాలం ఉంది. సభ్యుడి మరణం లేదా రాజీనామా కారణం ఏర్పడిన క్యాజువల్ వెకెన్సీ కావడంతో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు రెండింటికీ వేర్వేరుగా ఎన్నికలు జరిపారు. 396 మంది ఎమ్మెల్యేలు రెండు సీట్లకు వేర్వేరుగా ఓట్లేయగా రెండింటినీ బీజేపీ సునాయాసంగా గెలుచుకుంది. ఆ పార్టీ అభ్యర్థులిద్దరూ మానవేంద్ర సింగ్, పదమ్‌సింగ్ చౌదరి చెరో 164 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

గర్భిణిని చంపి.. ముక్కలుగా నరికిన ఆ దుర్మార్గులు

చచ్చేదాకా జైల్లోనే!

- ఐదేళ్ల క్రితం నాటి హత్య కేసులో కోర్టు సంచలన తీర్పు
- అప్పట్లో గచ్చిబౌలిలో బిహార్ మహిళ హత్య సంచలనం
- భర్తను వదిలేసి ప్రియుణ్ని వెతుక్కుంటూ నగరానికి మహిళ
- ఇంటి యజమాని భార్యతో ఎఫైర్ పెట్టుకోవడంతో ఆగ్రహం
- ఆమెను చంపేందుకు ప్రియుడు, యజమాని భార్య పథకం
- వారిద్దరికీ హత్యలో సహకరించిన యజమాని, కుమారుడు
- మెడపై కొట్టి హత్య.. ఎలక్ట్రిక్ కట్టర్‌తో మృతదేహం ముక్కలు
- ఆ ముక్కలను మూటగట్టి రోడ్డుపక్కన పారేసిన దుర్మార్గం
- నలుగురూ దోషులే.. యావజ్జీవ ఖైదు విధిస్తూ కోర్టు తీర్పు

హైదరాబాద్ సిటీ/కూకట్‌పల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): దాదాపు ఐదేళ్ల క్రితం సంచలనం సృష్టించిన బిహార్ మహిళ పింకీ హత్య కేసు గుర్తుందా? ఎనిమిది నెలల గర్భిణి అయిన ఆమెను దారుణంగా చంపి.. ఎలక్ట్రిక్ కట్టర్‌తో ముక్కలుగా నరికి, ఆ ముక్కల్ని మూటగట్టి రోడ్డున పడేసిన నలుగురు దుర్మార్గులూ చచ్చేదాకా జైల్లోనే ఉండాలని కూకట్‌పల్లి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. బిహార్‌లోని రాజౌన్ థానాకు చెందిన పింకీ (38)కి పెళ్లయి ముగ్గురు పిల్లలున్నారు. భర్తతో విభేదాలు రావడంతో.. అతణ్ని, పిల్లలను వదిలేసి యూపీకి చెందిన వికాస్ కాశ్యప్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందామె. కొన్నాళ్ల తర్వాత వికాస్ హైదరాబాద్‌కు మకాం మార్చాడు. గచ్చిబౌలి సిద్దికీ నగర్‌లో అనిల్ ఝా (60) అనే వ్యక్తి ఇంట్లో అద్దెకు దిగాడు. ఆయనకు భార్య మమత (46), కుమారుడు అమర్‌కాంత్ (24) ఉన్నారు. అద్దెకు దిగిన కొన్నాళ్లకే.. ఇంటి యజమాని భార్య అయిన మమతతో వికాస్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఇంతలో.. బిహార్‌లో అతడి వల్ల గర్భం దాల్చిన పింకీ తన ముగ్గురు పిల్లల్లో ఒకరిని వెంటబెట్టుకొని వికాస్ కోసం హైదరాబాద్‌కు చేరుకుంది. కానీ అతడు మరొక మహిళతో సంబంధం పెట్టుకున్నాడని తెలుసుకుని అతడితో గొడవపడింది. పింకీ తనకు పోటీగా రావడం జీర్ణించుకోలేకపోయిన మమత.. ఆమెను హత్యచేయాలంటూ వికాస్‌ను రెచ్చగొట్టింది. హత్యకు తన భర్త, కుమారుడు సహకరిస్తారని చెప్పి మరీ అతడిని ఒప్పించింది. అలా వికాస్, మమత, అనిల్, అమర్‌కాంత్ కలిసి పింకీ హత్యకు ప్లాన్ వేశారు. 2018 జూన్ 27 రాత్రి.. నిండు గర్భిణి అన్న కనికరమైనా లేకుండా అత్యంత రాక్షసంగా ఆమె మెడపై కొట్టి, పక్కటెముకలపై తన్ని ప్రాణాలు తీశారు. తర్వాత ఆమెను ఎవ్వరూ గుర్తించకుండా ఉండేందుకు ముఖాన్ని కాల్చేశారు. బండలను కోయడానికి ఉపయోగించే ఎలక్ట్రిక్ కట్టర్‌తో మృతదేహాన్ని ఏడు ముక్కలుగా కోసి రెండు సంచుల్లో మూటగట్టారు. తెల్లవారుజామున 3:30కు వికాస్, అనిల్, అమర్‌కాంత్ కలిసి యమహా బైక్‌పై ఆ సంచులను పెట్టుకొని బయలుదేరి కొండాపూర్ బొటానికల్ గార్డెన్ దగ్గర పడేశారు. మమతా ఝా ఇంట్లోనే ఉండి.. హత్య జరిగిన స్థలాన్ని శుభ్రం చేసింది. జూన్ 29న ఉదయం బొటానికల్ గార్డెన్ వద్ద వాకింగ్ చేస్తున్న కొందరు.. ఆ సంచుల్లోంచి దుర్వాసన వస్తుండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ పరిశీలించగా.. వికాస్, అనిల్, అమర్‌కాంత్ బైక్‌పై వచ్చి ఆ మూటలను పడేసిన దృశ్యాలు కనిపించాయి. బండి నంబర్ కనిపించకున్నా.. దానికి ముందు భాగంలో వైజర్ లేదని గుర్తించిన పోలీసులు ఆ గుర్తు ఆధారంగా ఆ బైక్ కోసం పరిసర ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీని 72 గంటలపాటు ఏకధాటిగా పరిశీలించారు. టెక్ మహీంద్రా వద్ద ఉన్న సిగ్నల్ దగ్గర ఆ బైక్ వారికి కనిపించింది. అలా వారిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. నలుగురినీ కోర్టు దోషులుగా కోర్టు నిర్ధారించింది. వారు మరణించేంత వరకూ జైల్లోనే ఉండాలంటూ న్యాయమూర్తి సి.పావని జీవిత ఖైదు విధిస్తూ శుక్రవారం తీర్పు వెలువరించారు.

'గీతం'లో బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

- ఐదో అంతస్తు నుంచి దూకిన వైనం
- గంజాయికి బానిసైన మరో యువకుడి బలవన్మరణం
- ఘట్‌కేసర్ వద్ద గూడ్స్‌రైలు కింద పడి అఘాయిత్యం



రేణుశ్రీ (ఫైల్)

పటాన్‌చెరు రూరల్, ఘట్‌కేసర్ రూరల్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ జనవరి 5: విద్యనభ్యసిస్తున్న కళాశాల ప్రాంగణంలోనే ఓ బీటెక్ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. కళాశాల భవనం ఐదో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. సంగారెడ్డి జిల్లా రుద్రారం పరిధిలోని గీతం విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. హైదరాబాద్ కూకట్‌పల్లిలోని శిల్పాబృందావన్ కాలనీ ఎల్లమ్మబండకి చెందిన ఎం.రేణుశ్రీ (18) గీతం యూనివర్సిటీలో బీటెక్(సీఎస్ఈ) మొదటి సంవత్సరం చదువుతుంది. శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో భవనం ఐదో అంతస్తుకు చేరుకున్న రేణుశ్రీ తన మొబైల్‌లో ఫోన్ మాట్లాడుతూనే పైనుంచి దూకింది. ఈ ఘటనపై పటాన్‌చెరు పోలీసులకు వెంటనే సమాచారం ఇచ్చిన యూనివర్సిటీ యాజమాన్యం రేణుశ్రీని స్థానికంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించింది. కానీ, తీవ్రంగా గాయపడిన రేణుశ్రీ అప్పటికే మరణించిందని వైద్యులు తెలిపారు. దీంతో తోటి విద్యార్థులు, రేణుశ్రీ తల్లిదండ్రులు విషాదంలో మునిగిపోయారు. ఈ ఆత్మహత్యపై కేసు నమోదు చేసిన పోలీసులు రేణుశ్రీ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు కారణం తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. మరో ఘటనలో.. గంజాయికి బానిసై మానసిక రుగ్మతలతో బాధపడుతున్న ఓ యువకుడు గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘట్‌కేసర్-బీబీ నగర్ రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో మేడ్చల్ జిల్లా చర్లపల్లికి చెందిన మోటుపోతుల విజయ్‌కుమార్ (28) బలవన్మరణం పొందాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. నారపల్లిలోని నల్లమల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో ప్రస్తుతం బీటెక్ సెకండియర్ చదువుతున్న విజయ్ గతంలో ఘట్‌కేసర్‌లో డిప్లమో చదివే రోజుల్లో గంజాయికి అలవాటు పడ్డాడు. డిప్లమో అనంతరం పాతబస్తీలోని మెథడిస్ట్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్‌లో చేరిన విజయ్ గంజాయి వ్యసనంతో పరీక్షలు తప్పి చదువు మానేశాడు. అనంతరం చర్లపల్లిలో ఓ చికెన్ సెంటర్ నిర్వహించాడు. విజయ్‌ను గంజాయికి దూరం చేయాలని తల్లిదండ్రులు డీఎడిక్షన్ కేంద్రానికి పంపి చికిత్సలు చేయించారు. ఆ తర్వాత మళ్లీ చదువుకుంటానని చెప్పడంతో తల్లిదండ్రులు విజయ్‌ను నల్లమల్లారెడ్డి కాలేజీలో చేర్పించారు. కానీ, మానసిక సమస్యలతో బాధపడుతూనే ఉన్న విజయ్ ఆత్మహత్య చేసుకుంటానని తల్లిదండ్రులతో పదేపదే చెప్పేవాడు. ఈ నేపథ్యంలో పరీక్షల్లో ఫెయిలైన విజయ్ మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి జేబులో దొరికిన గుర్తింపు కార్డుల ఆధారంగా వివరాలు సేకరించిన పోలీసులు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు.

ఆరోపణలు వస్తే అంతే

నేరుగా జోనల్ ఐజీ ఎదుట సరెండర్.. పోలీసులపై వస్తున్న ఫిర్యాదులపై సీరియస్

- బాధితులతో మాట్లాడుతున్న ఉన్నతాధికారులు
- నిజమని తేలితే కఠిన చర్యలకు అడుగులు
- కేసులు పెట్టేందుకూ వెనకాడబోమని హెచ్చరిక



హైదరాబాద్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో ఐఏఎస్ అధికారుల పోస్టింగ్‌లను మార్చిన కాంగ్రెస్ సర్కారు.. పోలీస్ శాఖపైనా ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా కీలక స్థానాల్లో సీనియర్ ఐపీఎస్ అధికారులకు పోస్టింగులు ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి.. వారి పరిధిలో సిబ్బంది పనితీరుపై చర్యలు, పోస్టింగుల విషయంలో అధికారులదే తుది నిర్ణయమని ప్రకటించారు. దీంతో అధికారులు మరీ ముఖ్యంగా హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో వరుస బదిలీలు చేపట్టారు కమిషనర్లు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని, పనితీరు సరిగా లేదని ఫిర్యాదులు వచ్చిన వారిని ఏకంగా జోనల్ ఐజీకి సరెండర్ చేస్తున్నారు. ఆరోపణలు వచ్చినప్పుడు, ప్రభుత్వాలు మారినప్పుడు పోలీస్ శాఖలో బదిలీలు సర్వసాధారణమే. కానీ గతానికి భిన్నంగా ఈసారి ఏకంగా జోనల్ ఐజీకి సరెండర్ చేస్తుండటం చర్చనీయాంశమైంది. ఆరోపణలు, ఇతరత్రా కారణాల వల్ల పాత వారిని తప్పించినా.. ఆ స్థానంలో కొత్త వారి నియామక విషయంలోనూ ఉన్నతాధికారుల నిర్ణయం సరిగా ఉండటం లేదని ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు చర్చించుకుంటున్నారు. గతంలో సిఫారసు లేఖలు లేకపోవడం, ఉన్నతాధికారులు సర్దిచెప్పడంతో ఏళ్ల తరబడి ఫోకల్ పోస్టింగ్స్‌కు దూరంగా ఉన్న వారిలో చాలా మంది తమకు ఈసారి కూడా అన్యాయమే జరుగుతోందని నిట్టూరుస్తున్నారు. కాగా, ఇటీవల జరిగిన ఐపీఎస్‌ల బదిలీల్లో ఒకరిద్దరి పోస్టింగ్స్ విషయంలోనూ పోలీస్ శాఖలో చర్చ జరుగుతోంది. ఓ కీలక కమిషనర్ నియామకం విషయంలో ఓ మంత్రి అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు చర్చ జరుగుతోంది.

పక్కా సమాచారంతోనే పక్కకు..

ఆరోపణలు వచ్చిన అధికారుల విషయంలో ఉన్నతాధికారులు పక్కా సమాచారం మేరకే స్పందిస్తున్నారు. ఆరోపణలు వచ్చిన సిబ్బందిపై ముందుగా నిఘా విభాగం నుంచి సమాచారం సేకరిస్తున్నారు. అవసరమైతే బాధితులతో మాట్లాడి వాస్తవాలు తెలుసుకుంటున్నారు. ఇలా అన్ని రకాలుగా తమకు అందుతున్న సమాచారాన్ని బేరీజు వేసుకుని పోస్టింగ్స్ నుంచి తప్పిస్తున్నారు కమిషనర్లు. పద్ధతి మార్చుకోవాలని, లేదంటే శాఖాపరమైన చర్యలతోపాటు కేసుల నమోదుకు వెనుకాడేది లేదని సిబ్బందిని హెచ్చరిస్తున్నారు. బాధితుల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు విజిటర్స్ టైమింగ్స్‌లోను మార్పులు చేస్తున్నారు. సైబరాబాద్ కమిషనరేట్ కార్యాలయంలో విజిటర్స్ టైమింగ్ మధ్యాహ్నం 12 నుంచి 1 గంటకు మార్చారు. కమిషనరేట్ పరిధిలోని దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు సాయంత్రం తిరిగి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతుండటంతో వేళల్లో మార్పు చేశారు. కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోనూ వరుస బదిలీలు హాట్ టాపిక్‌గా మారాయి. కొందరు కమిషనర్లు ఒక అడుగు ముందుకేసి సిబ్బంది తీరు మార్చుకోవాలని లేదంటే శాఖాపరమైన చర్యలతోపాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

చర్యలు సరే.. సమస్యల పరిష్కారమేది..

విధుల్లో నిర్లక్ష్యం, అవినీతి, ఇతరత్రా కారణాలతో సిబ్బందిపై ఉన్నతాధికారుల చర్యలు పక్కనబెడితే.. ఏళ్ల తరబడి పోలీస్ శాఖలో పేరుకుపోయిన సమస్యల సంగతేంటని సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. పోలీస్ సిబ్బందికి వారాంతపు సెలవులు లేకపోవడం వల్ల తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నారని.. దీనిపై ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టి సారించాలని కోరుతున్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు, సరెండర్లు, పీఆర్‌సీ ఎరియర్స్, జీపీఎఫ్, మెడికల్ బిల్లులు, టీఏలు ఇప్పించాలని, ఇతరత్రా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



▲ జేఎన్‌టీయూ స్నాతకోత్సవంలో పాల్గొన్న ఇస్రో చైర్మన్ సోమనాథ్

ఇక చాలు.. అనే ఆలోచనే వద్దు

- ఓటమి నుంచి పాఠాలు నేర్చుకోవాలి
- జేఎన్‌టీయూ స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మన్ సోమనాథ్

హైదరాబాద్ సిటీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): జీవితంలో ఇక చాలు అనే ఆలోచన చెయ్యకూడదని, ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని విజయం సాధించాలని ఇస్రో చైర్మన్ డాక్టర్ శ్రీధర ఫణిక్కర్ సోమనాథ్ విద్యార్థులకు సూచించారు. చదువుకున్న చదువు సమాజానికి ఏ విధంగా మేలు చేస్తుందనే మానవీయ కోణంలో పట్టభద్రుల ఆలోచనలు ఉండాలని అన్నారు. జేఎన్‌టీయూ 12వ స్నాతకోత్సవానికి సోమనాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతేకాక, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో కనబరిచిన ప్రతిభకు గాను జేఎన్‌టీయూ ఆయనకు అందజేసిన గౌరవ డాక్టరేట్‌ను ఉపకులపతి డాక్టర్ కట్టా నర్సింహారెడ్డి నుంచి స్వీకరించారు. చాన్సలర్ హోదాలో ఈ స్నాతకోత్సవానికి హాజరవ్వాల్సిన రాష్ట్ర గవర్నర్ తమిళిసై అనివార్య కారణాలతో గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించిన సోమనాథ్.. ఓటములకు భయపడి కుంగిపోకూడదని సూచించారు. విజయం కోసం చేసే ప్రయత్నం కొనసాగాలని అన్నారు. చంద్రయాన్ ప్రయోగం సందర్భంగా ఇస్రోకు ఎదురైన అనుభవాలను ఈ సందర్భంగా వివరించారు. డిగ్రీ చేతికొచ్చింది కదా అని సంతృప్తి పడకుండా విద్యార్థులు నిత్యం ఏదో ఒక ప్రయోగం చేస్తుండాలని కోరారు. కాగా, స్నాతకోత్సవంలో భాగంగా 75,815 మంది అండర్ గ్రాడ్యుయేట్, 11,088 మందికి పోస్టు గ్రాడ్యుయేట్, 835మంది ఫార్మ్-డీ, 142మంది పీహెచ్‌డీ విద్యార్థులకు పట్టాలు అందజేశారు. వివిధ అంశాల్లో విశేష ప్రతిభ కనబరిచిన 142 మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● శనివారం 6 జనవరి 2024

గుజరాత్ మారిటైమ్ వర్సిటీలో ఎంబీఏ, ఎల్ఎల్ఎం

గాంధీనగర్‌లోని గుజరాత్ మారిటైమ్ యూనివర్సిటీ (జీఎంయూ)- ఎంబీఏ, మాస్టర్ ఇన్ లా(ఎల్ఎల్ఎం) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఒక్కో ప్రోగ్రామ్‌లో 60 సీట్లు ఉన్నాయి.

ఎంబీఏ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్

దీనిని సంస్థ ఆధ్వర్యంలోని స్కూల్ ఆఫ్ మారిటైమ్ మేనేజ్‌మెంట్ నిర్వహిస్తుంది. ఇది రెండేళ్ల వ్యవధి గల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొత్తం 106 క్రెడిట్స్ నిర్దేశించారు. ఈ ప్రోగ్రామ్‌ని డెన్మార్క్‌లోని కోపెన్‌హాగన్ బిజినెస్ స్కూల్ రూపొందించింది. ఆలిండియా కోటా కింద 30 సీట్లు నిర్దేశించారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు/పరీక్షలు రాసి ఫలితాల కోసం చూస్తున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంపిక: జాతీయ స్థాయిలో సంస్థ నిర్వహించే ఆన్‌లైన్ రిమోట్‌లీ ప్రోక్టోర్డ్ ఆన్‌లైన్ ఎంట్రెన్స్ టెస్ట్‌లో సాధించిన మెరిట్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంట్రెన్స్ టెస్ట్‌లో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, వెర్బల్ ఎబిలిటీ అండ్ కాంప్రహెన్షన్ నుంచి 70 ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం గంటన్నర. నెగెటివ్ మార్కులు లేవు. ఆన్‌లైన్ ఎంట్రెన్స్ టెస్ట్‌కు 70 శాతం, ఇంటర్వ్యూకి 30 శాతం వెయిటేజీ ఉంటుంది. సీమ్యాట్/క్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్న అభ్యర్థులకు నేరుగా అడ్మిషన్స్ ఇస్తారు.

ఎల్ఎల్ఎం

సంస్థ ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ పోస్ట్ గ్రాడ్యుయేట్ లీగల్ స్టడీస్ ఈ ప్రోగ్రామ్‌ని నిర్వహిస్తోంది. మారిటైమ్ లా, ఇంటర్నేషనల్ ట్రేడ్ లా స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఇది ఏడాది వ్యవధి గల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. ఇందులో రెండు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి సెమిస్టర్‌లో మూడు కంపల్సరీ కోర్సులు, రెండు స్పెషలైజేషన్ కోర్సులు; రెండో సెమిస్టర్‌లో నాలుగు స్పెషలైజేషన్ కోర్సులు, ఒక డిజర్టేషన్ ఉంటాయి. సెమిస్టర్‌కు 13 చొప్పున మొత్తం 26 క్రెడిట్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఎల్ఎల్‌బీ/తత్సమాన డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం చాలు. చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు, క్లాట్ అర్హత పొందినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంట్రెన్స్ టెస్ట్: కంప్యూటర్/ల్యాప్‌టాప్/ట్యాబ్‌లెట్/మొబైల్ ద్వారా ఎగ్జామ్ రాయవచ్చు. ఆడియో, వీడియో సౌకర్యాలతోపాటు వేగవంతమైన ఇంటర్నెట్‌ను ఏర్పాటు చేసుకోవాలి. ఇందులో మొత్తం 70 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నలన్నీ ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ/ఎల్ఎల్‌బీ స్థాయిలోనే ఉంటాయి. కాన్‌స్టిట్యూషనల్ లా, జ్యూరిస్ప్రుడెన్స్, అడ్మినిస్ట్రేటివ్ లా, లా ఆఫ్ కాంట్రాక్ట్, టార్ట్స్, క్రిమినల్ లా, పబ్లిక్ ఇంటర్నేషనల్ లా, రీసెర్చ్ ఆప్టిట్యూడ్, టీచింగ్ ఆప్టిట్యూడ్, కరెంట్ అఫైర్స్ అంశాల ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం గంట.

పర్సనల్ ఇంటర్వ్యూ: ఆన్‌లైన్ ఎంట్రెన్స్ టెస్ట్‌లో కనీసం 50 శాతం మార్కులు సాధించిన వారిని పర్సనల్ ఇంటర్వ్యూకి పిలుస్తారు. ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థులకు ఈమెయిల్ ద్వారా సమాచారమిస్తారు. వర్సిటీ వెబ్‌సైట్‌లో కూడా పోస్ట్ చేస్తారు.

ఎంపిక: ఆన్‌లైన్ టెస్ట్ స్కోర్‌కు 70 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 30 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు. సీట్లు మిగిలిన పక్షంలో క్లాట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్న అభ్యర్థులకు అవకాశం ఇస్తారు.

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 5
- **మాక్/డెమో ఆన్‌లైన్ టెస్ట్:** జూన్ 7
- **ఆన్‌లైన్ ప్రాక్టోర్డ్ అడ్మిషన్ టెస్ట్:** జూన్ 9
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** జూన్ 12, 13
- **ఎంపికైన అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** జూన్ 18
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** జులై 1 నుంచి
- **వెబ్‌సైట్:** gmu.edu.in



ఐఐటీ మద్రాస్‌లో డేటాసైన్స్ అండ్ అప్లికేషన్స్

మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీఎం)- బీఎస్ ఇన్ డేటా సైన్స్ అండ్ అప్లికేషన్స్ (2024 జనవరి బ్యాచ్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఆన్‌లైన్ ప్రోగ్రామ్. ఇప్పటికే వివిధ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు, వర్కింగ్ ప్రొఫెషనల్స్, ఉద్యోగార్థులకు ఈ ప్రోగ్రామ్ ఉపయోగకరంగా ఉంటుంది. క్వాలిఫయర్ ఎగ్జామ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసినవారు ఇంజనీరింగ్ అర్హత లేకున్నా ప్రోగ్రామర్లుగా, డేటా సైంటిస్ట్‌లుగా రాణించవచ్చు.



ప్రోగ్రామ్ వివరాలు

- ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. గరిష్ఠంగా ఎనిమిదేళ్లలో పూర్తి చేయాలి. ఇందులో నాలుగు దశలు ఉన్నాయి. అవి ఫౌండేషన్ లెవెల్, డిప్లొమా లెవెల్, బీఎస్సీ డిగ్రీ లెవెల్, బీఎస్ లెవెల్.
- రెగ్యులర్ ఎంట్రీ విధానంలో దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులు అసైన్‌మెంట్స్ స్కోర్, క్వాలిఫయర్ ఎగ్జామ్ ద్వారా ఫౌండేషన్ లెవల్‌కు అర్హత సాధిస్తారు. దీన్ని పూర్తి చేసిన తరవాత డిప్లొమాకు ఆ తరవాత బీఎస్సీ డిగ్రీకి, తరవాత బీఎస్‌కి అడ్మిషన్ లభిస్తుంది.
- ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ 2023కి అర్హత పొందినవారు కూడా అడ్మిషన్ పొందవచ్చు. వీరు క్వాలిఫయర్ ఎగ్జామ్‌నకు బదులు నాలుగు గంటల క్విజ్‌లో అర్హత పొందాల్సి ఉంటుంది. క్విజ్ స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.
- ప్రోగ్రామ్ నుంచి ఏ దశలోనైనా అభ్యర్థులు నిష్క్రమించే వీలుంది. పూర్తిచేసిన కోర్సులకు సంబంధించి సంస్థ సర్టిఫికెట్‌లు ప్రదానం చేస్తుంది.
- ఫౌండేషన్ లెవెల్లో ఎనిమిది కోర్సులు ఉంటాయి. 32 క్రెడిట్లు నిర్దేశించారు.
- డిప్లొమా లెవెల్లో ఆరు థియరీ కోర్సులు, రెండు ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. 27 క్రెడిట్లు నిర్దేశించారు. ఈ లెవెల్లో ప్రోగ్రామింగ్, డేటా సైన్స్ స్పెషలైజేషన్‌లు ఉంటాయి. వీటిలో ఏదైనా ఒకదాన్ని లేదా రెంటినీ ఎంచుకోవచ్చు.
- బీఎస్సీ, బీఎస్ లెవెల్లో ఒక్కోదానికి 28 క్రెడిట్స్ నిర్దేశించారు.
- లెవెల్ వారీగా నిర్దేశించిన ఒక్కో అంతర్గత కోర్సు 12 వారాలు ఉంటుంది. ప్రతి వారం వీడియో క్లాసులు, అసైన్‌మెంట్స్ ఉంటాయి. మంత్లీ క్విజ్‌లు, ఎండ్ టర్మ్ ఎగ్జామ్‌లు కూడా నిర్వహిస్తారు.

అర్హత: ఇంగ్లీష్, మేథమెటిక్స్ సబ్జెక్టులతో ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.

- నేషనల్ డిఫెన్స్ అకాడమీ నిర్వహించే రెండేళ్ల జాయింట్ సర్వీసెస్ వింగ్ ఫైనల్ ఎగ్జామ్ ఉత్తీర్ణులు; మూడేళ్ల డిప్లొమా పూర్తి చేసినవారు; జనరల్ సర్టిఫికెట్ ఎడ్యుకేషన్ ఎగ్జామినేషన్(జీసీఈ) అడ్వాన్స్‌డ్ లెవెల్ ఉత్తీర్ణులు; కనీసం అయిదు సబ్జెక్టులతో ఎన్ఐఓఎస్ ఎగ్జామ్ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

అడ్మిషన్ ప్రక్రియ: రెగ్యులర్/జేఈఈ ఎంట్రీ విధానంలో దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులకు మొదట నెల రోజులు ఆన్‌లైన్ శిక్షణ నిర్వహిస్తారు. ఇందులో ఇంగ్లీష్, మేథమెటిక్స్ ఫర్ డేటా సైన్స్, స్టాటిస్టిక్స్ ఫర్ డేటా సైన్స్, కంప్యూటేషనల్ థింకింగ్ కోర్సులపై తరగతులు ఉంటాయి. ఒక్కో కోర్సుకు సంబంధించి వారానికి 2 నుంచి 3 గంటల వీడియో కంటెంట్ పంపుతారు.

- ప్రతి కోర్సులో అభ్యర్థులకు ఇచ్చిన అసైన్‌మెంట్లను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తిచేసి ఆన్‌లైన్‌లో పంపాలి. వీటికి మార్కులు ఉంటాయి. మొదటి మూడు అసైన్‌మెంట్లలో మంచి స్కోర్ వచ్చిన రెంటి యావరేజ్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకుంటారు. ప్రతి కోర్సులో కనీసం 40 శాతం యావరేజ్ అసైన్‌మెంట్ స్కోర్ సాధించినవారిని మాత్రమే క్వాలిఫయర్ ఎగ్జామ్/ఇన్ పర్సన్ క్విజ్‌కు అనుమతిస్తారు. రిజర్వుడ్ వర్గాలకు 30 శాతం వస్తే చాలు.
- క్వాలిఫయర్ ఎగ్జామ్ వివరాలు: పరీక్ష సమయం 3 గంటలు. ఒక్కో కోర్సుకు 45 నిమిషాలు ఇస్తారు. ఒక్కో కోర్సులో కనీసం 40 శాతం చొప్పున మొత్తమ్మీద 50 శాతం మార్కులు రావాలి. ఈ స్కోర్ వ్యాలిడిటీ ఏడాది వరకు ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.3,000; జనరల్ కేటగిరీ దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన దివ్యాంగులకు రూ.750
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 14
- **క్వాలిఫయర్ ఫేజ్ ప్రారంభం:** జనవరి 19 నుంచి
- **క్వాలిఫయర్ ఎగ్జామ్ తేదీ:** ఫిబ్రవరి 25
- **ఫలితాలు విడుదల:** మార్చి 1
- **ప్రోగ్రామ్ రిజిస్ట్రేషన్:** మార్చి 6 నుంచి 7 వరకు
- **వెబ్‌సైట్:** study.iitm.ac.in

మీకు తెలుసా?




- చూడటానికి కాకి లుక్, నెమలిలాంటి చర్మ సోయగం, ఎర్ర పెద్ద ముక్కు ఉండే ఈ పక్షి పేరు 'తకాహె'. రైల్ అనే పక్షి జాతికి చెందినవి. ఇవి కేవలం న్యూజిలాండ్‌లోనే కనిపిస్తాయి.
- 1847లో ఈ పక్షి ఆనవాళ్లు యూరోపియన్లకు తెలిశాయి. అప్పుడే వీటికి ఈ పేరు పెట్టారు.
- రెండున్నర కేజీ వరకూ బరువు పెరిగే ఈ పక్షులు కనీసం 18 సంవత్సరాల పాటు జీవిస్తాయి.
- పురుగులు, ఆకులు, చిన్న గింజలను తిని బతుకుతాయి.
- ఇవి కేవలం మూడు గుడ్లను మాత్రమే పెడతాయి.
- వీటి పెరుగుదల తక్కువ. పుట్టిన పిల్లల్లో 22 నుంచి 85 శాతం మాత్రమే బతికే అవకాశం ఉంది. 2013 లెక్కల ప్రకారం ఇవి కేవలం 263 పక్షులే




ఉండేవి. ఇప్పుడు 500 దాకా ఉన్నాయి. అంటే ఇవి అంతరించిపోయే జాతి అన్నమాట.

- ఇవి సోషల్ బర్డ్స్ కాదు. జూలో ఉంచితే మనుషులతో దగ్గరగా ఉన్నా.. వీటిని చీటికి మాటికి తాకరు. అవి ప్రమాదంలో పడతాయేమోనని వాటికి దూరంగా ఉంచుతారు.
- ఈ పక్షులు వేరే పక్షులతో కొట్లాడటానికి రెడీగా ఉంటాయి. అగ్రెసివ్‌గా ఉంటాయి. కొట్లాడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటాయి. అందుకే వీటిని సంరక్షించటం కత్తిమీద సామే.
- చిన్నపిల్లలు నల్లగా ఉంటాయి. యుక్త వయసుకు వచ్చినప్పుడే బూడిద రంగు, డీప్ బ్లూ రంగులొస్తాయి. దీంతో పాటు ముక్కు కూడా ఎర్రగా మారుతుంది.
- గ్రాస్‌లాండ్స్‌లో తిరిగే ఈ పక్షులు వేటగాళ్లకు సులువుగా దొరికిపోతాయి. ఇందుకు కారణం వాటి సోమరితనమే.

చుక్కలు కలిపి బొమ్మ గీయండి



దారి కనుక్కోండి



10 తేడాలు గుర్తించండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 197

	8		2	3				6
					6	3	4	
			8				1	5
				1		7		
	3		7		8		2	
		8		2				
8	9				4			
	4	2	5					
6				7	2		9	

సుడోకు - 196 సమాధానం

8	9	2	3	6	7	5	4	1
5	3	6	4	1	9	8	2	7
4	1	7	8	5	2	6	9	3
9	6	4	5	7	8	1	3	2
1	2	5	6	9	3	7	8	4
3	7	8	2	4	1	9	5	6
7	5	1	9	3	4	2	6	8
2	4	9	7	8	6	3	1	5
6	8	3	1	2	5	4	7	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

మహా జనపదాలు

టీఎస్‌పీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ హిస్టరీ

క్రీ.పూ.6వ శతాబ్దంలో ఏర్పడిన 16 రాజ్యాలను షోడశ మహా జనపదాలు అంటారు. దీనిని రెండో పట్టణీకరణ అని కూడా అంటారు. మగధ, అంగ, ఛేది, మల్ల, మత్స్య, కురు, గాంధార, అస్మక, కోసల, పాంచాల, కాంభోజ, వజ్జి మొదలైనవి వీటిలో ప్రధాన రాజ్యాలు.

క్రీ.పూ.600 నాటికి షోడశ మహాజనపదాలు 16 రాజ్యాలుగా ఏర్పడ్డాయి. ప్రస్తుత భారతదేశం అవతల గాంధార, కాంభోజ రాజ్యాలు ఏర్పడ్డాయి. దక్షిణ భారతదేశంలో ఏకైక రాజ్యం అస్మక. ఇది నేటి నిజామాబాద్ జిల్లా. దీని రాజధాని పోతలి(బోధన్). మిగతా రాజ్యాలన్నీ ఉత్తర భారతదేశంలో ఏర్పడ్డాయి. ఈ రాజ్యాల గురించి 'అంగుట్టనికాయ' అనే బౌద్ధ సాహిత్యంలో ఉంది. అవి..

అంగ: బెంగాల్, బిహార్‌లోని భాగల్‌పూర్, మాంఘర్ జిల్లాల ప్రాంతం. దీని రాజధాని చంప.

కాశీ: గంగానది తీరంలో మధ్య ఉత్తరప్రదేశ్ ప్రాంతం. దీని రాజధాని వారణాశి. వరుణ, అసి నదుల మధ్య ఉంది.

కోసల: ఉత్తరప్రదేశ్‌లోని సరయూ నది తీర ప్రాంతం. దీని రాజధాని శ్రావస్తి, అయోధ్య

ఛేది: మధ్యప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్ ప్రాంతం. దీని రాజధాని శక్తిమతి

వత్స: యమునా నదీ తీరంలో ఈ మహాజనపదం ఉంది. దీని రాజధాని కౌశాంబి.

కురు: ఢిల్లీ పరిసర ప్రాంతం. దీని రాజధాని ఇంద్రప్రస్థం. నేటి ఆధునిక ఢిల్లీ. మలివేద కాలంలో భరత, పురు తెగలు కలిసి 'కురు' తెగగా ఏర్పడింది.

పాంచాల: ఉత్తర ప్రదేశ్‌లోని బదౌని, ఫరుకాబాద్ జిల్లాల్లో పాంచాల జనపదం ఉంది. దీని రాజధాని అహిచ్ఛత్ర.

అవంతి: పశ్చిమ మధ్యప్రదేశ్ ప్రాంతం. దీని రాజధాని ఉజ్జయిని.

అస్మక: దక్షిణాపథ రాజ్యం. రాజధాని నిజామాబాద్ జిల్లాలోని బోధన్

మగధ: బిహార్‌లోని పట్నా, గయ జిల్లాల మధ్య ప్రాంతం. రాజధాని గిరివ్రజం, రాజగృహం, పాటలీపుత్రం.

శూరసేన: మధుర కేంద్రంగా యమునా నది తీర ప్రాంతం. రాజధాని మధుర

మత్స్య: రాజస్థాన్‌లోని జైపూర్ ప్రాంతం. దీని రాజధాని విరాట నగరం.

గాంధార: నేటి ఆఫ్ఘనిస్థాన్‌లోని కాందహార్ ప్రాంతం. దీని రాజధాని తక్షశిల నేటి రావల్పిండి.

కాంభోజ: నేటి ఆఫ్ఘనిస్థాన్

మల్ల: కుశినగర్, పావాపురి ప్రాంతాల్లో ఏర్పడిన జనపదం. రాజధాని పావపురి.

వజ్జి: ఉత్తర బిహార్ ప్రాంతం. దీని రాజధాని వైశాలి ప్రాంతం.

ముఖ్యమైన జనపదాలు:

1. మగధ, 2. అవంతి, 3. కోసల, 4. వారణాశి పై రాజ్యాల్లో మగధ రాజ్య విస్తరణకు దోహదపడిన రాజవంశాలు వరుసగా...హర్యంక, శిశునాగ, నంద, మౌర్య.



హర్యంక వంశం

బింబిసారుడు ఈ వంశ స్థాపకుడు. భారతదేశ చరిత్రలో మొట్టమొదటి సారిగా సిద్ధ సైన్యం ఏర్పాటు చేశాడు. అంగరాజైన బ్రహ్మదత్తున్ని ఓడించి వారి రాజధాని 'చంప'ను ఆక్రమించాడు. బింబిసారుడు కోసల రాకుమార్తెను వివాహం చేసుకొని 'కాశీ' మహాజనపదాన్ని కట్నంగా పొందాడు. అవంతి రాజైన చంద్రప్రద్యోత మహాసేనతో యుద్ధాలు చేసి చివరికి సంధి కుదుర్చుకున్నాడు. బింబిసారుని ఆస్థానంలో 'జనకుణ్ణి' లేదా జీవకుడు అనే వైద్యుడు ఉండేవాడు.

అజాత శత్రు: తన తండ్రి బింబిసారుడిని సంహరించి రాజు అయ్యాడు. పాటలీపుత్రం పేరుతో నూతన నగరాన్ని నిర్మించాడు. ఇది ప్రస్తుత బిహార్ రాష్ట్ర రాజధాని పట్నా. కోసల రాజు ప్రసేన జిత్తు కుమార్తె వజ్జిరను వివాహం చేసుకున్నాడు. మహాశిల, రథముశాల అనే నూతన ఆయుధాలు తయారు చేశాడు.

ఉదయనుడు: పాటలీపుత్రను తన రాజధానిగా చేసుకున్నాడు. గంగ, శోణ, సరయూ, గండకి నదుల సంగమ స్థానంలో పాటలీపుత్రం ఉంది. కాబట్టి పాటలీపుత్రం నగరాన్ని గొప్ప జలదుర్గం అని అంటారు. ఉదయనుడు తరవాత అనిరుద్ధ, మండ రాజు, నాగదాసకుడు వరుసగా పరిపాలించారు.

శిశునాగ వంశం

శిశునాగుడు: నాగ దాసకున్ని సంహరించి శిశునాగుడు ఈ వంశాన్ని స్థాపించాడు. వీరి రాజధాని వైశాలి.

కాల అశోకుడు: ఈ వంశంలో మరొక రాజు కాల అశోకుడు. ఇతడు బౌద్ధమతాన్ని ఆదరించాడు. ఈ వంశంలో చివరి వాడు కాకవర్ధిన్

నంద వంశం

శిశునాగ వంశాన్ని ఓడించి, నందవంశాన్ని మహాపద్మనందుడు స్థాపించాడు. ఇతనికి 'రెండో పరశురాముడు', 'ఏకరాట్' అనే బిరుదులు ఉన్నాయి. మహాపద్మనందుడు శూద్ర స్త్రీకి జన్మించినట్లు పురాణాల్లో ఆధారాలున్నాయి. మహాపద్మనందుడు కళింగ(ఒడిశా)పై దండెత్తి కొన్ని జైన విగ్రహాలను పాటలీపుత్రానికి తరలించాడు.

ధననందుడు: ఈ వంశంలో చివరి రాజు ధననందుడు. నంద రాజులను నవనందులు అని కూడా అంటారు. ఈ నంద రాజులను గ్రీకులు 'ఉగ్రసేనులు'గా వర్ణించారు. ధననందుని కాలంలో వాయువ్య ప్రాంతంలో అలెగ్జాండర్ భారతదేశంపై దండెత్తాడు. ధననందుడిని చంద్రగుప్త మౌర్యుడు ఓడించి మౌర్య సామ్రాజ్యాన్ని స్థాపించాడు.

విదేశీ దండయాత్రలు

పర్షియన్లు: భారతదేశంపై తొలిసారిగా దండయాత్ర చేసిన విదేశీయులు పర్షియన్లు. పర్షియన్స్ అంటే ఇరానీయులు. వీరినే పారశీకులు అని కూడా పిలుస్తారు.

డేరియస్: పర్షియన్లను పాలించిన మొదటి డేరియస్ క్రీ.పూ.516లో పంజాబ్, సింధూ ప్రాంతాలను జయించి తన రాజ్యంలో కలుపుకొన్నాడు. ఆ కాలంలో రాష్ట్రాలను 'సంతృపి' లేదా 'సాత్రపి' అని పిలిచేవారు. ఈ రాజు కాలంలోనే పర్షియా రాజ్యంలో పంజాబ్, సింధూ ప్రాంతాలను 20వ సాత్రపిగా చేర్చారు.

గ్రీకులు: భారతదేశంపై దండయాత్రను చేసిన రెండో వారు గ్రీకులు. క్రీ.పూ. 356లో అలెగ్జాండర్ జన్మించాడు. ఇతని గురువు అరిస్టాటిల్. గ్రీకులకు, పర్షియన్లకు మధ్య అనేక యుద్ధాలు జరిగాయి. వీటి గురించిన పూర్తి సమాచారం 'హిస్టోరికా' గ్రంథంలో ఉంది.

- క్రీ.పూ.336లో తన తండ్రి మరణాంతరం అలెగ్జాండర్ సింహాసనం అధిష్ఠించాడు. అనేక గ్రీకు రాజ్యాలను జయించి ఏకీకృతం చేశాడు. తరవాత 'ఆసియా మైనర్' ప్రాంతాలపై దండెత్తాడు. ఈజిప్టును ఆక్రమించి నైలు నది ఒడ్డున అలెగ్జాండ్రియా అనే నగరాన్ని అలెగ్జాండర్ నిర్మించాడు. గౌగమేళ యుద్ధంలో పర్షియా రాజైన మూడో డేరియస్‌ను ఓడించాడు. వారి రాజ్యాన్ని కూడా ఆక్రమించాడు. వారి రాజధాని పెర్సిపోలిస్‌ను ధ్వంసం చేశాడు. అలెగ్జాండర్‌కు వ్యతిరేకంగా గౌగమేళ యుద్ధంలో పర్షియన్లతో కలిసి భారతీయులు కొంతమంది యుద్ధం చేశారు. దాంతో అలెగ్జాండర్ కాబుల్ ప్రాంతాలను ఓడించి ఖైబర్ కనుమల ద్వారా భారతదేశంలోకి ప్రవేశించాడు.
- అలెగ్జాండర్ తక్షశిల రాజైన 'అంబి'తో సైనిక ఒప్పందం చేసుకున్నాడు. అతనిని తన సామంతుడిగా మార్చుకున్నాడు. క్రీ.పూ.326వ సంవత్సరంలో అలెగ్జాండర్‌కు పురుషోత్తమ్(పోరస్)కు మధ్య హైడాస్పస్(జీలం నది) ఒడ్డున కర్రమైదాన ప్రాంతంలో యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో అలెగ్జాండర్ విజయం సాధించాడు. అంబి చక్రవర్తి అలెగ్జాండర్‌ను ఆహ్వానించి సహాయం చేశాడు. ఈ సందర్భంగా భారతీయుల పోరాటపటిమను అలెగ్జాండర్ ప్రశంసించాడు. పురుషోత్తమ్‌ను సత్కరించి, అతని రాజ్యాన్ని అతనికి ఇచ్చి ఒక రాజుగా గుర్తించాడు.
- భారతదేశ వాయువ్య ప్రాంతంలో అలెగ్జాండర్ తాను జయించిన ప్రాంతాలను, కాబుల్‌లోని ప్రాంతాలను కలిపి తన సైన్యాధ్యక్షుడైన సెల్యూకస్ నికేటర్‌ను గవర్నర్‌గా నియమించాడు.
- ఈ క్రమంలో తన సైనిక తిరుబాటు కారణంగా అలెగ్జాండర్ పాటలీపుత్రంపై దాడి చేయకుండానే మాతృదేశానికి పయనమయ్యాడు. మార్గమధ్యలో క్రీ.పూ.323లో ఇరాక్‌లోని బాబిలోనియా ప్రాంతంలో విష జ్వరంతో అలెగ్జాండర్ మరణించినట్లు గ్రీకు చరిత్రకారులు పేర్కొన్నారు. అయితే మరికొన్ని మత గ్రంథాల్లో మాత్రం.. పురుషోత్తమ్‌తో జరిగిన యుద్ధంలో గాయపడి, దాని ప్రభావం చేతనే అలెగ్జాండర్ మరణించినట్లు రాసి ఉంది.
- గ్రీకుల దండయాత్రతో భారతదేశంలో చారిత్రక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి.

డాక్టర్ ఐ.నీలా
అసిస్టెంట్ ప్రొఫెసర్
ప్రభుత్వ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, సూర్యాపేట




చార్జింగ్ స్పీడ్ తగ్గించేందుకు
యాంపియర్ యాప్

బ్యాటరీ డౌన్ అయితే చార్జింగ్ పెట్టడం మనకు తెలిసిన విద్య. అయితే ఆ చార్జింగ్ ఎలా జరుగుతుందో తెలియాలంటే ఏం చేయాలన్నది ప్రశ్న. అందుకు సమాధానమే యాంపియర్ యాప్. చార్జింగ్ వేగాన్ని ఈ యాప్ లెక్కిస్తుంది. ఏ మేరకు కరెంట్ డిస్‌చార్జ్ అయిందో కూడా తెలియజేస్తుంది. మొత్తమ్మీద బ్యాటరీ హెల్త్, పవర్ వినియోగాన్ని ఈ యాప్ వివరిస్తుంది. దశాబ్దం క్రితం అయిదు, పది వాట్స్ చార్జింగ్ సదుపాయం మాత్రమే ఉండేది. ఈ రోజుల్లో రియల్‌మి జీటీ5 అంటే కేవలం పన్నెండు నిమిషాల వ్యవధిలో జీరో నుంచి వందశాతం చార్జింగ్ అవుతోంది. ఈ నేపథ్యంలో యాంపియర్ యాప్ ప్రొ వెర్షన్ బాగా ఉపయోగపడుతుంది. దీని వినియోగం ఎలా అంటే...

- స్మార్ట్‌ఫోన్‌లో యాంపియర్ యాప్‌ను ఓపెన్ చేయాలి. అది రన్ అవుతూ ఉంటుంది. అలా ఆటోమేటిక్‌గా లెక్కింపు పని జరుగుతుంది.
- కొద్ది నిమిషాల తరవాత ఫలితం స్ర్కీన్‌పై కనిపిస్తుంది.
- చార్జ్ లెవెల్, హెల్త్, స్టాటస్, టెక్నాలజీ, మేగ్జిమమ్ కెపాసిటీ, టెంపరేచర్, ఓల్టేజ్ తదితరాలన్నీ ఆ సమాచారంలో ఉంటాయి.

ఎంఏ(మిలియంపియర్)లో ఫలితం ఉంటుంది. దాన్ని వాట్స్‌లోకి మార్చుకోవాలి. గరిష్ఠంగా వినియోగంలో ఉందా లేదా అన్నది కూడా చూసుకోవచ్చు. అయితే ఈ యాప్‌నకు సంబంధించి పెయిడ్ వెర్షన్ చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.



అప్‌డేట్

ఇన్‌స్టా మెసేజ్‌లూ కరెక్ట్ చేయొచ్చు

దాదాపుగా యాప్‌లన్నీ మెసేజ్‌లను ఎడిట్ చేసే ఆప్షన్ ఇచ్చాయి. అలాగే 'ఎడిటెడ్' అన్న ట్యాగ్ సైతం ఉంటుంది. అయితే ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పంపిన మెసేజ్‌లను ఎడిట్ చేసుకోవచ్చు. ఎడిట్ చేసినట్టు మాత్రం తెలియదు. ఇందులో ఆశ్చర్యపోవాల్సింది ఏమీ లేదు. ఇదో బిల్ట్-ఇన్ ఫీచర్. రెండు ఫీచర్ల కలియకగా ఇది పనిచేస్తుంది. ఇందు కోసం...

- ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పంపిన మెసేజ్ తాలూకా చాట్‌విండోని మొదట కనుగొనాలి.
- మెసేజ్ టాప్, లాంగ్ ప్రెస్, తదుపరి కాపీ చేయాలి. మళ్ళీ అదే చర్యను రిపీట్ ఆపై డిలీట్ చేయాలి. దీన్ని ఇన్‌స్టాగ్రామ్ నోటీస్ చేయదు.
- మెసేజ్‌ను మళ్ళీ చాట్ బాక్స్‌లో పేస్ట్ చేయాలి. ఈ పద్ధతిలో మెసేజ్‌ని ఎడిట్ చేసినట్టు ఎవరికీ తెలియదు. అలాగే ఇన్‌స్టాగ్రామ్ నిర్దేశించిన టైమ్ ఫ్రేమ్‌ని యూజర్ గుర్తుంచుకోవాలి. లిమిట్ దాటితే మాత్రం ఈ ప్రాసెస్ పనిచేయదు.

ఇన్‌స్టాగ్రామ్ స్కామ్స్ కట్టడి ఇలా...

విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్‌కు చెందిన పాత వెర్షన్స్‌కు మద్దతును అధికారికంగా నిలిపివేస్తున్నట్టు ఈ ఏడాది మొదట్లోనే 'వాల్వ్' ప్రకటించింది. పాపులర్ పీసీ లైబ్రరీ, స్టీమ్ ఈ సపోర్టు అందని వాటిలో ఉన్నాయి.

అయితే విండోస్ 7, 8, 8.1 కు స్టీమ్ సపోర్ట్ ఈ ఏడాది మొదటి తేదీ నుంచి అందుబాటులోకి వచ్చింది. అందుకు అనుగుణంగా అప్‌గ్రేడ్ కావాలని స్టీమ్ యూజర్లకు కంపెనీ సూచించింది. ఫలితంగా అప్‌గ్రేడ్ చేసుకోవడం లేదంటే అన్‌సపోర్టెడ్ వెర్షన్‌తో రన్ కావడం అన్న రెండు ఆప్షన్లు మాత్రమే యూజర్లకు ఉన్నాయి. స్టీమ్ యూజర్లలో 0.81 శాతం మంది 7, 8, 8.1 వెర్షన్స్‌ను ఉపయోగిస్తున్నారని ఒక సర్వేలో వెల్లడైంది. 53.53 శాతం మంది విండోస్ 10, 42.04 మంది విండోస్ 11పై పనిచేసుకుంటున్నారు. విండోస్ 7 నుంచి 11 వరకు ఉచితంగా ఆప్‌గ్రేడ్‌కు అనుమతించింది. అయినప్పటికీ అప్‌గ్రేడ్ చేసుకునే విషయంలో కొద్దిపాటి కష్టాలు యూజర్లకు తప్పటంలేదు. గత సెప్టెంబర్‌లో మైక్రోసోఫ్ట్ ఒక లూప్‌హోల్‌ను ఫిక్స్ చేసింది. అందుకు అవసరమైన అప్‌గ్రేడ్ ఇది.

విండోస్ 11 ల్యాప్‌టాప్
మైక్రోఫోన్ పనిచేయకుంటే...?

విండోస్ 11 ల్యాప్‌టాప్‌లో మైక్రోఫోన్ పనిచేయకుంటే ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. సదరు సమస్యను పరిష్కరించేందుకు పలు మార్గాలు ఉన్నాయి.

- మైక్రోఫోన్ హార్డ్‌వేర్‌ను మొదట చెక్ చేయాలి. కంప్యూటర్‌కు దాన్ని సరిగ్గా కనెక్ట్ చేసుకున్నామా లేదా అని సరిచూడాలి. మైక్రోఫోన్ లేదంటే కేబుల్ ఏమైనా దెబ్బతిన్నాయా అన్నది చూడాలి. వేరే యూఎస్‌బీ పోర్ట్ లేదంటే సానుకూలత విషయాలను పరిశీలించాలి.
- ఔట్ డేటెడ్ ఆడియో డ్రైవర్స్‌తోనూ ఇబ్బందులు తలెత్తుతాయి. అలాంటప్పుడు డివైజ్ మేనేజర్ ఆపై ఆడియో డివైజ్‌లను లోకేట్ చేయాలి. దానిపై రైట్ క్లిక్ కొట్టి, అప్డేట్ డ్రైవర్‌ని సెలెక్ట్ చేసుకోవాలి. అప్డేట్ అందుబాటులో ఉంటే ఇన్‌స్టాల్ చేసుకునేందుకు విండోస్‌కు అనుమతి ఇవ్వాలి. అవసరమైతే లేటెస్ట్ డ్రైవర్స్ కోసం ఉత్పత్తిదారు వెబ్‌సైట్‌లోకి వెళ్ళాలి.
- మైక్రోఫోన్‌లో డిఫాల్ట్ రికార్డింగ్ డివైజ్‌గా సెట్ అయి ఉందా లేదా అన్నది చూడాలి. సిస్టమ్ ట్రేలోని స్పీకర్‌పై రైట్ క్లిక్ తదుపరి 'సౌండ్ సెట్టింగ్స్'ను సెలెక్ట్ చేసుకోవాలి. ఇన్‌పుట్ సెక్షన్‌కు వెళ్ళాలి. డిఫాల్ట్‌గా ఉన్న జాబితా నుంచి మీ మైక్రోఫోన్‌ను ఎంపిక చేసుకోవాలి. మైక్రోఫోన్ మ్యూట్‌లో లేకుంటే వాల్యూమ్‌ను అడ్జస్ట్ చేసుకోవాలి.
- విండోస్ 11లో బిల్ట్-ఇన్ ట్రబుల్‌షూటర్స్ ఉంటాయి. కామన్ సమస్యలను అవి ఆటోమేటిక్‌గా ఫిక్స్ చేస్తాయి. సెట్టింగ్స్ - సిస్టమ్ - ట్రబుల్‌షూట్ - అడిషనల్ ట్రబుల్‌షూటర్స్ ఎంపిక - రికార్డింగ్ ఆడియో ట్రబుల్‌షూటర్ రన్ చేయాలి. ఆన్‌స్ర్కీన్ ఇన్‌స్ట్రక్షన్స్ ఫాలో అవ్వాలి. తద్వారా సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలి.
- మైక్రోఫోన్ యాక్సెస్‌కు సంబంధించి అవసరమైన అనుమతులు ఉన్నాయా లేదా అన్నది చూడాలి. సెట్టింగ్స్ - ప్రైవసీ - మైక్రోఫోన్ తదుపరి టోగెల్ స్విచ్ టర్న్ అయిందా లేదా చెక్ చేసుకోవాలి. ప్రత్యేకించి కొన్ని యాప్స్ విషయంలోనూ ఇదే విషయమై సమీక్షించుకోవాలి.

ఇవేవీ పనిచేయకుంటే సిస్టమ్ రిస్టోర్ చేయాలి. అలా చేసేటప్పుడు ముఖ్యమైన ఫైల్స్ బ్యాకప్‌పై శ్రద్ధవహించాలి. సమస్య అప్పటికీ పరిష్కారం కాకుంటే మైక్రోసాఫ్ట్ సహకారం తీసుకోవాలి.

విండోస్‌కు స్టీమ్ సపోర్ట్ బంద్

విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్‌కు చెందిన పాత వెర్షన్స్‌కు మద్దతును అధికారికంగా నిలిపివేస్తున్నట్టు ఈ ఏడాది మొదట్లోనే 'వాల్వ్' ప్రకటించింది. పాపులర్ పీసీ లైబ్రరీ, స్టీమ్ ఈ సపోర్టు అందని వాటిలో ఉన్నాయి.

అయితే విండోస్ 7, 8, 8.1 కు స్టీమ్ సపోర్ట్ ఈ ఏడాది మొదటి తేదీ నుంచి అందుబాటులోకి వచ్చింది. అందుకు అనుగుణంగా అప్‌గ్రేడ్ కావాలని స్టీమ్ యూజర్లకు కంపెనీ సూచించింది. ఫలితంగా అప్‌గ్రేడ్ చేసుకోవడం లేదంటే అన్‌సపోర్టెడ్ వెర్షన్‌తో రన్ కావడం అన్న రెండు ఆప్షన్లు మాత్రమే యూజర్లకు ఉన్నాయి. స్టీమ్ యూజర్లలో 0.81 శాతం మంది 7, 8, 8.1 వెర్షన్స్‌ను ఉపయోగిస్తున్నారని ఒక సర్వేలో వెల్లడైంది. 53.53 శాతం మంది విండోస్ 10, 42.04 మంది విండోస్ 11పై పనిచేసుకుంటున్నారు. విండోస్ 7 నుంచి 11 వరకు ఉచితంగా ఆప్‌గ్రేడ్‌కు అనుమతించింది. అయినప్పటికీ అప్‌గ్రేడ్ చేసుకునే విషయంలో కొద్దిపాటి కష్టాలు యూజర్లకు తప్పటంలేదు. గత సెప్టెంబర్‌లో మైక్రోసోఫ్ట్ ఒక లూప్‌హోల్‌ను ఫిక్స్ చేసింది. అందుకు అవసరమైన అప్‌గ్రేడ్ ఇది.

మార్కెట్లోకి నయా స్మార్ట్‌ఫోన్

షావోమి తాజాగా రెడ్‌మి నోట్ 13 సిరీస్ స్మార్ట్‌ఫోన్లను మార్కెట్లోకి విడుదల చేసింది. ఇందులో మూడు ఫోన్లు ఉన్నాయి. రెడ్‌మి నోట్ 13, రెడ్‌మి నోట్ 13 ప్రొ, రెడ్‌మినోట్ 13ప్రొ+ పేరిట అవి మూడూ వచ్చాయి.

- రెడ్‌మి నోట్ 13 ప్రొ, రెడ్‌మి నోట్ నోట్ 13ప్రొ+లో ఓలెడ్ డిస్‌ప్లేకు తోడు 12జీబీ ర్యామ్ ఉన్నాయి. 200ఎంపీ మెయిన్ కెమెరా ఉంది. ఆండ్రాయిడ్ 13 ఆపరేటింగ్ సిస్టమ్‌పై ఇవి రన్ అవుతున్నాయి.
- రెడ్‌మి నోట్ 13 ప్రొ - 8జీబీ + 128 జీబీ, 8జీబీ + 256జీబీ, 12జీబీ + 256జీబీ - మూడు వేరియంట్లు కాగా వీటి ధరలు వరుసగా రూ.25,999, 27,999, 29,999గా ఉన్నాయి. ఆర్కిటిక్ వైట్, కోరల్ పర్పుల్, మిడ్‌నైట్ బ్లాక్ రంగుల్లో ఇవి లభ్యమవుతున్నాయి.
- రెడ్‌మి నోట్ 13 ప్రొ+ - ఫ్యూజన్ వైట్, ఫ్యూజన్ పర్పుల్, ఫ్యూజన్ బ్లాక్ రంగుల్లో అందుబాటులోకి వచ్చింది. 8జీబీ + 256 జీబీ, 12జీబీ + 256జీబీ, 12జీబీ + 512జీబీ - మూడు వేరియంట్లు కాగా వీటి ధరలు వరుసగా రూ.31,999, 33,999, 35,999గా ఉన్నాయి.
- రెడ్‌మి నోట్ 13 ప్రొ, రెడ్‌మి నోట్ 13 ప్రొ+ - రెంటిలోనూ 6.67 ఇంచీల 1.5కె ఓలెడ్ డిస్‌ప్లేకు తోడు 1220 x 2712 పిక్సెల్ రిజల్యూషన్‌తో డిస్‌ప్లే ఉంటుంది. ఈ రెండూ 12హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేటు కలిగి ఉన్నాయి. టాప్‌పై కార్నింగ్ గొరిల్లా గ్లాస్ విక్టస్ లేయర్ ఉంది.

ప్రొడక్ట్

- రెడ్‌మి నోట్ 13 ప్రొ - ఆక్టా-క్వాల్కామ్ స్నాప్‌డ్రాగన్ 7ఎస్ జన్2 చిప్‌సెట్, అదే ప్రొ+ విషయానికి వస్తే ఆక్టా-కోర్ మీడియాటెక్ డైమెన్సిటీ 7200 అల్ట్రా చిప్‌సెట్ కలిగి ఉన్నాయి. డ్యూయల్ సిమ్‌కి రెంటిలోనూ అవకాశం ఉంది. 200ఎంపీ మెయిన్ కెమెరా, 8ఎంపీ అల్ట్రావైడ్ యాంగిల్ లెన్స్ 2ఎంపీ మేక్రో షూటర్, ఫ్రంట్‌లో 16ఎంపీ సెల్ఫీ కెమెరా ఉన్నాయి. ఫింగర్ ప్రింట్, ఇన్‌ఫ్రారెడ్ సెన్సర్లు ఉన్నాయి. ఐపీ54 రేటింగ్, డస్ట్ - వాటర్ రెసిస్టెంట్‌గా మలిచారు. 13ప్రొలో 5100 ఎంఏహెచ్ బ్యాటరీ, 67 వాట్స్ ఫాస్ట్ చార్జింగ్, 13ప్రొ+లో 5000ఎంఏహెచ్ బ్యాటరీ, 120 వాట్స్ ఫాస్ట్ చార్జింగ్ సపోర్ట్ కలిగి ఉన్నాయి.

రెడ్‌మి నుంచి బడ్స్!

చైనాలో విడుదల చేసిన రెడ్‌మి బడ్స్‌5ని ఇండియన్ మార్కెట్లోనూ దింపుతారని భావిస్తున్నారు. గ్లాసీ డెకరేటివ్ స్ట్రైప్స్ దీని సొంతం. షావోమీకి చెందిన గోల్డెన్ ఇయర్స్ టీమ్ వీటికి సంబంధించి మంచి సౌండ్ ఎక్స్‌పీరియెన్స్‌ని హామీ ఇస్తోంది. 12.4 ఎంఎం డైనమిక్ డ్రైవర్ యూనిట్ ఇందులో ఉంది. నెట్ ఈజ్ సౌండ్ సర్టిఫికేషన్ కూడా లభించింది. 46 డెసిబిల్స్ మేర యాక్టివ్ నాయిస్ క్యాన్సిలేషన్ సపోర్ట్ ఉంది. ఈజీ టచ్ కంట్రోల్స్ ఉన్నాయి. షావోమీ హెడ్‌ఫోన్స్ యాప్‌ను కూడా ఉపయోగించుకోవచ్చు. 40 గంటల బ్యాటరీ బ్యాకప్ ఉంది. అయిదు నిమిషాల చార్జింగ్‌తో రెండు గంటల సేపు మ్యూజిక్ వినొచ్చు.

యూపీఐ రికార్డ్

యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్(యూపీఐ) గత ఏడాది డిసెంబర్‌లో లావాదేవీలకు సంబంధించి రికార్డు సృష్టించింది. పన్నెండు వందల కోట్ల లావాదేవీలు పద్దెనిమిది లక్షల కోట్ల మొత్తం మేర జరిగాయి. అంతకు ముందు నవంబర్ నెలలో ఈ మొత్తం 17.4 లక్షల కోట్లు మాత్రమే. 2022తో పోల్చుకుంటే వాల్యూమ్(59 శాతం), వాల్యూ(45శాతం)పరంగా పెరిగిందని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ) వెల్లడించింది. నవంబర్,



డిసెంబర్‌లలో జరిగిన వ్యవహారాన్ని పరిశీలిస్తే వాల్యూపరంగా పెరుగుదల 4.2 శాతం అధికంగా నమోదైంది. ఫెస్టివల్ సీజన్ అక్టోబర్ నుంచి ఈ ఎదుగుదల క్రమంగా ఉంది.

ఇదే సందర్భంలో తాము 'యూపీఐ ఫర్ సెకండరీ మార్కెట్'ని బేటా దశలో ఆరంభిస్తున్నట్టు ఎన్‌పీసీఐ ప్రకటించింది. దీంతో యూపీఐ సభ్యులకు ఫోన్లలోనే 'టాప్ అండ్ పే' సౌలభ్యం లభించనుంది. దేశంలోనే తొలిసారి యూపీఐ ఏటీఎంని హిటాచీ పేమెంట్ సర్వీసెస్ పరిచయం చేసింది. ఎన్‌పీసీఐతో కలిసి దీన్ని నిర్వహిస్తోంది. దీంతో క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేసి నగదును డ్రా చేసుకోవచ్చు.



కొనుగోలుదారులకు క్రోమా హెచ్చరిక

గాడ్జెట్ అలాగే ఎలక్ట్రానిక్ కొనుగోలుదారులకు జరుగుతున్న మోసాలకు సంబంధించి టాటా గ్రూప్‌నకు చెందిన క్రోమా హెచ్చరించింది. క్రోమా ఏజెంట్లు లేదా ఉద్యోగులం అంటూ మోసాలకు పాల్పడుతున్నారని తెలిపింది. కస్టమర్లకు ఆ మేరకు 'ఫ్రాడ్ అలెర్ట్ అండ్ డిస్‌క్లయిమర్' పేరిట అలెర్ట్ మెసేజ్‌ను విడుదల చేసింది. క్రోమా పేరిట డూప్ వెబ్‌సైట్లు పుట్టుకొస్తున్నాయి. కన్స్యూమర్ ఎలక్ట్రానిక్ చైన్‌కు ఇవి లింక్ అవుతున్నాయి. ఇవి రెండు వెబ్‌సైట్స్‌ను cromawholesellers.com, cromawholesale.com సూచిస్తున్నాయి. ఇవి మరికొన్ని వెబ్‌సైట్లను కలుపుతున్నాయి. అయితే ఈ డూప్ వెబ్‌సైట్ల బారినపడి మోసపోవద్దు. క్రోమా ఉద్యోగులం అని ఎవరు చెప్పినా నమ్మి పేమెంట్స్ చేయవద్దంది. వ్యాలిడ్ పేమెంట్ మెథడ్స్‌ను మాత్రమే ఉపయోగించుకోవాలి. అమ్మకాలకు డీల్స్ అంటూ కాల్స్ కాని గిఫ్ట్ కార్డులు ఇవ్వచూపడం వంటివి గానీ అనుమతించదు. కంపెనీ అధికారిక వెబ్‌సైట్‌పైనే ఆఫర్లు అన్నీ పొందుపరిచి ఉంటాయి. క్రోమా వాట్సాప్ చానల్, టాటాన్యూ యాప్ లేదా ఇండియాలోని 450కిపైగా ఉన్న స్టోర్స్ నుంచి మాత్రమే లావాదేవీలు జరుగుతాయి. టాటా క్రోమ్ వ్యవహారాలన్నీ అధికారికంగానే ఉంటాయని, మధ్యవర్తులు ఎవరూ ఉండరని కంపెనీ ఈ సందర్భంలో స్పష్టం చేసింది.

అలర్ట్

ఇతరుల రియల్ టైమ్ లొకేషన్ తెలుసుకోవచ్చు



గూగుల్ కొత్త అప్డేట్‌తో ఆండ్రాయిడ్ యూజర్లకు సరికొత్త వెసులుబాటును కల్పించింది. గూగుల్ మ్యాప్స్ సహాయంతో ఇతరుల రియల్ టైమ్ లొకేషన్‌ను యూజర్లు తెలుసుకోవచ్చు. దీని కోసం కాంటాక్ట్ యాప్ లేటెస్ట్ వెర్షన్‌ది అయి ఉండాలి. నిజానికి ఇది కొత్త విషయం ఏమీ కాదు. ఇప్పటికే ఉనికిలో ఉంది. ఎందుకంటే మెసేజింగ్ యాప్‌లతో రియల్‌టైమ్ లొకేషన్‌ను షేర్ చేసుకునే సదుపాయం ఉంది. అయితే కాంటాక్ట్ యాప్‌లో ఉన్న వారితో జోడింపు ఇది. ఉదాహరణకు యూజర్ ఎవరికైనా కాల్ చేయాలని అనుకుంటే, సదరు వ్యక్తి లొకేషన్ కూడా కొత్త సదుపాయంతో తెలుస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే మనం ఫోన్ చేయాలనుకునే వ్యక్తి లొకేషన్ తెలుస్తుంది.

అయితే ఈ విషయంలో కొన్నింటిని యూజర్ దృష్టిలో ఉంచుకోవాలి. అవి..

- వేరే వ్యక్తి జీమెయిల్ - యూజర్ అకౌంట్‌లోని కాంటాక్ట్ కార్డులో సేవ్ అయి ఉండాలి.
- యూజర్ చూపించే లొకేషన్ - గూగుల్ మ్యాప్స్‌లోనూ షేరింగ్‌పరంగా ట్యూన్ అయి ఉండాలి.

అయితే అవతలి వ్యక్తి లొకేషన్ తెలుసుకోవాలని అనుకున్నప్పుడు మాత్రమే ఈ షేరింగ్ ఆస్కారం ఉండాలి. అలాగే దీన్ని పొందేందుకు లేటెస్ట్ వెర్షన్ 4.22.37.586680692 పై కాంటాక్ట్‌లు అప్డేట్ కావాల్సి ఉంటుంది. అప్డేటెడ్ వెర్షన్‌పై రన్ అవుతోందని తెలుసుకునేందుకు కాంటాక్ట్ యాప్‌పై లాంగ్ ప్రెస్ చేయాలి. యాప్ ఇన్ఫోపై టాప్ చేయాలి. చెక్ చేసినప్పుడు పాత వెర్షన్‌పై ఉన్నట్టు తేలితే వెంటనే గూగుల్ ప్లే స్టోర్‌లో లేటెస్ట్‌ది తీసుకోవాలి.

- గూగుల్ మ్యాప్‌లో లొకేషన్ షేరింగ్ కోసం, యాప్ ఓపెన్ చేయాలి. ప్రొఫైల్ పిక్చర్‌పై టాప్ చేయాలి. ఎనేబుల్ లేదా డిజేబుల్ కోసం లొకేషన్ -షేరింగ్‌ని టాప్ చేయాలి. అలాగే ఈ ఆప్షన్‌ను నిర్దేశిత కాలానికి పరిమితం చేసుకోవచ్చు.
- ఈ రెండు సెట్టింగులను పొందిన తరవాత వ్యక్తి కాంటాక్ట్ కార్డుపై చిన్నగా గూగుల్ మ్యాప్స్ మాడ్యూల్ ప్రత్యక్షమవుతుంది. ఆ మాడ్యూల్‌ని టాప్ చేయాలి. అవసరమైన చోట అది మ్యాప్‌ని తీసుకుంటుంది. రియల్ లొకేషన్‌కు చేరుకున్న తదుపరి అలెర్ట్ వస్తుంది. లేదా ఎక్కడ ఉన్నారన్నది తెలుస్తుంది. అంటే సంబంధిత డైరెక్షన్స్ యూజర్ పొందుతారు.

క్లోన్డ్ కాల్‌ని గుర్తించవచ్చు!



ఏఐ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) క్లోనింగ్ టెక్నాలజీ ముఖ్యంగా స్కామర్లకు వరంగా మారుతోంది. మనం నమ్మే వ్యక్తిని పోలిన గొంతుతో మోసాలకు పాల్పడేందుకు వీలుచిక్కుతోంది. అయినప్పటికీ అప్రమత్తంగా ఉంటే వీటి నుంచి బైటపడొచ్చు.

క్లోన్డ్ కాల్‌ని గుర్తించడానికి నాలుగు సూచికలు ఉన్నాయి. అందులో మొదటిది అనూహ్యమైన కాల్. అదీ తమకు బాగా తెలిసిన వ్యక్తి నుంచి వస్తుంది. వెంటనే స్పందించకుండా ఒకసారి చెక్ చేసుకోవాలి. ఇంకొకటి అర్జెంట్ రిక్వెస్ట్. అంటే వెంటనే నిర్ణయం తీసుకునే పరిస్థితులను కల్పిస్తారు. ఇక్కడ కూడా 'విన్నంతనే వేగ పడక..' అన్న పద్యాన్ని గుర్తుకు తెచ్చుకోవాలి. అర్జంట్‌గా మనీ కావాలనే రీతిలో ఈ కాల్స్ ఉంటాయి.

ఇంకోటి స్పీచ్ విధానం అసహజంగా ఉంటుంది. ఎంత క్లోన్ చేసినప్పటికీ మాట్లాడే తీరులో సాగతీత, ఆగి - మొదలుపెట్టే తీరు, మాట్లాడుతూ ఊపిరితీసుకోవడం వంటి కొన్ని సహజమైన పద్ధతులు ప్రతి వ్యక్తికి ఉంటాయి. దగ్గర వ్యక్తి అని చెప్పుకొన్నప్పుడు లిజనర్ వీటిని పట్టేయవచ్చు. అసహజత్వం ఒక్కటి చాలు అది క్లోన్డ్ కాల్ అని సులువుగా తెలుస్తుంది. చివరిగా వ్యక్తిగత సమాచారం కోసం అభ్యర్థన. బ్యాంక్ అకౌంట్ నంబర్ నుంచి ఏదైనా కావచ్చు. పద్ధతిగా పనిచేసే బ్యాంకులు సహా ఏ ఆర్థిక సంస్థా వ్యక్తిగత సమాచారాన్ని అడగదని గుర్తుంచుకోవాలి.

జాగ్రత్తలు

- అపరిచిత నంబర్ల నుంచి వచ్చే కాల్స్‌కు రెస్పాండ్ కాకూడదు. నంబర్‌ని గుర్తించలేని పక్షంలో వాయిస్ మెయిల్ చూడాలి. అదీ మరీముఖ్యమైతే అవతలి వ్యక్తి తప్పకుండా మెసేజ్ చేస్తారు. ఖాళీ ఉన్నప్పుడు లేదా అవసరాన్ని బట్టి రెస్పాండ్ కావచ్చు.
- ఐడెంటిటిని వెరిఫై చేయాలి. మాటనుబట్టి సమాధానం ఇచ్చేయకూడదు. ఫోన్ చేస్తుంది అసలు వ్యక్తి అవునా, కాదా అని తెలుసుకునేందుకు మాటలు పొడిగించాలి. ఇద్దరికీ తెలిసిన ఇటీవలి సంఘటన లేదంటే ఇంతకమునుపు షేర్ చేసుక్ను జోక్‌ని ప్రస్తావించి కన్‌ఫర్మ్ చేసుకోవచ్చు.
- తొందరపడి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం లేదు. ఎంత ఒత్తిడి వచ్చినప్పటికీ వెంటనే ఏదీ చెప్పేయాల్సిన పనిలేదు. ఆలోచిస్తామని కచ్చితంగా చెప్పేయడమే మంచి పద్ధతి. ఫోన్‌లోనే నిర్ణయం తీసుకోలేమని కూడా పద్ధతిగా చెప్పవచ్చు.
- ఏఐ క్లోన్డ్ స్కామ్ అని గుర్తిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి.
- ఆన్‌లైన్‌లో షేరింగ్‌లోనూ జాగ్రత్తగా ఉండాలి. సామాజిక మాధ్యమాల్లో మరింత జాగ్రత్తగా ఉండాలి. వీటితోనూ స్కామర్ల మోసాలకు పాల్పడుతున్నారు.
- ఈ రోజుల్లో కాల్ బ్లాకింగ్ యాప్స్ అందుబాటులో ఉన్నాయి. స్కామర్స్ సహా అన్‌వాంటెడ్ కాల్స్‌ని బ్లాక్ చేసేందుకు ఇవి ఉపయోగపడతాయి.